
# శ్రీ రామానుజ చరిత్ర



శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ



రచయిత్రి శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

పతిదేవులు (పరమపదవాసులు) శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట రాఘవాచార్యులు అయ్యవార్లతో


అంతర్జాల మాధ్యమం

www.pravachanam.com

# శ్రీ రామానుజ చరిత్ర

పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజ జీయర్ స్వామి వారి

మంగళాశాసనములతో



పరిష్కర్త

**శ్రీ మొలుగు రంగాచార్యులు**

భాగవత కైంకర్యం

శ్రీమతి కరి విజయలక్ష్మి, రాధానాథాచార్య దంపతులు, విశాఖపట్నం

# శ్రీ రామానుజ చరిత్ర

శ్రీమతి శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ

© రచయిత్రి

ప్రథమ ముద్రణ

**అక్టోబర్, 1996**

ముముక్షుజన మహాపీఠము, పెదముత్తేవి, కృష్ణాజిల్లా

డిజిటల్ వెర్షన్

**జనవరి, 2021**

శ్రీమతి కరి విజయలక్ష్మి, రాధానాధాచార్య దంపతులు

వెల

**అమూల్యం**

సంప్రదించుటకు

శ్రీ ఎస్.టి.పి.ఎస్.వి. రాఘవాచార్యులు

9490942884

## శ్రీమతే రామానుజాయ నమః

# వినతి

శ్రీమత్తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మగారు రాఘవ ధర్మపత్ని, నిత్యపవిత్ర చరిత్ర, మహా భాగవతోత్తమురాలు. ఆమెకు జన్మసిద్ధమగు భక్తి, భాగవత ప్రీతి, కవనశక్తి, రచనా పాటవము మొదలగు శక్తులెన్నియో ఉన్నవి. వారి ఆరాధ్య దైవము సకల భువన సామ్రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి. భగవద్భక్తికంటే ఆమెలో ప్రస్ఫుటముగా కన్పించునట్టిది – ఆమె వినీత మధుర స్నిగ్ధ భాషణము. బంధుప్రీతి, ఆదరము ఆమె సహజ లక్షణములు. ఆ తల్లికి మేమాప్తులమగుట మా భాగ్యము. వారింటి ఆడపడుచు మా శ్రీమతి. ఆ సంబంధముచేతనే వారి దంపతులు మమ్ముల నెంతో ఆదరింతురు.

వారింతకుముందెన్నో భగవత్సంబంధములగు గ్రంథములు వ్రాసినారు. కాని ఇది వారి ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రకాశింపజేసే శిరోభూషణము. సూర్యరశ్మి కమలములను వికసింపజేయుట సహజమే. ఆ కమలము నీట బాసిన కమలాప్తుని రశ్మి, దాని కాంతిని చెరచి వేయును. అట్లే జగద్గురువులగు భగవద్రామానుజుల సంబంధ మున్ననాడే భగవత్కృప మన ఆత్మలను వికసింప

జేయును. 'ఆచార్య సంబంధము లేని ఆత్మలను, పురుషకారభూతురాలగు కమలా సంబంధము కూడా ఉజ్జీవింపజేయజాలదు' అను రహస్యము నెరింగిన మా సీతమ్మతల్లి, ఎన్నో విధాల స్వామి వైభవమును ప్రకాశింపజేసి, ప్రధానముగా ప్రకాశింప జేయవలసినది గురువైభవమే యని, భగవద్రామానుజ చరిత్రను గ్రంథరూపమున సంతరించి జన్మమును ధన్యమొనర్చుకొనినారు.

తాము ఎరిగినదానిని అనుభవించి, చర్వణ చేసి ఆనందించి తాము ఉజ్జీవించుటే కాక, తమ సంబంధము కలవారందరూ రామానుజ చరిత్ర చదివి తరించవలెనని, గ్రంథరూపముగ వ్రాసిరి. ఇంతకుముం దెందరో వ్రాసినారు. కాని అవి సామాన్యులకు ఇంత వివరముగా చరిత్ర నందింపవు. శ్రీవైష్ణవులమనుకొనుచున్న వారిలో నూటికి ఒకరికో, ఇద్దరికో తప్ప, మనదర్శన ప్రవర్తకులై జాతి, వర్గ, వర్ణ భేదము లేకుండా అందరకూ మోక్షము నందించిన రామానుజుల చరిత్ర సమగ్రముగా తెలియదు.

శ్రీవైష్ణవుల మనుకొనుచున్న వారికి తమ మతమును ప్రవర్తింప జేసిన వారి చరిత్రము తెలియకపోవుటకంటే పాపహేతువు మరొకటి లేదు. 'ఆచార్య సూక్తి ముక్తావళి', 'ప్రపన్నామృతము' అందరూ చదివి అర్థము చేసుకొనలేరు. వచనములో కొందరు వ్రాసినా, భాష సులభముగా నుండదు. అందుచే మా సీతమ్మతల్లి వ్రాసిన ఈ 'రామానుజ చరిత్ర' త్వరలో ప్రకాశితము కావలెను. 'శ్రీ వైష్ణవ గృహములలో ఉన్న పెద్దలు, పిల్లలు తప్పక చదవాలి. సాధుశీలము, సదాచారము అందరికీ లభించాలి' అనే ఉదార సంకల్పముతో ఆమె చేసిన ప్రయత్నము ప్రశంసనీయము.

ఆమె కుమారులు సంస్కారవంతులు, మాతృభక్తి పరాయణులు, ఉదార సంకల్పులు. కావున వారు ఆమె వ్రాసిన ఇతర గ్రంథములకంటే ముందుగా ఈ భగవద్రామానుజ చరిత్రను ముద్రించి, సకల శ్రీ వైష్ణవకోటికి అందించి వారి మాతృభక్తిని ప్రకటించుకొందురుగాక అని ఆశిస్తున్నాను.

వారికి, వారి కుటుంబములకు భగవద్రామానుజ కటాక్షముచే, శ్రీ సకల భువన సామ్రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి, ఐహిక ఆముష్మిక పారమార్థిక సకలాభ్యుదయములను ప్రసాదించు గాక ! అని శ్రియఃపతిని ప్రార్థించుచున్నాను.

ఇతి దాసః

**శ్రీభాష్యం అప్పలాచార్య**

# ముందుమాట

పుట్టి పెరిగినది విశిష్టాద్వైత సంప్రదాయమున. అందుచే సహజముగనే త్రిమతాచార్యులలో మధ్యములు – విశిష్టాద్వైత సిద్ధాంత స్థాపకులు, ఉభయ వేదాంత ప్రవర్తకులు నగు శ్రీరామానుజాచార్యులవారి చరిత్ర తెలుసుకొనవలెనను కుతూహలముతో అచ్చటచ్చట – ఆయా సమయములలో లభ్యమైన కొన్ని విశేషములు చదువుచు వచ్చితిని. విద్యావంతురాలను కాకపోవుటచేతను, సంసార బాధ్యతలచేతను – వాని నొకచో వ్రాసియుంచుకొను అలవాటు కలుగ లేదు. జీవితపు ప్రొద్దువాటారుచు, కష్టసుఖముల యనుభవము తరువాత బాధ్యతలు ఒక్కొక్కటిగ విడచుట యైనకొలది – రామానుజులవారి చరిత్రలో జ్ఞప్తిని వీడకున్న విషయములు క్రోడీకరించి – ఒకచో వ్రాసిన బాగుగనుండునను అభిలాష బలపడి – సమర్థత లేకున్నను – కేవలము కుతూహలమే బలముగ – ఈ రచన ప్రారంభించితిని.

జీవిత చరిత్ర యనుటతోడనే, అవతార ప్రారంభమునుండి, పరిసమాప్తి వరకు వ్రాయవలసినదే కదా ! వాని కార్యకారణ సంబంధము వివరించవలసినదే కదా ! అందుచే యామునాచార్య ప్రస్తావనతో రచన ప్రారంభించి – పరాశర భట్టరుల ప్రస్తావనలతో ముగించుటయైనది. కూరత్తాళ్వాన్‌ల చరిత్ర హారమున సూత్రము వంటిదై – అంతర్గతమై వీడరానిది.

ఆధ్యాత్మిక వేదాంత విషయములు గహనమై – నావంటి అల్పజ్ఞురాలు తలపనైన జాలనివి. పైగా నట్టివి జీవిత చరిత్రలో ప్రస్తావించుట కథాగమనము

నకు భంగకరము - సామాన్య పాఠకునికి క్లిష్టము నగును. కావున వానిని ప్రస్తావించి వదలుటేగాని లోతులకు పోవ వీలుకాలేదు. విశదము కొరకు సంభాషణాత్మక రచన చేయవలసి వచ్చినది. ఇక విసంధులు మొదలగు వ్యాకరణ నిరుద్ధములై నవియు కోకొల్లలు. కొన్ని తెలిసియు పాఠక లోకమునకు సులభ గ్రాహ్యతకై చేసినవి కాగా, అనేకము తెలియక చేసినవియు నుండుననుటకు సందేహము లేదు. సహృదయ పాఠకులు మన్నింతురుగాక !

సంప్రదాయమున కొన్ని పదములు వాని అర్థమున గాక గూఢార్థముతో ప్రచారమున నుండును. మరికొన్ని ఒక్కొక్కమతముననే విరివిగ ప్రచారములో నుండును. అట్టివానిని వీలయినంత వరకు వదలివేయ యత్నించితిని - కానిచో పుటలో క్రింద వివరణ నిచ్చితిని. పడికట్టుగా వైష్ణవ గృహములలో వాడెడు పదములు - ఇతరులకు అవగాహనలో యిబ్బంది కలిగించకుండునట్లుగా - వదలి వేయబడినవి.

ద్రావిడ భాషా గ్రంథముల పేర్లు, ఆళ్వార్లు మొదలగు విశిష్టాద్వైత ప్రసిద్ధ వ్యక్తులకు గల ప్రాచీన ద్రావిడ నామములు, తెలుగు పలుకుబడికి దగ్గరగ నుండునట్లు వ్రాసితిని. అంతేకాక ఒక్కొక్కరికి ఒకటికంటే అధికముగ నామము లున్నచోట్ల - అవి వచ్చిన మొదటిమారు - ఆ పుటలో క్రింద వివరించడమైనది.

ఇతర సంప్రదాయములను నమ్మకములను కించపరచకుండునట్లు జాగ్రత్త వహించడమైనది. అట్టి ప్రస్తావనలు తప్పనిసరి యగు తావుల వీలయినంత సున్నితముగ వ్రాయ యత్నించడమైనది. విశిష్టాద్వైత సిద్ధాంతమే ఉత్తర భారతమున వల్లభ - చైతన్యం - ఠాకూర్ - గౌడ - కృష్ణ మొదలగు పేరులతో ప్రచారములో నుండుటకు - ద్రావిడామ్నాయమునకు దక్షిణ దేశమున గల ప్రాముఖ్యమే కారణమనిపించును.

పఠనమునకు గ్రంథములనిచ్చియు, కథారూపమున వివరించియు, సూచనల జేసియు, లోపముల నెత్తిజూపియు, దోషసవరణలు చేసియు, అచ్చు

వేయించుటకు వీలుగా సాపుప్రాసి యిచ్చియు, ప్రూఫ్‌ల దిద్దియు – ఇట్లెందరో సహాయపడగా – గ్రంథ మీ రూపున వెలుగు చూచినది. వీరందరికి పేరు పేరున కృతజ్ఞతలు, వందనములు, ఆశీస్సులు తెలుపుట పరిపాటి. ఇక ఆర్థిక సహాయ మందించిన వారిమాట సరేసరి. కాని వీరందరు తమ తమ సహాయ సంపత్తులు భగవదర్పితముగనే చేసి, తమ ప్రస్తావనయైన – వలదని – అజ్ఞాతముగ నుండగోరిరి. వీరందరి నెట్లు సంభావింపగలను !

ధర్మగ్లాని కలిగినపుడెల్ల తాను అవతరింతునని భగవానుడు చెప్పెను. కావున స్వయముగగాని, తన అంశలచేగాని తిరిగి తిరిగి లోకోద్ధరణ చేయుచునే యుండును. దీనితో మన పరంపర అవిచ్ఛిన్నముగ కొనసాగుచున్నది. అట్లు అంశాజనితులైయున్న మహాత్ములందరికి నమోవాకములు.

ఈ గ్రంథమును ముముక్షువు లెల్లరు శ్రద్ధాభక్తులతో చదివి తరించవలెనను కోరికతో వ్రాసితిని. దీనికి కారణభూతురాలైన జగన్మాతను ప్రార్థించి, సకలభువన సామ్రాజ్య లక్ష్మీనారాయణ స్వామివారి పాదపద్మముల సన్నిధిలో సమర్పించు.

భాగవతపదదాసి

**శ్రీమతి తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మ**

శ్రీమతే రామానుజాయనమః

# శ్రీ భగవద్రామానుజ చరిత్ర - ఒక సమీక్ష

"ఆదౌ జగదాధారః శేషః తదను
సుమిత్రానందనవేషః తదుపరి
ధృతహల ముసల విశేషః
తదనంతర మభవ ద్గురు రేషః"

ఇది భగవద్రామానుజుల యవతారక్రమం. శేషుఁడే లక్ష్మణుఁడుగా, బలరాముఁడుగా, రామానుజుఁడుగా అవతరించాడు. భగవంతునికే చెంది పారతంత్ర్యమే స్వరూపంగా కలిగియున్నాడు కనుక, శేషనామధేయుడు. ఆ స్వరూప స్వభావాలతోనే యవతరించిన మహాపురుషుడు రామానుజుడు.

ఇది రామానుజ చరిత్ర. ఆ రామానుజుడైన లక్ష్మణుని గూర్చి యా సీతమ్మ తల్లికి తెలిసినంతగా నితరులకు తెలియనట్లే - ఈ రామానుజుల గూర్చి మా సీతమ్మతల్లికి తెలిసినంత ఇతరులకు తెలియదేమో అనిపిస్తుంది.

చరిత్ర వేరు, వేదాంతం వేరు. కాని మహాపురుషుల చరిత్ర సత్యాన్వేషక మగుటవల్ల, వారి చరిత్రలో వేదాంతం అంతర్వాహినిగా ప్రవహిస్తుంది.

శ్రీ భగవద్రామానుజులు విశిష్టాద్వైత వేదాంత సముద్ధారకులు. ఈ వేదాంత తత్త్వము వారి చరిత్రలో ఆచరణ రూపము ధరించి మహోన్నత శిఖరాలను చేరింది. ప్రబోధించిన వేదాంతాన్ని తాము ఆచరణలో చూపి మార్గదర్శకులైన వారు రామానుజులు. ఈ రహస్యాన్ని ఆకళింపు చేసుకొని మా సీతమ్మతల్లి వారి చరిత్రను మన కందించారు.

నేటి భారతదేశంలో కుల, మత, భాషా వర్గ భేదాలతో ప్రజలు దిక్కుతోచక ఉన్నారు. ఇలాంటి క్లిష్ట స్థితిలో జనసామాన్యానికి కనువిప్పు కలిగించే విధంగా రామానుజ చరిత్ర ఆవిర్భవించింది.

సత్యాన్వేషణ చేస్తే రూపము, నామము, మతము, కులము మొదలగు భేదాలు పాంచభౌతిక శరీరానికేగాని, ఆత్మలకు లేవు. ఆత్మల కన్నింటికీ స్వరూపం ఒక్కటే. హిందువైనా, మహమ్మదీయుడైనా, క్రైస్తవుడైనా అందరిలో నున్న ఆత్మ స్వరూపం ఒక్కటే. 'దేశకాలాది భేదంవల్ల, ఆయా ప్రవక్తల అనుభవాలవల్ల మత భేదాలు, కుల భేదాలు వచ్చినాయే కాని, మరో కారణం లేదు. ఒకే మతంలో కూడా వేరు వేరు కుల భేదాలు కేవలం 'కాల్పనికాలే. ఈ విషయం గుర్తించక పరస్పరం శత్రుభావంతో ప్రజలు ద్వేషపూరితులగుచున్నారు.

శరీర సంబంధమైన భేదాలు – ఆధ్యాత్మిక సంబంధమైన ఐక్యమునకు భంగకరములు కావని శ్రీ భగవద్రామానుజుల చరిత్ర విశదం చేస్తుంది. ఈ చరిత్రలోని ఘట్టాలు ఆ సత్యనిరూపకాలుగా ఉన్నాయి. ఉదాహరణకు కొన్ని పరిశీలనా యోగ్యములుగా భావించి చూపుచున్నాను.

పరమాత్మకు జీవులంతా సమానులే. అందరూ పరమాత్మ కటాక్ష సంపాదన కర్హులే. జీవులకుండవలసిన యర్హత ఒక్కటే – అతడు భక్తుడు కావాలి. శరణాగతి చేసిన ప్రపన్నుడు కావాలి. అట్టి ప్రపన్నునికి శరీరసంబంధమైన జాతి, మత,

కుల భేదముల సంబంధము లేదు. ప్రపన్నులంతా భగవత్సంబంధము కల భాగవతులు. వారు ఏ జాతిలో జనించినా, ఏ మతమునకు చెందిన వారైనా భగవత్ప్రీతిపాత్రులే. కారణం ఏ మతమైనా చేర్చేది పరమాత్మ చెంతకే. పద్ధతులు వేరైనా గమ్యం ఒక్కటే.

జన్మతః శరీరమునుబట్టి వచ్చిన శూద్రత్వమును పాటింపనివారు రామానుజులు. తాము బ్రాహ్మణ కులమున జనించినా శూద్రుడగు తిరుక్కచ్చి నంబిని గురువుగా భావించినవారు రామానుజులు. తిరుక్కచ్చినంబి శూద్రుడైనా పరమ భాగవతోత్తముడు, వరదరాజస్వామి భక్తుడు. కాన రామానుజులు వారిని గురువుగా భావించి వారి భుక్తశేషమును భగవత్ప్రసాదమువలె పవిత్రమైనదిగా తలచి భుజింపతలచినారు. తిరుక్కచ్చినంబిని భోజనమున కాహ్వానింప వెళ్ళిన సమయంలో నంబి రామానుజుల యింటికి రాగా రామానుజులవారి భార్య బ్రాహ్మణాహంకారంతో నంబికి ముందున్న యింట భోజనం పెట్టి, విస్తరి నాయనచేతనే తీయించి, గోమయంతో శుద్ధి చేసి, తాను స్నానము చేసి, మరల వంట చేసెను. రామానుజులు ఆ సంగతి తెలుసుకొని ప్రపన్నుని భుక్తశేషము తనకు లభింపనీయని ధర్మపత్ని బ్రాహ్మణాహంకారమునకు సిగ్గుపడి యామెను వదిలివేయవలసి వచ్చునని హెచ్చరించినారు. దీనినిబట్టి శరీర సంబంధమైన జాత్యాదుల కంటె పరిశుద్ధమైన యాత్మ సంపత్తియే ఆరాధ్యమని నిరూపించినారు.

రామానుజుల కాలం వరకు మంత్రోపదేశానికి కేవలం ఒక వర్గం వారు మాత్రమే అర్హులని భావించేవారు. కాని రామానుజుల యభిప్రాయం యిందుకు విరుద్ధం. ఈ సంసారమునందు విరక్తులై ముముక్షువులైనవారి కందరకు మంత్రోపదేశమున కర్హత కలదని వారి సిద్ధాంతం. తమ గురువులను గూడ యెదిరించి అష్టాక్షరిని గోపురాగ్రంనుండి సామాన్యుల కందరకు ఎలుగెత్తి యుపదేశించిన మహాదేశికులు రామానుజులు.

ఒక వ్యక్తి పవిత్రతను శరీరమునకు సంబంధించిన జాతిని బట్టి కాక, ఆత్మగుణము ననుసరించి నిర్ణయించాలని శ్రీ రామానుజుల భావన. ధనుర్దాసు విషయంలో వారి యాచరణ యీ సంగతిని నిరూపించింది. ధనుర్దాసు పుట్టుకచే శూద్రుడు. కాని రామానుజ కృపాపాత్రుడై మహాభాగవతోత్తముడైనాడు. కాని రామానుజానుయాయు లతనిని శూద్రభావనతోనే చూచిరి. ఆత్మ గుణాధిక్యాన్ని శిష్యులకు తెలుపుటకై రామానుజులు స్నానమునకు పోవునపుడు బ్రాహ్మణ శిష్యుని చేతి సహాయముతో వెళ్ళినా, తిరిగి వచ్చేటపుడు ధనుర్దాసుని హస్తావలంబనంతో చేరేవారు. అసూయాపరులగు శిష్యులకు ధనుర్దాసుని భాగవత భక్తిని నిరూపించు పరీక్ష పెట్టిన చరిత్ర సుప్రసిద్ధమైనది.

వేదాధ్యయన సంపన్నులు, జ్ఞానులునైనవారే మోక్షమున కర్హులని యొక అభిప్రాయం ఆనాడు ప్రచారంలో నుండేది. కాని మోక్షము నందుటకు పరమాత్మ కటాక్షము తప్ప వేరే ఉపాయం లేదని రామానుజ సిద్ధాంతం. ఏ మతమునకు చెందిన వారైనా, జ్ఞానహీనులైనా చివరకు పశుపక్ష్యాదులకు గూడ దైవానుగ్రహముంటే మోక్షం లభిస్తుంది. జటాయువు పక్షియైనప్పటికీ, రాము డుత్తమ లోకాలకు పంపినాడు. శబరి ఆటవిక స్త్రీ – జ్ఞానహీన – అయినా, గురుపరిచర్య ద్వారా శ్రీరామ కటాక్ష పాత్రురాలై మోక్షమందినది. ఈ ఉదాహరణలే రామానుజులకు ప్రేరకాలు.

ఏ మతము వారైనా సాయుజ్యమున కర్హులే. వారి కుండవలసినది కేవలము భగవత్కామన. ఢిల్లీ పాదుషావారి తనయ విగ్రహరూపి సంపత్కుమారులయందలి వ్యామోహంతో స్వామిభక్తురాలై స్వామిని విడువలేక రామానుజులతో వచ్చుచు మార్గమధ్యంలోనే సాయుజ్యమునందిన వృత్తాంతం ఈ సత్యాన్ని నిరూపించినది.

ఇట్లు రామానుజ చరిత్ర సర్వమానవ సమానత్వమును ప్రచారంచేసి

వేదాంత విషయములకు ఆచరణరూపత్వమును కల్పించి లోకానికి మహోపకారం చేసింది.

ఇట్టి చరిత్ర నెందరో వ్రాసినారు. కాని మా సీతమ్మతల్లి వ్రాత విశిష్టమైనది. పండితులకు మాత్రమే తెలియు వేదాంత రహస్యములతో కూడిన రామానుజ చరిత్రను నిరక్షరాస్యులు జ్ఞానహీనులునైన సామాన్యులకు కూడా సుబోధకంగా ఉండే సులభమైన భాషలో అందించిన కీర్తి ఈమెకు దక్కినది. ఈ రచన ద్వారా ఆంధ్రుల కీమె చేసిన మహోపకారం ప్రశంసనీయము.

భాగవత విధేయుడు

**శ్రీభాష్యం తిరుమల రామానుజాచార్య దాసః**

ముత్తీవి సీతారాం
ముముక్షుజన మహాపీఠము

శ్రీకృష్ణాశ్రమము
పెదముత్తీవి

# ఆశంసనము!

శ్రీమతే రామానుజాయ నమః
ఓం నమశ్శ్రీ సీతారామ లక్ష్మణయతీంద్రాయ!

యో నిత్య మచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ
వ్యామోహతః తదితరాణి తృణాయ మేనే
అస్మద్గురోః భగవతోఽ స్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే!

పరమభాగవతోత్తమురాలు శ్రీమతి తిరుమల పెద్దింటి వెంకట సీతమ్మతల్లి పుణ్యమా అని, భగవద్రామానుజుల చరితామృత వాహినిలో మరోమారు మునకలు వేసే భాగ్యం కలిగింది.

"న అయ మాత్మా ప్రవచనేన లభ్యః
న మేధయా న బహునా శ్రుతేన
య మేవైష వృణుతే తేన లభ్యః।"

భగవదనుభవం పొందటానికి భగవత్కరుణ తప్ప, వేరే సాధనం ఏదీ లేదనీ, భగవత్కృపాపాత్రుడైననాడు, భగవదనుభవం పొందటానికి జాతి మత కుల లింగ వివక్ష అడ్డురాదనీ, రారాదనీ ముక్తకంఠంతో – జీవన్ముక్త కంఠంతో – ఆచరణపూర్వకంగా ప్రచార ప్రసారాలు కావించిన మహాపురుషులు పరమ కారుణ్యమూర్తి భగవద్రామానుజులు.

అనేకానేక సంప్రదాయముల మధ్య ఉన్న వైవిధ్యం వైరుధ్యంగానూ, ఇతర సంప్రదాయముల పట్ల గల వైముఖ్యమే స్వసంప్రదాయంపట్ల అభినివేశంగానూ పరిగణింపబడుతున్న నేటి కాలంలో – భగవద్రామానుజుల అవతార విశేషాలూ, శ్రీవారి విశాల హృదయాన్ని వేనోళ్ళ చాటిచెప్పే ఆ యా ప్రత్యేకాంశాలూ ప్రముఖంగా ప్రచారం కావటం అవసరం.

అట్టి భగవద్రామానుజ చరిత్రను సుమధురంగా సులలితంగా ఆంధ్ర జనులకు అందించి మహోపకారం చేసి, విశిష్టాద్వైత సంప్రదాయానికి అపూర్వమైన సేవ చేశారు శ్రీమతి వెంకట సీతమ్మ తల్లిగారు.

ఆ తల్లికి అభినందనపూర్వకంగా ప్రణమిల్లుతూ, ఇట్టి సంప్రదాయ గ్రంథాలు ఇంకా అనేకం అందించి ఇతోధికంగా సంప్రదాయ సేవ చేస్తారని ఆశిస్తూ, అట్టి అవకాశం, ఆరోగ్యం ఆ తల్లికీ, కుటుంబానికీ అనుగ్రహించవలసిందిగా భగవద్రామానుజుల శ్రీచరణాలమ్రోల శరణాగతి చేస్తున్నాను.

"రామానుజార్య దివ్యాజ్ఞా
వర్ధతాం అభివర్ధతామ్!"

దాసశేషుడు

**ముత్తవి సీతారాం**

# విషయానుక్రమణిక


| | | | పుట |
|---|---|---|---|
| 1. | ఆళవందారుల తపన | ... | 1 |
| 2. | రామానుజుల జననము | ... | 3 |
| 3. | రామానుజుల విద్యాభ్యాసము | ... | 5 |
| 4. | రామానుజులను వరదుడు కాపాడుట | ... | 7 |
| 5. | ఆళవందారుల అన్వేషణ | ... | 10 |
| 6. | యామునాచార్యుల కాంచీయాత్ర | ... | 11 |
| 7. | రామానుజుల వినయ ఔదార్యములు | ... | 13 |
| 8. | రామానుజులు యాదవ ప్రకాశుల విడచుట | ... | 16 |
| 9. | యామున యుగ సమాప్తి | ... | 18 |
| 10. | తిరుకుట్యూర్ నంబి విచక్షణ | ... | 23 |
| 11. | సందేహ నివృత్తి | ... | 27 |
| 12. | గురూపదేశము | ... | 29 |
| 13. | భార్యాపరిత్యాగము | ... | 33 |
| 14. | సన్యాస స్వీకారము | ... | 34 |
| 15. | శిష్యుడు గురువగుట | ... | 35 |
| 16. | రంగనాథ విజయము | ... | 38 |
| 17. | కాళహస్తి నుండి తిరుమలకు | ... | 41 |
| 18. | విద్యాకాంక్ష | ... | 44 |

| | | | |
|---|---|---|---|
| 19. | విశాలదృష్టి | ... | 50 |
| 20. | గురు శుశ్రూషయా విద్యా | ... | 52 |
| 21. | క్రొత్త క్రొత్త ఉపదేశగురువులు | ... | 55 |
| 22. | పతివ్రత | ... | 59 |
| 23. | దేహాభిమానము | ... | 60 |
| 24. | హరిపాదోదకము | ... | 62 |
| 25. | మాయావాద ఖండనము | ... | 62 |
| 26. | యాత్రా ప్రారంభము | ... | 66 |
| 27. | చిత్తవృత్తి పరివర్తన | ... | 67 |
| 28. | తిరుమల నివాసము | ... | 72 |
| 29. | దాన గ్రహణము | ... | 73 |
| 30. | చీకటి ఎక్కడ? | ... | 76 |
| 31. | మత త్యాగము | ... | 77 |
| 32. | యామునుల మొదటి కోర్కె తీర్చుట | ... | 78 |
| 33. | స్వామికి మంత్రోపదేశము | ... | 81 |
| 34. | శ్రీభాష్యకారులు | ... | 82 |
| 35. | జగన్నాథుని సందిగ్ధత | ... | 83 |
| 36. | స్వామీ! నీవు విష్ణుడవు | ... | 86 |
| 37. | కూరత్తాళ్వాను | ... | 88 |
| 38. | నేత్ర సౌందర్యము | ... | 96 |
| 39. | భక్తితత్త్వము | ... | 97 |
| 40. | ముక్తి పరాయత్తము | ... | 101 |

| | | | |
|---|---|---|---|
| 41. | అంతిమ సంస్కార వివాదము | ... | 108 |
| 42. | గురు శరీరము అంత ముఖ్యమా? | ... | 110 |
| 43. | ద్రావిడామ్నాయ వాక్యము యథార్థమగుట | ... | 111 |
| 44. | నీ దివ్య మంగళ విగ్రహము కాపాడుకొనుము | ... | 113 |
| 45. | త్వమేవ శరణం మమ | ... | 115 |
| 46. | పాదుకలు | ... | 117 |
| 47. | సాలగ్రామము | ... | 122 |
| 48. | సత్యము, సత్యము, సత్యము | ... | 126 |
| 49. | ఢిల్లీ విజయము | ... | 127 |
| 50. | అందరు యోగ్యులే | ... | 132 |
| 51. | రామానుజాచార్య దివ్యాజ్ఞ | ... | 133 |
| 52. | యదుశైలము | ... | 134 |
| 53. | దైవమా? గురువా? | ... | 140 |
| 54. | కల్యాణ తీర్థము | ... | 142 |
| 55. | పునరాగమనము | ... | 143 |
| 56. | దిగువ తిరుపతి | ... | 145 |
| 57. | భక్త వరదుడు | ... | 146 |
| 58. | కూరేశులు పరమపదమున కేగుట | ... | 151 |
| 59. | కొండమీద వానికి చీటీ | ... | 155 |
| 60. | ప్రసన్న గాయత్రి | ... | 156 |
| 61. | ఆజ్ఞా పరిపూర్తి | ... | 157 |

# శ్రీ రామానుజ చరిత్ర

## [1]ఆళవందారుల తపన

"అప్పుడు క్షేమము కలుగును. ఈ లోకమందు ఆత్మలకు చెడు కాలము పోవును. సంకటములు కలిగించు నరక బాధలు నశించును. యమునకు ఈ లోకమున పని ఉండదు. కలిశక్తి తగ్గును. సాగర గంభీరుడైన స్వామితో చేరిన (వైష్ణవ) స్వాములు సమృద్ధి యగు యీ భూమిపై నిర్భయముగా నీ దివ్యప్రబంధమును పాడి నాట్యము చేయబోవుచున్నారు."

ఈ అర్థముకల తమిళ దివ్యప్రబంధము[2] "తిరువాయి మొళి" ఐదవ పత్తునందలి మొదటి పాశురము (పాట) శిష్యులకు వివరించుచు, ఇకపై చెప్పక నిశ్చేష్టులై కనులు మూసి, కొనలనుండి కన్నీరు విడుచుచున్న తమ ఆచార్యులైన యామునులను చూచి, ఆకస్మికమైన ఈ మార్పుకు కారణమేమో యని వారి శిష్యులు కళవళపడిరి.

"ఈ పాశురము నమ్మాళ్వారు చెప్పిరి. ఈ కాలమున నరకబాధ ఉండదనిరి. దీని ప్రకారము క్షేమము కలుగుటకు కారణ మేమియో, ఎవరిని గురించి ఇట్లు చెప్పిరో యని యోచించితిని. ఎవ్వరో జన్మింప బోవుదురు. లేకున్న నీ

---

1. యామునాచార్యులకు ఆళవందారు అను పేరున్నది.
2. తిరువాయి మొళి కర్త నమ్మాళ్వారు.

చెడుకాలమున నిట్లు జరుగునా ? చెడుకార్యములు చేయించు కలి యున్నాడు. అతని ప్రభావము చేత దుష్కార్యములు చేయుటకు నరులున్నారు. పాపఫలము అనుభవించుటకు నరకమున్నది. కర్మానుభవమును ఇచ్చు యముడున్నాడు."

"ఆ మహాత్ములు మీరే! మీరుగాక ఇతరులు ఎవరును లేరు."

"నన్ను గురించి కాదు. నమ్మాళ్వారు తమను గురించి చెప్పి యుండరు. వారెంతో చేసిరి. కాని విశిష్టాద్వైత సిద్ధాంతము స్థిరపడ లేదు. మీరు నన్ననుచున్నారు. నా కేమి తెలియును ? అల్పజ్ఞుడను. నన్ను గూర్చి అని యుండరు. సర్వలోక గురుడై ఒకరు జన్మింతురు. వారిని గూర్చియే చెప్పి యుందురు."

"సరియే, జన్మింపనిండు, చూతము."

"ఏది ఏమైనను, అట్టి మహనీయుడు నేనుండగనే పుట్టునో ? పుట్టడో ? శ్రీరంగనాథా ! నీ కృపచేత అతడు శీఘ్రముగా అవతరించిన ఎంత ఆనందముగా నుండును !"

## శ్రీమహావిష్ణువు ఆజ్ఞ

వేదములందు, శాస్త్రములందు, పురాణములందు చెప్ప బడుచు వైకుంఠమున నిత్యముక్తులచే నిరంతరము సేవింపబడు స్వామి – శ్రీదేవీసహితుడై శేషునిపై శయనించియుండగా – ఆయనకొక చింత కలిగెను. అది శేషుడు గమనించెను.

"స్వామీ! నీవు నిత్యమును సుఖముగ శయనించువాడవు. సమస్త ప్రాణుల చింత తీర్చువాడవు. అట్టి నీకు చింత ఏల కలిగినది?"

"అందరు ప్రాణులు నా బిడ్డలే ! కలి చెడ్డవాడు. వారిని నరకమున త్రోయును. ప్రాణులు చెడుదురు. అందుకు ప్రతిక్రియ ఏర్పడ లేదు. ఏమి చేయవలయును ?"

"శంఖ చక్ర ఆయుధాంశలచేతను, నిత్యశూరులును భూమిపై పుట్టిరి కదా!"

"ఔను, జన్మించి భక్తిభావముతో నాకు మంగళాశాసనము కావించి, నా కల్యాణగుణములను గ్రంథములలో వర్ణించిరి. కాని అవి స్థిరములు కావు కదా! స్థిరమైన సిద్ధాంత ప్రతిపాదన ప్రచారములు జరుగవలెను."

"అందుల కేమి చేయవలసి యుండును ?"

"ఆదిశేషా ! అనంతా ! నీవే వెళ్ళి భూమిపై అవతరింపుము. నా మతమును సుస్థిరముగా స్థాపించుము. నేనెల్లప్పుడు నీపై శయనించుచుండుటచేత నన్ను బాగుగా తెలిసియున్నావు. నీవు పోయి నా మతమును స్థాపనచేసి రమ్ము!"

"స్వామి ! తమ ఆజ్ఞ !"

శ్రీవైష్ణవ మతస్థాపన కొకడు శీఘ్రముగా అవతరించవలెనని ఆళవందారులు శ్రీరంగనాథుని ప్రార్థించు సమయముననే, భగవానుడు శేషుని భూమిపై అవతరించుమని ఆజ్ఞాపించెను. మహనీయుల ఆకాంక్షలు వ్యర్థము కావు కదా!

## రామానుజుల జననము

యామునాచార్యులవద్ద ఉభయ వేదాంతములు పఠించి, సచ్ఛిష్యులైన [1]శ్రీశైలపూర్ణులు తిరుమలయందు స్వామికి పుష్ప, తీర్థ కైంకర్యములు చేయించుచుండిరి. సాధుమార్గము లోకమునకు చూపుటకై వా రచ్చట గురుని ఆజ్ఞ మన్నించుచు ఉండిరి. శ్రీశైల పూర్ణులకు ఇరువురు చెల్లెండ్రు. వారిలో పెద్దయామె కాంతిమతి సాక్షాత్తు మహాలక్ష్మి అంశము. రెండవయామె ద్యుమతి – భూ దేవి అంశమున జన్మించినది. ఆళవందారులు శ్రీరంగనాథుని సేవించుచు శ్రీవైష్ణవ సిద్ధాంతకర్త జననము ఆకాంక్షించుచుండగా; శ్రీమహావిష్ణువు సిద్ధాంత

1. శ్రీశైలపూర్ణులను తిరుమలనంబి అందురు.

ప్రతిపాదన, ప్రచారములకు శేషుని భూమిపై జన్మించుమని ఆజ్ఞాపించిన కాలమున; శ్రీశైలపూర్ణులు శ్రీవేంకటేశ్వరుని కైంకర్యము, గురుపాదస్మరణ చేయుచు తిరుమలయందుండిరి.

ఆ సమయమున [1]భూతపురిలో నుండు ఆసూరి కేశవ సోమయాజియు, మధుర మంగళములో నుండు కమలనయన భట్టరు అనువారు తమకై కన్యల నడుగుటకు తిరుమలకు పోయి, శ్రీశైలపూర్ణులను అడిగిరి. లక్ష్మీదేవి అంశచే పుట్టిన తన పెద్దచెల్లెలు కాంతిమతిని (పెరియపిరాట్టి) కేశవ సోమయాజికి; భూమ్యంశ సంభవురాలైన చిన్ని చెల్లెలు ద్యుమతిని (భూమిపిరాట్టి) కమలనయన భట్టరుకు ఇచ్చి, శ్రీశైలపూర్ణులు వివాహములు జరిపించిరి. వారు తమ తమ ఊర్లకు పోయి గృహస్థ ధర్మములు నిర్వర్తించుచు సుఖముగ నుండిరి.

[2]శాలివాహన శకము 940 వదియు, పింగళనామ సంవత్సర చైత్రమాస శుక్లపక్ష పంచమి, ఆర్ద్రా నక్షత్రమున గురువారము మధ్యాహ్నము కర్కాటక లగ్నమున; కౌసల్యకు శ్రీరాముడు, దేవకికి శ్రీకృష్ణుడు జన్మించినట్లు, శ్రీశైలపూర్ణుని చెలియలు, కేశవ సోమయాజి భార్యయు, శ్రీదేవి అంశయునైన పెరియపిరాట్టికి భగవదాజ్ఞానుసారము శేషుడు తనయుడై అవతరించెను. రామానుజులు అవతరించిన పింగళిని స్మరించిన పాపహరణమగును. శ్రీశైలపూర్ణులు ఈ సంగతి విని – బిడ్డను చూడవచ్చి, జాతకర్మ నామకర్మలు కేశవ సోమయాజితో నుండి జరిపించి, బిడ్డ భగవదాజ్ఞచే పుట్టెనని జ్ఞాన దృష్టిచే తెలుసుకొని "రామానుజుడు" అని, సాముద్రిక శాస్త్రానుసారముగా అవయవములు ఉన్నందున "ఇళయాన్వాను" అని, "లక్ష్మణుడు" అని పేర్లు పెట్టి తిరుమలకు పోయిరి.

---

1. భూతపురిని శ్రీ పెరుంబూదూరు అందరు.
2. క్రీ.శ. 1018

# రామానుజుల విద్యాభ్యాసము

రామానుజులకు అక్షరాభ్యాసము ఉపనయనములు చేసి, శాస్త్రమును అభ్యసింపచేసిరి. వేదములు నేర్పించిరి. స్వమత స్థాపన చేయవలెనన్న అన్యమత వాదనలు తెలియుట అవసరము కనుక, రామానుజులు కాంచీపురముననున్న యాదవప్రకాశులవద్ద విద్యాభ్యాసము ఆరంభించిరి. ఇట్లు పదునారు సంవత్సరములు గడచెను. రామానుజుల తండ్రి కేశవసోమయాజి సద్వంశమున జనించిన తంజమాంబను తన కుమారునకు వివాహము చేసిరి.

యాదవప్రకాశు లొక వ్యాఖ్య చేసినదానికి, రామానుజులు మరియొక వ్యాఖ్య చేయుచుండిరి. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యమునకు యాదవులు "అన్నియు నొకటియే. అదియే బ్రహ్మ"యని వ్యాఖ్యానించిరి. అందుకు రామానుజులు "బ్రహ్మము సర్వజ్ఞము. దానికి తెలియనిది ఉన్నదా? మొద్దు బ్రహ్మముతో సమానమా? ప్రపంచము భగవంతుని శరీరము – శరీర శరీరి సంబంధము ఉండుటచే అన్నియు ఒకటియే అని చెప్పవచ్చునా? అని అనేక వేదవాక్యములు, పురాణ ఉదాహరణలు చెప్పి, గురుని వాదమును ఖండించిరి. కార్యము ముఖ్యమగుట చేత తమ సామర్థ్యమును ఇంకను వెల్లడింపకుండిరి. "వీడు విద్యకొరకు వచ్చినట్లులేదు. అయినను వీనిని పంపివేయుట యుక్తముకా" దని యాదవులును జాగరూకతతో ప్రవచనము చేయుచుండిరి.

ఒకనాడు రామానుజులు యాదవులకు తలయంటుచుండగా, ప్రవచనము సాగుచుండెను. లక్ష్మణులు యాదవ ప్రకాశుల వీపుపై తైలమర్దన చేయుచుండగా, యాదవులు శంకరాచార్య పద్ధతి ననుసరించి "తస్య యథా కప్యాసమ్ పుండరీక మేవం అక్షిణీ" అను వాక్యమునకు "అస్యతే ఉపవిస్యతే అనేన ఇతి ఆసః పశ్చాద్భాగః కపేః ఆసః కప్యాసః" అనగా 'ఆ హిరణ్మయ పురుషుని నేత్రములు వానరపృష్ఠభాగమువంటి ఎరుపుదనము కలిగియుండెను'

అని వ్యాఖ్యానించిరి. భగవంతుని అట్లు హీనోపమానముతో వర్ణించుటకు రామానుజులు కళవళపడి "అయ్యో! వేదార్థములు తెలియకున్నారే!" అని చింతించగా, వారి కన్నులనుండి వెచ్చని కన్నీరు యాదవుల తొడపై పడెను. అంతట వారు శిష్యుని చూచి "ఏమిరా! సంగతి ఏమి?" అని అడిగిరి. రామానుజులు "అయ్యో! శ్రుతి వాక్యముల కిట్లు విపరీతార్థములు చెప్పుచున్నారే! ఎంత అపరాధము! అయ్యా! కప్యాస పదములోని 'క' అనగా జలము; 'కం పిబతి ఇతి కపిః' అనగా జలము తాగువాడు – సూర్యుడు. 'ఆస' అనగా వికసించుట. కనుక 'కప్యాసం' అనగా సూర్యునిచే వికసించునది – కనుక పద్మము. సౌందర్య స్వరూపుడగు భగవానుని నేత్రములు వికసించిన పద్మముల వలె నున్నవని అర్థము కదా!" అని సమాధానమిచ్చిరి. యాదవులు తమ వాక్యము పరాస్తమగుటకు ఆగ్రహించి, రామానుజులను "నేనేమి చెప్పినను విపరీత వ్యాఖ్యలు చేయుచున్నావు. నీవు గురుడవు నేను శిష్యుడనుగా నున్నది. మన కిరువురకు సరిపడుటలేదు. నీ ముఖము చూడరాదు, పొమ్ము" అనిరి. అయినను మరునాడు లక్ష్మణులు పాఠమునకై వచ్చిరి. యాదవులు "వీడు అధిక ప్రసంగి. నా వ్యాఖ్యలను అపార్థములు చెప్పి, అందరును నాదే తప్పు అనుకొనునట్లు చేయుచున్నాడు. వీడు జీవించియున్న శంకరాచార్య సిద్ధాంతములు పరాస్తము లగునట్లున్నవి. వీని వాదములు పటిష్ఠముగా నా మదికే యథార్థము లనిపించుచున్నవి. వీనిని తొలగించవలెను" అని తలచిరి.

"వీనిని పొమ్మనినను మిమ్ములను విడచిపోకున్నాడు. కాశీ యాత్రా నెపమున వీనిని తీసుకొనిపోయి మణికర్ణికా ఘట్టము విడచులోగా అదునుచూచి మృతి పొందించుట యుక్తము" అను తన అంతరంగ శిష్యుల ఆలోచనను మన్నించి, యాదవ ప్రకాశులు శిష్యులతో కాశీయాత్రకు బయలుదేరిరి.

# రామానుజులను వరదుడు కాపాడుట

తిరుమలనంబి రెండవ చెలియలు ద్యుమతికి క్రోధన సంవత్సరమున, చైనెల శుక్లపక్ష పౌర్ణమి సోమవారమున పునర్వసు నక్షత్రమున గోవిందభట్టరు జన్మించి, పెరిగి, ఉపనీతుడై, తానుకూడ తన పెదతల్లి కొడుకు లక్ష్మణులవలె విద్యార్జనకై యాదవ ప్రకాశులవద్ద చేరియుండెను. సాధుస్వభావుడనియు, వినయశీలి యనియు గురువుల అభిమానము పొందియుండెను. అతనిని కూడ తమతో కాశీయాత్రకు తీసుకొనిపోయిరి. ఎంత గురుభక్తి యున్నను బాంధవ్య బలముచేత తమ ఆలోచన అన్నకు వెల్లడించునేమో యని తలచి, యాత్రా లక్ష్యము అతనికి వెల్లడింపరైరి. కాని గోవిందభట్టరు జడుడు కాడు. రామానుజులు రాత్రి చీకటి ప్రయాణములో నొకచోట మూత్రశంకకై నిలువగా, గోవిందభట్టరును అన్నతో నిలిచి "అన్నా! నిన్ను అంతమొందించుటకే వా రీ యాత్ర తలపెట్టిరి. నీతో నిలిచి ఆలస్యము చేసిన వారు నన్ను సందేహింతురు. జాగ్రత్త!" అని చెప్పి వెళ్ళి మిగతవారిని కలిసి ముందుకు సాగెను. శ్రుతివాక్యార్థ ములు చెప్పుకొనుచు పయనము సాగుచుండెను. రామానుజులు ఒంటరియై అడవిలో నిలచిరి.

రామానుజుల విద్యాభ్యాసము కంచిలో జరిగినందున, ఆ వాసనాప్రభావము చేత లక్ష్మణులు [1]"ఓ వరదరాజా!" అని ప్రార్థించిరి. మరల నొచ్చుకొని "అయ్యో! కంచి చాల దూరము. అచట నుండి స్వామి రావలదా!" అని తలచి, "అయినను [2]గరుడుడు ఉన్నాడుకదా!" అని సమాధానపడిరి. "అతనిపై కూర్చుండి వచ్చి నన్ను కావవచ్చును. అతడు వరదుడు కదా! తన శయనమునైన నన్నెట్లు

1. వరదరాజు – కంచిలోని దైవము.
2. కంచిలోని గరుడవాహనము ప్రసిద్ధమైనది.

ఉపేక్షించును? భక్తవత్సలుడని శ్రుతులు ఘోషించుచున్నవి కదా! హాలాహల పానము చేసితినని గర్వించు శివునైన శిక్షించువాడు. అతనికి యాదవులు అభిమానులైనమాత్రమున సందేహమేల? వరదరాజా! నిన్ను నమ్మినవాడను. వీరు నన్ను చంపదలచిరట. నేను నీ సన్నిధికి ఎట్లు చేరుదును?" అని రామానుజులు స్వామిని తలచిరి. అంత వరదరాజస్వామి భార్యాసహితుడై (పెరుందేవి తాయారు) వేటగానివలె దర్శనమిచ్చి రామానుజులను పరిచితునివలె పలుకరించెను. "నేను కాంచీపురమున నుండువాడను. నీవును కాంచీపుర మఠమున చదువుకొనుచుండు లక్ష్మణుడవు కదా! రమ్ము. నిన్ను అచటికి పిలుచుకొనిపోయెదను. మాతో రమ్ము!" అనిరి. వారు ప్రయాణించుచుండగా మార్గమున "ఇచట జలము దొరకునా? దాహమగుచున్నది" అని పెరుందేవి తాయారు అడిగెను. అంత స్వామి, "ఇచటికి సమీపమున నొక బావి ఉన్నది. దానియందు దివ్యతీర్థము కలదు. చీకటి కదా! తెల్లవారనిమ్ము, తెచ్చి ఇచ్చెదను" అని చెప్పగా, "ఉపకారులగు మీకు తీర్థము తెచ్చి ఈయకుండ నేను ఆలస్యము చేయరాదు" అని రామానుజులు ఆ బావికి పోయి తీర్థము తెచ్చి ఇచ్చిరి. ఆ పుణ్యవతి తీర్థపానము చేసి "సంతోషము, సమయమునకు తెచ్చి యిచ్చితివి" అని రామానుజులను అభినందించెను.

పిమ్మట వారొక చెట్టుక్రింద నిద్రించిరి. తెల్లవారి లక్ష్మణులు చూచుసరికి ఆ దంపతులు అంతర్ధానమైరి. ఆ చోటు కాంచీపుర సమీపమై యుండెను. [1]"పుణ్యకోటి విమాన మెచ్చట? పుష్కరిణి ఎచ్చట?" అని రామానుజులు అచటివారిని అడుగగా, వారు "అవిగో" అని సమీపముననే చూపిరి. తనను కాపాడుటకై వరదరాజు, పెరుందేవి తాయారు వచ్చిరని తలచి, రామానుజులు

1. కంచి వరదరాజాలయములోనివి.

అచట స్నానమాడి, సంధ్యవార్చి, స్వామి దంపతుల కిష్టమైన ఆ బావి జలము నిత్యము వారి తిరుమంజన కైంకర్యమును కిచ్చుచుండిరి.

"గోవిందభట్టరు రామానుజుని తమ్ముడు. వీడైనను మన సిద్ధాంతములందు నిష్ఠితుడు కావలె"నని తలచి, యాదవ ప్రకాశులు వానిని తన అభిమతానుసారము శిక్షించుటకు తాపత్రయపడుచుండిరి. యాత్రికులు కాశి చేరి గంగలో మునిగిరి. లేచుసరికి గోవిందభట్టరు అరచేతి కొక లింగము వచ్చెను. అచట చేరినవారు "ఓహో! ఏమి శివానుగ్రహము! ఇతడు శివభక్తాగ్రేసరుడు!" అని కొనియాడిరి. దానితో గోవిందభట్టరు పరమశైవుడై "ఉళ్ళంకైలింగ కొండనాయనార్" అని ప్రసిద్ధిపొందెను. యాత్ర నుండి తిరిగివచ్చిన తరువాత "ఎన్నాళ్ళిట్లు లింగము చేతబెట్టుకు తిరిగెదవు? దీని నొక చోట నుంచుము" అను గురువాక్యము ప్రకారము, భట్టరు ఆ లింగమును తన ఊరు మధురమంగళమున ప్రతిష్ఠించెను.

కాళహస్తీశ్వరు డా యూరి అధికారులను స్వప్నమున ప్రబోధించగా, వారు ఉళ్ళంకైలింగ కొండ నాయనార్ దొడ్డవ్యక్తి యని తలచి, అతడుండు చోటికి వచ్చి, కాళహస్తిలో దేవళ మర్యాదలను లెస్సగా జరిపించుటకు రావలెనని గోవిందభట్టరును ఆహ్వానించి, తీసుకొనివెళ్ళిరి. అతడును పరమశైవుడై అచట కార్యనిర్వహణ చేయుచుండెను.

యాదవ ప్రకాశులు కాంచీపురమునకు వచ్చి బిందెతో తీర్థము తెచ్చుచున్న రామానుజులను చూచి "ఇచటి కెట్లు వచ్చితివిరా? చేత ఈ బిందె ఏమి?" అని అడుగగా, రామానుజులు తనను వారు విడిచినది మొదలు జరిగిన అన్ని సంగతులు విశదము కావించిరి. యాదవులు "ఆహా! 'అన్యథా చింతితం కార్యమ్, దైవమన్యత్ర చింతయేత్' అన్నట్లు, దైవ సంకల్పము వేరుగానున్నది. వీడు భగ

వత్ప్రసాద పాత్రుడుగా తోచుచున్నది. వీనితో విరోధము కూడదు. ఇంత వేదాంతిని, నాకు దైవము ప్రసన్నము కాలేదు. వీనితో వరదుడు మాట్లాడు చున్నట్లు తోచుచున్నది" అని మనసున తలచినను, పైకి తెలుపక "నీకు తీరిక యైనప్పుడెల్ల వచ్చుచుండుము" అని చెప్పి మఠమునకు వెళ్ళిరి. ఇట్లు రామానుజులు మరల యాదవ ప్రకాశులవద్దకు వెళ్ళుచు వచ్చుచు నుండుట కొనసాగినది.

## ఆళువందారుల అన్వేషణ

శ్రీరంగమున [1]పెరియనంబి, [2]తిరువరంగ పెరుమాళ్ళరయర్ మొదలగు వారెల్లరు కాలక్షేపము చేయుచుండగా, ఆళువందారులకు ఒక ఆలోచన కలిగెను. " 'పొలిఘు-పొలిఘు' అను పాశురము కాలక్షేప సమయములో అట్టి క్షేమము కలిగించు నాతడు ఎప్పుడు అవతరించునో అనుకొంటిని. ఈసరికి అవతరించియే ఉండును. వారే వత్తురని ఉపేక్షింపరాదు. మన శ్రేయమును తలచవలదా? కావున శిష్యులారా! ఆతని పాదాది కేశపర్యంతము సాముద్రిక శాస్త్రానుసారముగ నుండును. మీరు లెస్సగా పరికించుడు. అట్టివానికై వెదకుడు" అని ఆనతీయగా, వారును వివిధ ప్రదేశములందు వెదకి వెదకి తిరిగివచ్చి, "గురువరా! సర్వలక్షితు డొకడు కాంచీపురమున విద్యాభ్యాసము చేయుచున్నాడు. ఆతడై యుండును" అని చెప్పిరి. యామునులకు వెంటనే అతనిని చూడవలెనని కోరిక కలిగినను, శారీరక అస్వస్థతచే పోజాలరైరి. తలచినంతనే చూచిన ఆశ తీరును. కాని పోలేకుండుటకు చింతించిరి. "రంగనాథా! నా శరీర మెప్పుడు స్వస్థత నొందునో! అతనిని ఎప్పుడు చూడగలుగుదునో!" అని ప్రార్థించుచుండిరి.

---

1. యామునుల శిష్యుడు
2. యామునుల పుత్రుడు, శిష్యుడు కూడ. వరరంగాచార్యులని మరియొక పేరు కలదు.

# యామునాచార్యుల కాంచీయాత్ర

శ్రీరంగనాథులు యామునులకు స్వస్థత ప్రసాదించిరి. ఆ సమయమున కాంచీపురి నుండి ఇరువురు వైష్ణవులు యాత్రార్థము శ్రీరంగము వచ్చి యామునాచార్యులను దర్శించిరి.

"తమ దేయూరు?"

"ఆచార్యా! మాది కాంచీపురము."

"అచటి విశేషము లేమి?"

"ఇచట మీరు, మీ శిష్యులును వైష్ణవులే. అచట గురువు అద్వైతి, శిష్యుడు ఒక వైష్ణవుడు. అతడు నిత్యము గురువాక్య వివరణము నంగీకరించక జగడమాడుచుండును."

"ఆ శిష్యుని శారీరక లక్షణములో?"

"వాని యంద మేమని చెప్పుదుము! శుభలక్షణములు కలవాడు."

"జగడమాడు శిష్యుని అంగీకరించిన, గురుడు సామాన్యుడై యుండడు."

"అవును, ఆ చిన్నవానిన చంపదలచి వానిని కాశికి పిలుచుకొనిపోయెను. ఆ సంగతి నెరిగి, వారిని విడిచి, భగవంతుని ప్రార్థించిన శిష్యుని వరదుడు పిలుచుకొనిపోయి, క్షేమముగ కాంచీపురము చేర్చెను."

"ఆహా! పిలచినంత మాత్రాన స్వామి వచ్చి కాపాడుటయా! ఆర్తశరణ్యత నిరూపించుటయా! నే తలచిన యాతడు అతడే యగును. నేను శీఘ్రము చూడవలెను."

యామును లట్లు తలచుటకు కారణమేమైయుండును? సుందర పురుషుడని చూడతలచిరా? లేక తమకు దగ్గర బంధువనియా? కాదు – అద్వైతగురుని వాక్యమును ఖండించిన శిష్యుడని వినినంతనే సంతోషము కలిగినది. నాథమునుల పరంపరగా వచ్చిన వేదాంతార్థము పాడుబడుచున్నందున, ఆ

చిన్నవాడు పునరుద్ధరించగలడని తలచి సంతోషించిరి. పయనమై తిరుక్కొయిలూరు మార్గమున వెళ్ళుచు అచటి స్వామిని దర్శించి, కాంచీపురి కేగిరి. యామునుల శిష్యులైన [1]కాంచీపూర్ణులు తమ గురుని రాక తెలుసుకొని, పిలుచుకొనిపోయి, ఉపచారములుచేసి వరదరాజులను సేవింపజేసిరి. యామునులు అట్లు వరదుని సేవించి ఏమికోరిరి? లోకులందరివలె ధనధాన్యములుగాని, బిడ్డలనుగాని  కాదు. రామానుజులను క్షేమముగా నుండునట్లు అనుగ్రహింప గోరిరి.

"స్వామీ! కొంచెము కొంచెముగా సంగ్రహించిన సొత్తు పుత్ర పౌత్ర పరంపరగా తనవారు అనుభవింపవలెనని తండ్రి కోరును. నాధమునులు, ఉయ్యక్కొండారు, మణక్కాల్‌నంబి శ్రమపడి సంపాదించిన విద్యా భక్తి వైరాగ్యధనములు నాకిచ్చిరి. వానిని ఆచంద్రార్కముగా నుండునట్లు చేయు బిడ్డ రామానుజులే. ఇతడు బహుకాలము జీవించి వైష్ణవ సిద్ధాంతమును కాపాడవలెను. నీ కటాక్షముచేత చెవిటి వినగలుగును. కుంటివాడు పరిగెత్త గలుగును. అశ్వత్థ ప్రదక్షిణము, రామేశ్వరయాత్ర, సుందరకాండ పారాయణము చేసియు గొడ్రాలైన స్త్రీ, కాంచీవరదా! నిన్ను సేవించి పుత్రవతి యగునే! నీవు కోర్కెలు తీర్చి అనుగ్రహించువాడవు. నిన్నివి యేవియు అడుగబోను. నీకా శ్రమ లేదు. కండ్లు, కాళ్ళు, చేతులు, నోరు మొదలగు సర్వాంగ పరిపూర్ణుడగు బిడ్డ జన్మించియున్నాడు. ఈ రామానుజుని కాపాడుము" అని ప్రార్థించి, ప్రదక్షిణము చేయుచుండగా యాదవ ప్రకాశులు తమ శిష్యవర్గముతో వచ్చుచుండిరి. ఆ శిష్యకూటమున రామానుజులను తిరుక్కచ్చినంబితో కూడి గుర్తించిరి. తిరుక్కచ్చినంబియు "స్వామీ! తెలియలేదా, ఆ సర్వలక్షణయుతుడు! ఆపాద శిరః పర్యంతము వీక్షింపుడు" అని చెప్పెను.

---

1. కాంచీపూర్ణుల మరియొక పేరు తిరుక్కచ్చినంబి. యామునుల అబ్రాహ్మణ శిష్యులు.

సందడిగా శిష్యగణ సమేతుడై ప్రాకారమువద్ద పోవుచున్న యాదవ ప్రకాశుని పరివారమధ్యమున, రామానుజులు నక్షత్రమండల మధ్యమున చంద్రునివలె వెలుగుచుండిరి. యామునులు రామానుజుని చూచి "ఈతని విషయమే నేను రంగనాథుని ప్రార్థించితిని. అది యిప్పుడు ఫలించినది" అని తలచిరి. కన్నులనుండి ఆనందబాష్పములు రాలుచుండగా, వారినే చూచుచు పోయి ప్రదక్షిణము చేసిరి. యాదవ ప్రకాశులు ప్రవచనము చేయుచు పోవుచుండిరి. రామానుజుల నపుడు పిలచినను, మాట్లాడినను, వాక్యార్థములకు ప్రతిబంధకమగును. అందును వైష్ణవు డెవరైన మాట్లాడిన యాదవుల కాగ్రహము కలుగును. రామానుజులు సిద్ధాంతకర్త కావలసియున్నందున, పూర్వపక్ష గ్రంథములు ఆమూలాగ్రము పఠించవలెనని తలచి, రామానుజులను పలుకరించకయే, యామునాచార్యులు తిరిగి శ్రీరంగమునకేగిరి.

## రామానుజుల వినయ, ఔదార్యములు

కాంచీపుర రాజపుత్రికకు బ్రహ్మరక్షస్సువలని బాధకలిగెను. అనేక మంత్రవాదులు యత్నించిరి. కాని, దానిని పారద్రోలలేరైరి. రాజు వ్యధచెంది క్రొత్త మంత్రవాదులను పిలిపించుచుండెను. రాజాంతరంగికులు యాదవ ప్రకాశుని మంత్రశక్తిని ప్రస్తుతించి, వారు మన పట్టణమునే ఉన్నారు. కొండ తలక్రింద నుండగా రాళ్ళకై వెదకుటెందుకు? వారిని పిలిపింపుడు. వారు పొమ్మనిన వెంటనే ఈ పిశాచము పారిపోవును" అని చెప్పిరి. వార్తనందుకొని యాదవులు రాజు నొద్దకు శిష్యగణ పరివృతులై వచ్చిరి. వారికి తన మంత్రశక్తిపై అపూర్వ విశ్వాసముండెను. రాజును ఆ విశ్వాసముతోనే పిలిపించెను.

"అయ్యా! మీరు మహామంత్రవాదులని వింటిని. మా బిడ్డను పిశాచము పీడించుచున్నది. దానిని పారద్రోల గోరుచున్నాను."

"ప్రభూ! ఇంతవర కెవరెవరు యత్నించిరి?"

"అనేకులు వచ్చిరి. వారివలన కాలేదు."

"ఎందరో వచ్చినను వారివలన కాలేదా?"

"అది ఎంతయో శక్తిమంతమైనదై యుండును."

యాదప్రకాశులు శిష్యునొకనిని పిలిచిరి.

"ఓరీ! అంతిపురిలోనికి పోయి, రాజపుత్రిని కూర్చుండుమని, 'యాదవ ప్రకాశస్వామి బిడ్డను వదలిపొమ్మని'రని పిశాచముతో చెప్పుడు."

శిష్యుడు అంతఃపురమునకు వెళ్ళి, గుర్వాజ్ఞ వినిపించగనే రాజపుత్రి నావహించిన బ్రహ్మరక్షస్సు,

"ఓరీ! నీ గురువు యాదవ ప్రకాశుడుగాని, వాని గురువుగాని, ఎవరు వచ్చినను నేను పోను. వాని దుర్మంత్రములు నాయొద్ద చెల్లవని చెప్పుము" అనెను. జరిగినది విని యాదవులు ఆగ్రహించిరి. "ఓహో! దానికంత ధైర్యమా? అదియేమో వదలించెదను!" అని అంతఃపురమునకు వెళ్ళి, తాను నేర్చిన శ్రేష్ఠతమ మంత్రములు దానిపై ప్రయోగించ నారంభించిరి. పిశాచము చలింపదయ్యెను.

"ఓరీ! నేను పోనని చెప్పితిని కదా! నీవు వచ్చిన మాత్రమున పోదునని తలచితివా? నీవే పొమ్ము. లేకున్న నిన్ను మ్రింగివేసెదను. నీవంటివారిని అనేకులను చూచియున్నాను!"

"ఓసీ! నన్ను అందరితో సమానమని తలచితివా? నేను సర్వజ్ఞుడనని తెలుసుకొనుము."

"అటులైన నీవు పూర్వజన్మమున నెవరివో చెప్పగలవా?"

"నీవే చెప్పుము!"

"ఇదిగో! సర్వులు వినున ట్లీ సభయందే చెప్పుచున్నాను. నీవు మధురాంతకమున ఏటిగట్టున పుట్టయందు ఉడుమువై యుంటివి."

"అట్లయిన, ఈ జన్మమున బ్రాహ్మణజన్మ నెత్తుట ఎట్లు తటస్థించినది?"

"శ్రీరంగమునుండి తిరుమల యాత్రికులు అగు వైష్ణవులు నీవున్న ఏటిగట్టున భుజించి వెళ్ళిరి. అచట విడిచిన భుక్తశేషము నీవు మ్రింగితివి. వారి భుక్తశేష ప్రాభవము నీ కీ జన్మనిచ్చినది. నేను బ్రాహ్మణుడనై, వేదపారంగతుడనై భగవద్గీత పదునేడవ అధ్యాయమున చెప్పినట్లు, ప్రతిష్ఠకై యాగమొనర్చిన లోపమున పిశాచ జన్మ కలిగెను. తామస యాగఫల మూరకే పోవునా?"

"అటులైన నీవు ఏమి చేసిన పోయెదవో తెల్పుము?"

"నీ శిష్యులలో నొకరగు రామానుజులు పొమ్మనిన పోయెదను!"

"రామానుజా! ఈ పిశాచమును పొమ్మని చెప్పుము!"

గురునాజ్ఞ మన్నించి రామానుజులు ఇట్లనిరి :

"బ్రహ్మరాక్షసుడా! ఈ రాజపుత్రిని వదలిపొమ్ము!"

"నీవిట్లు ఊరకపొమ్మనిన పోవుదునా? నీ శ్రీపాదములను నా శిరమున నుంచుము. ఆ ధూళి నా తలపై పడవలెను. నీ శ్రీపాదతీర్థము నాకొసగవలెను. నేనపుడు పోయెదను!"

రామానుజులు యాదవులను చూచి వినయముతో

"మీముందు అది కోరినట్లు నేనెట్లు చేయగలను?"

"యోచింపకుము. అది చెప్పినట్లు చేసి దానిని పొమ్మనుము!"

"ఓ బ్రహ్మరాక్షసుడా! ఇదిగో, మా గురువాక్యానుసారము నీవు కోరినట్లు చేయుచున్నాను. నీవు వెంటనే రాజపుత్రిని వదలి పోవలెను. నీవు పోవుటకు గుర్తుగా, అదిగో! మా మఠద్వారమున నీవు వశించు ఆ రావిచెట్లు విరిగిపడవలెను."

రామానుజులు అది కోరినట్లు పాదధూళిని, పాదతీర్థమును ప్రసాదించిన వెనువెంటనే రావిచెట్టు విరిగిపడెను. రాజపుత్రి శరీరము నుండి ఒక

దివ్యప్రకాశము బయల్వెడలి దివ్యదేహధారణ చేసి విమానమెక్కి దివ్యస్థానమునకు పోయెను. రాజపుత్రి శరీరమున కాంతి కలిగెను. ఇట్లు రామానుజుని ప్రభావము అందరికి విశదమయ్యెను. రాజు ఆశ్చర్యపడి రామానుజులు మహానుభావులని తలచి, శరణాగతుడై అపరిమిత ధనమును సమర్పించెను. అతడిచ్చు సంపద ఆదిశేషుని ఒక శిరోమణి విలువచేయునా? రామానుజులు వలదనిరి. కాని రాజు ఎంత వారించినను విరమించనందున, తనకు కలిగిన గౌరవకారకునిగా యాదవులను సంభావించి, వారి కా ధనమంతయు సమర్పించిరి. వరదుని దర్శించి "వరదరాజా! బ్రహ్మరక్షస్సు నా సమర్థతచేత పోలేదు. నీ కృపచేతనే పోయెను" అని విన్నవించి, స్వామిని స్మరించుచు గురునితో కలిసి మఠమునకేగి విద్యాభ్యాసము కొనసాగించిరి.

## రామానుజులు యాదవప్రకాశులను విడచుట

ఆళవందారులకు రాజవ్రణము కలిగెను. వారు నిత్యానుష్ఠానములు నిర్వహించుట అసాధ్యమగుచుండెను. కాబట్టి వారా సమయమున తాము కప్పుకొను శాలువను దూరముగా పడవైచి "నా ప్రారబ్ధమా! నీవటులుండుము" అందురు. తోడనే వారి బాధ ఆ శాలువయందు నిలచును. అనుష్ఠానానంతరము వారు భోజనము చేయకయే ప్రారబ్ధమును రమ్మని పిలచినంత అది తిరిగి వారియందు నిలచును. [1]మార్నేర్ నంబి ఆళవందారుల బాధను తనయందుంచ మని ప్రార్థించెను. కాని వారంగీకరించకుండిరి. వారు "ప్రారబ్ధమనియు, అప్రారబ్ధమనియు కర్మలు ఇరుతెరగులు. అప్రారబ్ధము జ్ఞానముచే నశించును. కాని ప్రారబ్ధము అనుభవించి తీరవలసినదే. ఇంక కొంచెమే మిగిలియున్నది"

1. యామునాచార్యుల అబ్రాహ్మణ శిష్యుడు.

అనిరి. అయినను మార్నేర్ నంబి పలుమారు ప్రార్థించుచున్నందున 'తీసుకొను' మని తన బాధనీయగా, నతడు సహింపలేకపోయెను. ఆళవందారు లపుడు పెరియనంబిని పిలచి "అబ్బాయి! ఇతడు భక్తిచే అడిగెనేకాని, భరింపలేకున్నాడు. నీ వీతనిని జాగ్రత్తగా చూచుకొనవలెను" అని చెప్పి [1]కాలక్షేపము మాత్రము కొనసాగించుచుండిరి. అట్లు శిష్యునకు వ్యాధి నిచ్చినందున యామునులకు ఆరోగ్యము కలిగెను. "రామానుజుడు అద్వైతమును లెస్సగా పఠించినాడు. గోవిందభట్ట రీ వరకే దారితప్పినాడు. ఇరువురును ఆ మార్గమునే పోవుదురేమో?" అని ఆళవందారులు భయపడిరి. "స్వామీ! నే చేసిన ప్రార్థన ఫలించలేదు. రామానుజునికి యాదవప్రకాశుల పొత్తు వదలవలెను. వారు కలహించిన అరుచి పెరుగును. అప్పుడుగాని ఇచటికి వచ్చువీలుండదు. రామానుజుని వరదుడుకూడ పంపకున్నాడు. లక్ష్మణులు వచ్చిననే నీకు గౌరవము" అని శ్రీరంగనాథునికి విన్నవించిరి. స్వామి ప్రేరణచే యాదవులతో రామానుజునికి వాదకలహము కలిగెను. యాదవులు 'తదేక సేవ్యం' అను శ్రుతి వాక్యమునకు వ్యాఖ్యానము చేయుచు "ఈ సమస్తమును ముత్యపుచిప్ప యందు వెండివలె తోచును. జ్ఞానము కలిగెనేని ఏమియును లేదని తెలియును" అని అర్థము చెప్పిరి. అంత రామానుజులు "గురువరా! చరాచర ప్రపంచమును స్వామి సృజించెను. దానిని మీరు అబద్ధమనుచున్నారే! మీ వాదము ప్రమాణములకు సరిపడుటలేదు. మూఢుడు కూడ ఇట్లు చెప్పియుండడు" అనిరి. అంత యాదవప్రకాశులు "ఓరీ! ఒకటి, రెండు, మూడు పర్యాయములైనది. నేను గురుడను – నీవు శిష్యుడవు అను తారతమ్యములేదు. చాలునిక నీ శిష్యత్వము, పొమ్ము!" అనిరి.

---

1. వివరణ.

రామానుజులు ఇంటికి వచ్చి “వరదరాజా! ఇదివరకు మూడు పర్యాయము లైనది కదా! మరల మఠమునకు పోదునా? వలదా?” అని ఆలోచించుచుండగా, వారి తల్లి “సంగతి ఏమి నాయనా!” అని అడిగెను. జరిగిన సంగతిని వారు తల్లికి చెప్పగా ఆమె “నాయనా! నీవు వైష్ణవ ధర్మ నిష్ఠురుడవు; ఆయన అద్వైతి. అట్లే చెప్పుచుండును. పొత్తు ఎట్లు కుదురును? ఇక చాలించి తిరుక్కచ్చినంబిని ఆశ్రయించుము. వారు పెద్దవారు. వారు చెప్పినట్లు చేయుచుండుము” అని ఉద్బోధించెను. లక్ష్మణులు తిరుక్కచ్చినంబిని అడుగగా “ఇక ఆ చదువు చాలించి నిత్యము వరదరాజస్వామికి తిరుమంజన [1]కైంకర్యము చేయుము” అనిరి. రామానుజు లట్లే చేయుచుండిరి.

## యామునయుగ సమాప్తి

ఆళవందారులకు మూడవమారు వ్యాధి కలిగెను. శిష్యులు జాగ్రత్తగా చూచుచుండిరి. పెరియనంబి, తిరువరంగ ప్పెరుమాళ్ళయర్ మొదలగువారు తమ తమ సందేహములు అడుగగా సంగ్రహముగ చెప్పిరి. వారు వారు నిర్వహించవలసిన బాధ్యతలను నిర్దేశించిరి. వారందరకు తమ ఆచార్యులతో ఎడబాటు కలుగునను దుఃఖము కలిగెను. రామానుజులు యాదవప్రకాశు లను వదలిన సంగతి ఆళవందారులకు తెలియరాలేదు. కావున వారు “రంగనాథా! రామానుజులను పిలచుకొనిరాకున్నావు. నా మనోరథము నెవరికి అప్పగింతును?” అని విన్నవించుకొనిరి.

ఇంతలో కాంచీపురి నుండి వైష్ణవు లిరువురు ఆళవందారులవద్దకు వచ్చి ప్రసంగవశమున, రామానుజులకును యాదవప్రకాశులకును కలహమై,

1. సేవ

రామానుజులు వారివద్ద చదువుమాని, తిరుక్కచ్చినంబి నాశ్రయించి, వారు చెప్పినట్లు వరదరాజస్వామి కైంకర్యము చేయుచున్నట్లు చెప్పిరి. తోడనే ఆళవందారులకు రామానుజుని చూడవలెనను కోరిక బలమాయెను. వారు "రంగనాథా! నన్నిక ఎనిమిది దినములు బ్రతికించుము" అని ప్రార్థించిరి.

స్వచ్ఛంద మరణప్రాప్తి భీష్మునికి మాత్రమే. ఇతరుల కట్లు కలుగునా? శిశువు మాతృగర్భమున నుండగనే వానికి కర్మ విత్త విద్యా నిధనాదులైదును బ్రహ్మ లలాటమున లిఖించును. అది విధి – అవిలంఘ్యముకదా!

ఆళవందారులు తమ ముఖ్య శిష్యులైన పెరియనంబిని కాంచీపురి కంపిరి. వారును గురువాజ్ఞ శిరసావహించి కాంచీపురికి వచ్చి అనంత సరస్సున స్నానము చేసి వరదరాజస్వామిని దర్శించి ఆళవందారులచే చేయబడిన ఆళవందార్ స్తోత్రమును పఠించి ప్రదక్షిణము చేసిరి. అందలి ఒక శ్లోకము రామానుజుల చెవిబడెను.

"ఓ నారాయణా! అనేకులు ఒక్కొక్క దేవుని తలతురు. కొందరు బ్రహ్మ విష్ణు పరమేశ్వరులను ముువ్వురను తలచుదురు. నే నిద్దరిని విడచితిని, నిన్ను విడువను. నారాయణానువాక ప్రతిపాద్యమవైన నిన్ను వైదికులు పరతత్త్వమవని నమ్ముదురు. నేనందరిని విడచి నిన్నే స్తుతింపనేల? అని అడిగెదనా? నీవును, వారును దేవతలే. నాకు నీ మహిమ సముద్రముగాను, వారి దేవత్వము నీటి బిందువుగాను తోచుచున్నది" అని దాని భావము.

రామానుజులు ఇది విని "ఆహా! బ్రహ్మాదుల దైవత్వమును జలకణముగాను, స్వామిని సాగరముగాను సిద్ధాంతీకరించిన ఈ వైష్ణవుడెవరో?" అని తలచి పెరియనంబిని సమీపించిరి.

"అయ్యా! దీని నెవరు రచించిరి?"

"ఆళవందారులు రచించిరి."

"వారెచ్చట నుందురు?"

"శ్రీరంగ క్షేత్రమున నున్నారు."

"నేను వచ్చినచో వారిదర్శనమగునా?"

"నేనందులకే వచ్చినది, బయలుదేరుడు!"

వారిరువురు శ్రీరంగమునకు పయనమైరి. అచట యామునాచార్యుల నిర్యాణ సమయమయ్యెను. వారు శిష్యులను చూచి కన్నీరు నించిరి. "జ్ఞానులగు మీరేల దుఃఖించుచున్నారు?" అని అడిగిన, వారు "నా మనసున మూడు కోర్కెలున్నవి" అని, తమ మూడు చేతివ్రేళ్ళను ముడిచి చూపుచునే పరమపదించిరి.

సన్న్యాసవిధి ననుసరించి వారి దేహమును తిరువరంగప్పెరుమాళ్ళరయర్, తిరుక్కొట్ట్యూర్నంబి మొదలగు అనేకులు కావేరీ తీరమునకు చేర్చి భూస్థాపన చేయనుండిరి. ఆవేళకు రామానుజులతో కావేరీ తీరము చేరిన పెరియనంబి అచట గల జనసమూహమును చూచి, విచారించి, గురుమరణమును విని మూర్ఛనొంది, లేచి, "రామానుజా! వారే యామునులు. నిన్ను పిలచుకొని రమ్మనిరి. వచ్చులోననే మరణించిరి" అని చెప్పగా, రామానుజులును మూర్ఛనొంది లేచి, "భగవత్సంకల్పము" అని ఊరకుండిరి. తిరువరంగ ప్పెరుమాళ్ళయర్ మొదలగువారు వారియొద్దకు వచ్చిరి. రామానుజుని పిలచుకొని పోయిరి.

"రామానుజా! యామునుల దివ్యమంగళ దేహమును సేవింపుడు!" రామానుజులును తద్దేహము నఖశిఖపర్యంతము చూచిరి.

"ఓ వైష్ణవులారా! వీరి చేతివ్రేళ్ళు మూడు ముడుచుకొని యున్నవి.

పుట్టిననాటి నుండి ఇట్లే యున్నవా? ఇప్పుడే ఇట్లాయెనా? చెప్పుడు, మీరు వారితో నెల్లపుడు ఉండువారుకదా!"

"ఇవి పూర్వము సరిగానే ఉండెను. ఇప్పుడే ఇట్లాయెను."

"ఇట్లు జరుగుటకు కారణమేమి?"

"మహాత్మా! అదియేమో మీరే సెలవీయవలెను!"

అంత రామానుజులు నారాయణస్మరణచేసి, యామునుల మూడభిప్రాయములు తెలుసుకొని "అయ్యో! సమయము మించిపోయినది. వీరియొద్ద అనేక శాస్త్రార్థములు తెలుసుకొని యుండెడు వాడను. దానికి వీలులేకపోయెనే!" అనుకొని, అచట చేరిన అశేష ప్రజానీకము, యామునుల శిష్యులు చూచుచుండగా యామునుల చరమ విగ్రహమును సమీపించి, ప్రదక్షిణించి, నమస్కరించి, ఇట్లు చెప్పిరి. "స్వామీ! నేను ప్రమాణముచేసి చెప్పుచున్నాను.

1. "నేను గోవిందభట్టరువలె మతాంతరమున పడిపోను. దుష్టసహవాసము విడచితిని. వైష్ణవ సిద్ధాంతమును స్థాపించెదను. పంచసంస్కారములు ఆవశ్యకములనియు; వైష్ణవ సంస్కారము కలవారు వేదము నభ్యసించిన విధముగా దివ్యద్రావిడ ప్రబంధము అధ్యయనము చేయవలెననియు; కర్మ జ్ఞానభక్తులు చాలుననుకొను వారికి శరణాగతియందు రుచికలిగించెదననియు వీనిని లోకోద్ధరణకు గాను ఏర్పరతుననియు నొక్కి చెప్పుచున్నాను.

2. "బ్రహ్మసూత్రములకు వైష్ణవ ధర్మమగు విశిష్టాద్వైత రీతిని భాష్యము వ్రాసి, దానిని లోకమున నిలిపెదను.

3. "పురాణరత్నమని చెప్పబడు శ్రీవిష్ణుపురాణకర్త శ్రీపరాశరుల పేరును, సకలవేద సారమును ద్రవిడమున గానము చేసిన నమ్మాళ్వారుల పేరును

లోకవ్యాప్తి చేసెదను" అని ఒక్కొక్కటి చెప్పినంతనే యామునులు మూసిన వ్రేళ్ళొకటి ఒకటిగా మూడును యథాప్రకారము విచ్చుకొనుట అచటివారందరు ఆశ్చర్యముతో తిలకించిరి.

"ఓహో ! ఇతడు విశిష్టాద్వైత చక్రవర్తి. స్వామి ! మీరే ఆళవందారుల కొరత దీర్చగలవారు. మీరే విశిష్టాద్వైతమును స్థాపింపను, నిలుపను మాకు గతి. రంగనాథుని సేవింప రండి !"

"మీ రంగనాథునికిని, నాకును సరిపడదు !"

"రంగనాథుడు సర్వలోకేశుడు కదా !"

"ఆయన సర్వలోకేశుడై నను నా కాయనతో పని లేదు."

"అపచారము ! – వారు మీకు స్వామికాదా ?"

"ఆళవందారులు నన్ను చూడగోరి తమను ఎనిమిది దినములు బ్రతికించి యుంచుమని కోరిరి. వారి కోరిక తీర్చలేదు. నేను వచ్చులోపల మూడువేళ్ళు ముడుచునట్లు చేసి ప్రాణముల దీసిరి. వారింకను నాతో నేమి చెప్పదలచిరో ! వారిని నేను వచ్చునందాక నుంచినచో ఎన్ని వేదాంత రహస్యము లుపదేశించి యుందురోకదా ! వచ్చితిని కదా! మీకొరత దీర్చెదననగా వేళ్ళను సరిగా విడచిరి. ఈ స్వామికి 'కర్తు మకర్తు మన్యథాకర్తు' శక్తియున్నదని తలచుచున్నారు. ఆళవందారుల నిక నాల్గుదినములు జీవించియుంచని కారణమేమి ? అందుకు నాకు యోగ్యత లేదా ? లేకున్న చూడనేలను ? శక్తియున్న కాపాడవలయును. నాకు తత్త్వార్థ గ్రహణము లేకపోయినది."

రామానుజు లిట్లనుటకు వారికేమైన భగవద్ద్వేషమా ? ఎంత మాత్రము లేదు. యామునులు తనను, తాను యామునులను చూచుటకు సాయపడక కొరతపెట్టెనని ఆగ్రహించిరి. అందుచే స్వామిని సేవించకయే తిరిగి కాంచీపురి కేగిరి. యామునుల చరమ కార్యములు జరిగినవి.

# తిరుక్కోట్యూర్ నంబి విచక్షణ

రామానుజులట్లు కాంచీపురమున కేగి తిరుకచ్చినంబితో జరిగిన సంగతులన్నియు చెప్పిరి.

"యామునులే - జీవించియుండిన నెన్ని విషయములు తెలిపి యుండెడివారో!"

"రామానుజా ! నీవు స్వామిని శపించి వచ్చియుందువు. రంగనాథుడేమి చేయును? కోపగించి వచ్చితివి. పోనిమ్ము. కొదువచేత ముడుచుకొనిన వ్రేళ్ళను సరిగా వచ్చునట్లు చేసితివి. ఎప్పటి యట్లు వరదరాజునకు తిరుమంజన కైంకర్యము చేయుచుందుము."

"రామానుజు లట్లే చేయుచుండిరి. వారిట్లు తలచిరి : "ఎల్లవారు గ్రంథపఠన ద్వారా విషయగ్రహణ చేయుదురు. తిరుక్కచ్చినంబికి స్వామియే సందేహముల దీర్చుచున్నాడు. కావున వీరిని ఆశ్రయించ వచ్చును. సేవ్యతకు జ్ఞానము ముఖ్యము. ఎందరో వేదాదులద్వారా పరబ్రహ్మమును తెలుసుకొందురు. ఈయన సాక్షాత్పరబ్రహ్మయైన స్వామితో మాట్లాడుచున్నారు. ఇట్టియెడ కులము ముఖ్యము కాదు. భగవంతునితో గల బాంధవ్యమునుబట్టి వీరిని గురువుగా నెంచవచ్చును. పెద్దలు నమస్కార మాత్రమున ప్రీతులగుదురు. వీరిని ప్రీతులనొనర్చి వీరివద్ద విషయ జ్ఞానము, మార్గము నెరిగెదను."

వెంటనే తిరుక్కచ్చినంబిని దర్శించి, నమస్కరించబోగా నంబి వారిని వారించిరి.

"నేను మీ శిష్యుడను. శాస్త్రములను నేర్చి ఇతరులను వాద బలమున నోడింప సమర్థుడనై యున్నాను. అయినను నా మనసున కొన్ని సందేహము లున్నవి. వాని నెవరు తీర్తురు ? యామునులు పరమపదించిరికదా ! నాకు మీరే శరణ్యము."

రామానుజా! నీవు తలచినట్లే వరదుడు నాతో మాట్లాడును. సత్కాలక్షేపము చేయువారితోను మాట్లాడును. నేను కాంచీపూర్ణుడను కదా! పూర్ణుడనే! నా కట్టి శక్తి చేకూరినది. అయినను నీవు బ్రాహ్మణుడవు. నేనట్లు జన్మించలేదు. శాస్త్రములందు కులశీలములు పాటించనక్కరలేదని యున్నది. భగవద్గీత యందును ఎట్టి హీనజాతీయుడైనను దురాచారుడైనను తన్ను భజించువాడు ఋషియే యని స్వామి చెప్పియున్నాడు. వరదుడే కదా గీతాచార్యుడు! విష్ణుం వందేజగద్గురుం. నీవు స్వామి అనుగ్రహపాత్రుడవు. మహాజ్ఞానివి. కావున శాస్త్రానుసారము నడచుచున్నావు. అందరు నీస్థితికి రాలేరు. 'యద్యదాచరతి శ్రేష్ఠః' సాధారణ బ్రాహ్మణుడొక శూద్రుని ఆశ్రయించును. వానిని ఇతరులు అనుసరింతురు. దానిచే వర్ణాశ్రమ ధర్మములు నశించును అని చెప్పబడినది. నన్ను గురువుగా భావింపకుము. వరదుడే నీ గురువు. నమస్కారము పొంద నర్హతలేనివారు ఇతరులు తమను సేవించుటకు సంతోషించరు. ఇది లోకవాడుక."

"'కులత్తురుం' అనగా కులమునిచ్చునని చెప్పబడినదికదా! మిమ్మాశ్రయించు టకు ఆటంక మేమున్నది?"

"సరి సరి, కులము నిచ్చునను మీ మాటలు నమ్మి సంబంధములు చేయుదురా? ఈ కులము మర్యాదకే కాని సంబంధములు చేయు కులము వేరు. 'సవర్ణాం' అని యుండలేదా? ఆ జన్మ వేరు; ఈ జన్మము వేరు. నీవు సేవించినను దానిని పొందుటకు నాకీ జన్మ చాలదు. కావున చాలును – మనసా తలపుము."

"ఏమి చెప్పినను అంగీకరించకున్నారు. నా మనోరథము తీరలేదు. మీ ద్వారా కొన్ని సంగతులు తెలుసుకొనగోరుచున్నాను. చెప్పననుచున్నారే?"

"నీకు కావలసి తెలుసుకొనగోరు సంగతులేవో చెప్పుము."

"గురువనక, శిష్యుడనక, నమస్కరింపక ఉన్నను, కావలసిన సంగతులు మీవద్ద తెలుసుకొనిన, గురువనియే అర్థముకదా!"

"నీ వెరుగగోరినవి నేనై చెప్పను. వరదుని ద్వారానే చెప్పించెదను. నీవు ఆయనకే శిష్యుడవు కమ్ము."

"ఎట్లైన నేమి? మీరు నాకు గురువని మనసున తలచితిని. ఇప్పుడు మీరును, వరదుడును – ఇరువురు గురువులయ్యెదరు. నేనడుగు సంగతులు వరదునకు తెలిపి, ఆయన తెలుపు సమాధానములు నాకు తెలుపుచుండుడు."

రామానుజులు తిరుక్కచ్చినంబిని గురువుగా భావించినందున వారి మృష్టాన్నమును భుజింపగోరిరి. వరదుని ప్రసాదము భుజించుచునే యుండిరి కదా! నంబి మనమున నిట్లు తలచెను – "ఈయన శేషాంశము. సర్వలోక గురువు కాబోవువాడు. వరదరాజు – రంగరాజుల ప్రీతిపాత్రుడు. పైగా నా గురువర్యులు యామునుల కిష్టుడు. ఈయన ఇంట భుజింపవలెను." తన కోరిక రామానుజులకు తెలిపిరి. రామానుజులు వెదుకబోయిన దేవర ఇంటికే వచ్చుచున్నట్లు తలచి తన భార్య [1]రక్షమాంబను వంటచేయుమని చెప్పి, ముందు తిరుక్కచ్చినంబిని భుజింపజేసి, పిమ్మట తాను తచ్ఛేషము భుజింపదలచి, నంబిని పిలచుటకు పోయిరి.

రామానుజు లొక మార్గమున తిరుక్కచ్చినంబిని పిలువబోవ, వారు మరియొక మార్గమున వచ్చి రామానుజు లింట లేనిసంగతి తెలుసుకొని, [2]తంజమాంబతో "అమ్మా! నేనిచ్చట ఆలస్యము చేసితినేని స్వామి కైంకర్యమునకు

---

1. తంజమాంబ
2. రక్షమాంబ అని కూడ అందురు.

ఆటంకమగును. కాన నాకు ముందు సాపాటు పెట్టు”మని యడిగిరి. సాధారణముగా పెద్ద ఉద్యోగి యైనను, తాను తనను పైయధికారికంటె క్రిందివానినిగానే భావించును. కాని అతని భార్య అట్లు తలచక తన భర్త గొప్పవాడని తలచును, గర్వించును. అట్లే రామానుజుల భార్యయు గర్వించినది. తిరుక్కచ్చి నంబికి ముందు పంచేలో భోజనముపెట్టి, భోజనానంతరము అతనిని ఎంగిలి ఎత్తి శుద్ధి చేయుమనెను. ఆయనయు అట్లే చేసి వెళ్ళెను. తరువాత ఆమె వారు భుజించినచోటున గోమయముతో కలిపిన జలము చల్లి తాను స్నానముచేసి మరల [1]తళిహ చేయుచుండెను.

రామానుజులు ఇంటికి వచ్చి భార్య చేయుచున్న పనిని చూచిరి.

“ముందు పంచేలో పేడనీరు చల్లియున్న దేమి?”

“తిరుక్కచ్చినంబి భుజించిన చోటగుటవలన గోమయముతో శుద్ధి చేసితిని.”

“ఆయన భుజించిన విస్తరి నెవరెత్తి శుభ్రపరచిరి?”

“ఆయన బ్రాహ్మణుడు కాదుకదా! అందుచే తాకరాదని ఆయన చేతనే శుద్ధి చేయించితిని.”

“వారు భుజించిన శేషాన్న మేమి చేసితివి?”

“శూద్రశేష మెట్లు పనికివచ్చునని పనికత్తె కిచ్చితిని.”

“ఆ పొయ్యిమీదనే తిరిగి వంట చేయుచుంటివా?”

“పొయ్యిని అలికితిని, శుచికై స్నానముచేసి తళిహ చేయుచున్నాను.”

“అయ్యో! వరదుని పిలచినట్లు పిలిచితినే, ఇది ఇట్లు అపచారము చేసినదే; వారి భోజన శేషమైన మిగలకపోయెనే!” అని రామానుజులు మిక్కిలి

1. వంట లేక విస్తరి.

విచారపడిరి. “ఇక ఇట్లు చేసినచో భాగవతాపచారము సహింపను. నిన్ను వదలివైచెదను” అని చెప్పిరి.

వెంటనే కాంచీపూర్ణులవద్ద కేగిరి.

“స్వామీ! మిమ్ము భోజనమునకు పిలువకుండినచో నిట్టి అపచారము జరిగెడిదికాదు. ఇప్పుడో మహాపచారమైనది.”

“శ్రోత్రియుని ఇంట నాకు భోజనము లభించినది. ఆమెయే విస్తరి నెత్తిన నేను చెడియుండెడివాడను. న న్నా వరదుడే కాపాడెను.”

## సందేహ నివృత్తి

పిమ్మట రామానుజులు తిరుక్కచ్చినంబిని చూచి “అయ్యా! నేను వేదము చదివితిని. యాదవప్రకాశులయొద్ద ప్రత్యక్షముగను, యామునుల గ్రంథముల ద్వారాను, మహార్థములు తెలుసుకొంటిని. అయినను నాకు కొన్ని సందేహము లున్నవి. యామునులుండిన ప్రత్యక్షముగా వారినడిగి నివృత్తి చేసుకొని యుండెడివాడను. మొదటిది – పరతత్త్వమెవరు? రెండవది – జీవాత్మ పరమాత్మలకు భేదమున్నదా? మూడవది – దాన ధర్మ భక్తి జ్ఞానాదులకంటె తరుణోపాయమేది? నాల్గవది – మోక్ష మనేక జన్మలకా? ఈ జన్మమందేనా? ఐదవది – అంతిమస్మరణ అనునది కలిగితీరవలసినదేనా? ఆరవది – మిమ్మా శ్రయింపవలదంటిరి. ఇక నేనెవరి నాశ్రయింపవలెను? ఈ యారు సందేహములు వరదుని అడిగి సెలవీయుడు” అని అడిగిరి.

ప్రతి దినము తిరుక్కచ్చినంబి స్వామికి వింజామర వీచెడివారు. స్వామి నిదురించగనే విసరుట ఆపివేయుట ఆచారము. రామానుజు లడిగిన విషయము మనసున నుంచుకొని వరదునికి కైంకర్యము చేయుచుండగా స్వామి ఎప్పటివలె

నిదురించక "సంగతి ఏమిరా? మనసున నేమి యోచించుచున్నావు?" అనిరి. నంబియు "ఔను స్వామీ! రామానుజునికి కొన్ని సందేహములున్నవి" అని వానిని స్వామికి విన్నవించిరి. స్వామి ఇట్లనెను : "పరబ్రహ్మము – పరతత్త్వము జగత్కారణములందురు. జీవాత్మ పరమాత్మలు ఒక్కటే అందురు. కాని అది సరికాదు. పరమాత్మ జ్ఞానానంద స్వరూపుడు. వేదవేద్యుడు. పరమ పురుషుడు. నిత్యసేవ్యుడును. అట్టి పరమాత్మతో నిన్నటివరకు కుంభీపాక నరకము లనుభవించుచుండిన జీవాత్మ సరియగునా? రామానుజులును మీరును బుద్ధిమంతులే. మీకు తెలియలేదా? 'విద్యా వినయసంపన్నే' అన్నంత మాత్రమున అర్థవిచారము చేయక విద్య నేర్చినవానిని – బ్రాహ్మణుని – ఆవును – ఏనుగును – కుక్కను – కుక్కమాంసము దిను చండాలుని సమముగా చూతురా? అన్నియు నొక్కటే అగునా? ఇది అపార్థమనియే నా అభిప్రాయము. ప్రపత్తియే గొప్ప ఉపాయము. నేను జ్ఞానిని –భక్తుడను – విరక్తుడను – అనువానికి – అంతిమ స్మరణ కావలెను. 'స్వామి! నా కేమియు తెలియదు' అని భరన్యాసముగా శరణాగతి చేసినవానికి అంతిమస్మరణ మక్కరలేదు" అనిరి. అంత తిరుక్కచ్చి నంబి "స్వామీ! భగవద్గీత యందువలె అంతిమస్మృతి కావలెనని దేశికుల అభిప్రాయము. మీరు వలదనుచుండగ వారేల నిట్లు అభిప్రాయపడి"రని అడుగగా, "ప్రసన్నుడు స్మరింప యత్నించ మార్గముల పోవువారు బుద్ధిమంతులు – తమ ఉనికిని గుర్తించిన వారునైనందున వారు జాగ్రత్తగా నుండి స్మరింపవలసియుండుననియు వారి అభిప్రాయము. కాని శరణాగతునికి ఉనికిని గూర్చిన స్మరణ లేదు. వానికి ప్రారబ్ధకర్మముతో సహా పోవును. కర్మానుభవమునకే శరీరము. అది లేనప్పుడు శరీర మక్కరలేదు. కావున దేహము వదలగనే మోక్షము ప్రాప్తించును. రామానుజుడు యామునుల శిష్యులైన

మహాపూర్ణుల నాశ్రయింపవలెను" అని వరదరాజులు సెలవీయగా, తిరుక్కచ్చినంబి రామానుజుల కెరిగించిరి. వారి కానంద ముప్పొంగి రోమములు గగుర్పొడువ, సంశయములు తీరినవారై వలదని త్రోయుచున్నను నంబికి సాష్టాంగపడిరి.

## గురూపదేశము

పెరియనంబి శ్రీరంగమున నున్నట్లు తిరుక్కచ్చినంబివలన తెలుసుకొని వారి నాశ్రయించుటకై రామానుజులు కంచినుండి బయలుదేరిరి. శ్రీరంగమున రంగనాథుడు "అయ్యో! రామానుజులు వచ్చియు నన్ను చూడకపోయెనే! ఆయన వచ్చి మంగళాశాసనము చేసిననే కదా - నాకు గౌరవము! ఆయనను శీఘ్రముగా రప్పింపవలెను, దర్శనమీయవలెను" అని తలచి తిరుక్కొట్యూరునంబి, పెరియనంబి మొదలగువారిని పిలచి "మీరు రామానుజునికి వైష్ణవ సిద్ధాంతమును తెల్పి, పంచసంస్కారములుచేసి ఇచటకు పిలచుకొని రండి" అని ఆజ్ఞాపించగా, తదనుసారము పెరియనంబి బయలుదేరి వచ్చుచుండగా మధురాంతకమున రామానుజ లెదురుపడిరి. "ఏరికాత్తరామన్" సన్నిధిలో వారు కలుసుకొనిరి. ఇదివరకు "స్వాభావికా నవధికాతిశయే త్రిత్వం" అను శ్లోకమును చెప్పి రామానుజుని శ్రీరంగమునకు తీసుకొనిపోయి ఆళవందారుల చరమ విగ్రహమును సేవింపజేసిన వారగుటచేత, పెరియనంబిని రామానుజులు గుర్తించిరి.

"ఇదియేమి, ఎచ్చటెచ్చటివారో శ్రీరంగమునకు పోవుచుండగా మీరు దానిని విడిచి పోవుచున్నా రేల?"

"ఆ శ్రీరంగమునకు గౌరవము కలిగించుటకై మిమ్ము పిలుచుకొనిపోవుటకు వచ్చుచున్నాను."

తనను శిష్యునిగా చేసుకొనుటకై వచ్చు పెరియనంబిని "ఏరిక్కాత్తరామన్" సన్నిధిలో చూచిన రామానుజులకు మిగుల ఆనందమాయెను. అందుకు కారణ మేమి? ధనలాభమనియా? అది కాదు. ఎవరేది వాంఛింతురో అది వారికి లభించిన, ఆనందమగును. అందున అయాచితముగ లభించిన కలుగు ఆనందమునకు అవధి ఏముండును? తాను వెదుకబోవువారే ఎదురుపడిరికదా! వారికి నమస్కరించి వరదరాజస్వామి ఉత్తరువును నివేదించిరి.

"తమ చరణారవిందములు ఆశ్రయింప వచ్చియున్నాను."

"అట్లే కానిండు, ఇది మాయూరును మీ యూరును కాదు కదా! కాన కాంచీపురి కేగుదము, అచట ఉపదేశించెదను."

"మీరన్యథా భావింపకుడు. మన మిరువురము ఈ రాత్రివరకు మనియుం డిన గదా ఇది నిజము!"

"అట్లగునా?"

"ఆళవందారులు నన్నును - నేను వారిని చూడగోరితిమి. అయినను అట్లు తటస్థించెనా? కావున తమ దర్శనమైన ఈచోటే దివ్యదేశము, ఇదియే పుణ్యకోటి విమానమును."

"రామానుజా! రేపటివరకు నిదానింపుము."

"మరల అట్లే యనుచున్నారే! నేను చిన్నవాడను, మీరు పెద్దలు. కాలు, కన్ను పోయిన నెట్లు? వరాహపురాణమున 'స్థితే మనసి సుస్వస్థే' అన్నట్లు శరీరము పాటవముగా నున్నపుడే చెప్పిన బాగుండును."

"నాయనా! కాంచీపురికి పోవులోపలనే శరీర పాటవము తప్పునా? ఆర్భాటముగా చెప్పుచున్నావు!"

"అది సరియే. శరీరపాటవము తప్పుటకు ఆలస్యము కావచ్చును. కాని

మనోవృత్తి మాటయో? భగవద్గీతయందు చెప్పినట్లు మనసు చంచల స్వభావము కలది. అది ఇరువురికి సరిగా నుండవలెను కదా! ఒకక్షణమునకు ఒకరీతిని, మరుక్షణమున మరియొక విధముగా నుండెడిదికదా? మారిన నెట్లు?"

"ఏమి రామానుజా! ఇంతలో మనసు మారునా? నన్ను గురువుగా చేసుకొన నీవు వచ్చితివి. నిన్ను శిష్యునిగా చేసుకొన నేను వచ్చితిని కదా!"

"గురువరా! ప్రాణము పోయిన నెట్లు?"

"అంతలోనే ప్రాణము పోవునా?"

"స్వామీ! ప్రాణము మెరుపువంటిదికదా, పోవచ్చును! విలంబన మెందుకు?"

"పోవునో, పోవదో – ఎవరికి తెలియును? వరదరాజస్వామి సన్నిధియైన బాగుండును."

"ఆ వరదుని కంటె ఇచటి ఈ స్వామి తక్కువవాడని తలచను."

"అచట పుణ్యకోటి విమానమున్నది."

"ఇచట నున్న ఈ పొన్నచెట్టు ఆ విమానమునకన్న తక్కువది కాదు. అచటనున్న ఆ వరదరాజు హెచ్చని చెప్పుచున్నారు. ఆయనకంటె ఎదుటనున్న ఈ స్వామి హెచ్చని తలచెదను. తత్త్వోపదేశము లేక నా మనసు మూసుకొని యున్నది. రాత్రియందు ముకుళించియున్న తామరను తెల్లవారినంతనే సూర్యుడు వికసింపజేయునట్లు, అజ్ఞానావరణ చెందిన నా మనఃపద్మమును మీ తత్త్వోపదేశ కిరణములచే వికసింపజేయుడు" అని ప్రార్థింపగా, మహాపూర్ణులు తమ ఆచార్యులగు యామునుల పాదముల స్మరించి, ఉపదేశింప సిద్ధమైరి. రామానుజులును ఉపదేశము పొందుటకు సిద్ధముగా నుండిరి. 'ఇదియే నైమిశారణ్యము. ఇదియే శ్రీరంగము. ఇదియే పుణ్యకోటి విమానము' అని భావించి నిమిత్తమాత్ర శిష్యులైరి. అంత మహాపూర్ణులు లక్ష్మీనాథులాదిగా

గల గురుపరంపరను, పిమ్మట ద్వయమంత్రమును రామానుజుల కుపదేశించి ఇట్లు చెప్పిరి :

"దీనిని మంత్రరత్నమందురు. ప్రళయాతీతుడైన నారాయణుడు తన నాభికమలమున బ్రహ్మ నుద్భవింపజేసి వానికి వేదముల నుపదేశించెను. అవి స్థిరముగ నిలిచియున్నవి. ఇట్టి జగదుపకారియగు స్వామి సకలవేదసారమును తెలుపునట్టి గీతను అర్జునున కుపదేశించెను. ఆ కారణమున స్వామియే ఆదిగురువైనాడు."

మంత్రోపదేశము పొంది రామానుజులు మేఘావరణ తొలగిన పూర్ణ చంద్రునివలె ప్రకాశించిరి. పెరియనంబితో నిట్లనిరి :"ఆచార్యా! ముఖ్య కార్యాచరణ మాయెను. ఇక ఈ శరీరమున్నను, పోయినను చింతలేదు. మీరు కాంచీపురికి విచ్చేయుడు. అచట నాకుటీరమున్నది." మహాపూర్ణులు రామానుజునికి తప్తముద్రాంకణ చేసిరి. పుండ్రధారణ చేసిరి. దాస్యనామ ముంచిరి. అర్చారూపుడైన దేవరాజ విగ్రహము నిచ్చిరి. ద్వయమంత్ర ప్రతిపాద్యమూర్తిని ప్రత్యక్షముగా చూపెదనని కంచికి తీసుకొనిపోయి వరదరాజ స్వామిని దర్శింపజేసిరి. నాలాయిరార్థము నెరుగగోరి కొంతకాలము కాంచీపురముననే ఉండగోరిన రామానుజుని కోరికను మన్నించి అచట నిలచిరి. వీరిరువురి భార్యలకు సరిపడదని తలచి రామానుజులు తమ గురువును వేరు గృహమున సమీపముననే ఉంచిరి. ఇట్లు ఆరుమాసములు గడచెను. మహాపూర్ణులకు వరదునిసేవ ఆనందముగా నుండెను. వారు భార్యతో సహా నిత్యము స్వామిని సేవించుచు, యామునులు తమకు చెప్పిన సకలార్థములు రామానుజుల కుపదేశించుచుండిరి.

# భార్యాపరిత్యాగము

ఒకనాడు రామానుజులకు తలయంటు వైష్ణవుడు ఆకలితో వచ్చెను. ఆ విషయము తెలిసి ఆ వైష్ణవునకు అన్నము పెట్టుమని భార్యతో చెప్పగా ఆమె ఇంట ఒక్కమెతుకైన లేదనెను. రామానుజులు వంటయింట చూడగా నలుగు రైదుగురు భుజించుటకు చాలినంత ప్రసాదముండెను. దానిని ఆమె చేసిన రెండవ తప్పిదముగా రామానుజులు పరిగణించిరి.

రామానుజులు శ్రీపెరుంబుదూరు వెళ్ళిన ఒకనాడు మహాపూర్ణుల భార్యయు, రామానుజుల భార్యయు ఒక్కమారే బావికి వెళ్ళుట తటస్థించెను. ఇరువురును చేదలను ఏకకాలముననే నూతిలో విడచి పైకితీసిరి. మహాపూర్ణుల భార్య చేదలోని నీటిబొట్లు రామానుజుల భార్య బిందెపైపడెను. అందు కామె కోపించి "ఏమేమి? మీరు మాయన్నము తినువారు. నన్ను మైలచేతువా? నీ భర్త నాపతికి పాఠము చెప్పుచున్న మాత్రమున నిట్లు చేయవచ్చునా? మీ పాఠము నా భర్తకు, మైలనీరు నాకును అక్కరలేదు" అని చెప్పెను. వెంటనే మహాపూర్ణుల ఇల్లాలు ఇంటికేగి భర్తతో సంగతి చెప్పి "నేను వెంటనే శ్రీరంగమునకు పోవలసినదే. అటుపిమ్మటనే భోజనము. ఇచట గంగకూడ ముట్టను" అనెను. ఎంతటివారి కైనను భార్యమాట పథ్యమేకదా! మహాపూర్ణులు రామానుజులు వచ్చిన పోనీయరని తలచి పయనమై భార్యతో శ్రీరంగమునకు వెళ్ళిరి. లక్ష్మణులు తిరిగివచ్చి జరిగిన విషయము తెలుసుకొని, తిరుక్కచ్చినంబిని అగౌరవపరచుట, తలయంటువానికి అన్నములేదనుట, పెరియనంబి భార్య నవమానించుట అను మూడు తప్పిదములను తన భార్య చేసెనని తలచిరి. రామానుజు లొకనాడు వరదుని సన్నిధియందుండగా నొక వైష్ణవుడు ఆకలిగ నున్నదనెను. వానిని "మీరు మా యింటికి వెళ్ళి, నేను పంపినటుల నా భార్యతో చెప్పి భుజించు"దని పంపిరి. అట్లే ఆ వైష్ణవుడేగి రామానుజుల భార్యతో చెప్పగా నామె "నా భర్తకును

మీకును ఏమిపని? అంత ముఖ్యమైన, వారినే వచ్చి పెట్టుమని చెప్పు”డనెను. ఆ వైష్ణవుడు వెళ్ళి జరిగినది చెప్పగా, రామానుజ లౌక వివాహపత్రిక వ్రాసి, పండ్లు పూలతో సహా పళ్ళెమున నుంచి మరల యింటికి పంపిరి. తంజమాంబ ఆ శుభలేఖను చూచి తన తమ్ముని వివాహము జరుగనున్నదని సంతోషించి, వచ్చిన వైష్ణవునకు షోడశోపచారములు చేసి భోజనము పెట్టెను. భర్త రాగానే “నా సోదరుని వివాహము జరుగబోవుచున్నదట” యని చెప్పెను. రామానుజులు నాల్గవ తప్పిదము గమనించి వివాహ మహోత్సవమునకు పంపుచున్నట్లు మంచి మాటలతోనే తన భార్యను ఆమె తండ్రి యింటికి పంపి, సంసారమునందు విరక్తులై స్వామి సన్నిధికి పోయిరి.

# సన్యాస స్వీకారము

కొందరు విధివత్తుగను, మంత్రపూర్వకముగను భార్యాపుత్రులను వదలియు మరల స్వీకరింతురు. తిరిగి గ్రహింపకున్నను మరల తలచువారుందురు. వారు ‘వాతాంసులు’ – అనగా వాంతియైన దానినే మరల తిన్నవారు. రామానుజులట్లు కాక – గృహస్థులుగా నున్న రాగము కలుగును. దానితో కామము, అది నెరవేరకున్న క్రోధము కలుగును. భగవద్గీతయందు చెప్పినట్లు – పండితులనైనను మనస్సు బలాత్కారముగా నీడ్చును. అట్లది ఈడ్వబడకుండ పరబ్రహ్మమునందే నిలుపదలచిరి. తిరుక్కచ్చినంబిని ముందుంచుకొని విధిప్రకారముగ త్రిదండ సన్యాసము స్వీకరించిరి. వరదరాజస్వామి వారికి సన్న్యాసదీక్షనొసగి ‘యతిరాజు’ అను పేరుపెట్టిరి. యతిరాజనగా సన్యాసులకు రాజు. రామానుజులు యతిసార్వభౌములై మంత్రజపము, శిఖా యజ్ఞోపవీతములు, త్రిదండము, కాషాయాంబరములతో ప్రకాశించిరి.

యతిరాజులకు స్వామికి నెట్టి సంబంధము! వరదుడు గురువు –

రామానుజుడు శిష్యుడు. ఇట్టి బాంధవ్య మెవరియందైన చూపెనా? అట్టి భగవత్సంబంధము గల యతిరాజుల మహిమ నేమనవచ్చును!

## శిష్యుడు గురువగుట

కూరత్తాళ్వారు, మొదలియాండాన్ అనువారికి యతిరాజులు పంచ సంస్కారములు చేసి శిష్యులుగా గ్రహించి, అనేక మంత్రార్థము లుపదేశించిరి. యతిసార్వభౌములని కీర్తింపబడుచుండిరి. వారికి గోవిందభట్టరును గూర్చి ఆలోచన కలిగెను. "అయ్యో! వానికి అన్యాయము జరిగెనే!" అని తలచి కొందరు వైష్ణవులను పిలచి తిరుమలనంబి యొద్దకు పంపిరి. వారు అట్లు పోయి తిరుమల చేరి తిరుమలనంబిని చూచి "యతిరాజులు తమను గోవిందభట్టరును సరిపరచు"దని ప్రార్థించి"రని చెప్పిరి.

కాంచీపురమున రామానుజుల తేజస్సు హెచ్చుచుండగా యాదవప్రకాశకుల ప్రభ తగ్గుచుండెను. ఒకనాడు యాదవుల తల్లి కోవెల మెట్లు ఎక్కుచుండగా అచట కొందరు "రామానుజుల నాశ్రయించినవారి కే కొదువయు నుండదు" అనుకొనుచుండుటను వినెను. అంత నామె "ఊరంతయు రామానుజులు – రామానుజులు అని కీర్తించుచున్నారు. నా కుమారుడో, అట్టి సర్వలోక గురువుతో విరోధించనేల? గుణ మెచ్చుట నున్నను గ్రహించవలయును కదా! వృధాగా అహంకరించుచున్నాడు. శిష్యవాత్సల్యము విడచి ద్వేషించుచున్నాడు" అనుకొనుచు తిరిగివెళ్ళి కుమారునికి తన ఆంతర్యము వివరించెను – "అట్లు చేయరాదా, నాయనా?"

"మాకు పగయే కదా! అచటికి ఎట్లు పోవుదును?"

"వైరము విడచి భక్తితో పోయి ఆశ్రయింపుము. నీవు మూర్ఖుడవుకావు; బుద్ధిశాలివి కదా!"

"ఇతరులు చెప్పిన నేమో అనుకొని ఉందును.." అమ్మా! రామానుజులు జ్ఞానియనియు వరదులచేతను పెరుందేవి తాయారుచేతను కాపాడబడిరనియు నేనెరుగుదును. అట్టి రామానుజులనే ఆశ్రయించుమంటివి. నీవు చెప్పినట్లు చేయవచ్చును. కాని నేను దోషిని. అందుకు ప్రాయశ్చిత్తము భూప్రదక్షిణము. అందుకు నాకు శక్తిలేదు. అయినను ఆలోచించెదను."

"కుమారా! అందుకు అంత ఆలోచన ఎందుకు? రామానుజులను కూర్చుండమని వారికి ప్రదక్షిణము చేయుము. అదియే ప్రాయశ్చిత్తమగును. రాళ్ళు, మన్ను మొదలగువానికి చేయుటెందుకు? దివ్యదేశము, స్వాములు - తీర్థములు అన్నియు వారి యందే ఉన్నది."

తల్లి మాటలు విని యాదవులు "రామానుజులు చిన్నవాడు కదా! అయినను జ్ఞానదీపము పెద్దది" అని తలచిరి. రామానుజుల మఠమునకేగి "అబ్బాయీ! ఇంతకుముందు నీవు శిష్యుడుగను, నేను గురువుగను ఉంటిమి. నాకు కొన్ని సందేహములున్నవి. వానిని నీవు నివారించిన నీమతము ననుసరింతును" అనిరి. యతిరాజు లంత "ఇంతకు పూర్వము నేను మీ శిష్యుడనై యున్నందున, నేను మీ సందేహములు తీర్చుట శోభింపదు. నా శిష్యుడు కూరత్తాళ్వారు అయిన బాగుండును, అట్లు చేయుడు" అనెను.

యాదవప్రకాశులు విష్ణుపరతత్త్వమును ఖండించగా, కూరత్తాళ్వారు విష్ణువే పరతత్త్వమని స్థాపించిరి. పరమాత్మకు గుణరూపములు లేవని యాదవ ప్రకాశులు వాదించగా - పరబ్రహ్మము సగుణుడు - సస్వరూపుడునని కూరత్తాళ్వారు నిర్ధారించిరి. చక్రాంకణము అనావశ్యకమని యాదవ ప్రకాశులు ప్రతిపాదించగా - సమాశ్రయణము ఆవశ్యకమనియు, అది లేనిదే వైదిక కార్యములు ప్రయోజన శూన్యమని కూరత్తాళ్వారు స్థాపించిరి. వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, భగవద్గీతల నుండి ఉపనిషత్తులను చూపి, వాక్యార్థ

వివరణచేసి, సంశయ విచ్ఛేదనచేసి, 'యాదవప్రకాశుల యొద్ద సమాధానము, ప్రతిపాదన లే'వని రామానుజులకు విజ్ఞాపన చేసిరి.

"మీకు సమాధానమైనదా? మా మతము అనుసరింతురా?"

"సమాధానమైనది. మీ మతమున జేర్చుకొందురా?"

"ఎట్లు రావలయునో అట్లు వచ్చిన అభ్యంతరము లేదు."

యాదవప్రకాశుల మనసు డోలాయమాన మాయెను. తల్లి మాటను నమ్ముట, యతిరాజమతము అనుమతింపబడుట - అను వాని మధ్య నిర్ణయించుకొనలేక, ఏమియు పరిష్కారము తోచక నిద్రించిరి. వరదరాజస్వామి స్వప్నమున సాక్షాత్కరించి "నీకును నాకును పూర్వబంధము లేదు. రామానుజు లకు గురువైయుండినందున చెప్పుచున్నాను. రామానుజుని ఆశ్రయింపుము. నీ తల్లి మాటలు విశ్వసింపుము" అని చెప్పిరి. "కలవరముందువానికి స్వప్నములు వచ్చును. వానిని నమ్మరా"దని యెంచి యాదవప్రకాశులు తిరుక్కచ్చినంబి నడిగిరి. వారు వరదరాజుల నడిగిరి. ఆ స్వామి "నంబీ! స్వప్నమున చెప్పున దొకటియు, ఇప్పుడు చెప్పునది వేరుగను ఉండునా? ప్రత్యక్ష దైవమైన తల్లి చెప్పినట్లు చేయుమనుము" అనిరి. ఆ విషయము తిరుక్కచ్చినంబి చెప్పగా, యాదవప్రకాశులు రామానుజుల వద్దకు వచ్చి ఆయనకు ప్రదక్షిణ నమస్కారములు చేసిరి. యతిరాజులు వారికి పంచసంస్కారములుచేసి తమ విధిప్రకారము సన్యాసమిచ్చి 'గోవింద జియ్యరు' అను పేరుంచి మరల మనసు తిరుగకుండుటకై 'యతిధర్మము' అను పేరున ఒక గ్రంథమును వ్రాయుమనిరి. జియ్యరులు అట్లే చేసిరి. యాదవప్రకాశులు జన్మాది అద్వైతి-యతిరాజులు. వారి నెట్లు చేర్చుకొనిరి? పూర్వము స్వామి సన్నిధిలో ప్రదక్షిణ చేయునపుడు యామునుల కటాక్ష వీక్షణము వారిపై ప్రసరించినది. కావున చేర్చుకొనదగునని వారు తలచిరి. గోవిందజియ్యరును శిష్యులతో చేర్చి రహస్యార్థములు

తెల్పుచుండిరి. వారును మహావైష్ణవులై కాలక్షేపము చేయుచుండగా, కాలము రాగా మోక్షము పొందిరి.

## రంగనాథ విజయము

రామానుజులు శ్రీరంగమున నుండని కారణమున [1]పెరియ పెరుమాళ్ళనబడు రంగనాథులు చిన్న పెరుమాళ్ళయిరి. "జగదాచార్యుడగు రామానుజుడు వచ్చియు నన్ను చూడకయే వెళ్ళెనే!" అని భక్తులతో అనగా వారు "ఆళవందారులను జీవముతో ఎనిమిది దినములు ఉంచియుండ వలసినది. ఆ లోపము మీదేకదా! దానిని అంగీకరించుట యుక్తము" అని వారనిరి. రంగనాథుడపుడు "సర్వేజనా స్సుఖినోభవన్తు' అని యుండవలెనుకదా! యోగ్యవస్తువును మీరే అనుభవించవలెనా? కావున రామానుజుని పంపుడు" అని వరదరాజులతో చెప్పగా, వారు "అత్యుత్తమ వస్తువు ఎన్నిదినములు అనుభవించినను చాలుననిపించదు. అన్నము విసుగు పుట్టినవానికి అంత్య దినములు సమీపించినట్లే కదా! రామానుజునివలననే నాకు గౌరవము. కావున పంపజాలను" అనిరి.

తరువాత కొంతకాలమునకు యామునాచార్యుల కుమారుడైన తిరువరంగ పెరుమాళ్ళరయరనువారు రంగనాథుని అభిమతమును అనుసరించి కాంచీపురికి వెళ్ళి వరదరాజులను సేవించి పూదత్తాళ్వార్లు పాడిన 95-96 పాశురములను తిరువాయ్ మొళి నుండి అర్థానుసంధానమున దేవగానము చేసిరి. గానప్రియు డగు వరదరాజస్వామి అరయరు నుద్దేశించి "మీ గానమునకు ముగ్ధుడనైతిని. అయ్యా మీకేమి కావలెనో కోరుడు" అని చెప్పిరి. అంత అరయరులు "గానము

1. పెద్ద

విని యానందించువారు మొదట అట్లే అనెదరు. పిమ్మట దేనినైన అడిగినచో ముఖము త్రిప్పుకొందురు" అనిరి. వరదులు "నే నట్లు చేయుస్వామిని కాను" అనినంత, అరయరులు విశ్వామిత్రుడు రామునివలె రామానుజుల నడిగిరి. వరదరాజులు సమ్మతించి "రామానుజా! నేను వారి గానముచే విజితుడనైతిని. నిన్ను వారికి సన్మానముగ నిచ్చితిని. వారివెంట పొమ్ము" అని ఉత్తరువీయగా, రామానుజులు "వల్లె"యనిరి. అరయరు లట్లు రామానుజులను సన్మానముగా, చేకొని బయలుదేరిరి. రామానుజులు పూర్వము శ్రీరంగమునుండి కాంచీపురికి తండ్రి ఇంటికి కూతురు పోవునట్లుగా పరుగిడి వచ్చిరి. ఇపు డచట నుండి శ్రీరంగమునకు పోవునపుడు నిర్బంధము మీద అత్తవారింటికి పోవునట్లుగా తోచెను. కాన వారు దుఃఖించుచు అశ్రునయనములతో తిరిగి తిరిగి చూచుచు, వరదరాజును స్మరించుచు, విడచిపోవలసి వచ్చెనే యనుకొనుచు వెళ్ళిరి. అరయరులు ముందు పోవుచుండగా రామానుజులు వెంట వెళ్ళిరి. రంగనాథుడు వీరి రాక నెరిగి పెరియనంబి మున్నగువారిని పిలచి "కోవెలనుండి సకల మర్యాదలతోను వైభవములతోను రామానుజులను పిలచుకొనిరండి, ముందు వెళ్ళుడు" అని సెలవీయగా, పెరియనంబి అట్లే చేసిరి. రంగనాథులకు తృప్తి చాలలేదు. తామే రామానుజుల కెదురుపోయిరి. అదియేమి? తానే స్వయముగా పోవలెనా? యన - స్వామి భక్తవత్సలుడు కదా! రామానుజులు వచ్చిన తనకు గౌరవమని అట్లు పోయెను. అయిన రామానుజులు రాకుండిన వీరికి గౌరవము లేదా? అదికాదు - భక్తుని పెద్ద చేయవలెనని అట్లు చేసిరి. "రామానుజా! వచ్చితివా? నేటి నుండి నాకు గౌరవమే!" అని స్వామి చెప్పగా, వారికి భయము కలిగి పెరియనంబిని చూపి "అంతయు పెద్దలదయ" యని చెప్పిరి. అంత నంబి "అబ్బాయీ! నేను పెద్దను కాను; నీవే పెద్ద. ఏలయన 'పొలిఘ-పొలిఘ' అను పాశురమునకు అరవిచారము చేయుచు, మంచికాలము రాబోవుచున్నదని

చెప్పబడియున్నందున, నెవరో పుట్టబోవుచున్నారని ఆళవందార్లు యోచించిరి. అట్టివారు వారేనని మేమనగా వారు కాదనిరి. ఆ మహాపురుషుడవు నీవే యనిరి. రంగనాథుని ముందు రంగనాథుని మనస్సునకు కొదువ లేకుండ నడుచుకొనుచు ఇచ్చటనే ఉండుము" అని చెప్పిరి.

రామానుజులును శ్రీరంగముననే ఉండునట్లుగా నిశ్చయించుకొనిరి. స్త్రీకి యుక్తవయసు రాకమునుపు పుట్టినింటనే ఉండగోరును. ప్రౌఢయై సంతానమును గని అత్తవారింటనే ఉండగోరును. రామానుజుల స్థితియు అట్లే ఉండెను. రంగనాథులు "రామానుజా! సన్నిధి కార్యములు చెడియున్నవి. నీవిచ్చటనే ఉండి మంచి ఏర్పాట్లు చేయవలెను. నా సకలయోగక్షేమములు నీకు అప్పగించితిని. కోవెల బంధువులను క్రింద నుంచుకొని నీవు పైన ఉండి విచారించుచుండుము. మహామతే! పదునాలుగు లోకము లిచ్చినను చూచుకొన గలవు" అనిరి.

ఆ కాలమున అకలంకభట్టనాళ్వారను రాజు శ్రీరంగమును పాలించు చుండెను. స్వామికి వారి పరిపాలనము తృప్తిగా లేకుండెను. రామానుజు లా రాజుకు సదుపదేశము చేసి తమ శిష్యుని చేసుకొనిరి. ఇట్లు స్వామి యాజ్ఞానుసారము ప్రధాన పురుషునిగా నెన్నబడి సన్నిధి పరిపాలనలో ప్రవేశించి కోవెలయందుండిన అయోగ్యులను దండించి, చెడియుండిన కార్యములను ఒక్కటొకటిగా చక్కబెట్టిరి. అప్పుడచట వైదికమైనను, లౌకికమైనను రామానుజుల ఇష్టప్రకారమే జరుగుచుండెను. స్వామికిని రామానుజార్య దివ్యాజ్ఞయే. ఇప్పటికిని రామానుజుల ఆజ్ఞాచక్రమే శ్రీరంగనాథుల సన్నిధిని ప్రవర్తిల్లుచున్నది.

ప్రారంభమున యతిరాజులకు వరదరాజులు జ్ఞాపకము వచ్చుచుండెను. రంగనాథుల, పెరియనంబి ఆజ్ఞలు వారికి సంకెళ్ళుగా నుండెను. ఆజ్ఞాబద్ధులై కూరత్తాళ్వారు మొదలగు వారితో కాలక్షేపము చేయుచుండిరి. వరదుని విడిచి

వచ్చినందుకు వారి ముఖము వాడియుండలేదు. రంగనాథుని ఆదరణ - గురునితో కలయిక - స్వామితో సల్లాపములు - ఊరివారు చేయు ప్రీతి - వారు కరివరదుని మరచి శ్రీరంగమున నుండునట్లు చేసినవి.

## కాళహస్తి నుండి తిరుమలకు

రామానుజులు ఈ విధముగా శ్రీరంగ మఠమున నుండునపుడు పూర్వము వారు తిరుమలనంబి వద్దకు పంపిన వైష్ణవులు తిరిగివచ్చిరి. వారు యతిరాజులతో "స్వామీ! మేమిచ్చటినుండి పోయి తిరుమల నంబిని దర్శించితిమి. మీరు చెప్పినట్లు వారితో విన్నవించితిమి. అంత వారు తామొక్కరే పోయిన చాలదని మమ్ములను వారితో కాళహస్తికి పిలచుకొనిపోయిరి. సువర్ణముఖీ నది నుండి తీర్థము కొనిపోవు దారిలో మేము కూర్చుంటిమి. పరమశైవుడైన గోవిందభట్టరు రుద్రాభిషేక జలమునకై బంగారు బిందె నెత్తుకొని ఆ మార్గమున వచ్చెను. వారిని 'అబ్బాయీ! ఇటు ర'మ్మని తిరుమలనంబి పిలువగా, 'ఎందుకని' ఆత డడిగెను. నంబి 'నీవు అనేక శాస్త్రములు చదివితివి. ఏది పరతత్త్వమో తెలిసి జ్ఞానమార్గమున నుండక బిందె నెత్తుకొని సేవకునివలె మెలగుట ఎందుకు?' అనిరి. 'ఓహో! ఇతడు నన్ను పరివర్తన చేసి పిలుచుకొని పోవుటకై వచ్చినాడు' అని తలచెనేమో గోవిందభట్టరు నవ్వుచు వెడలిపోయిరి" అని వైష్ణవులు చెప్పగనే "మామ పోయినను కార్యము సఫలము కాలేదా?"యని రామానుజులనిరి. అంత వారు "అతడు మాట్లాడిన కదా, సరిదిద్దుట! కాన మరియొకసారి చూతము" అనిన నంబితో తిరుమలకు పోయితిమి. మరల కొన్నాళ్ళకు మేమందరము కాళహస్తికి వెళ్ళి పూర్వపు స్థలముననే కూర్చుంటిమి. తిరుమలనంబి శిష్యులను ముందుంచుకొని కాలక్షేపము చెప్పుచుండిరి. గోవిందభట్టరు మునుపటివలె చేతబిందెతో వచ్చిరి. శరీరమంతయు విభూతి

పూసుకొని, త్రిపుండ్రములు, రుద్రాక్షలు ధరించి, శివపంచాక్షరి జపించుచు శివదీక్ష గలవారై యుండిరి. నంబి వారిని చూచి "ఓరీ, గోవిందా!" అని పిలచిరి. మారురాలేదు. కొండవలె కదలింపవలను కాలేదు. 'శివభక్తులలో ప్రశస్తుడగు బాణాసురునికంటె ఘనుడుగా నుండెను. ఇతనిని త్రిప్పుట కష్టము. మాట్లాడడు' అనుకొని నంబి ఆళవందార్ స్తోత్రములోని "స్వాభావికానవధికాతిశయే శితృత్వం" అను శ్లోకమును వ్రాసిన ఒక తాళపత్రమును గోవిందభట్టరు తిరిగి వచ్చులోగా దారిలో వేసిరి. అది కాలికి తగిలినందున భట్టరు దానినెత్తి, అందేమియున్నదో అని చదివిరి. ఈ శ్లోకమును వినియే రామానుజులు మహాపూర్ణులచే నాకర్షింపబడిరి. కనుకనే ఇది భట్టరు మనసును కూడ ఆకర్షింపగలుగునని నంబి భావించిరి. భట్టరు 'బాబా! నీవు నా కవసరములే'దని పారవేసిరి. కాని మరల తీసి, మరల చదివి నంబి మొదలగు కూర్చుండిన వారిని చూచి "ఈ పత్రముపై నిది వ్రాసినది మీరేనా?"

"ఔను."

"ఏల వ్రాసినారు?"

"నీవు చూచుటకు."

"మీరేల యిచటకు వచ్చితిరి?"

"పాలుపిండు గోవును తోలుకొని పోవుటకై."

"ఓహో! నన్ను త్రిప్పుటకై వచ్చితిరి! అందుకై దీనిని వ్రాసితిరా! దీనితో నేను మారుదునా! నాకెన్ని శ్లోకములు రావు! అన్నియు చూచియే కదా ఇట్లైతిని! ఇప్పుడా స్థానమున శివుని ఉంచితిని. మీ చమత్కారములు నా ఎడ ఫలించవు. మీరు పోయి మీ ఊరు చేరుడు" అని చెప్పి వెడలిపోయిరి.

'రెండవమారు మాట్లాడిపోయెను. ఇంకను పక్వము కావలెను' అని తలచిన నంబితో మేమును తిరుమల చేరితిమి.

మూడవమారు మేము తిరుమలనంబితో కాళహస్తి చేరితిమి. నంబి మునుపటివలెనే కాలక్షేపము చేయుచుండిరి. తిరువాయ్మొళి రెండవ పత్తునందు ఒకటి, రెండు, మూడు పాశురములు జరిగెను. ఈలోగా గోవిందభట్టరు వచ్చి వినుచునే బిల్వపత్రములకై చెట్టునెక్కి, పంచాక్షరి జపించుచునే ఆలకించుచు, పత్రములు గిల్లుచునే వినుచు పిమ్మట అది కూడ మాని వినుచుండిరి. నంబియు యుక్తిప్రయుక్తులతో వైష్ణవదీక్షకు తగినట్లు ఇంపుగ ప్రవచనము చేయుచుండిరి. మేము వినుచు కూర్చొని యుంటిమి. నాల్గవ పాశురము ప్రారంభించి, "ఏల ఇంకొకనికి పుష్పములు? సకల ఇతర దేవతలను, సకల చరాచర ప్రపంచమును గిల్లవలెను. సృష్టికర్తయగు బ్రహ్మను నాభికమలమున సృష్టించిన దేవాదిదేవుడైన ఆ స్వామికి మాత్రమే పుష్పములు సమర్పించవలెను. ఇతరులకు తగునా?" అని నంబి వివరించిరి. తోడనే భట్టరు చెట్టుకొమ్మనుండి క్రిందికి దూకి అంతవరకు కోసిన పుష్పపత్రములు బుట్టను పారవైచి పరువెత్తి వచ్చి తిరుమలనంబి పాదముల బడి 'నన్ను అంగీకరించి మీతో పిలచుకొని పొండు' అని ప్రార్థించిరి.

కాళహస్తి ప్రజల కీ సంగతి తెలిసి 'ఓహో! ఈ గట్టున కూర్చుండిన వీరు, మోసగించి మా గోవిందుని పిలచుకొని పోవవచ్చి'రని కలహమునకు వచ్చిరి. 'మేము వానిని పిలువలేదు. వాడే వచ్చెదననుచున్నాడు. మీరు వీనిని పిలువుడు – వచ్చిన నుంచుకొనుడు' అని నంబి చెప్పిరి. 'ఇన్ని నా ళ్ళిచట నుండి, ఇన్ని ధర్మములు చెప్పి, ఇప్పుడు విడచిపోయెదవా? వీరు నీ మీద మత్తుమందు చల్లలేదు కదా! ర'మ్మని ప్రజలు భట్టరు చేయిపట్టి పిలువగా, 'ఓ కాళహస్తిజను లారా! ఇక మీరు నన్ను తాకకుడు. మీకును నాకును సంబంధము వదలినది. ఇదివరకు మీరును నేనును శైవులము. ఇప్పుడది వదలినది. మీకు పరమశివుని సంబంధ మింకను అట్లేయుండగా, నాకు విష్ణుబాంధవ్యము మరల

ప్రాప్తించినందున మీరు – నేను వేర్వేరు' అని భట్టరు అనిరి. ఇట్లు కలహము జరుగుచుండగా, కాళహస్తీశ్వరు డొకనియందు ఆవేశించి 'నేను అతనికి అట్టి బుద్ధినిచ్చితిని. అడ్డగించకుడు. వానిని పోనీయుడు' అని చెప్పిరి. కాని వారు సమాధానపడక 'అట్లైన ఇతనిని ఎందుకు మీయొద్దకు పిలచుకొని వచ్చితిరి?' అని అడిగిరి 'చెప్పెదను. ఇతడు కాశీక్షేత్రమునకు వెళ్ళినపుడు అచటనే ఉండ వలెనను కోరిక కలుగగా, ఆ యూరు వదలి రావలెనని నేను సంకల్పించితిని. వీనికి భక్తికలుగుటకై, శివుడైన నేమి? విష్ణువైనేమి? ఆచోటునుండి మనసు తిరుగవలెనని – అది చాలునని అట్లు చేసితిని – కాళహస్తికి పిలచుకొని వచ్చితిని. కాని వీడు మనసున వైష్ణవుడుగానే యుండెను. కావున వానిని వదలుడు' అని చెప్పెను. నంబియు 'సమయమునకు కాళహస్తీశ్వరుడు వచ్చి చెప్పె'నని సంతోషించి, గోవిందభట్టరుకు శివదీక్ష మాన్పి పంచసంస్కారములు చేసిరి. ఇప్పు డతడు మీకంటె వైష్ణవాగ్రేసరుడుగ దీక్షగొని యున్నాడు" అని చెప్పగా విన్న రామానుజులకు ఆనందము కలిగెను. ఈ వార్త చెప్పిన యా వైష్ణవులకు శాలువల గప్పి సత్కరించిరి.

## విద్యాకాంక్ష

యతిరాజు లొకనాడు పెరియనంబి యొద్దకేగి నమస్కరించి "మీరు మధురాంతకముననను కాంచీపురియందును నాకు ఉపదేశించిరి. అంత మాత్రమున చాలునా? ఇంకను వేదాంత రహస్యములను ఉపదేశించుడు. రంగనాథుని యోగక్షేమములకు తమవలననే ఏర్పడితిని. తమ పాదదాస్యము చేతనే నాకా అవకాశము లభించినది" అని విన్నవించిరి. పెరియనంబి, తనకు యామును లుపదేశించియుండిన ద్వయమంత్రార్థము రామానుజులకు వివరించి "యతిరాజా! నేను ఈ రహస్యార్థములను నా కుమారునకు వివరించలేదు.

నా గురునియొద్ద ఆర్జించిన సొత్తు నీకు అప్పగించితిని. నీవు దీనిని నా పుత్రునకు చెప్పుము" అని తన కుమారుడు పుండరీకాక్షుని రామానుజులకు శిష్యునిగా జేసిరి.

మరియు పెరియనంబి "యతిరాజా! ఏమియో చదివి, విని, గ్రహించిన చాలదు. విద్యయందు కాంక్ష నిత్యనూతనముగా నుండవలెను. గోష్ఠీపూర్ణులు అను మరియొక పెద్దలున్నారు. వారియొద్ద తిరుమంత్ర, చరమశ్లోకములను తెలుసుకొనుము. ఆ భాగములందు వారు బహుసమర్థులు. బహు బాగుగ చెప్పగలరు. ఆ యర్థములను నీవు గ్రహించవలెను. భ్రమరము విరులనుండి మకరందమునువలె విద్య గ్రహింపవలెను. ఎచ్చటెచ్చట నేమేమి విద్యలుండునో అచ్చటచ్చట వానిని గ్రహింపుమని శిష్యుని పంపుట గురుధర్మము" అని చెప్పి పంపిరి.

యతిరాజులు మహాపూర్ణుల యాజ్ఞగొని గోష్ఠీపూర్ణుల యొద్ద కేగి నమస్కరించి నిలచిరి.

"ఎందుకు వచ్చితివి?"

"తిరుమంత్ర, చరమ శ్లోకార్థములను నా కుపదేశింపగోరుచున్నాను. అందు నిమిత్తము వచ్చితిని."

"నీపేరేమి?"

"నన్ను యతిరాజు అందురు."

"నీవు వానిని ఎరుగ తగవు."

అప్పటికిని యతిరాజులు పోకుండ అట్లే నిలువగా,

"నిలువనేలను? పొమ్ము" అని గోష్ఠీపూర్ణు లనిరి.

యతిరాజులు మరలిపోయి మహాపూర్ణులతో జరిగినది చెప్పిరి.

"ప్రార్థించి అడుగరాదా?"

"ప్రార్థించినను, పొమ్మనిరి."

"పోనిమ్ము, పెద్దలు కదా! మరి నాల్గుదినములు ఆగి వెళ్ళుము. ఆ మంత్రార్థమునకుండు గౌరవ మిట్టిదని తెలుపుటకు అని యుందురు."

'వా రట్లు పొమ్మనిరి. నా గతి ఏమని తలచి యతిరాజులు నిద్రాహారములు మాని కృశించిరి. శ్రీరంగనాథులు తమ యోగక్షేమములు చూచువానికి దుఃఖము కలిగెనే యని తలచిరి. ఇంతలో స్వామి ఉత్సవములు వచ్చెను. ఆ వేడుకలు తిలకించుటకు గోష్ఠీపూర్ణులు రాగా, శ్రీరంగనాథులు [1]"గోష్ఠీపూర్ణా! మహాప్రాజ్ఞా! మన యతిరాజుకు రహస్యార్థములు చెప్పరాదా? నాతో చేరియుండువాడు, బుద్ధిమంతుడు" అనిరి. గోష్ఠీపూర్ణులు వీనికి రంగనాథానుగ్రహము కలిగియున్న దని సంతోషించి "స్వామీ! విషయమేమో పెద్దది కదా! సమయము చూచి చెప్పెదనులెండు" అని చెప్పి యతిరాజులను చూచి "చెప్పెదను, రమ్ము!" అనిరి. రంగనాథుల యాజ్ఞచే గోష్ఠీపూర్ణు లంగీకరించినందులకు ఆనందించిన రామానుజులు వారి యొద్దకు తిరిగి వెళ్ళిరి, నమస్కరించిరి. "స్వామి చెప్పిరి. అది అట్లుండ నిమ్ము. అయినను ఉపదేశము స్వామికా? నీకా? నీకు యోగ్యత లేదనికాదు" అని నంబి యనిరి.

రామానుజులు తిరిగివెళ్ళిరి. ఇట్లు పదునేడు పర్యాయములు నంబి యొద్దకు వెళ్ళియు ఉపదేశము పొందజాలరైరి. మంత్రార్థము పొందు యోగ్యత తనకు కలుగకపోయెను. యోగ్యుడనని వారెప్పుడు చెప్పుదురో కదా! యని చింతతో రామానుజులు కాలక్షేపములు, తదీయారాధనలు, మాటలు, ఆహారాదులు మాని పరితపించుచుండిరి. తిరుక్కొట్యూరు నుండి యొక వైష్ణవుడు శ్రీరంగమునకు వచ్చి యోగక్షేమమడుగగా, "అయ్యో! నేనేమి యతిరాజును! ఇన్ని పర్యాయములు తిరిగితిని. కాని ఉపదేశమునకు యోగ్యుడను కాకపోయితిని. ఇట్లు కాలము

1. తిరుక్కొట్యూరునంబి.

గడుపుచున్నాను. ఉండి ప్రయోజనమేమి? నా కిక ప్రాయోపవేశమే మిగిలినది" అని యతిరాజులు అనిరి. ఆ వైష్ణవస్వామి తిరిగి వెళ్ళి తిరుక్కోట్టియూరు నంబిని చూచి "యతిరాజులు మహానుభావులు. సంకటపడుచున్నారు. ఇదియేమి అన్యాయము! వారికి ఉపదేశించరాదా? తపస్సు చేసినను అట్టి శిష్యుడు లభించునా?" అని రామానుజుల మనోవ్యథను తెలియజేసిరి. గోష్ఠీపూర్ణు లంత "ఓహో! అంత శ్రద్ధతో నున్నాడా! శాంత శమ దమాదులు కలవాడు. వరదరాజు నొద్ద సన్యాసము గైకొన్నవాడు. పెరియనంబి శిష్యుడు. పైగా ఆదిశేషుడు. రంగనాథులు చెప్పినను నే నతనికి ఉపదేశింపలేదు. పదునేడు పర్యాయము త్రిప్పితిని. అప్పటికిని కోపము తెచ్చుకొనక తనకు యోగ్యతలేదని తలచు చున్నాడు" అని తలచి, తన శిష్యునొకనిని పిలచి యతిరాజును పిలచుకొని రమ్మని పంపిరి. అతడును పోయి "యతిరాజా! తిరుక్కోట్టియూరునంబి పంపిరి. తిరుమంత్ర – మంత్రార్థ, చరమశ్లోకములు ఉపదేశింతురు. ఇది పెద్ద సంగతి. కావున నీ శిష్యకూటమితో గాక, దండపవిత్రములతో ఒక్కడవే రమ్ము" అనగా, "అట్లే చేసెదను. నా భాగ్యము. నా కుపదేశింపవలెనని వారికి తోచినది. రంగనాథుని కటాక్షము" అని వచ్చిన యా స్వామిని పంపి యతిరాజులు స్వామి సన్నిధికి పోయి "స్వామీ! మీరు తిరుక్కోట్టియూరునంబికి నన్ను గూర్చి చెప్పియుంటిరే, అది ఫలించినది" అని విన్నవించిరి. స్వామియు "యతిరాజా! పరీక్షించియే శిష్యునకు ఉపదేశింపవలెనను నియమమునుబట్టి నేను చెప్పినను ఆత డట్లు పరీక్షించెను. ఇప్పుడు వెళ్ళుము" అనగా, రామానుజులు మొదలియాండాన్, కూరత్తాళ్వారులతో తిరుక్కోట్టియూరు పోయి నంబికి ప్రణమిల్లిరి. అంత నంబి :

"రామానుజా! నేను శిష్యుని పంపితిని, వచ్చెనా?"

"ఆయన చెప్పగనే వచ్చితిని."

“నేను నిన్ను పదునెనిమిది పర్యాయములు త్రిప్పితిని కదా! నిన్ను బాధించితినా?”

“అయిననేమి! చివరకు ఉపదేశింతునంటిరికదా! ఆనందమైనది!”

పూర్వము ఒక గురువు విద్యాగంధమంటని శిష్యునొకనిని నిత్యము భగవంతుని పూజించుమని చెప్పగా, వాడును శ్రద్ధాభక్తులతో ధూప దీప నైవేద్యములిడి దైవారాధన చేయుచుండెను. భగవంతుడు వచ్చి ఆరగించి పోవుచుండుట యెరుగక, తాను పెట్టిన నైవేద్యము మాయమగుచున్నదని తోటి శిష్యులతో చెప్పసాగెను. వారతనిని గేలి చేసిరి. తుద కీ సంగతి గురువునకు తెలిసి శిష్యుని పిలచి ‘నాకు భగవద్దర్శనము చేయింపు’మనగా వారు ‘స్వామి నడిగి చెప్పెద’ ననెను. మరునాడు స్వామి స్వయముగా ఆరగించ వచ్చినపుడు వాడు పాదములపై పడి గురుని కోరిక విన్నవించెను. స్వామి వాని నొక కొంత దూరమునగల చింతచెట్టు నొద్దకు పిలచుకొనిపోయి దానిని చూపి “దీనియందు ఎన్ని ఆకులు కలవో అన్ని వేల జన్మముల తరువాత నీ గురువునకు నా దర్శనమిచ్చెదను” అనగా వాడు ఏడ్చుచు గురువు నొద్దకు వచ్చెను. “నాయనా! స్వామి ఏమనెను? ఏడ్చుచుంటివేల.” అని గురువు అడిగెను. వాడు గురువును తనతో పిలచుకొనిపోయి, ఆ పెద్ద చింతచెట్టును చూపి మరల ఏడువసాగెను. ‘సంగతి ఏమి?’ యని గురువు ప్రశ్నించగా, వాడు స్వామి చెప్పినదంతయు చెప్పెను. అంత నా గురువు సంతోషముతో గంతులు వేయుచు నాట్యము చేయసాగెను. శిష్యున కేమియు బోధపడక “అయ్యా! నే నిది విని దుఃఖించు చున్నాను. మీరో ఆనందము పట్టలేకున్నా రేమి!” అనగా, నా గురువు “అనేక జన్మలు గడచిన పిదపనైనను సద్గతి కలదు కదా! ‘సర్వము వాసుదేవుడని తెలిసి తనను ఆశ్రయించు పుణ్యాత్ముడు అరుదు’ అని భగవానుడు గీతయందు చెప్పెను. ఆ స్థితి నాకు ఎన్ని జన్మల తరువాతనైనను కలుగునని సంతోషించు

చున్నా"ననెను. అట్లే పదునెనిమిది పర్యాయములు తిరిగినను చివరకు ఉపదేశింతునంటిరని యతిరాజులు ఆనందించిరి.

నంబి :

"యతిరాజా! నేను చెప్పినదేమి? నీవు చేసినదేమి?"

"మీరు ఆజ్ఞాపించినట్లే వచ్చితినికదా!"

"నీవట్లు రాలేదు. నిన్నొక్కనినే రమ్మంటినికదా!"

"మీ శిష్యుడు చెప్పినట్లే వచ్చితిని, వాని నడుగుడు!"

"వినుము, వాడు నిన్ను 'దండపవిత్రములతో రమ్మంటిని' అనుచున్నాడు. అయినను నీ వి ట్లేల వచ్చితివి?"

"మీరు చెప్పిన దండపవిత్రములు నిత్యోపయోగములు కావు. అవి మాట్లాడవు. నాకు వీరిరువురిలో నొకరు దండము; మరియొకరు పవిత్రము. కావున మీ ఆజ్ఞానుసారము దండ పవిత్రములతోనే వచ్చితిని (యతి దండ పవిత్రములనువలె, వీరిని వదులను)."

"వీరిరో దండమెవరు? పవిత్రమెవరు?"

"ఇందు కూరత్తాళ్వారు సాధువు, విరక్తుడు, మిగుల అణకువ కలవాడు – కాన – పవిత్రము. మొదలియాండాన్ గడుసువాడు, చిన్నవాడు – ఇంకను విద్యామదము వదలనివాడు – వాదములు చేయుచుండును – తన్నిమిత్తము వచ్చువారిని వాదమున అణచిపంపుటకు నిలిపియున్నందున అతడు దండము."

అంత తిరుక్కోట్యూరునంబి సంతసించి మంచి ముహూర్తమునందు

"ప్రణవాద్యం నమోమధ్యం, నారాయణ పదం యదా
తిరుమంత్రాక్షరం విద్యా సర్వసిద్ధికరం సదా!
ముముక్షూణాం సదా జప్యం భుక్తి ముక్తి ఫలప్రదం
వైష్ణవానాం సదాజప్యం భక్తి జ్ఞాన ప్రవర్ధనమ్."

అనునట్లుగా ఎనిమిది అక్షరములును ఆదిమధ్యాంతములందు మూడు పదములును కలిగి సదా జపించువారికి సర్వఫలములనిచ్చు తిరుమంత్రము నుపదేశించిరి. అట్లు తిరుమంత్రమును పొంది యతిరాజు లిట్లు తలచిరి : "నేను ఆదిశేషుడను. సకలవిద్యాప్రవీణుడను. ఇదివరలో వరదరాజు నొద్ద వినినవాడను. నాకే ఈ మంత్రము లభించుట ఇంత కష్టము కాగా ఎల్లవారి గతి ఏమి? ఎల్లరు తరించుట కదా పరమావధి!"

## విశాలదృష్టి

యతిరాజు లా మరునాడు తిరునాళ్ళ సందర్భమున నృసింహస్వామి గుడివద్ద చేరిన భక్తానీకమును జూచి గోపురమెక్కి "ఓ భక్త వైష్ణవులారా! మీరెల్లరు తరించు మంత్రము చెప్పెదను రండి, రండి!" అని వారిని పిలిచి తిరుమంత్రమును వారికి వెదజల్లిరి. సర్వులను తరింపజేయుట వారి అభిమతము. అట్లీ మంత్రమును అందరికి అందజేసినట్లు తెలుసుకొని తిరుక్కొట్టియూర్‌నంబి రామానుజులను పిలిపించిరి.

"యతిరాజా! మంత్రమును వెల్లడి పరచితివా?"

"ఔను వెల్లడించితిని."

"నేను వలదని చెప్పితిని కదా! గురునాజ్ఞ మీరువాని కేమి ఫలమో తెలియును కదా? నీకు నరకము కలుగదా? ఇంత తెగించి చెప్పనేలను?"

"స్వామి! గురువాజ్ఞ మీరినందున నేనొక్కడను నరకమున బడుదును. ఎందరో పరమపదమున కేగుదురు కదా! కావున నేనొక్కడను నరక మనుభవించిన నేమని అందరికి వెల్లడించితిని!"

"ఆహా! ఎంత చదివితిని! ఎన్ని మంత్రార్థము లెరిగితిని! ఎంత వయసు

చెల్లినది! ఈ మంత్రమును వెలిబుచ్చరాదని – సర్వులు నరకమునబడిన నేమని ఉపేక్షించితిని. నీవు 'పదునెనిమిది పర్యాయములు తిరిగి శ్రమపడితివే!' ఎల్లవారికి లభించుట దుర్లభము – నేను చెడిన నే'మని తలచి ఎల్లవారికి వెదజల్లితివి. మన్నాథా! ఎంబెరు మానార్! నా స్వామీ! పరమ సమృద్ధిలో నీ కెంత అభినివేశము! నేనా గురువును? నీవే జగద్గురువువు."

"ఐన, స్వామీ, చరమ శ్లోకమున కూడ ఉపదేశించుడు!"

"బాగు బాగు! నీకే చెప్పెదనంటిని కదా!"

"నాకు మాత్రమే ఉపదేశింతురా?"

"ఔను, నేను రంగనాథుని సేవించి ఏకాంతమున చరమశ్లోకమును అనుసంధించితిని. స్వామి సంతోషించి న న్నీ మంత్రమును తగినవారికి చెప్పుమని, అట్టివానిని శీఘ్రమే పంపెదననిరి. అట్టివాడవు నీవే. ఉపదేశించెదను రమ్ము! తిరుమంత్రమో గొప్పది. ఇది రహస్యమైనది. దీనిని కూడ వెల్లడి చేసెదవేమో! వెల్లడి చేయనని నా పాదములంటి ప్రమాణము చేయుము."

నంబి యిట్లు యతిరాజులచే ప్రమాణము చేయించి గీతాచార్యులు అర్జునున కుపదేశించిన చరమశ్లోకము ప్రీతితో రామానుజుల కుపదేశించిరి. వారును తాను సంపాదించిన రెండు మంత్రములలో తిరుమంత్రమును విస్తారముగ జనులకొసగుచు రెండవదానిని మాత్రము గోప్యముగ నుంచుకొని గురువాజ్ఞ మన్నించిరి. పెరియనంబి తాను చెప్పిన రహస్యార్థములు తన పుత్రున కీయుమనినట్లు, తిరుక్కొట్టియూరునంబియు తిరుమంత్ర చరమశ్లోకము లుపదేశించి, ఆ సొత్తును తన పుత్రునకీయుమని రామానుజుని కోరి, కృతకృత్యుడనైతినని ఆనందభరితులైరి. వారు రామానుజుని పిలచిన 'ఎంబెరు మానార్' నామము ఈనాటికి సార్థకమై యున్నది.

# గురు శుశ్రూషయా విద్యా

వారు శ్రీరంగమునకు తిరిగివచ్చిరి. వారికి నమస్కరించి "రహస్యార్థము లుపదేశించు"డని కూరత్తాళ్వార్ అడిగిరి.

"ఉపదేశము పొందగోరువారు ఒక సంవత్సరము ఆచార్య శుశ్రూష చేయవలెను, చేసెదవా?"

"స్వామీ! ఒక వత్సరమే కాదు, పది వత్సరములైన చేసెదను. ఐతే, ఈ శరీరము అస్థిరము. కనుక త్వరలో ఉపదేశింపుడు."

"నీవు చెప్పినది యథార్థమే! ఒక సంవత్సరము శుశ్రూషగాని, ఒక నెల ఉపవాసముగాని చేయవలెను. ఆహారము మానినను ఎప్పటివలె సకలోపచారములు చేయుచుండవలెను, చేసెదవా?"

కూరత్తాళ్వార్ సకలోపచారములు చేయుచునే మాసోపచార ముండినందున సంతసించి యతిరాజులు తనకు తిరుక్కొట్యూరునంబి చెప్పిన సకలము కూరేశుల కుపదేశించిరి. మొదలియాండాన్ను ఉపదేశము పొందగోరిరి.

"కూరత్తాళ్వార్కే ఉపదేశింపవలెనని నా బుద్ధికి తోచినది."

"స్వామీ, నాకెట్లు లభ్యమగును?"

"నీవు తిరుక్కొట్యూరు నంబి యొద్ద కేగి నేను నీకుపదేశించలేదని చెప్పుము."

మొదలియాండాన్ యతిరాజుల ఆజ్ఞానుసారము తిరుక్కొట్యూరు పోయి నంబి యెదుట నిలచెను. "ఓరీ! యతిరాజుల దండమా! నీవేల వచ్చితివి?" అని అడుగగా, మొదలియాండాన్ రామానుజులు తనకు ఉపదేశ మీయనట్లును, నంబి యొద్దకు వెళ్ళుమని చెప్పినట్లును విన్నవించెను.

"ఓరీ! నీకు విద్యా ధన కుల మదములున్నవి. అవి 'నేను' అనక 'మేము' అని చెప్పుకొనునట్లు చేయును. విద్యనేర్చుటకు ఫలితము తల్లి తండ్రి గురువు పెద్దల యొద్ద మెలగు విధము తెలియుట. నీ కీ మూడు మదములు వదలువరకు

యతిరాజు లుపదేశింపరు. కాన వానిని విడచి వారి పాదముల బడుము. నా యొద్ద ఉపదేశము పొందుటకు యతిరాజు లొక్కరే సమర్థులు – తగినవారు. ఎవరికిని నే జెప్పిన రహస్యార్థములు తెలుపవలదని నేను వారికి చెప్పగా, కూరత్తాళ్వార్‌కు, మొదలియాండాన్‌కు చెప్పెదననిరి. నీవు తగవు అనలేదు. వారి పాదముల బడుము. తగిన సమయము చూచి చెప్పుదురు" అని తిరుక్కొట్టియూరునంబి చెప్పిరి.

మొదలియాండాన్ తిరిగివచ్చి నంబి చెప్పినవెల్ల వివరించెను. వారు "మరి ఆ మూడు మదములను విడచితివా?" అని అడుగగా, "విడచితిని" అనెను. "లేదని తోచుచున్నది" అని వారనగా, "పరీక్షించి చెప్పుడు" అనెను. "అట్లనే కానిమ్ము" అని వారనిరి. సరిగా నా సమయమునకు పెరియనంబి కుమార్తె అత్తుళ్ళాయమ్మకు అత్తయింట పోరు కలిగినందున సహింపలేక తండ్రి యొద్దకు వచ్చి "తండ్రీ! అత్త నన్ను బాధించుచున్నది. అర్ధరాత్రి జలము తెమ్మనుచున్నది. 'భయ'మందునా – "ఓసీ! నీకు తోడు వచ్చుటకు నీదాసినా?" యని తిట్టుచున్న దని యేడ్చుచు చెప్పెను. "అమ్మా! నేనేమి చేయగలను? శిష్యునితో చెప్పుము. వారే ఏదియైన ఏర్పాటు చేయగలుగుదురు" అని తండ్రి చెప్పగా, నామె యతిరాజు లొద్దకు వచ్చి సంగతి చెప్పి "నాకు తోడుగా వచ్చువారెవరైన ఉండిన చాలును. వారు జలము తేనక్కరలేదు" అని చెప్పినది. వారు మొదలియాండాన్‌ను చూచి "మూడు మదములు విడిచితి నంటివికదా! ఈమె గురుపుత్రి. ఈమెకు చేయు సహాయము గురు శుశ్రూష యగును. సూర్యోదయము మొదలు మరల సూర్యోదయమువరకు ఈమె ఒక పనియైన చేయకుండునట్లు ఈమెతో వెళ్ళి శుశ్రూష చేసెదవా? ఇట్టి భాగ్యము కలిగెనని సంతోషముతో చేయవలయును సుమా! అట్లు చేయుదువా?" అనిరి. మొదలియాండాన్ సమ్మతించి ఆమెతో వెళ్ళి సకల కార్యములు రామానుజుల ఆదేశానుసారము చేయుచుండెను.

మహాపూర్ణులు గొప్ప విద్వాంసులు. వారి వియ్యాలవారును అంతటివారే. వారి యింట నిత్యము కాలక్షేపములు పదిమంది చేరి పరుపుచుండిరి. వారిలో నొక వైష్ణవు డొకనాడు అపార్థము చెప్పెను. ఆ సమయమునందు మొదలియాండాన్ వంట చేయుచు దానిని విని సహింపలేక ఆ స్వామితో "అది సరికాదు. ఇట్లు చెప్పిన బాగుండు"నని సరియగు అర్థము చెప్పెను. అంత అచట చేరినవారు ఆగ్రహించి "ఓరీ, వంటవాడా! నీవో వంటవాడవు. మేము పదుగురము మాట్లాడునపుడు ఇందుకల్పించుకొనక నీ పని చూచుకొనుము" అని మందలించిరి. "అట్లే చేసెదనుగాని, మీ అర్థవివరణ బాగుగాలేదు" అని మొదలియాండాన్ చెప్పెను. పిమ్మట వారందరు ముందు వెనుకల పునర్విమర్శించి చూడగా వంటచేయువాడు చెప్పినదే సరియగు అర్థమని తేలినది. దానితో పెరియనంబి వియ్యంకుడు, అల్లుడు, కూతురు అత్తుళ్ళాయమ్మ మొదలగువారందరు వానివద్దకు వెళ్ళి "మీరు విద్వాంసులు. ఇక వంట చేయకుడు. ఈసరికే తెలియక అపచారము జరిగినది'' అనగా, మొదలియాండాన్ "ఇది గురునాజ్ఞ. వలదన మీకును, మానుట నాకును అలవికానిది" అనెను. వారు కటకటపడి "అపచారము. మహాపచారము. వంటచేయుట, నీరు తెప్పించుట వంటి హీన కృత్యములు మీచే నెట్లు చేయించగలము? మీరు రామానుజు లొద్దకు తిరిగివెళ్ళుడు" అనగా, "ఏ యతిరాజుల యాజ్ఞతో నిటకు వచ్చితినో, ఆ యతిరాజులు చెప్పిననే తిరిగి వెళ్ళుట" అని మొదలియాండాన్ అనెను. వారెల్లరు యతిరాజుల యొద్దకు వెళ్ళి జరిగినది చెప్పి, "ఎంతటివారిని మా యింటి కార్యములకు పంపితిరి!" అని నొచ్చుకొనిరి. "యతిరాజులు అతనిని తిరిగి పంపివేయుడు" అనిరి. తిరిగివచ్చి వా రా మాట చెప్పినను మొదలియాండాన్ పోలేదు. అంత యతిరాజు లొక శిష్యుని "ఇక చాలును, చరమశ్లోకముపదేశింతును రమ్మని" చెప్పి పంపిననే

మొదలియాండాన్ తిరిగి వచ్చెను. నమస్కరించిన వానిని చూచి “ఏమిరా! మూడు మదములు విడిచితివా?” అని యతిరాజు లడిగిరి. ‘విడచితినని తలచుచున్నా’నని యాండాన్ అనెను. “పరీక్షలో విడచితివని తెలిసినదే!” అని రామానుజులనగా ‘మహాభాగ్య’మని యాండాననెను. పిమ్మట యతిరాజులు శాస్త్రవిధిని మొదలియాండాన్‌కు ఉపదేశవిధిని నిర్వర్తించిరి.

## కొత్త కొత్త ఉపదేశ గురువులు

యతిరాజులు మహాపూర్ణులయొద్ద ద్వయమంత్రమును, గోష్ఠీ పూర్ణులయొద్ద తిరుమంత్రము, చరమశ్లోకములు గ్రహించి కృతార్థులై, మరల మహాపూర్ణుల యొద్దకేగి నమస్కరించి, “తమ ఆజ్ఞానుసారము విషయములు గ్రహించితిని” అని విన్నవించిరి. “ఇంతమాత్రమే అని తలపకుము. [1]వరరంగాచార్యుల యొద్ద ద్రవిడవేదమును రాగ తాళములతో నేర్చుకొనిరమ్ము” అని వారనిరి. తన గానముచేత వరదరాజును మెప్పించిన వారియొద్ద రామానుజులు ద్రావిడా మ్నాయమును రాగతాళములతో నేర్చుకొని వచ్చి తమ ఆచార్యునితో చెప్పిరి.

“ఆ పాశురముల రహస్యార్థములు విచారించవలదా! తగిన వారిని తెలిపెదను, పోయెదవా?” అని పెరియనంబి యడుగగా, “అట్లే చేసెద”నని యతిరాజులనిరి. [2]“తిరుమాలెయాండాన్‌ల యొద్ద కేగి పాశురముల అర్థవిచారము చేయుము” అని వారాజ్ఞాపించిరి. యతిరాజులును తిరుమాలెయాండాన్‌ల యొద్ద కేగి నోటిని చేతితో మూసి నిలచిరి. ఆయన చెప్పునది అంత రహస్యమో, చెప్పగల పాండిత్యము అట్టిదో, లేక యతిరాజుల భక్తి విశేషమోగాని – వారట్లు నిలచిరి. ఆండాను వారిని శిష్యునిగా గ్రహించిరి.

1. తిరువరంగప్పెరుమాళ్ళరయార్.
2. మాలాధరులు.

ఒకనాడు తిరుమాలెయాండాన్ ఒక పాశురార్థము వివరించుచుండిరి. అంత యతిరాజులు "దీనికి ఈ విధముగాను అర్థము చెప్పవచ్చు"నని వేరొక వివరణ చేసినంత వారికి ఆగ్రహము కలిగెను. "నేను పెద్దలు చెప్పినట్లే చెప్పుచున్నాను. కనుక కాదనరాదు. కాని నీవో సర్వజ్ఞుడవు. ఇక నీకు చెప్పుట సరికాదు పొమ్ము!" అనిరి. యతిరాజులు మఠమునకు వెళ్ళిరి. ఒకనాడు పెరియనంబి, తిరుమాలెయాండాన్ యొద్దకేగి "మన లక్ష్మణునకు ఉపదేశించు చున్నారా?" అని విచారించగా, వారు "కాలక్షేపము నిలచినది" అనిరి. "ఎందుచేత?" అనగా, "నేనొకటి చెప్పిన అతడు మరియొకటి చెప్పుచున్నాడు. అపరాధము కదా?" అని వారు జవాబు చెప్పిరి. వారిరువురు కలసి తిరుక్కొట్యూరునంబి యొద్ద కేగి యామునులయొద్ద మువ్వురును వినియున్న వారగుట తర్కించి, పునర్విచారము చేసి, జ్ఞప్తికి తెచ్చుకొని, యతిరాజులిచ్చిన వివరణయే సరియైనదని నిర్ధారించి మఠమునకు వచ్చిరి. తిరుమాలెయాండాన్ "రామానుజా! నే నా యర్థము మరచి అట్లు చెప్పితిని. మీ వివరణయే సరియైనది. ఇక మీరు వచ్చి కాలక్షేపము వినుచుండవలెను" అని చెప్పిరి.

తిరుక్కొట్యూరునంబియును, పెరియనంబియు, తిరుమాలెయాండాన్‌తో రహస్యముగా "రామానుజులేమైన చెప్పిన కాదనవలదు. ఆయనకు తెలియక అడుగుచున్నాడని అనుకొనరాదు. సాందీపనియొద్ద గీతాచార్యునికి వలెనే నిమిత్తమాత్రముగా నొక గురువు ఉండవలెనని యున్నాడేకాని వేరుకాదు" అని చెప్పిపోయిరి. యతిరాజులును మునుపటివలెనే కాలక్షేపమునకు పోవుచుండిరి. మరల నొకవిషయము జరిగినది. తిరుమాలెయాండాన్ ఒక అర్థవివరణ చేసిరి. "అర్థము బాగుగ నున్నది. ఇట్లు కూడ అర్థము చెప్పవచ్చును కదా!" అని యతిరాజనిరి. "యామునులు అర్థము చెప్పగా నీవు వింటివా? వారు జీవించియుండగా నీకు వారి దర్శనమే కలుగలేదే! నేనో! సాక్షాత్తు

విన్నవాడను" అని తిరుమాలెయాండాన్ అనగా, రామానుజులు "నేను వారిని చూడనవసరములేదు. నా కా యర్థము తెలియును. ద్రోణాచార్యుల ధనుర్విద్యా రహస్యములు ఏకలవ్యునికి తెలియలేదా! నాకును యామునులందు గల భక్తిచే తెలిసెను. ఏకలవ్యుడు ద్రోణునకువలె నేనును యామునుల శిష్యుడనైతి ననుకొనుడు" అనిరి.

తిరుమాలె యాండాన్‌కు కోపమువచ్చెను. కాని తిరుక్కొట్ట్యూరు నంబియు పెరియనంబియు "రామానుజులు నీయొద్ద నామమాత్రముగ విద్య నభ్యసించుచున్నారని చెప్పిన దానిని అనుసరించి "రామానుజులే యామున మతానుసారము చెప్పియుందురు. నేనట్లు చెప్పియుండను" అని తలచి వెంటనే లేచివచ్చి "యతిరాజా! యామునులు చెప్పిన యర్థములు చెప్పుచున్నావు. అవి నీకెట్లు తెలియుచున్నవో! ఇక నీముందు నేను అర్థవివరణ చేయుట సరికాదు. ఇకనుండి నీవు గురుడవు; నేను శిష్యుడను" అని యతిరాజులు వారించుచున్నను, వారికి ప్రదక్షిణించి, నమస్కరించి "పుత్రుడైనను, శత్రుడైనను, శిష్యుడైనను – ఎవరైననేమి! ఎవరియొద్ద విషయమున్నను గ్రహింపవలసినదే" అని వారిని ప్రశంసించి, తన పుత్రుడు [1]సుందరహును యతిరాజులకు శిష్యునిగా చేసి "యతిరాజా! నేనొక కార్యము చెప్పెదను, చేయుదువా? యాముల పుత్రుని యొద్ద విశేషములుండును. నీవచటికి పోయి, విశేష శుశ్రూష చేసితివేని ఉపదేశింతురు పో"మ్మనిరి.

రామానుజులు రెండవమారు తిరువరంగ ప్పెరుమాళ్ళరయర్‌ల యొద్దకేగి విశేషము లుపదేశింపుడని కోరిరి. "అన్నియు చెప్పుట అయినది కదా!" అనినను, యతిరాజులు అచటనే యుండి వారి సేవ చేయుచు, నిత్యము పాలుకాచి కలకండచేర్చి యిచ్చుచు అనేక నెలలు వారియొద్దనే గడపిరి. ప్రతిమారు శర్కరతో

---

1. సుందరత్తో శుడయాను.

పాలు సేవించుచు "యతిరాజా! బాగుగనున్న" వనుచుండిరి. ఇంతలో ధనుర్మాసము వచ్చెను. అరయరులు నిత్యము రంగనాథుని సన్నిధిలో పాడి ఆడి పరుందురు. వారికి శ్రమగా నుండును – అని తలచి యతిరాజులు వారికి వేడినీరు పెట్టి దేహముపట్టి స్నానము చేయించుచుండిరి. ఇట్లు భక్తితో సేవచేయుచుండగా ఆరునెలలు గడచెను. ఒకనాడు వారు యతిరాజులతో అనిరి :

"నీకు మంత్రోపదేశమైనది. సకలశాస్త్రములును నేర్చితివి. ఎందరో పెద్దల యొద్ద ఇంత విద్య గ్రహించితివే! ఇందు ఎవరిని అధికునిగా గ్రహించితివి?"

"సాక్షాత్తు వైకుంఠనాథుని!"

"అది సరియే. నీకు పంచమోపాయము – అదే – చరమోపాయము చెప్పెదను. అది శరణాగతికి పై మెట్టు. కర్మ, జ్ఞాన, ప్రపత్తులకును మిన్న."

"గురురేవ పరంబ్రహ్మ గురురేవ పరంధనం
గురురేవ పరఃకామో గురురేవ పరాయణః ।
గురురేవ పరావిద్యా గురురేవ పరాగతిః
అస్మాత్తదుపదేష్టాం సా తస్మా ద్గురుతరో గురుః ।"

అనునట్లు సర్వము గురువేయని భావింపవలెను. భగవంతుని ఆశ్రయించితిని – నన్ను కాపాడును – అని తలచి గురువును మరువరాదు. ఒకవేళ భగవంతునికి ఆగ్రహము కలిగినను, గురువు – వీడు నా శిష్యుడని చీటీ నిచ్చును. గురువునకే కోపము వచ్చిన వేరు శరణ్యములేదు. ఉపాయోపేయములు గురువే. వారియొద్ద చేరినవారినే భగవంతుని యొద్దకు చేర్చుదురు – అని తలచి యుండుట అను పంచమోపాయము నుపదేశించగా, యతిరాజులు వినిరి. మరియు పెరియనంబి, తిరుక్కొట్యూరునంబి, తిరుమాలెయాండాన్‌లు తమ తమ పుత్రులను రామానుజులకు శిష్యులుగా

చేసిరి. మరి తనకు కుమారులు లేరు. యోగ్యుడగు తమ్ముని కుమారునిగా తలపవలెను. ఇది శాస్త్రము. కాబట్టి తాను పుత్రునిగా తలచియుండు శొట్టనంబిని (సోదరుని) తిరువరంగప్పెరుమాళ్ళరయార్ రామానుజునికి శిష్యునిగా చేసిరి.

రాజ్యపరిపాలన చేయుచు, తన దేహత్యాగకాలమున ప్రభువు – చిన్నవాడగు తన కుమారుని శ్రేయమునకై, సన్మంత్రులొద్ద తన సర్వస్వమును దాచినట్లుగా; యామునులు రామానుజులకొరకై తన శిష్యులయొద్ద రహస్యములు దాచియుంచిరి. రాకుమారుడు ప్రాజ్ఞుడై సన్మంత్రులనుండి తన వారసత్వము గ్రహించునట్లు, రామానుజులును; రాకుమారుని ప్రాజ్ఞత గుర్తించి తమయొద్ద న్యాసముగా నుంచిన సంపదలను వానికి అప్పగించు సన్మంత్రులవలె యామునుల శిష్యులును వర్తించిరి.

## పతివ్రత

యతిరాజులు ప్రతిదినము శిష్యులకు [1]కాలక్షేపము చెప్పుచుండిరి. వారు యతిధర్మము నియతిగా పాలించువారు. మిగుల ఆచారపరులును. ఈ నియమ పాలన స్వామి సన్నిధిలో నుండు అర్చకులకు సరిపడలేదు. వారి స్వేచ్ఛా ప్రవర్తనకు భంగము కలిగినది. కావున వారు యతిరాజులకు విరుద్ధముగా నుండిరి. వీరినెటులైన తొలగించవలెనను నిర్ణయమునకు వచ్చిరి. ప్రధానార్చకుడు ఒక వైష్ణవునికి ధనమిచ్చి నియోగించెను. రామానుజులు యతిధర్మము ననుసరించి మధుకర వృత్తిచే జీవించువారు. తుమ్మెద అందందు తేనెను సేకరించును. అందుచే దానిని మధుకరి యందురు. ఆమాదిరిగనే శరీరధారణకై అందందు ప్రసాదము స్వీకరించుట మాధుకరమని పిలువబడు చున్నది.

1. పాతప్రవచనము.

అర్చకుని సూచనను అనుసరించి, ఆ వైష్ణవుడు రామానుజునికి మాధుకరముగా విషాన్నము పెట్టుమని భార్యతో చెప్పెను. ఆమె పతివ్రత - సంకోచమున బడినది. ముందు నుయ్యి, వెనుక గొయ్యిగా నామెకు తోచినది. భర్త ఆదేశము తిరస్కరింపలేదు, యతికి విషాన్నము పెట్టలేదు. భర్త నిర్బంధము హెచ్చెను. యతిరాజు లా సరికే వాకిట భిక్షకై నిలచిరి. వ్యవధి లేదు. ఆమె రంగనాథుని స్మరించి విషాన్నమును తెచ్చి రామానుజులకిచ్చి ప్రదక్షిణ నమస్కారములు చేసినది. ముఖము వెలవెల పోయినది. ముఖమెత్తి యతిని వీక్షింపలేకపోయినది. అధోముఖియై కాలి బొటనవ్రేల క్రింద వ్రాయుచు నిలచినది. పరేంగితజ్ఞులయిన యతిరాజు లామె సంకోచమును గుర్తించి, జ్ఞానదృష్టిచే కనుగొని ఆ యన్నమును అచటనే గల ఒక కుక్కకు వేసిరి. రామానుజుల చేతిప్రసాదము తిని ఆ కుక్క మృతిచెంది మోక్షప్రాప్తికి అర్హత నొందినది. రామానుజు లా పతివ్రతను ఆశీర్వదించి వెళ్ళి హత్యాదోష నివారణకై త్రిదివసోపవాసము చేసిరి. ఈ వార్త పెరియనంబి ద్వారా వినిన, తిరుక్కొట్యూరు నంబి మున్నగువారు వచ్చి రామానుజులను పరామర్శించిరి. రామానుజులు పరీక్షలకు మూలమైనందులకు ఏమి చేయనగునని చింతించుచుండిరి.

## దేహాభిమానము

కిళాంబి యాచ్చాన్ అనువారు తిరుమలనంబికి బావమరది కొడుకు. వారు తమ మేనయత్త భర్తను, వారి పుత్రుని చూచుటకు తిరుమల వెళ్ళిరి. తిరుమలనంబి పుత్రుడు ప్రహ్లాదునివలె జన్మించిన నాటినుండి భగవద్భక్తి కలిగి యుండెను. ఇంతలో కొందరు వైష్ణవులు శ్రీరంగమునుండి తిరుమలకు వచ్చిరి. వారిని అచటి విశేషము లేమియని తిరుమలనంబి యడిగిరి. వారు రంగనాథుని

కోవెలభారమంతయు యతిరాజులదే యని, అచటి విశేషములు ప్రశంసా పూర్వకముగ చెప్పిరి. ఈ మాటలు వినిన కిళాంబియాచ్చాన్‌కు శ్రీరంగమునకు పోవు కోరిక కలిగెను. వారు బయలుదేరుట జూచి తిరుమలనంబి బిడ్డడు తానును పోయెదననెను. నంబియు అంగీకరించి వానిని తన బావమరది పుత్రునితో పంపిరి. వారు పోయి యతిరాజులను దర్శించిరి. వారెవరో రామానుజులు ప్రశ్నించిరి. కిళాంబియాచ్చాను తన పరిచయము చేసుకొని నంబి కుమారుని చూపి "ఈ బిడ్డ తిరుమలనంబి కుమారుడు. ఇతనికి భగవద్భక్తితోబాటు తమ పాదభక్తియు కలదు. తమ్ము సేవింపవలెనను ఆశతో వచ్చెను" అని చెప్పిరి. యతిరాజులు వానిని చూచి "ఓహో! ఈతడు [1]తిరువేంగడ ముడయాను అనుగ్రహముచేత పుట్టినవాడు' అని తెలుసుకొని ఆ బిడ్డను అనుగ్రహించి, ఆశీర్వదించిరి. వారిద్దరికి సకలార్థములు తెలిపిరి. "యతిరాజులు రంగనాథానుగ్రహ పాత్రులు. ఈ దివ్యమంగళ విగ్రహమును కాపాడవలెను" అను భక్తిచే కిడాంబియాచ్చాను సూర్యోదయము మొదలు మరల సూర్యోదయము వరకు ఏమరక రామానుజుల సకల కైంకర్యములు చేయుచుండిరి.

పెరియనంబియు తిరుక్కోట్యూరునంబియు రామానుజులను చూచుటకై ఒకనాడుకావేరి ఒడ్డుననే వచ్చుచుండిరి. లక్ష్మణు లది చూచి ఎదురేగి వారికి సాష్టాంగపడిరి. ఆ నంబులు లెమ్మనలేదు – రామానుజులు లేవలేదు. ఎండ తీవ్రమాయెను. దీనిని చూచుచుండిన కిళాంబియాచ్చాను సహింపలేకపోయెను. "అయ్యా! కావేరీజలముల ప్రక్కనైన నిలువరైతిరి. వీరు ఎండలో మాడిపోవు చున్నారే! గురుశిష్య సంబంధమన్న నిదియా! (చోళియా) ముందు జుట్టువారా! లెమ్మనరాదా?" అని వారిని నిందించి, యతిరాజులనెత్తి దేహము నంటుకొనిన మన్నుదులిపి భుజముపై వేసుకొనిరి.

---

1. శ్రీవేంకటేశ్వరుడు.

అంత గోష్ఠీపూర్ణులు యతిరాజుల చేయిపట్టుకొని, "రామానుజా! ఈతడు నీ దేహము కష్టపడుచుండుటను సహింపలేకపోయినాడు. నీ శరీరముపై గొప్ప అభిమానము కలవాడు. నీవు వీనియొద్ద కాక ఇతరునియొద్ద భుజింపకుము" అని కట్టడి చేసిరి.

## హరిపాదోదకము

పూర్వము యతిరాజులకు చేసిన విషప్రయోగము ఫలింపలేదు, కాని వారు యత్నము మానలేదు. అసూయాద్వేషములు, కార్యభంగము మనుష్యుల మనసులను మార్పజాలవుకదా! తన యత్నమున విఫలుడైన అర్చకుడు సమయముకొఱ కెదురుచూచుచుండెను. ఒకనాడు యతిరాజు లొక్కరే రంగనాథుని సేవింపవచ్చిరి. వారిని ఒంటరిగా చూచినంత సంతసించి అర్చకుడు హరిపాదోదకమున విషముకలిపి వారికి ఇచ్చెను. శ్వాసామాత్రమున వారది గుర్తించినను భగవత్పాదతీర్థమగుటచే స్వీకరించిరి. రామానుజులు స్వయముగా ఆదిశేషుడు; ఎదుట రంగనాథుడు – శేషతల్పశాయి! మధ్యలో విషప్రయోగము! ఎంత చిత్రము! శేషాహి విషమున అర్చకుడు కలిపిన విషప్రభావమెంత? పైగా విషము హరిపాదోదకమున చేరి తన స్వధర్మము – స్వభావము – పోగొట్టుకొనెను. ఋష్యాశ్రమములందు క్రూరమృగములు తమ క్రూరత పోగొట్టుకొనుట విదితమేకదా! యతిరాజుల ప్రభావము మరింత ప్రకాశించినది.

## మాయావాద ఖండనము

యతిరాజ ప్రభావము దేశమంతట విస్తరించుచుండ, ఒకనాడు శ్రీరంగమున వేలాది తాళపత్ర గ్రంథములు బండ్లపై వచ్చుచుండెను. వాని

ముందు జయభేరి మ్రోగుచుండెను. అవి అన్నియు మఠము నొద్ద ఆగినవి. ఒక పాలకి నుండి [1]యజ్ఞమూర్తి యను అద్వైత పండితుడు దిగి మఠములోనికి వెళ్ళి రామానుజులను చూచెను.

"'యతిరాజు, యతిరాజు' అని ప్రజలచే చెప్పబడువాడవు నీవేనా?"

"నన్నట్లే పిలచుచున్నారు."

"నన్ను యజ్ఞమూర్తి యందురు. అద్వైత పండితుడను. ఇంతవరకు ఎదురుపడిన అన్ని వాదములను, పండితులను ఓటమి పాలుగావించి వచ్చితిని!"

"మీరిచటికి వచ్చిన ప్రయోజనమేమి?"

"వాదప్రయోజనము, అద్వైత స్థాపనము."

"వాదించుటకు సందేహములేదు."

"ఊరకే వాదమువలన ప్రయోజనములేదు, పందెము పెట్టవలెను."

"ఏమిపందెము కోరుచున్నారు?"

"నేనోడిన నీ పాదరక్షలు శిరసున ధరించి, నీ పేరు పెట్టుకొని నీ మతము స్వీకరించెదను. నీవు ఓడిన ఏమి చేయుదువు?"

"నేను ఓడిన యెడల నేను జపించు మంత్రము వదలెదను. కాలక్షేపము చెప్పుట మానెదను. గ్రంథ సన్న్యాసము చేయుదును."

ఆ విధముగ వారిరువురు నరసింహస్వామి సన్నిధిని ప్రమాణములు చేసిరి. వాదప్రారంభమాయెను. ఇరువాద సమర్థకులు నిరువైపుల పెద్ద గోష్ఠిగా చేరిరి. ఎవరికి వారు వారి పక్షమునకే జయమని నమ్మియుండిరి. యజ్ఞమూర్తి అనేక వాదసంగ్రామముల ఆరితేరినవాడు. రామానుజులో శేషావతారము. పదునారు దినములు వాదము సమాన ప్రతిభతో సాగెను. ఫలితమెటులుండునో ఛాయా

1. కారుణ్యాకరుడనియు పేరు.

మాత్రముగను గోచరముకాలేదు. పదునేడవనాడు యతిరాజుల వాదము కించిత్తు తగ్గినట్లు తోచినందున కారుణ్యాకరుడు పైపైరాసాగెను. ఆనాటి సాయంకాలము వాదవిరామ కాలమునకు యజ్ఞమూర్తిదే పైచేయిగా నుండెను. అతడు "రామానుజా! రేపు నా ప్రతిపాదనలను పూర్వపక్షము చేయవైతివేని, నీవు ఓడినట్లు జయభేరి వేయించెద"నని చెప్పి వెళ్ళెను.

రామానుజులు మఠమునకు వెళ్ళి చింతతో ఉదకమైన ముట్టక పరుండి వరదరాజస్వామిని ప్రార్థించిరి. స్వామి సాక్షాత్కరించెను.

"యతిరాజా! యజ్ఞమూర్తి వంటి వాదనాపటిమ గల వానిని నిన్ను బాధింప తెచ్చితి ననుకొంటివా? లేక అతడు నిన్ను జయింపగలడని తలచితివా? ఎందరెందరో వచ్చి నీతో వాదించి నీకు శ్రమ కలిగింపరాదనియు వారందరిని మించినవారు - సింహమువంటివాడు నీకు శిష్యుడు కావలెనని వానిని పిలుచుకొనివచ్చితిని!"

"ముందు వాని వాదమును పూర్వపక్షము చేయవలెనుకదా!"

"దానికి సందేహములేదు. నీవు మంచి వాదనాపటిమ గల శిష్యుని కలిగియుండిన ప్రతివారితో నీవు తలపడనక్కరలేదు. నీవాక్కు బుద్ధిమంతులకు వినిపించుచుండగా, వాదనార్థము వచ్చువారిని వాడే చూచుకొనునని వానిని తెచ్చితిని. రేపు వాడు ఓడి, దానిని అంగీకరించును."

"దానికి గల అవకాశమేది?"

"యామునులు 'మాయావాద ఖండనము' అనునొక గ్రంథమును వ్రాసియుంచిరి. వాదకోలాహలమున నీవు దానిని సంప్రదించి యుండలేదు. లెమ్ము! దానిని పరిశీలించుము. సరిపోవును! అందలి యుక్తులు అప్రతిహతమైనవి."

రామానుజు లా గ్రంథమును పరిశీలించి 'ఆహా! యామునులీ చిన్న గ్రంథమున ఎన్నెన్ని వ్రాసిరి! ఇంకను వారి ఇతర గ్రంథములందు ఎన్నెన్ని వ్రాసిరో!' అని తలచిరి. మరునాడు మరల వాదమునకు చేరిరి. వాద ప్రారంభమునందే యతిరాజుల పోకడను గ్రహించి యజ్ఞమూర్తి "నా చివరి అస్త్రము విఫలమైనది. చెప్పనేల! భగవంతు డీతనికి ప్రసన్నుడైనాడు, గ్రహించితిని. నలుగురిముందు ఓటమిపాలగుట ఎందుకు?" అని తలచి, "యతిరాజా! భగవదనుగ్రహము నీకు కలిగినదని గ్రహించితిని. నీకు శిష్యుడనగుచున్నాను. నీవు మనుష్యమాత్రుడవు కావు. ఈశ్వరాంశ నీయందున్నది" అని లేచి ప్రదక్షిణ నమస్కారములు చేసి యతిరాజుల పాదములు తలదాల్చి శిష్యుడాయెను. వారి పాదరక్ష తనంత తానుగా గ్రహించెను.

"శిష్యుడనైతినన చాలదు. వాదము చేయవలయును."

"స్వామీ! మీకు శిష్యుడనైతిని. మీ మతమునకే వచ్చితిని. మీ పాదరక్షల గ్రహించితిని."

"మా మతమునకు వచ్చిన అచట నెట్లుండవలెనో, అట్లుండవలెను కదా!"

అంత యజ్ఞమూర్తి తన ఏకదండమును వదలి త్రిదండసన్యాసియై పంచసంస్కారములు పొందెను. యజ్ఞమూర్తి పరాజయము స్వామి, రామానుజులు – ఇరువురి వలన జరిగినందున, ఇరువురి పేర్లు ధరించవలసి యుండెను. కనుక యతిరాజు లతనికి "దేవరాట్ దేవమన్నారు" – "పేరరుళాళప్పెరుమాళ్ ఎంబెరుమన్నార్" అను పేర్లు పెట్టిరి. ఇది పెద్ద పేరైనందున "దేవరాజన్' అని వ్యవహరించుచుండిరి. రామానుజులు శిష్యుల బిలచి "ఇతడు ఓడియున్నందున మీతో సరియనుకొనకుడు. నా స్థానమున నుండదగినవాడని తలచి, మీరు నాయందెంత భక్తి చూపుదురో, నా కెట్లు శుశ్రూష చేయుదురో, వారికిని అట్లే చేయుడు" అని చెప్పిరి.

# యాత్రాప్రారంభము

యతిసార్వభౌములు యాదవప్రకాశులను సరిపరచి గోవిందజియ్యరుగ జేసిరి. వానికంటె హెచ్చైనవాడు, వాదమున నెట్టి వారినైన ఖండించగలవాడైన యజ్ఞమూర్తిని వరదరాజానుగ్రహమున జయించి దేవరాట్ దేవమన్నారును చేసి, అజ్ఞానాంధకారమున నున్నవారికి జ్ఞానోదయము కల్గించుటకు నియమించిరి. అనంతాళ్వాన్ మొదలగు గొప్ప గొప్ప పండితులు ఆశ్రయింప రాగా, "నాకు పెద్ద శిష్యుడున్నాడు. వానియొద్దకు వెళ్ళుడు" అనిరి. వారెల్లరు పేరరుళాళప్పెరుమాళ్ ఎంబెరుమానారులయొద్దకు వెళ్ళిరి వారు "రామానుజు లుండగా నేనేమి కాలక్షేపము చెప్పుదును? చిన్నపిట్ట గొంతులో తాటికాయను కట్టినట్లుగా చేసిరే! నేనజ్ఞుడను. రామానుజులు మహానుభావులు. వారి పాదములనే ఆశ్రయించుడు'' అని చెప్పిరి. ఆచార్యులకుండవలసిన వాత్సల్యమును యతిరాజులు చూపగా, శిష్యుని కుండవలసిన భక్తి - నైచ్యానుసంధానములను దేవరాజు ప్రదర్శించిరి.

యతిరాజులు 'తిరువాయ్ మొళి కాలక్షేపము జరిగించుచుండగా, మధ్యలో తిరుమల విషయమైన ప్రస్తావన వచ్చెను. "ఆహా! ఏమి వేంకటేశ్వర ప్రభావము! నాకు వాదములతోనే సరిపోవుచున్నది. తిరుమలకు పోయి స్వామికి పుష్ప కైంకర్యము చేయుచుండిన నెంత బాగుగ నుండెడిది! అట్లు కైంకర్యప్రాప్తి ఎంతటి వారికో!'' అనిరి. ''నాకు అనుజ్ఞనిచ్చిన నేను వెళ్ళి ఆ కైంకర్యము చేయుచుందును" అని అనంతాళ్వారనిరి. "నేనైననేమి? నా శిష్యుడైననేమి?" యని తలచి యతిరాజులు అనుజ్ఞనీయగా, అనంతాళ్వాన్ తిరుమలకు పోయి నందనవనమును పెంచి, నిత్యము పుష్పములు తులసిమాలలు కట్టి, స్వామికి కైంకర్యము చేయుచుండిరి.

ఈ వార్తను వినిన యతిరాజులు తాను తిరుమలకేగి స్వామిని సేవింపగోరి రంగనాథుని సన్నిధికేగి "స్వామీ! రంగనాథా! వేంకటేశ్వరుని దర్శించి సేవించవలెనని యున్నది. తమ ఆజ్ఞ అయినచో పోయి వచ్చెదను. నిన్ను విడచివెళ్ళుట కష్టమే. అయినను ఆజ్ఞయైనచో పోయి రాగలను" అనిరి. 'సుఖముగా పోయిరమ్మని' రంగనాథుడనెను. అట్లు రంగనాథానుజ్ఞగొని యతిరాజులు అనేకమంది శిష్యులతో తిరువేంగడ ముడయానును సేవింప బయలుదేరిరి.

## చిత్తవృత్తి పరివర్తన

అట్లు పయనించుచు మార్గమున అష్టసహస్ర గ్రామము చేరిరి. వారి కా గ్రామమున నిరువురు శిష్యులుండిరి. వరదాచార్యుడు మహాప్రాజ్ఞుడు, దరిద్రుడు, భక్తిగలవాడు. యజ్ఞేశ్వరుడు మిగుల శ్రీమంతుడు. 'ధనముకన్న భక్తి ముఖ్యము' అని ప్రజలు తెలుసుకొనవలెనని తలచి యతిరాజులు వరదాచార్యుని యింటికే పోయిరి. అప్పుడు వరదాచార్యు డింటలేడు. అతడు ఉంఛవృత్తి జీవనుడు. ఆ పనిమీదనే వెళ్ళియుండెను. యతిరాజులు వారి వాకిట నిలచి "అమ్మా! ఇంట నెవరు? వరదాచార్యు డెక్కడ?" అని అడిగిరి. వరదాచార్యుని ఇల్లాలు లక్ష్మియను నామె మూడుగజముల వస్త్రము (అర్ధవస్త్రము) ధరించియుండెను. చీరలోని మిగతా భాగము వరదాచార్యుడు కట్టుకొని బయటికి వెళ్ళెను. ఆమె రామానుజుల రాక నెరిగియు, వారిని సేవింపగోరియు వీలుకాకపోవుటచే, సంజ్ఞార్థము చేతులు తట్టెను. రామానుజులా శబ్దమును విని తమ శిరోపరివేష్టమైన కాషాయ వస్త్రమును ఆమెకై విసరివేసిరి. ఆమె యా వస్త్రమును ధరించి వచ్చి రామానుజులకు నమస్కరించెను. వారందరు లోనికి వచ్చి వసారాలో

విశ్రమించిరి. కాని ఆమె మనస్సు కలవరపడెను. "మేము దరిద్రులము. ఈయన మాయందలి అనుగ్రహముతో విచ్చేసిరి. నా భర్త ఉంఛవృత్తిచే సంపాదించి తెచ్చినదానితో నేమగును? ఇందరు శిష్యులతో దయచేసిరే! మరల నిట్టి కైంకర్య భాగ్యమును లభించదు. చెడుకార్యము చేసి వైష్ణవ కైంకర్యము చేయనగునా? తిరుమంగై ఆళ్వార్లు ఎట్లు ఆర్జించి భాగవత తదీయారాధన చేసిరి? దొంగి లించియే కదా! మహానుభావుడు, జ్ఞాని యగు వారే అట్లు చేసి యుండగా, నాకు సంకోచమెందుకు? వైష్ణవారాధనకంటె శరీరము, దేహాభిమానము నెక్కువ కావు" అని నిశ్చయించుకొనెను.

ఆయూర నుండు పెద్దయంగడివాడొకడు లక్ష్మమ్మ రూపలావణ్యములకు మోహపడి 'ఈమె పేదరాలు, ఒక్కనాటి శరీర సుఖమునకు ఆపాదమస్తకము అమూల్యాభరణములను చేయింతునే' యని తలచి, యాసంగతి నామెకు చెప్ప బంపుచుండెను. కాని ఆమె పతివ్రత, ఎట్లు సమ్మతించును? పాతివ్రత్యము సర్వాభరణములకు మిన్నయని తలచునది. ఇప్పు డామె కా సంగతి జ్ఞప్తికి వచ్చినది. భర్త వచ్చువరకు ఆగి ఆతని అనుమతి కోరుదమనిన, లోకులు దూషింతురని యీలోగా మనసు మారునేమో! మలమూత్ర దూషితమైన ఈ శరీరము నిచ్చి తదీయారాధనకు కావలసిన ధనము తెచ్చి వీరి నారాధించుట యుక్తమని తలచి అంగడివాని ఇంటికి పోయినది. వాడును బ్రహ్మానందభరితుడై "ఆహా! ఎన్నిదినములు వేచియుంటిని! నా భాగ్యము స్వయముగా వచ్చినది. నేడెవరి ముఖము చూచితినో! నా సంపదయంతయు కోరిన నిత్తునే. ఈ సంబారము లొక లెక్కయా!" అని ఆమె కోరిన బియ్యము, చక్కెర, గోధుమ, నెయ్యి మొదలగు పదార్థముల నిచ్చి పంపెను. ఆమె వానిని తెచ్చి యతిరాజుల శిష్యులతో నా పదార్థములను పచనము చేసుకొని ఆరగించుడని చెప్పినది.

వారామెతో "నీవు సాధ్వివి. శిష్యుని భార్యవు. నీకును గురూపదేశమై యుండును. నీవే [1]తళిహ చేయుము" అని రామానుజుల అనుమతితో చెప్పిరి. "ఆహా! ఇందరికి సేవచేయు భాగ్యము భగవంతుడు సమకూర్చె"నను ఆనందముతో నామె వంట చేసెను. భక్తిచే అర్పింపబడినది. ఆమె తలచిన అకార్యము వారికి సమ్మతమా? కాదు. ఆమె పాతివ్రత్యము చెడదనియు, ఆమె మనసున చెడుకోరికలు లేవనియు వారెరుగుదురు.

భోజనానంతరము యతిరాజులు "శిష్యులారా! వరదాచార్యు లింట లేకున్నను, ఆమె పాకము నెంతలో నెట్లు చేసినదో చూచితిరా?" అని చెప్పిరి. యతిరాజ చంద్రులు కాలక్షేపము చెప్పుచుండిరి. వరదాచార్యులు వచ్చి "నేనింట లేను. వీరికి పెట్టుట కింట సంబారములా లేవు. నా భార్య చిక్కునబడి యుండును. నేను మాత్ర మేమి చేయగలను?" అని తలచుచు వచ్చినవారికి నమస్కరించిరి. "భయపడకుము. మీరింటలేరని కొదువ కలుగలేదు. శిష్యులతో సహా ఆరగించితిని'' అని వారనిరి. అయినను సందియము వీడక వరదాచార్యులు లోనికిపోయి చూడగా సందేహముతీరి భార్యను పిలచి "సంగతి యేమి? నిజము చెప్పు"మనిరి. ఆమె "మీ పాదసాక్షిగా సత్యమే చెప్పుచున్నా"నని సర్వమును వివరించెను. సందేహము వీడి వరదార్యులు "ఓసీ! నీవు నాకు భార్యవు కావు. గురువువగుచున్నావు. వచ్చిన భాగవతోత్తములకు పస్తులేకుండ జేసితివి. నా జన్మాంతర పుణ్యవశమున నా భార్యవైతివి. తిరుమంగై ఆళ్వార్లను ఆదర్శముగా చేసుకొని పెద్దల నారాధించితివి. కాకున్న మనమిరువురము అపచారపడి నశించవలసి వచ్చెడిది" అనిరి. "రాకుమార్తె నావహించిన పిశాచము నెంతటివారు పోగొట్టలేకుండగా, దానిని తమ పాదస్పర్శ మాత్రమున

---

1. వంట

తరిమి వేసిరి. అట్టివారు భాగ్యవశమున రాగా, అజ్ఞానాంధకారము బాపు నా గురువును ఆరాధించితి"వని ఆనందముతో నామెను ప్రశంసించిరి. బండి ఎద్దులు చెరియొక వైపునకు లాగక బండిని ముందున కీడ్చునట్లా దంపతు లొకవిధముగనే తలచిరి. వారేకమనస్కులైనందున వారిపై యతిరాజుల అనుగ్రహము వెల్లివిరిసినది. "వరదా! నీకంటె నీ భార్యయు, ఆమెను మించి నీవును ఆనందించుచున్నారు - మీరెట్టివారు!" అనిరి. జనుల పాపములను, అగ్ని కట్టెలను కాల్చినట్లు కాల్చు యతిరాజు లుండగా వారికి ఆనందమేకదా!

వరదాచార్యులు భార్యను చూచి "ఓసీ! నీవు వాగ్దత్తము చేసితివి కదా! రమ్మె! నీకు తోడుగా వచ్చెదను" అని ఆమెను పిలచుకొని పోయి అంగడివానితో "ఓయీ! చీకటి యగుటచే నేనును వచ్చితిని. నాకు కోపములేదు. నీ మనోరథము తీర్చుకొనుము" అని చెప్పి పోయెను. లక్ష్మమ్మ ఉపకారస్మృతిచే రామానుజుల పాదతీర్థమును, ప్రసాదమును తబుకున నుంచుకొని వెళ్ళెను - అచంచల మనస్కయై వెళ్ళెను. 'అయ్యో! వీరు వచ్చినందున నా పాతివ్రత్యము చెడనున్న'దని అనుకోలేదు. ఈ అంగడివానివలన భాగవత తదీయారాధన జరిగెనను ఉపకార స్మృతితో వెళ్ళెను. ఆమె లోనికి వెళ్ళి వానికి తీర్థ ప్రసాదముల నీయగా వాడు వానిని స్వీకరించెను. తోడనే సూర్యోదయముతో చీకటివలె, వాని రజస్తమో గుణములు పటాపంచలైనవి. వివేకోదయమైనది. వాడు తన దుర్మార్గమును తలచి కన్నీరు కారగా, తత్క్షణము తన పైవస్త్రమును నడుమున జుట్టుకొని ఆమెకు నమస్కరించి "అమ్మా! నీవు నా తల్లివి. నీ భర్త నాకు తండ్రి. నేను నీ విషయమున చెడుతలపు కలిగియుంటిని. బుద్ధిచెడి మన్మథ వికారమునకు లోనైతిని. నీ చేతి శ్రీపాదతీర్థము నా సకల పాపములను పారద్రోలినది. నన్ను మన్నింపు"మని ప్రార్థించెను. గుర్వారాధనము, మాటతప్పకుండుట, అంగడివాని పరివర్తన ఆమెకు ఆనందము కలిగించెను.

"ఓయీ! నీకు నేనేమి ప్రత్యుపకారము చేయుదును?"

"తల్లీ! ఏ పెద్దల పాదతీర్థముచే నాకు జ్ఞానోదయమైనదో, ఆ పెద్దలకు నన్ను శిష్యుని చేయుము!"

ఆమె వానిని పిలచుకొనిపోయి యతిరాజులకు చూపినది.

"ఓయీ! నీ విచ్చిన పదార్థములు వీరి ఆరాధన కుపయోగించితిని, వీరిని సేవింపుము."

వాడు యతిరాజులకు నమస్కరించి వైష్ణవు డయ్యెను.

"తుదకిట్లు జరిగి మీ దంపతులు కృతార్థులగుదురనియు, ఈ ధనికు డిట్లు పరివర్తన పొందుననియు ఉపేక్షించితి"నని యతిరాజు లనిరి.

రామానుజులు తన యింటికి వత్తురని, వరదాచార్యుడు వీరి నేమి ఆరాధించ గలడని యజ్ఞేశు డెదురుచూచుచుండెను. ఇంట అన్ని పదార్థములు సమృద్ధిగ నుంచెను. బంధువుల పిలచెను. ఇంటిని అలంకరించెను. తామర సూర్యునికి వలె ఎదురుచూచెను. మూడు దినములైనది. వారు రాలేదు. "నేనో గ్రామమున సంపన్నుడను. గురువులు నా యింటికి రాకున్న నా కెంత అప్రతిష్ఠ!" అని తలచి తానే వెళ్ళి యతిరాజుల సేవించి "స్వామీ! మా యింటికి రాకున్నా రేమి? మీరు వత్తురని ఎదురుచూచుచుంటిని. సకల సంబారములు సిద్ధపరచి యున్నాను. శిష్యులతో దయచేయుడు" అని పిలచెను. యతిరాజు లంత "సంబారములు, సత్కారములు – వీనికంటె భక్తి –ప్రపత్తి మిన్నయైనవి. గురునిష్ఠ సత్కర్మాచరణము హెచ్చైనవి" అనిరి. యజ్ఞేశుడు "అయ్యా! నేను దానధర్మములు చేయుచున్నాను. మీయందెంతో ప్రపత్తి కలవాడను. ఇవి ఈ గ్రామమున నెల్లరకు తెలియునే!" అనెను. లక్ష్మణులు "నీవన్నియు చేయుచున్నావు. ధనము వ్యయించు చున్నావు. గీతాచార్యు లన్నట్లు దంభార్థముగా కాక సాత్త్వికదానము చేయవలెను కదా! నీవును శిష్యుడవే. ఐనను రాజాలను" అనిరి. వానిలో పరివర్తన తెచ్చుటకే వారు కఠినముగ పలికిరి.

# తిరుమల నివాసము

పయనమైపోయి మధ్య మధ్య దివ్యక్షేత్రములు దర్శించుచు రామానుజులు శిష్యులతో తిరుమల జేరవచ్చిరి. ఆ ప్రాంత ప్రభువగు విఠలదేవరాయలు యతిరాజ ప్రభావమును విని ఎదురువచ్చి శరణాగతి చేయగా, వానిని శిష్యునిగా చేసుకొని, తిరుమలకు పోయి కపిలతీర్థమున స్నానముచేసి కొండ దిగువనే నిలచిరి. "ఇంక పైకి ఈ కొండను త్రొక్కియేకదా, పోవలసినది! ఇదియో భగవత్స్వరూపము. కావున నిచటినుండియే నమస్కరించెదను" అనగా, అనంతాళ్వాన్ వారి యొద్దకు వచ్చి "మీరే యీ కొండ త్రొక్కని యెడల మీ శిష్యులమైన మేము మాత్రము త్రొక్కుదుమా! మేమును కొండనెక్కము. మనమే కాదు, ప్రజానీకమును అట్లే తలచును. స్వామికి ఆరాధనయే నిలచును" అనిరి. యతిరాజులు బాగుగ యోచించి "ఇది పరమ ధర్మపరులేకాక, కైంకర్యపరుల అభిప్రాయమును. కావున దీనిని శాసనముగానే పరిగణింపవలె"నని తలచి స్వామిని ధ్యానించి మొదటి మెట్టున కాలుంచిరి.

వీరి రాక నెరిగిన తిరుమలనంబి మర్యాదార్థము తీర్థప్రసాదములతో రామానుజులకు ఎదురేగిరి.

"స్వామీ! నన్ను గౌరవింప మీరు వచ్చుటయా? ప్రసాదమెవరైన పిన్నవారిచే పంపవచ్చును. ఇది యుక్తముగలేదు. ఎవరైన దొరుకలేదా?"

"దొరుకలేదు. నాల్గు వీథులలోను నాకంటె హీనుడు, అధముడు, సర్వవిధముల పిన్న లభించలేదు."

"ఆహా! వీరిది ఎంత మనఃపరిపాకము! వీ రెంత నైచ్యానుసంధాని! నాకో మామ, పూజ్యులుగా నుండియు నిట్లనుచున్నారు. మానవుడన్న నిట్లుండవలెను కదా!" అని తలచి యతిరాజులు తీర్థప్రసాదములు స్వీకరించి అచటి విశేషములు

చూచుచు కొండనెక్కి వేంకటేశ్వరుని దర్శించిరి. "ఈ కొండ వైకుంఠముగను, ఇచటి వృక్షములు, లతలు, పక్షులు నిత్యశూరులుగాను గోచరించుచున్నారు" అని తలచి కొండ దిగి వెళ్ళదలచిరి. అంత "యతిరాజా! ఇది గొప్ప దివ్యక్షేత్రము. ఇట్టి పుణ్యక్షేత్ర దర్శనమునకు పోయిన యెడల మూడుదినము లచట నుండవలెను" అని శ్రీశైలపూర్ణులనిరి. రామానుజులు స్వామి దర్శనము చేయుచు త్రిరాత్ర మచట నుండి, పిమ్మట శ్రీశైలపూర్ణులతో సహా కొండదిగి వారియింట నివసించుచు వారివద్ద శ్రీమద్రామాయణమును ఒక సంవత్సరకాలము కాలక్షేపము వినిరి. సర్వజ్ఞులగు వా రొక సంవత్సరకాలము వినిరనగా, శ్రీమద్రామాయణ మాహాత్మ్యము, ఔన్నత్యము వెల్లడి యగుచున్నవి కదా!

## దానగ్రహణము

ఆ కాలముననే గోవిందభట్టరు అచట ఉండి తిరుమలనంబికి శుశ్రూష చేయుచుండిరి. ఒకనాడు భట్టరు నంబికి శయనించుటకు ప్రక్కవేసి దానిపై తాను పరుండి లేచెను. తరువాత దానిపైనే నంబి శయనించుటను రామానుజులు చూచి 'స్పృశించి కండ్లకద్దుకొనవలసిన గురుతల్పమున వీడు పరుండెనే!' యని చింతించి నంబితో నా విషయమును తెలిపిరి. వారు కోపించిరి – "గోవిందా! అట్లు చేసితివా?"

"ఔను, అది యథార్థమే."

"గురుతల్పమును శయనించు ఫలమెరుగుదువా?"

"ఎరుగుదును. దానిని ఫలము నరకము."

"మరి ఎందులకు అట్లు చేసితివి?"

"పడకలో మిట్టపల్లము లుండును. దుమ్ముపడి ఉండవచ్చును. నాకు నరకమైన అగుగాక! మీరు సుఖముగ నిద్రించిన చాలును."

శ్రీశైలపూర్ణులకు సంతోషమైనది. రామానుజులు ఆనందించిరి – "ఆహా! వీనికి కలిగినంత మనఃపరిపాకము నాకు కలుగలేదు. ఐనను వీడు నా తమ్ముడు. గురుభక్తి కలవాడు. జ్ఞాని అని పదుగురిచే పొగడ్తలు పొందవలెనని గాక నిజమైన భక్తిచేతనే చేయుచుండునేమో! ఇంకను పరీక్షింపవలెను" అని తలచిరి. గోవిందభట్టరు స్నానమునకు వెళ్ళు దారిలో నొక సర్పము పడియుండెను. అది ఆహారార్థము పొదలలోనికి వెళ్ళి నోరుతెరువగా నాలుకపై నొక ముల్లు గ్రుచ్చుకొనెను. అది నాలుకను లోనికి ముడుచుకొనలేక శ్రమపడుచుండుట భట్టరు చూచి దాని నాలుకపై గ్రుచ్చుకొని యుండిన కంటకమును తొలగించి, రక్తము తుడిచి దానిని పుట్టయొద్ద విడిచెను. దానిని యతిరాజులు చూచి వెళ్ళి గోవిందభట్టరు తిరిగి వచ్చిన తరువాత "గోవిందా! ఇంతసే పేమి చేసితివి?" అని అడిగిరి. భట్టరు జరిగినది చెప్పగా యతిరాజులు "పరమదుష్టప్రాణి పరితాపమును చూడజాలకపోయెనే! ఓహో, వీని మనఃపరిపాకము!" అని తలచిరి.

రామాయణ కాలక్షేపము పూర్తియైనది. రామానుజులు ఇంత ఏకాగ్రతతో విన్నందున శ్రీశైలపూర్ణులు తృప్తిపడిరి. "యతిరాజా! రామాయణము వింటివి. స్వామిని సేవించితివి. నాకు మిగుల సంతోషమాయెను. నీకేమి కావలెనో కోరుము. ఇచ్చెద"ననిరి లక్ష్మణులు. గోవిందభట్టరు ఆచార్య భక్తి చూచియుండి నందున తమతో కొనిపోదలచి "వాస్తవముగా నేనడిగినది మీకీయవలెనని యుండిన గోవిందభట్టరు నీయు"డనిరి. నంబియు గోవిందభట్టరును కృతార్థుని చేయుట కీయన పిలచుచున్నాడని తలచి, భట్టరచట బహుదినములుగా నున్నందున మరల తిరిగి రాగలడని సంశయపడి, వానిని ఉదకధారా పూర్వకముగా యతిరాజుల కర్పించిరి. అంతేకాక తమ ఇరువురు పుత్రులు, రామానుజులు మహాజ్ఞాతయైనందున వారివలన తరింతురని తలచి యతిరాజుల వెంట పంపిరి. వారును రామానుజుల నాశ్రయించి సకలార్థములు గ్రహించిరి.

భట్టరు శ్రీశైలపూర్ణులయెడ మిగుల భక్తికలిగి యున్నందుననే, నరకమైనను, తాను భరించి గురునకు సౌఖ్యమార్గము చూచిరి. అట్టి గురువును వదలుట, వారి పాదసేవ లేకుండుట భట్టరుకు దుఃఖకారణము లైనవి. కాలుచేతులాడక పోయెను. ముఖమున కళ తప్పెను. రామానుజు లది చూచి, అతడు దాక్షిణ్యము చేత నచ్చినాడని తలచి "గోవిందా! నీవు గురువును వదలి చిక్కిపోవు చున్నట్లున్నది. వెళ్ళి వారిని సేవించిరమ్ము" అనిరి. భట్టరు సంతోషముతో తిరిగి వెళ్ళి తిరుమలనంబి వాకిట నిలచిరి. అచటి వారా వార్తను నంబికి చెప్పగా వారు "ఉదకధారాపూర్వకముగా యతిరాజులకు దానమిచ్చితిని కదా! తిరిగి ఎందుకు వచ్చినాడు? వాడు పరమభ్రాంతుడు, పొమ్మనుడు" అనిరి. తిరుమలనంబి భార్యకు జాలికలిగి, భర్తయొద్దకేగి "అయ్యో! వాకిటినుండి అటులనే పంపివేయవలెనా? లోనికి పిలచి, భుజింపుమని, మంచిమాటలు చెప్పి పంపరాదా?" అనగా, నంబి "గోవు మనదైనపుడు కసవిచ్చి కాపాడుదుము. అమ్మిన తరువాత అది తిరిగి వచ్చి గడ్డిలో మూతిపెట్టిన రోకలినెత్తి కొట్టుదుమే కాని కసవు మేపుదుమా? అట్లే వానికిని మనకును సంబంధము వదలినది. వాడు యతిరాజుల సొత్తయ్యెను. తిరిగి వచ్చిన చేరనీయరాదు" అని "వానిని పొమ్మనుడు" అని శిష్యులతో చెప్పిరి. యతిరాజులే శరణమని వానికి తోచవలెనని వారు అభిలషించిరి.

ఆ సంగతి వినిన గోవిందభట్టరు "మామ పూర్తిగా వదలిపెట్టెను. ఇక యతిరాజులే దిక్కు" అని నిశ్చయించుకొని గురుమందిరమునకు మ్రొక్కి తిరుమల విడచి యతిరాజుల యొద్దకు తిరిగి వచ్చిరి. "గోవిందా! చూచి వచ్చితివా!" అని యతిరాజులు అడుగగా "'అమ్మిన గోవుకు కసువు వేయుదుమా?' యని వారనిరి. ఇక మీరే శరణము" అని రామానుజుల పాదములపై పడిరి. యతిరాజులు వారి నాదరించి, స్వామిని ధ్యానించిరి.

# చీకటి ఎక్కడ!

గోవిందభట్టరు భార్య రజస్వలయైనదనియు, నిషేకము చేసుకొనుమనియు వారితల్లి వచ్చి చెప్పెను. భట్టరు రామానుజుని విడచి ఒక క్షణమైన ఉండనని చెప్పినందున నామె పుత్రుని బంపుమని యతిరాజుల నడిగెను. వారు భట్టరుతో "విషయసుఖానుభవము చీకటియందే జరుగవలెనని విధింపబడి యున్నది. దైవము సన్నిధానవర్తియై యున్నందున వెలుతురులో ననుభవింపరా"దని చెప్పి పంపిరి. ముహూర్తమై రెండు నెలలు గడచెను. భట్టరు భార్యను స్పృశింపలేదు. వారా సంగతి యతిరాజులకు చెప్పిరి. "ఏమిరా! గోవిందా!" అని వారనగా, భట్టరు "స్వామీ! చీకటిని చూచి అనుభవించుమంటిరి. అది నాకు అగుపడలేదు."

"దీపము నార్పిన చీకటిరాదా?"

"తాము నాకుపదేశించిన రీతిగా భగవంతుని ధ్యానించుచున్నాను. ఆయన ముప్పదిమూడు కోట్ల దేవతలతో, కోటిసూర్యు లుదయించినట్లు వెలుగుచున్నాడు. ఇక చీకటి ఎక్కడ!"

"సర్వాంతర్యామిని అనంతుని ఎట్లు తీసివేయుదును!"

"నాకు చీకటిలేదు. ఇక గృహస్థాశ్రమమున నుండుట ఎట్లు? ఇది పొసగనిది, కాన నాకు సన్న్యాస మిప్పింపుడు."

ఇట్లు పలుమారు ప్రార్థింపగా యతిరాజులు భట్టరుకు సన్న్యాసమిచ్చి, పునర్జన్మమైనందున "మన్నాథ ఎంబెరుమానార్" అను పేరు పెట్టిరి. ఎంబెరుమానారా! అని పిలచిరి. తనయందు సంతోషించి తనను ఎంబెరుమానార్ అని పిలచిన తిరుక్కొట్యూర్నంబికి వలె తాము భట్టరు విషయమున ఆనందపడి "ఎంబెరుమానారా!" అని పిలచిరి. అంత భట్టరు "స్వామీ! మీ పేరు నేను భరింపలేను. వేరు పేరు పెట్టు"డని కోరగా పెట్టిన

పేరు తీయుట సరికాదని, "ఎంబార్" అని పిలచిరి. లోకమున భోగహీనత నందియో, ఎల్లరు సేవింపవచ్చెదరనియో, భార్యతో జగడమాడియో, బిడ్డలు నిరాదరించిరనియో, సన్యసించినవాడు భగవద్గీతలో చెప్పినట్లు భయభ్రష్టు డగును. గోవిందభట్ట రట్లుగాక భక్తి జ్ఞాన వైరాగ్యముల ద్వారా అందుకు అర్హతతో సన్న్యాసము పొందిరి. దానిని ప్రసాదించినవారో! యతిసార్వభౌములు కదా!

## మఠత్యాగము

రామానుజుల ప్రభ లోకమున అంతకంతకు వ్యాపింపగా దానిచే ఆకృష్టులై నిత్యము ప్రజలు శ్రీరంగము వచ్చుచుండిరి. ఒకనా డట్లు వచ్చు కొందరు "ఎంబెరుమానార్ మఠమెచట?" అని వీథిన పోవువారి నడుగగా, వారు "ఏ ఎంబెరుమానార్?" అనిరి. ఆ వచ్చిన వా రాశ్చర్యపడి "ఆ పేరు కలవారు ఇంకను ఉన్నారా? మేమొక్కరినే ఎరుగుదుము. రామానుజాచార్యులనియు పిలువబడు ఎంబెరుమానార్ను మేమడిగితి"మనిరి. "అదిగో ఆ వీథి చివర" అని వీథి వారు మఠమును చూపిరి. "ఆ పేరుకల మరియొకరెవరు?" అని వారడుగగా "అరుళాళప్పెరుమాళ్ ఎంబెరుమానార్ అని మరియొకరున్నా"రని వీథివారనిరి. వారు రామానుజులను దర్శించిరి.

ఈ సంగతి అరుళాళప్పెరుమాళ్ ఎంబెరుమానార్కు తెలిసి "ఎంత అపరాధము కలిగినది! ఆత్మస్వరూప నాశనమగునే! ప్రజలు సూటిగా ఎంబెరుమాననార్ల సన్నిధికి పోవుటకు ఆటంకమగుచున్నది" అని చింతించి, తన మఠము పడగొట్టించి రామానుజుల మఠమునకు వచ్చి నమస్కరింపగా వారు "ఏమి సంగతి?" యని అడిగిరి. ఆయన ఇట్లనెను – "ఈ జీవుడు ఎనుబదినాలుగు కోట్ల జీవరాసులలో బుట్టి – అందందు మాతృస్తన్యపానము

చేసి – జనన మరణములొంది – నరకయాతనలనుభవించి – చివరకు నరజన్మ నెత్తినాడు. ఈ జన్మమైనను సార్థకము కావలదా? జీవుడును – సర్వేశ్వరుడు నొకటే యను మతమున జన్మించితిని. అధమయోనులనుండి ఉత్తమజన్మకు వలె తమచేత వాదమున నోడి కృతకృత్యుడనైతిని. తమ కటాక్ష వీక్షణము సోకినది. మరల పతనమా! ఎంత అపరాధ మేర్పడినది! నేను తమ ప్రతినిధిగా నున్నట్లు ప్రజలకు అర్థమగుచున్నది. కనుక నాకు ప్రత్యేకము మఠమక్కరలేదని నేనున్నదానిని పడగొట్టించితిని. ఇప్పుడు భక్తులు మీ యొద్దకే తిన్నగా రాగలరు. నేనిచట మీ అందరు శిష్యుల క్రింద అధమాధముడనై కైంకర్యము చేయగోరు చున్నాను" అని చెప్పగా యతిరాజులు సమ్మతించిరి. అనేక వృక్షములలో కల్పవృక్షమువలె పూర్వపు యజ్ఞమూర్తి అచటి శిష్యకోటిలో శ్రేష్ఠులై కైంకర్యము చేయుచుండిరి.

## యామునుల మొదటి కోర్కె తీర్చుట

యామునాచార్యుల మనోరథము తీర్చిన బాగుండునని కూరత్తాళ్వాన్ మొదలగు శిష్యులు యతిరాజులతో చెప్పుచుండిరి. బ్రహ్మసూత్రములకు భాష్యము వ్రాయవలెనన్న బోధాయనవృత్తి యను గ్రంథమును సంప్రదించుట ఆవశ్యకమై యుండెను. అట్టి వ్యాఖ్యానము లుపేక్షింపరానివి. ఏ విషయమునకైన దాని కుపకరించు గ్రంథపరిశీలన చేసి విశేషములు గ్రహించు పద్ధతికి యామునులే దారి చూపియుండిరి. బోధాయనవృత్తి కాశ్మీరమందలి శారదా పీఠమున నుండుట తెలుసుకొని ప్రధాన శిష్యులతో అచటికి బయలుదేరిరి. మార్గమున అన్యసిద్ధాంత ఖండనచేసి స్వమత స్థాపన చేయుచుపోయి శారదాపీఠమున నుండిన పండితులను వాదసంగ్రామమున పరాజితులను చేయగనే శారదాదేవి

సంతోషించి స్వయముగా వచ్చి పీఠము నుండి బోధాయనవృత్తిని యతిరాజుల కొసగెను.

వా రా గ్రంథమును గ్రహించి కూరేశుల చేతికిచ్చిరి. కొన్ని నాళ్ళచట గడపి తిరుగ ప్రయాణమైరి. పీఠము నాశ్రయించి యుండిన పండితులు ఆగ్రహించి యున్నందున దురాలోచన చేసిరి. మనకు తెలియని సంగతులు వారికి తెలిసినవి, భగవతి అనుగ్రహము వారికి కలదని ఎంచక, రామానుజుల తుదముట్టించి, గ్రంథమును తీసుకొని పోదలచినను; పరివారయుతులగు యతిరాజులందు మొదటిది సాధ్యముకాక, గ్రంథమును సంగ్రహించుకొని పోయిరి. ఉదయము చూడగా గ్రంథము కన్పించలేదు. "శ్రీరంగము వెళ్ళిన తరువాత పరిశీలింతమని తలచితిని. ఇంతలో గ్రంథము పోయినది. ఏమి చేయుట? అసూయచే కొనిపోయినవారు తిరిగి ఇత్తురా? ఇక మనకు లభించుటెట్లు?" అని యతిరాజులు చింతాక్రాంతులైరి. "స్వామీ! మీరు గ్రంథమును నాయొద్ద ఉంచుమని యిచ్చిరికదా! దానియందేమియున్నదోయను కుతూహలముతో పరిశీలించితిని. జ్ఞాపకమున్నది వివరింతును. కటాక్షింపుడు" అని కూరత్తాళ్వాన్ అనిరి. ఇట్లనుట అపచారమగునేమోయని తలచినవారై "తమ కటాక్షముచేత" అనిరి. యతిరాజులు పరమానందము నొంది 'ఏదీ చెప్పు' మనగా కూరత్తాళ్వాన్ గ్రంథము కడవరకు నొప్పగించిరి. యతిరాజులు వినిరి.

పిమ్మట బ్రహ్మసూత్రములకు భాష్యరచన ప్రారంభమాయెను. యతిరాజులు చెప్పుచుండ కూరత్తాళ్వాన్ వ్రాయుచుండిరి. "నీవు వ్రాయునప్పుడేమైన సందేహము కలిగినచో చెప్పుము. అంతేగాని అట్లే వ్రాయకు"మని యతిరాజులనిరి. రచన సాగుచుండెను. రామానుజు లొకచోట తప్పు చెప్పిరి.

"అర్థము పొసగలేదు" అని కూరేశులు వ్రాయుట ఆపిరి. "కొన్ని విషయములలో నిన్ను మెచ్చుకొనగా గర్వపడి ప్రసంగింతువా? కానిమ్ము, వ్రాయు"మని యతిరాజు లన్నను "నాకు అట్టి ఆజ్ఞ లేదు" అని కూరేశులు అనిరి. "లట్లైన క్రిందబెట్టు"మని రామానుజు లనినంత కూరత్తాళ్వాన్ గ్రంథమును క్రిందనుంచి వెడలిపోయిరి. తరువాత రామానుజులు గ్రంథమెత్తి పరిశీలింపగా తప్పుగా తానే చెప్పినట్లు తోచినది. "పరబ్రహ్మమును తెలియుననువాడు తెలియనివాడే. తెలియదనువాడే తెలిసినవాడు. ఇది వేదవాక్కు. పరబ్రహ్మమెక్కడ! నేనెక్కడ! నారదాదులకును అందలేదు" అని తలచిరి.

ఒక పండితుడు, రాజసన్మానము నందగోరి, రాజు భాగవతమనిన చెవి కోసుకొనువాడని విని, తాను భాగవతము చెప్పుదునని వచ్చెనట. రాజు తన కప్పుడు విన తీరికలేదని చెప్పుచు, పండితునకు భోజన వసతుల నిచ్చుచు కాలహరణము చేసెనట. పండితు డెప్పుడు చెప్పుటకు వచ్చినను రాజు సమయము లేదనియే చెప్పుచుండినందున రాజేమి యడుగునో యని పండితుడు భాగవతము సవివరముగ చదువసాగెను. పండితు డట్లు చదివి చదివి, ఒకనాడు ప్రభువుతో, భాగవతార్థము గ్రహించుటకు శుకమహర్షియే సరియగువా డనెను. భాగవతము గురించి పండితున కిప్పుడు తెలిసినదని రాజునకు అవగతమైనది. రామానుజు లీ సంగతి తలచి కూరేశులను పిలచి ఆలింగనము చేసుకొని – మంచి మాటలు చెప్పి "ఇట్టి బుద్ధిమంతుని అధిక ప్రసంగి యంటినే! అపచారమైనది" అనుకొనుచు "కూరేశా! ఇప్పుడు వ్రాయుము. సవరించు కొంటిని" అనినంత వారును గ్రంథమెత్తి వ్రాయ సిద్ధమైరి.

యతిరాజు లట్లు స్వమతమును స్థాపించుచు, చేతనోద్ధరణకై శ్రీభాష్యము రచించి భూమండలమున నిలపిరి. యామునుల మూడు అభిప్రాయములలో నొకటి నెరవేరెనని వ్రాసియుంచు డనిరి.

# స్వామికి మంత్రోపదేశము

యతిరాజులకు మరల దేశసంచారాభిలాష కలిగి, శ్రీరంగనాథుని యొద్ద అనుమతి పొంది బయలుదేరి, చోళపాండ్యదేశముల సంచరించుచు దివ్య దేశములు దర్శించుచు, ఎదిరించినవారిని వాదమున నోడించి స్వమత స్థాపన చేయుచు పోయి, తిరుక్కురుంగుడిచేరి, అచట చేరినవారికి [1]కాలక్షేపము చెప్పుచుండిరి. అప్పు డొక వైష్ణవుడు వచ్చి నమస్కరించి మంత్రోపదేశము చేయుడని కోరెను. లక్ష్మణులు వానిని సమీపమునకు పిలచి స్వహస్తములతో పుండ్రధారణ చేసి మంత్రము తరువాత ఉపదేశింతుననిరి. పిమ్మట యతిరాజులు స్వామి సన్నిధికి పోగా, తాను పెట్టిన పుండ్రము స్వామి నుదుట నుండెను. వారు, స్వామియే తమ వద్దకు వచ్చెనని గ్రహించి, శరణాగతి గద్యను రచించి, దానిచే స్వామిని స్తుతించిరి. అంత స్వామియే దిగివచ్చి, యతిరాజుల కాసనమిచ్చిరి. వారు 'వలదు, వల'దనుచున్నను స్వామి అంగీకరించలేదు.

"నేను మత్స్య కూర్మాది అవతారములెత్తితిని. వేదోద్ధరణ చేసితిని. దుష్టశిక్షణ, శిష్టపరిపాలన చేసితిని. కాని నీవలె వేదార్థ వివరణ చేయలేదు. ఆహా! ఏమి అర్థములు చెప్పితివి!"

"స్వామీ! నీ పేరు చెప్పి – అష్టాక్షరీ మంత్రభావము చేతనే నేనట్లు చేయగలిగితిని."

"ఎల్లరకు నుపదేశించినట్లే నాకును మంత్రోపదేశము చేయుము."

స్వామి తనను ఆసనమున కూర్చుండబెట్టగా, యతిరాజులు – యామునుల స్మరించి వారే తన కుమారు పీఠమున గూర్చుండినట్లు తలచి, శిష్యుడుగా

1. ప్రవచనము

వచ్చినవానికి తానెట్లు మంత్రోపదేశము చేయునో, అట్లే స్వామికి మంత్రము నుపదేశించిరి – 'వైష్ణవనంబి'యని నామధేయముంచగా స్వామి రామానుజులను బ్రహ్మరథమున గూర్చుండబెట్టి యూరేగించిరి.

## శ్రీభాష్యకారులు

యతిరాజులు సమస్త భారతమున దిగ్విజయము చేయుచు మరల శారదా పీఠమునకు వెళ్ళిరి. ఆలయమున వారు ప్రవచనము చేయుచుండగా, సరస్వతీ దేవి విగ్రహమునుండి స్వయముగ దిగి సన్నిధి తలుపులు తెరచుకొని వచ్చి, యతిరాజా! 'కప్యాసమ్ – పుండరీకమ్' అను శ్రుతి వాక్యములకు అర్థము వివరింపుమని యడిగెను. యతిరాజు లా వాక్యార్థము పూర్వము వారు యాదవ ప్రకాశుల యొద్ద వివరించినట్లే తెలిపిరి. అంత శారద "పూర్వము దీనికి అపార్థము చెప్పబడియున్నందున ఇప్పటివరకు నేను చింతించుచునేయున్నాను. నీ వ్యాఖ్య నా చింత దీర్చినది. బ్రహ్మసూత్రముల కిట్లు సముచితవ్యాఖ్య చేయరాదా!" యనగా, రామానుజులు "అమ్మా, ఇదిగో అట్లే చేసియుంటిని" అనగానే, నామె యా గ్రంథము దెప్పించుకొని శిరసున నుంచుకొని "ఇది శ్రీభాష్యము. నీవు శ్రీభాష్యకారుడవు. నా శోకము దూరము చేసినందున నీవు భారతీశోకనాశనుడని కీర్తిగాంతువు" అని ఒక హయగ్రీవ విగ్రహము నిచ్చి "భాష్యకారా! దీని నారాధించుచుండుము!" అని చెప్పి అంతర్ధానమైనది. అది మొదలు వారా విగ్రహమును ఆరాధించుచుండిరి.

వారా తావు వదలగనే, అసూయాపరులగు నచటి పండితులు, యతిరాజులు అంధులు కావలెనని కాంక్షించుచు, అభిచారికా హోమము చేసిరి. కుండము నుండి 'కృత్తి' యను దుష్టశక్తి ఆవిర్భవించి, ఆర్భాటముగా యతిరాజుల పైకి

రాసాగినది. వారు నిశ్చింతులై మంత్రరత్నమగు తిరుమంత్రము జపించిరి. స్వామి కృష్ణావతారమున ద్వారకలో నుండునపుడు కాశీరాజిట్లే హోమము చేసి కృత్తిని స్వామిపై ప్రయోగించెను. స్వామి చలింపక చక్రమును పంపిరి. దానిని చూచి కృత్తి పరుగెత్తిపోయి తనను ప్రయోగించిన వానినే సంహరించినది. యతిరాజుల జూచి అవ్యాహతమగు తిరుమంత్ర ప్రభావమునకు జంకిన కృత్తిని వారట్లే త్రిప్పిపంపిరి. కరుణాళువులైన రామానుజులు దానిని ప్రయోగించిన వారిని చంపవలదని శాసించిరి.

కృత్తిని ప్రయోగించిన పండితులకు పిచ్చిపట్టి, వారు పలుకరాని పలుకుల పలుకుచు, భక్షింపరానివి భక్షించుచు, ధరించవలసినవి విసర్జించుచు భ్రష్టులై సంచరించుచుండిరి. అచట పరిపాలన చేయు ప్రభువుకు చింతకలిగి, విషయము సర్వము తెలుసుకొని, యతిరాజుల పాదములపై బడెను. యతిరాజులు దయాళువు, అసూయ లేనివారును అగుటచేత, “వారు స్వస్థులగుదురు. కాని బుద్ధి కలిగియుండుమని చెప్పు”మనిరి. విద్వాంసులు స్వస్థులై, మంచి వస్త్రములు ధరించి తమ ప్రభువుతో కలసివచ్చి యతిరాజుల దర్శించిరి. యతిరాజులు అట్లు గౌరవింపబడి పయనమై కాశీక్షేత్రము చేరి గంగాస్నానము చేసిరి. అచటి ప్రజలతో అనుగ్రహభాషణముచేసి, పూరీజగన్నాథమని ప్రసిద్ధి చెందిన పూరీ క్షేత్రము చేరి, జగన్నాథుని దర్శింపనేగిరి.

## జగన్నాథుని సందిగ్ధత

అచట జగన్నాథుని అర్చనలు పాంచరాత్రాగమమును అనుసరించి జరుగకుండుటను చూచి యతిరాజు లచటి అర్చకుల బిలచి “ఈ పూజా విధానము ఆగమానుసారముగా నుండలేదు. ఆగమ పద్ధతిని జరిగించు”దని చెప్పిరి. పరంపరాగతముగా వచ్చు పద్ధతి విడచుట సుకరమైయుండదు. క్రొత్త

పద్ధతి వారికి రుచింపలేదు – పట్టుపడలేదు. "ఆగమపద్ధతి లెస్సగా తెలిసినవారి నౌకరిని శ్రీరంగమునుండి పిలిచెద"మని రామానుజు లనిరి. దానితో అర్చకులు కలతనంది, స్వామి సన్నిధిలో ప్రాయోపవేశముచేసి "స్వామీ! మా గతి యేమి? ఇంతకాలమును మా యర్చనలను అంగీకరించుచునే యుంటివే! ఇప్పుడు మమ్ము అన్యాయము చేయుదువా? రామానుజులను ఇటనుండి పంపి మమ్ము కాపాడుము" అని మొరపెట్టుకొనిరి.

స్వామి శరణాగత శరణ్యుడు, ఆశ్రితవత్సలుడు, ఇంతకాలము నుండి తనను ఆరాధించు అర్చకులను విడువలేడు. సర్వము చక్కబరచుటకు తా బంపిన యతిరాజుల శాస్త్రపద్ధతిని, మంగళాశాసనమును కాదనలేడు. అర్చకుల ప్రాయోపవేశము సహింపలేడు. ఏమి చేయుట? – క్రొత్తవారికంటె, చిరకాల సమీపవర్తుల ఆక్రందన వినలేకపోయెను. ఇంటిపోరు భరింపరానిది. బ్రహ్మాదులే వేదప్రతిపాద్యుడగు జగన్నాథుని అర్చించుచున్నారు. తమకు తెలిసిన మార్గమున అర్చించు వారి పూజలు నిరాకరింపరాదు. రామానుజుని సమ్మతింపజేయ వచ్చును. దివ్యదేశము లనేకములందు రామానుజుడు చక్కచేయవచ్చును – అని తలచిన జగన్నాథస్వామి, స్వప్నమున సాక్షాత్కరించి "యతిరాజా! నీవు శాస్త్ర పద్ధతిని ప్రవర్తింపజేయ వాంఛించుచున్నావు. వీరేమో తమ మార్గమున నెంతో కాలము నుండి నన్నర్చించుచున్నారు. నేను అంగీకరించుచునే యున్నాను కదా! కాన నేను వానిని ఇష్టపడుచున్నాను. శాస్త్రమైనను, మరేమైనను – పరంపరగా వచ్చు ఇచటి విధానములను మార్చి వీరి వృత్తిని చెడగొట్టకు"మని చెప్పిరి. "యతిరాజులు వచ్చి వెళ్ళిరి. వారు దీనిని అంగీకరించి వెళ్ళిరి. ఇదిగో శాస్త్రపద్ధతి"యని ఇతరులు భావించు ప్రమాదమున్నందున దీనిని పరివర్తన చేయుటయే సమంజసము. స్వామి భక్తసులభుడు కావున అర్చకుల కాదనలేక అట్లు చెప్పె"నని యతిరాజులు తలచి, అచటి ప్రభువును పురజనులను

సమావేశపరచి సమ్మతింపజేసి నిష్ణాతుడగు అర్చకస్వామికై జాబు వ్రాసి శ్రీరంగము పంపిరి.

అంత జగన్నాథుడు "పూజ సరిగా నున్నను లేకున్నను ఇచటి అర్చకులకు భక్తిలోపము లేదు. నేను చెప్పినను రామానుజులు తన యత్నము మానలేదు. వీరి నిచటనే యుంచిన నా ఆర్తత్రాణ పరాయణతకు భంగమేర్పడు"నని తలచెను.

శ్రీరంగ సమీపమున నరసింహస్వామి దేవళమున నుండు అర్చకుడు పాండిత్యము లేనివాడు. 'వాసుదేవోఽ మరప్రభుః అనుచోట విభాగించి చెప్పి పూజ చేయుచుండెను. 'వాసుదేవాయనమః' 'మరప్రభవేనమః' అనుచుండెను. అమరప్రభువనుటయు తెలియలేదు. వానిపై అసూయగొనిన గొప్ప విద్వాంసు డొకడు ప్రభువుతో చెప్పెను. రా జా యర్చకుని తొలగించెను. అర్చకుడు భక్తిశ్రద్ధలు కలవాడు. బహుకుటుంబి. బుద్ధిపూర్వకముగ ఏ దోషము చేసినవాడు కాదు. అతడు స్వామిని వేడెను. స్వామి ప్రసన్నుడయ్యెను. "ఇతడు భక్తిశ్రద్ధలు కలవాడు. సకల చరాచర ప్రపంచమునకు నేను ప్రభువునైయుండ మర(చెట్లు) లకు మాత్రము కానా? అది సరియే"నని రాజునకు స్వప్నమున జెప్పెను. రా జా యర్చకునే మరల నియమించెను. అట్లే జగన్నాథుడా యర్చకుల పూజలనే యంగీకరించెను. యతిరాజులు నిద్రయందుండగా వారిని శిష్యసహితముగా తన యోగమాయాప్రభావమున శ్రీకూర్మమందలి సుధాకుండ సమీపమునకు చేర్చెను. మేల్కొనిన యతిరాజులు జగన్నాథునకు అచటి అర్చకుల పూజలే ప్రియములైనట్లు తలచిరి.

శైవులు శ్రీకూర్మమందు స్వామిని శివుడని తలచి కూర్మేశ్వరుడని పూజించు చుండిరి. విష్ణ్వాలయము లేనిచోట భుజింపరానందున యతిరాజు లుపవాసముండిరి. సామగ్రి లేనందున పుండ్రధారణ వీలుకాలేదు. అంత స్వామియే వటురూపమున వచ్చి సుధాకుండము వద్ద త్రవ్వి శ్వేతమృత్తికను,

శ్రీచూర్ణమును పైకెత్తి రామానుజుల కిచ్చి పుండ్రధారణ చేయించిరి. పాలు పండ్లు సమర్పించుచు స్వయముగా సేవజేసిరి. నాల్గుదినములు గడచెను. యతిరాజులకు స్వప్నమున స్వామి సాక్షాత్కారమాయెను – "నేను కూర్మనాథుడను, శంఖ చక్రాది చిహ్నాములతో నున్నాను – చూడు"మని చెప్పిరి.

యతిరాజు లచటి శైవులతో పందెమువేసిరి. విష్ణులాంఛనములను, శివలాంఛనములను గుడిలో బెట్టి ఆలయమునకు ఇరువైపుల వారి బీగములు వేసిరి. తెల్లవారుసరికి గుడిలోని దైవము వేనిని ధరించునో ఆ దేవతామూర్తిగా భావింప నిర్ణయమాయెను. "స్వామి దయామయుడు. సర్వము చక్కజేసి స్థిరపరుప నన్ను నియమించియు అర్చకుల మొరలకు జాలిపడినవాడు" అని తలచి యతిరాజులు దేవాలయము వెనుకవైపునుండి "స్వామీ! నీ యాదేశానుసారమే నే నీ కార్యము తలపెట్టితిని" అని ప్రార్థించిరి. కూర్మనాథులు రామానుజుల వైపు తిరిగిరి. (ఈనాటికి అట్లే సుధాకుండము వైపు ముఖమై యున్నారు.) తెల్లవారి బీగములు తీయుసరికి స్వామి విష్ణులాంఛనములతో పడమర ముఖమై దర్శనమిచ్చిరి. అంత అచట శైవులు పరాజితులై శ్రీశైలమునకు పోయిరి. క్షేత్రము విష్ణుక్షేత్రమైనది.

జగన్నాథుడు విష్ణువుగనే ఆరాధింపబడుచుండెను. కాని శ్రీకూర్మముననో అట్లుకాదు. కావున సంస్కరించి స్థిరపరుపవలసిన ఆవశ్యకత, ఎచట కలదో, అచటికే స్వామి రామానుజుని తెచ్చి వదలి తనమాట నిలుపుకొనెను.

## స్వామీ! నీవు విష్ణుడవు

రామానుజు లిట్లు దివ్యదేశములు సేవించుచుపోయి, మరల వేంకటాచలమునకు వచ్చిరి. పూర్వము అచట నుండిన తిరుమలనంబి

మొదలగువారి తరువాత నచటిస్వామి సుబ్రహ్మణ్యుడనియు, విష్ణువనియు; శైవ, వైష్ణవులకు వివాదము జరుగుచుండెను. యతిరాజులు ఇరుపక్షములను సమావేశపరచిరి. శివస్థలమనువారు శివలాంఛనములను, విష్ణుస్థల మనువారు విష్ణులాంఛనములను రాత్రి దేవళమున నుంచి అర్చనానంతరము తలుపులు మూసి, బీగములు వేసి ఎవరి బీగపు చెవిని వారివద్దనే ఉంచుకొనవలెను. ఉదయ మిరుపక్షముల సమక్షమున బీగములు తెరచుసరికి దైవ మే చిహ్నములు ధరించునో ఆ దేవతామూర్తిగా నంగీకరింప నిరుపక్షములు నంగీకరించెను. స్వామి విష్ణువనుట విదితమే. కాని ఇరుపక్షములవారు ప్రార్థించుచున్నారు. తమ తమ చిహ్నములే ధరింపగోరుచున్నారు. "స్వామి ఏమిచేయునో! ఆయన భక్తపరతంత్రుడు. అపారకరుణాంబుధి. 'అబ్బా! అమ్మా!' అని మొరవెట్టినంత కరగిపోవును. లేక ఎటుచేసినను మరొకరికి బాధ కలుగునని, ఏవియు ధరింపక యూరకుండిన నెట్లు?" అని తలచి భాష్యకారులు తన నిజరూపముదాల్చి సోమసూత్రమునుండి ఆలయ ప్రవేశము చేసి శంఖచక్రములనెత్తి స్వామికి ధరింపజేసి తిరిగివచ్చిరి.

ఉదయ మిరుపక్షములవారు తమ తమ బీగములుదీసి, తలుపులు తెరచిరి. స్వామి విష్ణులాంఛనములు ధరించియుండెను. యతిరాజు లంత "స్వామీ! నీవు విష్ణుడవు" అనిరి. స్వామి "రామానుజా! నీవు నాకు గురుడవు. స్వరూప ధారణ చేయించితి"వనిరి. యతిరాజులు స్వామి వక్షస్థలమున లక్ష్మి నుంచిరి. ఇట్లు వారు స్వామికి మామయు, గురువునైరి. వారిట్లు వేంకటేశ్వరుని తిరుగ విష్ణువునుచేసి తమ భూప్రదక్షిణ ముగించుకొని శ్రీరంగముచేరి శ్రీరంగనాథ దర్శనము చేసుకొని తమ మఠమున ప్రవేశించిరి.

# కూరత్తాళ్వాను

కాంచీపుర సమీపమున కూరగ్రామము కలదు. కూరత్తాళ్వాను ఆ గ్రామ నివాసిగా నుండెను. రామానుజుల శిష్యుడు. ఒకనాటి రాత్రి అర్ధరాత్రి వరకు అన్నదానము చేసి సంపన్నుడగు నాతని యింటి తలుపులు మూసిరి. ఆ నిశ్శబ్దమగు రాత్రియందా ధ్వని శ్రీ పెరుందేవి తాయారుకు వినబడెను. ఆమె "అదేమి శబ్ద"మని వరదరాజస్వామి నడిగెను. స్వామి అదియేమో చెప్పగా, నామె అట్టి నిరతాన్న ప్రదాతను చూడగోరెను. వరదులు తిరుక్కచ్చినంబిని పిలిచి పెరుందేవి కూరత్తాళ్వానును చూడగోరుచున్నదని చెప్పగా, నంబి పోయి, కూరత్తాళ్వానుకు సంగతి చెప్పి, రమ్మని పిలువగా "నే నధముడను, నన్ను చూడగోరిరా? తాము పెద్దలు, పిలచుచున్నారు. అయినను నేనల్పుడను. రాజాలను. స్వామి పెరుందేవితో [1]తిరువీథికి వేంచేయునప్పుడు దూరముననుండి దర్శించెదను" అనిరి. నంబి స్వామి చెంతకు వెళ్ళి "మిగుల భక్తి కలవాడు. వేదవేద్యుడగు స్వామిని దర్శించుటకు సిగ్గుపడుచున్నాడు" అని తెలిపిరి. పెరుందేవితాయారు సంతోషించెను.

కూరత్తాళ్వాను విరాగియై తన సర్వస్వమును దానము చేసి భార్య యగు ఆండాళ్ళమ్మతో బయలుదేరి తమ గురు నివాసము శ్రీరంగము వెళ్ళుచుండిరి. భర్త శరీర రక్షణ భార్య విధి. ఆండాళ్ళమ్మ ఒక స్వర్ణపాత్రను తనతో దాచి తెచ్చుచుండెను. అది దాహము తీసుకొనుట కుపయోగించును, లేక ఆపత్సమయమున విక్రయింపవచ్చునని తలచెను. రాత్రి పయనించుచుండగా నామెకు భయముగా నుండెను. ఆమె పలుమార్లు ఆ మార్గమున 'దొంగల భయమా?' అని యడుగుచుండెను. "నాకేమియు నట్లు తోచుటలేదు. నీచేత

---

1. ఊరేగింపు.

నేమైన నున్నదా? లేకున్న నీకు భయమెందుకు కలుగును?" అని కూరేవు లనగా, పతివ్రతయగు నామె నిజము చెప్పెను. 'దాని నిటుతె'మ్మని వారనిరి. భర్త, పాత్రను పదిలపరచుటకు అడుగుచుండెనని తలచి దానిని వారిచేత బెట్టినది. కూరత్తాళ్వాను దానిని దూరముగా విసరివేసి 'ఇక నీకు భయముండదు' అని భార్యతో చెప్పిరి.

ధనముండునంతవరకు మదముండును. అది పోయిన, దానితో మదమును పోవును. కావున నదియు పోయినది. శ్రీరంగము చేరిన కూరత్తాళ్వాను ఉంఛవృత్తిచే జీవించుచు తమ గురువగు యతిరాజుల కైంకర్యము చేయుచుండిరి. ఒకనాడు పెద్ద వర్షము వచ్చెను. కూరత్తాళ్వాను ఉంఛవృత్తికి పోవ వీలుకాలేదు. ఆ దినము ఉపవాసమయ్యెను. ఆకలిచే వారు నిద్రింపక అటు నిటు దొరలుచుండిరి. "అయ్యో! సాధులైన వీరు నిరాహారులై యున్నారే!" అని ఆండాళ్ళమ్మ చింతించుచుండెను. గుడిలో గంటలు మ్రోగినవి. శ్రీరంగనాథునికి నైవేద్యము జరిగినది. గుడిగంటల మ్రోత వినిన ఆమెకు "శ్రీరంగనాథా! నీ భక్తుడు ఇచట ఉపవాసియై యుండ నీవు ఆరగించుచున్నావా!" అనిపించెను. ఆ రాత్రి ప్రసాదరాజమనబడు [1]అక్కారవడిసె స్వామికి నివేదనమైనది.

శ్రీరంగనాథులు ఉత్తమనంబితో "ఓయీ! నీవు మేళతాళములతో ప్రసాదము తీసుకొనిపోయి కూరత్తాళ్వాన్‌కు ఇచ్చిర''మ్మని ఆజ్ఞాపించిరి. నంబి, భగవదాజ్ఞానుసారము కూరత్తాళ్వాన్‌కు ప్రసాదమిచ్చిరి. వా రాశ్చర్యపడి నంబిని "సంగతి ఏమి?" అని అడుగగా నంబి "భగవత్సంకల్ప"మనిరి. కూరేశులు "ఆహా! స్వామి ఉత్తరువాయెనా? శ్రీరంగనాథుని అవ్యాజకృప. మీకు

---

1. నేతిలో మునిగిన చక్కెరపొంగలి.

శ్రమయైనది” అని ప్రసాదము గైకొనిరి. తాము భుజించి భార్యకిచ్చిరి. వారి ఆనందమునకు అవధిలేదు. అక్కారవడిసె దొరకెననియా? కాదు. భగవద్గీత యందు చెప్పినట్లు భక్తుల యోగక్షేమ చింత స్వామికే కదా! తాము పస్తుండగా, అధికారిని లేపి ప్రసాదము పంపిరి. తామింత కృపకు పాత్రులమా! అను తలపే వారికి సంభ్రమమును ఆనందమును కలిగించినది.

“నీవేమైన చెప్పి పంపితివా?”

“లేదు. మీతో జెప్పకుండ అట్లు చేయుదునా? నా మనసున ‘స్వామీ! నీ భక్తుడు నిరాహారియై యుండ నీవు ఆరగించుచుంటివా!’ యని అనుకొంటిని.”

“ఏలనే, స్వామికి అంతశ్రమ నిచ్చితివి? ఒకనాడు నిరాహారమైన నేమి.”

“శ్రీరంగనాథా! నేను నా భర్త శ్రేయము కోరుదానను. కావున అట్లనుకొంటిని. దానికి నీవింత చేసితివి. వీరో, కోపించుచున్నారు!”

“రంగనాథులు కూరత్తాళ్వానుకు స్వప్నమున సాక్షాత్కరించి “మీ దంపతులు ఉపవాసముండి నా ప్రసాదము స్వీకరింపవలెననియే మీ సంపాదనకు ఆటంకము కలిగించితిని. ఉపవాసముండి ప్రసాద స్వీకార ఫలితముగా దశరథుని భార్యకు పాయసము స్వీకరించినందునవలె మీకు ఇరువురు పుత్రరత్నములు జన్మింతురు” అని చెప్పిరి.

కూరేశులు మేల్కొని భార్యను లేపి “ఓసీ! నిన్ను కోపించితిని కదా! ఇప్పుడు స్వామి కలలో కన్పించి చెప్పగా తెలిసినది. స్వామి సంకల్పముచేతనే అట్లు జరిగెనట. అక్కారవడిసె ప్రభావమున మనకిరువురు పుత్రులు కలుగుదురట” అని చెప్పగా, నామెయు సంతోషించెను. ఆమె గర్భముదాల్చెను. శాలివాహన శకము 984వ సంవత్సరము – శోభకృతు వైశాఖ పూర్ణిమ – అనూరాధా నక్షత్రమునందు కుశలవులవలె నిరువురు పుత్రుల గనెను.

యతిరాజుల కీ సంగతి తెలిసి తమ అంతరంగ శిష్యులు ఎంబారుతో

వచ్చి బిడ్డలను తెమ్మని చెప్పగా ఎంబారు ద్వయ మంత్రానుసంధానము చేయుచు బిడ్డలను తెచ్చిరి. "ఇది ఏమిరా! బిడ్డలవద్ద ద్వయవాసన వచ్చుచున్నది. ఏమి చేసితి"వనగా "బిడ్డల దెచ్చుచు ద్వయమంత్రము అనుసంధించితి"ననిరి. "మీ నోటనే నామకరణము చేయు"డని కూరేశులు కోరగా, పరాశరుల పేరుగా పెద్దబిడ్డకు పరాశరభట్టరనియు, వ్యాసునిపేరుగా చిన్నబిడ్డకు [1]వ్యాసభట్టరనియు (చూచినవారు 'ఏమి అందము!' అని పొగడుటచే రాముడనియు) యతిరాజులు పేర్లు పెట్టిరి. యామునుల రెండవ యభిప్రాయము నెరవేరెనని వారు కూరత్తాళ్వారుతో చెప్పిరి.

గోవిందభట్టరు తమ్ముడు [2]బాలగోవిందన్ అనువారి కొక కుమారుడు కలుగగా యతిరాజు లా బిడ్డకు 'పరాంకుశనంబి' యని నమ్మాళ్వార్ల పేరుంచి, యామునుల మూడభిప్రాయములు నెరవేరెనని వ్రాసియుంచుమని కూరత్తాళ్వానుతో చెప్పిరి.

## రంగనాథపుత్రుడు

కూరత్తాళ్వాను పుత్రులలో నొకనికి పరాశరభట్టరని పేరు పెట్టిరి కదా! ఆ బిడ్డను రంగనాథులు తమ పుత్రునిగా స్వీకరించిరి. ఆలయ గర్భగృహములో నుండు స్తంభములకు బంగరు ఉయ్యల గట్టి అం దా బిడ్డనుంచి పాలుపోయు చుండిరి. రంగనాథుని ఆరగింపు కాగానే షడ్రసోపేతమైన అన్నము పెట్టుచుండిరి. బిడ్డకు నడువశక్తి రాగానే స్వామి ఆరగించకముందే తాను స్వయముగా ప్రసాదమున చేయి నుంచి ఎత్తుకొని భుజించెను. అర్చకు డా శేషమును స్వామికి నివేదించలేదు. ఇట్లు రెండుమార్లు వరుసగా జరిగినది.

---

1. శ్రీరామ దేశికన్
2. సిరియ గోవింద పెరుమాళ్.

అర్చకులా బిడ్డను స్వామి ఆరగింపు సమయమునకు ఆవలకు పంపిరి. అక్కారవడిసెయను ప్రసాదము రాజు చేయించు ప్రసాదమై యుండెను. బిడ్డను ఆవలకు పంపినందున తాను ప్రసాదము స్వీకరించలేదని, స్వామి రాజుతో స్వప్నమున జెప్పిరి. అంత "రేపటినుండి బిడ్డ ముందు భుజించిన పిమ్మటనే స్వామికి నివేదన కావలె"నని రాజును ఏర్పాటు చేసెను. పరాశరభట్టరు మాహాత్మ్యములలో నిది యొకటి. యతిరాజు లొకనాడు శ్లోకమొకటి వ్రాసికొని వచ్చి బిడ్డకీయగా ఆ బిడ్డ దానిని నిర్దుష్టముగా చదివెను. యతిరాజు లా సంగతిని ఎల్లరకు తెలిపి బిడ్డ పురోభివృద్ధికి రాబోవుచున్నాడని చెప్పిరి.

కూరత్తాళ్వా నొకనాడు కాలక్షేపము చెప్పుచు "అణోరణీయాన్ మహతో మహీయాన్" – అనగా 'స్వామి అణువుకు అణువు, మహత్తుకు మహత్తునై యున్న'దని చెప్పగా "ఇది యేమి? పరస్పర విరుద్ధముగా నున్నదే?" అని బిడ్డడు అడిగెను. "బిడ్డా! నీకు ఉపనయనము కాలేదు. ఈ సంగతులను వినకుము, చెప్పకు"మనగా "చెప్పనుగాని" అదెట్లు సంభవ"మని పరాశరభట్ట రడిగెను. "సిరియాచ్చాన్, పేరరుళాళప్పెరమాళెంబెరుమానార్' – శరీరతః అణుత్వమును, జ్ఞానతః మహత్వమును కలిగియుండగా, స్వామికి అణుత్వ మహత్వములుండవా? ఇక అడుగకు'మని కూరేశులనిరి.

ఒకనాడు సర్వజ్ఞ భట్టరను విద్వాంసుడు జయభేరి వేయించుకొనుచు వచ్చుచుండెను. భట్టరు వీథిలో ఆడుకొనుచు, 'నిలువుము, నిలువు'మని పల్లకిని పట్టుకొని ఆపి "సర్వజ్ఞభట్టరువా? నీకన్నియు తెలియునా?" అని అడిగెను. "ఆహా! తెలియకేమి?" అని ఆతడనినంతనే భట్టరు క్రిందనుండి పిడికెడు ఇసుక నెత్తి, అది ఎంత కలదో చెప్పుమనెను. అతడు యోచనలోపడెను. "ఓయీ! నీకు సర్వజ్ఞభట్టరను పేరెవరిచ్చిరి? చెప్పుటకు నీరునములుచున్నా"వని బాలు

డడిగెను. "బిడ్డా! ఎంత యున్నదని చెప్పదగునో నీవే చెప్పు"మని విద్వాంసుడనగా "ఒక పిడికెడు ఉన్నదనరాదా? ఈ మాత్రపు యుక్తి తెలియలేదా?" అని బాలుడనెను. సర్వజ్ఞభట్టరు మిగుల ఆనందించి "సర్వజ్ఞభట్టరును నేను కాదు బిడ్డా! నీవే" అని మెచ్చుకొని 'ఈ బిడ్డ బుద్ధిశాలియే కాదు, యుక్తిశాలియు'నని తలచి వాని నెత్తి ముద్దుపెట్టుకొని తన పల్లకిలో కూర్చుండబెట్టుకొని తన విడిదికి కొనిపోయి కూరత్తాళ్వాను పిలచి బిడ్డ నప్పగించెను. "ఈ బాలుడు పిడికెడు మన్నుతో నన్నోడించెను. వీనిని బయట విడువకుడు, దృష్టి తగులును" అని వానిని ఆశీర్వదించి పంపెను. "ఇచట బిడ్డడే ఇంత శక్తిసంపన్నుడే! ఇట నుండుట మంచిదికా"దని ఊరువిడచి పోయెను.

పరాశరభట్టరునకు ఉపనయనముచేసి వేదాధ్యయనమునకై గురువు నొద్దకు పంపిరి. రెండుదినము లట్లే పోయి తిరిగి వచ్చెను. 'ఏమిరా! వచ్చితి'వని కూరత్తాళ్వాను అడుగగా 'నిన్నటి పాఠమునే తిరిగి చెప్పుచున్నారు' అని భట్టరనెను. 'నిన్న చెప్పిన పాఠము వచ్చినదా? అటులైన తిరిగి చెప్పు'మనగా భట్టరు ఒప్పగించెను. కూరేశులాశ్చర్యపడిరి. భట్టరట్లు శ్రుతి, స్మృతి, శాస్త్రేతిహాసములు నేర్చిరి. శ్రీభాష్యము పఠించిరి. తిరువాయ్‌మొళి గానము చేయగలిగిరి. విష్ణుసహస్రనామములనెత్తి ప్రతి నామమును వ్యాఖ్యానించుచు గ్రంథరచన చేసిరి. భక్తిచే స్వామి విషయమున హద్దులు పాటించుచు మర్యాదగా నుండిరి. ఒకనాడు తెరమరుగున నుండిన స్వామి :

"మమ్ము జూచిన నేమని తోచుచున్నది?"

"లక్ష్మీనారాయణులవలె దోచుచున్నారు!"

"అట్లనకుము. తల్లిదండ్రులనుము. లేకున్న అందరితో మేమును సమమగుదుమే, నిన్ను మేము స్వీకరించిన దెందులకు?" అనిరి.

భట్టరునకు యౌవనము రాగానే కూరత్తాళ్వాను మహాపూర్ణుల వంశజులను "మా చిన్నవానికి మీ కన్య నిచ్చెదరా?" అని అడిగిరి. "కూరేశులు స్వామి యొక్కయు, రామానుజుల యొక్కయు అనుగ్రహ పాత్రులు. కాని దరిద్రుడు" అని రెండు విధములు తలపోసి వారు 'ఇచ్చెదము – ఈయము' అని చెప్ప ఆలోచనలో పడిరి. కూరేశులకు చింత కలిగెను. స్వామి స్వప్నమున కన్పించి "ఈ బిడ్డకు నీవా కర్తవు? నీవా పెండ్లి చేయబోవునది? నేనున్నాను. నీవు సుఖముగా పరుండుము" అని కూరత్తాళ్వానుతో చెప్పిరి.

కన్య తండ్రికి స్వామి స్వప్నమున కనుపించి "భట్టరు కూరత్తాళ్వాను బిడ్డ కాడు. వాడు నా బిడ్డ. మీ కన్య నిచ్చెదరా?" అని యడుగ, వారు "ఇచ్చెదము, ఇచ్చెదము" అనిరి. మరునాడే వివాహము జరిగెను. స్వామియే తలచిన కొదువయేమి!

రామానుజులు సన్యాసులు కదా! వారు సకల బంధువులను విడువవలెను కదా! కాని వారు తమ మేనల్లుడగు మొదలియాండానును మాత్రము విడువలేదు. "ఆండానును గాక తక్కినవారిని విడచితి ననిరి. "ఇట్లు చేయవచ్చునా?" అని శిష్యు లనుకొనుచుండుట యతిరాజుల చెవిన పడెను. యతిరాజులు ఇట్లనిరి. "తిరుక్కోట్యూర్‌నంబి మంత్రోపదేశ మిచ్చుటకై పిలచినపుడు దండపవిత్రములతో రమ్మనిరి. ఇతరులు ఉండరాదనిరి. నేను కూరత్తాళ్వానును, మొదలి యాండానును తోడుకొనిపోగా, వారు చూచి ఇదేమని యడిగిరి. నేను మీరు చెప్పినట్లే వచ్చితిని "వీరు నా దండపవిత్రము"లని చెప్పితిని. అందు కాయన సమ్మతించెను. సన్యాసి దండపవిత్రముల విడువరాదు కదా! మొదలియాండాను దండస్థానీయుడు. వానిని వదులరాదు." యతిరాజు లట్లు శిష్యులతో, గురువులతో, గురుస్థానీయులతో శ్రీరంగమున నుండిరి.

# నేత్రసౌందర్యము

శ్రీరంగము సమీపమున వరయూరున్నది. అచట చాణూరునివంటి మల్లుడొక డుండెను. వాని పేరు [1]విల్లిదాసు. వానికి [2]హేమాంబ యను స్త్రీ అభిమానపాత్రయై యుండెను. అతడు ఆమె యందు బద్ధానురాగి, సర్వదా ఆమె ముఖమునే చూచుచుండెను. శ్రీరంగమున ఉత్సవములు రాగా వానిని చూడగోరి హేమాంబ బయలుదేరెను. ఆమెను విడువలేక అతడును పయన మయ్యెను. ఆమె ముఖమును చూడనిదే అతడు నిలువలేడు. ఆమె వీథిని ముందుకు నడచుచుండగా అతడామె ముందు నిలచి ఆమె వైపునకే చూచుచు, ఆమె కన్నులపై ఎండ పడకుండ గొడుగు పట్టి, తాను వెనుకకు నడచుచుండెను. జను లా వింత తిలకించుచుండిరి. కొందరు వైష్ణవు లా వింతను యతిరాజులకు నివేదించిరి.

"ఆమెయందంత ఇష్టపడుచున్నాడా! వానిని త్రిప్పెదను చూడుడు."

"యతిరాజా! వా డామెయం దంత లయించి యున్నాడు. వానిని త్రిప్పుట సాధ్యము కాదు."

"వానిని పిలువుడు."

వైష్ణవులు వానిని పిలచిరి. తాను పోయినచో హేమాంబ ముఖముపై ఎండపడి ముఖము కన్నులు వాడిపోవునని తలచి అతడు రానన్నెను. హేమాంబ దీనిని ఆలకించెను. ఆమె వానితో నిట్లనెను :

"అయ్యో! పిలచినవారు గురువులు. వారు పిలచిన రానని అనరాదు. వెళ్ళుము. నేనిచట నీడను నిలచియుండెదను."

---

1. ధనుర్దాసు.
2. పొన్నాచ్చి.

"నే నథముడను. వారు నన్ను పిలచిరి. పోకున్న హేమాంబ కోపించు"నని తలచిన విల్లిదాసుడు రామానుజుల వద్దకు పోయి నమస్కరించెను.

"ఓరీ! లోకమున నెందరో కామాతురు లుందురు. రహస్యముగా భార్యకు శుశ్రూష చేయువారుందురు. కాని ఇంతటి మోహముండునా?"

"అయ్యా! నేను కామాతురుడను కాను. సృష్టిలో దాని కన్నులబోలు అందమైన కన్నులుండవు. ఆ సౌందర్యమునే చూచుచున్నాను. నేను త్వరగా పోవలెను. హేమాంబ కన్నులు నా కొరకై నిరీక్షించుచుండును."

"ఆమె కన్నులకంటె అందమైన కన్నులను చూపెదను. అటులైన ఆమె కన్నుల జూచుట మానెదవా?"

"అది అసంభవము. అయినను తాము గురువులు. మీ మాట కాదను టెందుకు? – చూపుడు, అట్లే చేసెదను.

యతిరాజులు వాని చేతినిబట్టి తీసుకొనిపోయి రఘువంశ భాగ్యమగు రంగనాథుని సన్నిధిని నిలిపి, వాని నేత్రములను తమ చేతితో తుడిచి – కరుణారసముతో నిండిన స్వామి నేత్రముల జూపి "ఇవిగో చూడుము" అని చెప్పిరి. అతడు రంగనాథుని నేత్రములనే తదేక దీక్షతో చూచెను – ఆమె కండ్లను మరచెను. దయాసముద్రులైన యతిరాజులు స్వామి నేత్రదర్శనము చేయించి వాని నుద్ధరించిరి.

"స్వామీ! రామానుజా! ఈ నేత్రములలో గోచరించునంతటి సౌందర్యము లోకమున నెందును లేదు!"

"ఓరీ! నీ వీ స్వామి నేత్రములను జూచుచునుండి తృప్తితీరిన తరువాత మఠమునకు రమ్ము!"

అని వానితో చెప్పి యతిరాజులు వాడు ఉద్ధరింపబడెనని సంతోషించుచు మఠమునకు వచ్చి చేరిరి. విల్లిదాసుడో! – అట్లు స్వామిని జూచుచు "ఏమి

అద్భుత సౌందర్యము! ఇట్టి లోకోన్నతమైన నేత్రదర్శనము చేయించిన రామానుజులను కదా ఆశ్రయించవలసినది!” అని తలచి మఠమునకు వచ్చి నిత్యకైంకర్య నిరతుడయ్యెను. హేమాంబ నిలచి నిలచి, విల్లిదాసు తిరిగి రాకుండుటను చూచి “ఆహా! ఇతడిట్లు మారునని స్వప్నమందైన తలచియుండ లేదు కదా! అట్టి విల్లిదాసు మనసునే మార్చిరే! లేకున్న నింతసేపు ఆలస్యము చేసియుండడు. గురువులేమి చేసిరో! విల్లిదాసునే మార్చగలిగిరి. నాకును వారే శరణ్యము” అని తలచి యతిరాజుల సన్నిధికి వచ్చి శరణాగతి చేసెను. “సరియే, మీ ఇరువురి మనసులు మారినవి. మీరిరువురు దంపతులై వాకిట కాచియుండుడు” అని ఆజ్ఞాపించగా వారట్లే సేవజేయుచుండిరి. విల్లిదాసుకు ఎల్లప్పుడు స్వామి నేత్రములే కన్పించుచుండెను. తనకు దారి చూపిన గురువుల సేవించుచు, అచంచల భక్తిశ్రద్ధలు కలవాడై యుండి హేమాంబతో కలసి కైంకర్యము చేయుచుండెను.

## భక్తితత్త్వము

ఈ దంపతులను చూచి మఠములో కొందరికి అసూయ కలిగెను. వారి జాతి మతములనెత్తి దూషింప నారంభించిరి. యతిరాజు లూరకుండిరి. ఇంతలో శ్రీరంగమున తీర్థవారి వచ్చెను. యతిరాజులు స్నానమునకు పోవునపుడు తనకు దండస్థానీయుడగు మొదలియాండాను చేయి పట్టుకొని పోవుచు, స్నానానంతరము తిరిగి వచ్చునపుడు విల్లిదాసు చేయి పట్టుకొని వచ్చుచు నుండిరి. ఆ తరువాత అట్లే ఆరాధన, భోజనము చేసెడివారు. “అయ్యో! వానిని ముట్టుకొనుచున్నారు. అది స్నానమునకు ముందైనచో కొంత నయముగా నుండెడిది” అని వారు గుసగుసలాడసాగిరి. “మొదలియాండానుకు మొదట

మూడు మదము లుండెడివి. తరువాత వానిని విడచెను. వీడును మదములను వదలినవాడు. ఆ మూడు మదము లుండువానిని తాకుట నా కిష్టము కా"దని రామానుజు లనిరి. విల్లిదాసునకును ఇతర శిష్యులకు నుండు భేదమును వారట్లు విశదీకరించిరి. అయినను శిష్యులకు జాతి కుల భేదములే కనిపించుచుండెను.

ఒకనాడు రామానుజులు తమ అంతరంగ శిష్యులతో ఆ రాత్రి మఠమున నుండు వా రందరి ఆరవేసిన అంగవస్త్రములనుండి ఒక్కొక్క కౌపీనమంత భాగమును రహస్యముగా చించి తెచ్చు ఏర్పాటు చేసిరి. అది అత్యంత రహస్యముగా జరిగెను. ఉదయమున శిష్యులెల్లరు అంగవస్త్రములు చూచుకొని ఒకరి నొకరు అనుమానించి 'నీవు చించితివి – నీవు చించితి'వని దోషారోపణలు చేసుకొని, జగడములాడి, చెప్పరాని విధమున తిట్టుకొనిరి. వారి యోగ్యత లట్లు వెల్లడియైనవి. పిమ్మట రామానుజులు వారిని సమాధానపరచిరి.

మరియొకనాటి రాత్రి యతిరాజులు శిష్యులతో నిట్లనిరి – "మఠ వ్యయము అధికముగ నున్నది. మీకు అంగవస్త్రములు క్రొత్తవి ఇచ్చుటకును ధనలోపమే అడ్డువచ్చుచున్నది. విల్లిదాసు భార్య యొడలినిండ బంగారు ఆభరణములున్నవి. వానిని సద్వినియోగము చేయవచ్చును కదా! ఈ రాత్రి విల్లిదాసు నిట నిలిపి యుంచెదను. మీరు పోయి ఆ నగలను తెచ్చినచో వానిని ఉపయోగించి మీకు సౌకర్యము కలిగించ వీలగును. మీ కిష్టమైనచో ఆ పని చేయుడు. జాగ్రత్త! ఆమెకు మెలకువ రాగలదు!" శిష్యులు ఉత్సాహముతో వెళ్ళిరి. రామానుజులు విల్లిదాసుతో మాట్లాడుచు వానిని మఠమున నిలిపి యుంచిరి. హేమాంబ ఎడమవైపునకు తిరిగి నిద్రించుచుండెను. శిష్యులు సద్దుచేయక వెళ్ళి ఆమె కుడివైపున ధరించియున్న ఆభరణములు ఒక్కొక్కటే తీయుచుండిరి. ఆమెకు మెలకువ వచ్చినది. కొంచెము కనులు తెరచినది. 'ఓహో! వీరు మఠముననుండు శ్రీవైష్ణవ స్వాములు. ఈ నగల అవసరమేదో కలిగియుండును. తీసుకొను

చున్నారు' అని తలచి కన్నులు మూసుకొనెను. ఆమె నిద్రించుచున్నదను ధైర్యముతో వారు కుడివైపున నున్న నగలన్నిటిని తీసుకొనిరి. రెండవవైపు నగలను తీయుటెట్లా? యను ఆలోచనలో పడిరి. ఆ వైపు నగలు వారు తీసుకొనుటకు వీలుగా నామె కుడివైపుకు తిరిగినది. ఆమె నిదుర మేల్కొనుచున్న దని తలచి వారు మఠమునకు తిరిగి వెళ్ళిరి.

శిష్యులు తిరిగివచ్చు సద్దు విని యతిరాజులు విల్లిదాసు నింటికి పంపిరి. శిష్యులు తెచ్చిన ఆభరణములు చూచిరి. శిష్యులందరికి తమకు క్రొత్త అంగవస్త్రములు మరునాడు వచ్చునని సంతోషముగా నుండెను. దాసు ఇంటికి పోవుసరికి తలుపులు తెరచియుండెను. యతిరాజుల ఆదేశానుసారము కొందరు శిష్యులు వాని వెనుకనే వెళ్ళి విల్లిదాసు నింట యేమి జరుగునో యని కనిపెట్టి చూచుచుండిరి. దాసు లోనికి వెళ్ళి భార్యను పిలచెను.

"ఏమే! నిద్రించుచుంటివా? తలుపులు తెరచియున్నవే? అదేమి? ఒకప్రక్కనే నగలను ధరించితివేమి?"

"రెండు ప్రక్కల నగలను ధరించియే నిద్రించుచుంటిని. మఠము నుండి వైష్ణవస్వాములు వచ్చి ఈ ప్రక్క నగలన్నియు తీసుకొనిరి. రెండవవైపు నగలను వారు తీసుకొనుటకు వీలుగా రెండవవైపుకు తిరిగితిని. అంత స్వాములు తిరిగి వెళ్ళిపోయిరి."

"ఏలనే అట్లు తిరిగితివి? ఒకప్రక్క నగలు సార్థకమైనవి. అవి భాగవత కైంకర్యమునకు ఉపయోగపడును. ఈ మిగిలినవానికి ఆ భాగ్యము లేకపోయినది. వీని కిక సద్వినియోగ యోగ్యత లేదు. నీవు రెండవవైపునకు తిరిగిన దోషమిది. నీవట్లే పరుండిన వారే నిన్ను దొరలించి నగలు తీసుకొని యుందురే!"

"వారికా శ్రమ కలుగకుండవలెననియే నేను తిరిగితిని. మీ పాదసాక్షిగా,

గురువుల పాదసాక్షిగా చెప్పుచున్నాను. నేను మంచిమనసుతోనే దొరలితిని. గాఢనిద్ర పోవుచున్నట్లే తోచవలెనని తలచితిని. కాని వారు వెడలిపోయిరి.”

కాని వానికి సమాధానము కలుగలేదు. ఆమెను నిందించెను. శేషరాత్రి యంతయు నిట్లే గడచెను. శిష్యులీ సర్వము లక్ష్మణులకు నివేదించిరి. ఉదయమైనది. దాసొక నిశ్చయమునకు వచ్చెను.

“ఓసీ! నీవు భాగవతులయందు అపచారము చేసితివి. ఇది భగవదపచారము కంటె తీవ్రమైనది. దూదియందు అగ్నివలె దగ్ధము చేయును. కావున నిన్ను విడచుచున్నాను.”

అని చెప్పి పెద్ద అంగలు వేయుచు యతిరాజుల వద్దకు వచ్చి సాష్టాంగపడెను – “స్వామీ! నాకిక సంసారలంపటము వలదు. సన్న్యాస మిప్పింపుడు.”

“ఇంతలో నేమి వచ్చినదిరా?”

“స్వామీ! మీ దాసి భాగవతాపచారము చేసినది. అట్టి ఆమెతో నాకు పొత్తు పొసగదు. నన్ను కటాక్షింపుడు.”

యతిరాజులు శిష్యులవైపు చూచిరి. వారు తలలు వాల్చి నిలుచుండిరి. విల్లిదాసు తన ఇంట జరిగిన దంతయు వివరించి, తనకు సన్న్యాస మిప్పించు మని రామానుజులను వేడుచుండెను.

“మఠమున నుండెడి మీరందరు వినుచున్నారుకదా! లోకమున నెవరైనను తన ఇంట దొంగతనము జరిగెనని తెలియుటతోడనే “ఓసీ! ఏలనే అరవ కుంటివి?” అని భార్యను మందలించి అధికారులకు నగలు పోయెనని ఫిర్యాదు చేసి అవి లభించు విధము చూచునేగాని, మిగుల విలువగల నగలను శ్రీవైష్ణవులు తీసుకొనలేదని వీనివలె అల్లాడుదురా? వీడా, మీరా హెచ్చు? గుణమే హెచ్చు కాని, జాతి కాదు. ఏ జాతియందు జన్మించిననేమి? భగవత్సంబంధ ముండ

వలెను. భగవన్నామమే కులము నిచ్చునని తిరుమంగై ఆళ్వార్లు [1]సాయించి యుండిరికదా! ప్రహ్లాదుడు. భక్తిలేని బ్రాహ్మణుని కన్న, కుక్కమాంసము తినువాడైనను, భక్తిగల చండాలుడే మిన్న – వానిని సేవించెదనని చెప్పియున్నాడు కదా!" అని యతిరాజు లనిరి.

విల్లిదాసుపై అసూయపడువారికేకాక, స్నానముచేసి దాసు చేయిపుచ్చుకొని వచ్చుటను ఆక్షేపించువారికిని ఈ సంఘటన గుణపాఠమైనది. యతిరాజులు వాని చేయిపట్టియే స్నానానంతరము మఠమునకు తిరిగివచ్చుచుండిరి. వారు దాసుతో "ఓరీ! నీ విప్పటి నుండి ధనుర్దాసువైతివి. నీ గుణమును పరీక్షించుటకై నగలను నేనే తెమ్మంటిని. నీ భార్య దోషము లేదు. ఎప్పటివలెనే ఆమెను ఆదరింపు"మని చెప్పి, అతడు వలదనుచున్నను వారి నగలనిచ్చి పంపిరి. విల్లిదాసు తన పేరు ధనుర్దాసాయెనని చెప్పి హేమాంబయెడ ఎప్పటియట్లే ప్రవర్తించెను. భాగవతాపచారదోషము తొలగెనని వారు సంతోషించి, ఇతోధిక భక్తిశ్రద్ధలతో యతిరాజ కైంకర్యము చేయుచుండిరి.

## ముక్తిపరాయత్తము

యతిరాజులు శ్రీరంగనాథుని సెలవంది సింహాద్రినాథుని సేవింప సింహాచలమేగి, అద్రిచెంత విడిసి, ఇరువదినాలుగు వారి ధారలతో విరాజిల్లు నా కొండనెక్కి, కోవెల కేగిరి. చుట్టూ తిరుమాలె యందు ప్రదక్షిణము చేసి, భండారమున నిలచియున్న లక్ష్మీదేవికి నమస్కరించి, గరుడుని సేవించి, పురూవ మందిరమున వేంచేసి ఉన్న వరాహనృసింహుని వేదాంత సూక్తులతో నుతించిరి. ప్రసాదము స్వీకరించి, ఆస్థానమంటపమునకు వచ్చిరి.

---

1. చెప్పి.

సింహాచలమున కాంత కృష్ణార్యుడను గొప్ప వైణిక భక్తుడు నిత్యము పదరచన చేయుచు, వానిని వీణియపై మేళవించి గానము చేసి స్వామిని స్తుతించు చుండెను. ఆ పదముల భావ గాంభీర్యములకును, భక్తుని గానమాధుర్యము నకును, తంత్రీధ్వానమునకు ముగ్ధుడైన వరాహనరసింహుడు నృత్యము చేయు చుండెను. అందుచే కృష్ణార్యునకు రాజసము కలిగెను. యతిరాజు లతనిని దర్శించి “ఆర్యా! మీరు వైణిక, గాయక, కవిశేఖరులనియు మీ ప్రతిభచే విజితుడైన స్వామి నృత్యము చేయుననియు వినియుంటిని. నేను ఎంబెరుమానారను యతిని. మీరు మహాభక్తులు. మీరు గాక ఇతరులు చేయజాలని ఉపకృతి నా కొనరింప గోరెదను. నాకు పరమపద ప్రాప్తి కలదా? అను విషయము స్వామిని అడిగి తెలుపగోరెదను” అని చెప్పిరి.

కృష్ణార్యుడు శేషాంశసంభవుడగు రామానుజులను సామాన్యునిగా తలచి, తన యాధిక్యమును వెల్లడించుచు “అదెంత పని! అట్లే స్వామి నడిగి తెలిపెదను. రేపు రమ్ము” అనెను. యతిరాజులు తిరుచుట్టుమాలె ఈశాన్యభాగమున కొంతసేపు భక్తులకు ప్రవచనము చేసి, పిమ్మట తన బసకేగిరి. ఆ రాత్రి కృష్ణార్యుని గానము, స్వామి నృత్యము పూర్తియైన పిమ్మట కృష్ణార్యుడు రామానుజులు తన నడిగిన సందేహము స్వామి నడిగెను. అంత వరాహ నృసింహుడు “అతనికే కాదు – అతడిచ్చిన వారందరకు మోక్షప్రాప్తి కలదు. ఇది నిశ్చయము” అనెను. కృష్ణార్యుడీ యతి దొడ్డవాడని తలచెను.

ఉదయమయ్యెను. కృష్ణార్యు డెప్పటివలె కోవెలకు వచ్చెను. యతిరాజులును శిష్యసమేతులై వచ్చి “స్వామీ! కృష్ణార్యా! రాత్రి నృసింహస్వామి ఏమనెను?” అని అడిగిరి. “మీకేకాక మీరిచ్చిన వారందరకు మోక్షప్రాప్తి కలదని స్వామి చెప్పెను. కావున మీరు మంచి భక్తి గల సన్యాసి యని మాకు తోచుచున్నది” అని కృష్ణార్యుడనెను. అతని భక్తి గర్వ మట్లనిపించెను. యతీంద్రు లిట్లనిరి.

"ఆర్యా! మీకు మోక్షప్రాప్తి కలదా యను విషయము స్వామి నడుగరాదా?"

"అయ్యో! ఎంత పిచ్చి సన్యాసివి! శ్రీహరి నా కనుల యెదుట నృత్యము చేయునే! నాకు మోక్షము లభించుటలో సందేహమేమున్నది?"

"అయినను అడిగిన తప్పేమున్నది? ఎల్లరకు సందేహ నివృత్తి యగునుకదా! అడిగి చూడుడు."

"అదియును బాగుగనే యున్నది. నేడే స్వామి నడిగి నీ సందియమును తీర్తును."

లక్ష్మణులు ఈశాన్యమంటపమున తన గంభీర వాక్కులతో వేదాంతగోష్ఠి సలిపి తమ నివేశమున కేగిరి.

రాజసుడైన కృష్ణార్యు డా రాత్రి గీతాగాన వాద్యములచే స్వామిని మెప్పించి, "నా తండ్రీ! నృసింహా! నాకు మోక్షప్రాప్తి కలదుకదా! తెలియజెప్పు"మని యడుగ శ్రీహరి మౌనము వహించెను.

"మాధవా! విని యూరకున్నావేమి? ఇది ఉచితముగా నున్నదా."

"నీవు భక్తుడవు. నీ వాక్యములకు ఆలోచించి సమాధాన మీయవలెను. ముక్తి నా సొత్తని, నేను ప్రసాదించినవారికే లభించునని ముల్లోకములు, వేదములు, మూలశ్రుతులు ముక్తకంఠముతో ఘోషించుట యథార్థమే. కాని ఇప్పుడది పరాయత్తమై యున్నది. మాకు శ్రీరంగము దక్షిణపుట్టిల్లు వంటిది. ఆ శ్రీరంగధామమున శేషాంశసంభవుడైన యతిరాజులు నన్ను కోరినందున ఉభయ విభూతులును నేను ఊర్జితముగా నిచ్చితిని. కాన నేను తిరిగి తీసుకొనను. అందుచేతనే నీ కోరిక తీర్చ సంశయమైనది. అవి ఉడయవరుల కిచ్చిననాటినుండి అతడే ఎవరికైన సకలసుఖముల నిచ్చుచున్నాడు. కాన, నీకు మోక్షమిచ్చుటకు నేను అస్వతంత్రుడను. ఇచ్చుటకైనను, కాదనుటకైనను అతడే కర్త. నీవు వెళ్ళి అతనినే అడుగుము."

"అయ్యో! స్వామీ! అక్కటా! ఒక సన్యాసికై నాయంతటి భక్తుని ఇట్లు వంచింతువా? ఇది నీకు న్యాయమా? నా చిన్ననాటినుండి నా స్వామివని, నిన్నే నమ్మియుంటిని. ఇట్లు అన్యాయము చేతువని యెరుగనైతినే! నీవో! – గోవులగాచుకొను గోవిందుడవు. యుక్తాయుక్తములు తెలియనివాడవు. తెలిసియే ఉన్నచో సీతాదేవిని అగ్నిప్రవేశము చేయించి యుందువా? అట్టి నీకు చేయరాని దేముండును? ఎల్లకాల మొక్కరీతిగా గీతముల రచించి, నీయెదుట పాడి, వీణావాదనముచేసి, నిన్ను కీర్తించి, నీ నాట్యమునకు సాయపడుచుండిన భక్తుడనే! ఎల్లరు నన్ను గొప్ప భక్తుడని కీర్తించుచున్నారే! నా యింటిముంగిట కల్పవృక్ష మువని, నా ముంగొంగు బంగారమువని తలచి మురియుచుంటినే! నే భావించిన అన్నియు మంటగలిసెను. ఆ మాయ సన్యాసి నిన్ను నిశ్చయముగా మభ్యపెట్టెను!"

"ఆగు మాగుము, వేయి చెప్పనేల? నీ గర్వమే నిన్నింత చేసినది! వినుము – ఇందు నా నేరమేమున్నది? అకారత్రయము తెలిసి పంచసంస్కారములు పొంది, బోధించగల సంస్కారముకలిగి, సత్కాలక్షేపము చేయువారి కెవరికైన మోక్షము లభించును. భక్తులు, దానగుణములు కలవారు, సుకృతములు చేసినవారు, మనసున నన్నే ధ్యానించుచు కాలము గడుపువారు క్రమముగా శుద్ధమైన సత్త్వగుణము కలిగి, ఆచార్య కటాక్షము పొందిన వారికిని పరమపదము లభించును. భూమిపై చర – అచర రూపములు కలవు. వివరించెద వినుము. చరరూపమే ఈ దొడ్డ సన్యాసి, ఎంబెరుమానార్. అచరములే నా విగ్రహములు. రామానుజాచార్యులు అనువారు శాస్త్రోక్తయతి – సదాచార నిరతుడు – నా చర రూపమును. వారిని చూచియు నమస్కరింపవైతివి. గానము చేయుచుంటిని గదా యని గర్వించితివి. నేను నీ భక్తిభావనచే కన్పించుచుంటిని. నీవు పాడుచుంటివి – కాన నే నాడుచుంటిని. పరమపదమో! జ్ఞాననిష్ఠులు లేనిదే

లభింపదు. నీవు భగవత్ భాగవతాపచారములు రెండును చేసితివి. ఇందు రెండవది అపరిహార్యము, శిక్షార్హము. ఈ నేరము నీ గీతరచన, వాని గానముల వలని గర్వము వలన జరిగినది. అట్టి నీ పదములు విద్యాగంధశూన్యుల పాలగును. మాన్యులు నిరాదరింతురు.”

“నృసింహా! నిన్నే నమ్మిన నన్ను వంచించితివి. నన్ను నా గీతములను శపించితివి. ఆ గీతములందు కీర్తింపబడినది ఎవరు? నీవే కదా! నిన్ను నీవే నిషేధించుకొంటివి. నీ వంచనను నేను మాత్రము సహింతునా! నీ విమానము నేలగూలును గాక! నీ కోవెల ఏకధాటిగా ఏడు దినములు కాలును. అట్లు కాలియు చెక్కుచెదరకుండును. విమానము పునర్నిర్మించబడును.”

భక్తుని శాపమును భరించి స్వామి భక్తవాత్సల్యము చూపెను. స్వామి వాక్యానుసారము [1]కృష్ణార్యపదములు నేటికిని మాలదాసులు పాడుచున్నారు. భక్త వాక్యానుసారము తరువాత కొంత కాలమునకు ‘మలికినే’నను తురక సర్దారు తన దండుతో వచ్చి ఆకాశమునంటు స్వామి కోవెల విమానమును పడగొట్టి, కోవెలకు నూనెగుడ్డలు చుట్టి దానిని ఏడహోరాత్రములు తగులబెట్టెను. అట్లు కాలియు కోవెల నేటికిని దూరమునుండి చూచిన అద్దమువలె మెరయుచు కన్పించుచున్నది. విమానము పూర్వవైభవము చెడకుండా పునర్నిర్మించబడి యున్నది.

కృష్ణార్యుడు వేరుగతి లేనివాడై, క్రోధము విడిచి, పశ్చాత్తప్తుడై సింహాద్రినాథుని పాదములబడి, మ్రొక్కి, ప్రార్థించెను.

“దేవా! సింహాద్రినాథా! నిన్నే తండ్రిగాను, తల్లిగాను, దాతగాను, త్రాతగాను, ఆప్తునిగాను తలచి యున్నవాడను. ఇది యథార్థము. తండ్రీ! నీవు

---

1. ఆంధ్ర భాషలో రచింపబడిన పదములలో ఇవి ప్రథమములని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు పేర్కొనిరి.

ఆర్తశరణ్యుడవు, భక్తవత్సలుడవు. నే నాడిన దురుక్తుల మన్నించుము. వానిని మరచి నన్ను కటాక్షింపుము.”

“కృష్ణార్యా! లోకరక్షాభారము వహించిన మాకు నీ వంటి భక్తుని కాపాడుట భారము కాదు. అపకారికిని ముందెన్నడు అనృతము చెప్పియుండలేదు. న్యాయము దప్పి పలుకను. నేను పూర్వము చెప్పినట్లే చేయుము. కుమారా! రామానుజాచార్యు నాశ్రయించుము. మోక్షము నీ కరతలామలకమగును. సందేహించక వెళ్ళుము.”

కృష్ణార్యులు కొండదిగి వచ్చి యతిరాజుల పరివారమును చూచి నిశ్చేష్టుడాయెను. శ్వేతమృత్తికతో ధరించిన ద్వాదశ ఊర్ధ్వపుండ్రముల మధ్య పదారువన్నెల బంగారు ఛాయగల శ్రీచూర్ణరేఖలు కలిగి, తులసిమాలికలు కంఠమున వెలయ, శంఖ చక్ర ముద్రలతో భుజములు విరాజిల్లుచుండగా, కోరి నిరంతరము తమ గురువులైన యతిరాజుల దాస్యము చేయుచుండిన అసంఖ్యాక వైష్ణవ సంఘమును వీక్షించెను. ఈ చిహ్నములే కాక నాలుకతో నారాయణ స్మరణ చేయుచు, చెవులు కదలుచుండగా నొకచేతితో తులసి తావళముల ద్రిప్పుచు, రెండవచేత దండములు ధరించి ద్వారరక్షణ చేయు స్వాముల జూచెను. “అయ్యా! మీ గురువులతో కృష్ణమాచార్యుడు వాకిట నిలచి యున్నాడని చెప్పుడు” అని కోరెను. వారు యతిరాజుల కీ విషయము విన్నవించిరి. రామానుజులు “ఆ కృష్ణమాచార్యు లనువారితో మాకేమియు పనిలేదని మా మనసుకు తోచుచున్నది” అనిరి.

కృష్ణార్యుడు తిరిగివెళ్ళి దేవదేవుడైన సింహాద్రినాథునితో జరిగిన సంగతి పూర్ణముగా విన్నవించెను. స్వామి “నాయనా! ఆచార్యశబ్దము యతిరాజులకే తగును. కావున అభిమానపడక వెళ్ళి, నీ పేరు మాత్రము చెప్పుకొనుము”

అని చెప్పి పంపగా, నతడు తిరిగి వెళ్ళి "కాంత కృష్ణుడు వచ్చెనని మీ గురువులకు చెప్పు"డని ద్వార రక్షకుల గోరెను. యతిరాజులు విని యూరకుండిరి. హతాశు డై కృష్ణార్యుడు తిరిగి వచ్చి స్వామికి చెప్పగా, శ్రీహరి "కృష్ణా! ఆచార్యుడు కానివాడు దాసుడగును. నీవు 'అడియేన్ కృష్ణదాసుడను' అని తెల్పుము" అని బోధించి పంపగా, కృష్ణార్యుడు రామానుజాచార్యుల ద్వార రక్షకులతో "నిరంతరము దండముల ధరించియుండు నాయనలారా! నాపై దయతో యతీంద్రునికి అడియేన్ కృష్ణదాసుడు నిలిచియున్నాడని నా జ్ఞప్తిని తెలియ జేయుడు" అని పలుకగా వారు రామానుజుల ఆజ్ఞచే కృష్ణదాసును వారియెదుట నిలిపిరి.

జన్మదరిద్రుడు అపార ఐశ్వర్యము పొందినట్లు, జన్మాంధునకు దృష్టి కలిగినట్లు, ఎడారిలో గొంతు ఎండి యున్నవానికి నీరు లభించినట్లు, కుంటి వానికి నడక కలిగినట్లు - కృష్ణార్యుడు ఆనందముతో యతిపతికి దండప్రణామము చేసి నిలువగానే యతిరాజశ్రేష్ఠుడు వానిని కటాక్షించి పంచ సంస్కారములు చేసి, అర్థపంచకమును, త్రిభాష్యములు మొదలగు సర్వ హితోపదేశములు చేసిరి. అతనితో నిట్లనిరి - "నాయనా! నరసింహస్వామి ప్రహ్లాదుని రక్షించి ఈ పర్వత శిఖరమున నొక పుట్టయందు అర్చారూపుడై నిలిచియుండగా పురూరవ చక్రవర్తి వరాహ నృసింహున కొక దారుమంటపము నిర్మించెను. తరువాత లాంగూల గజపతి సర్వలక్షణయుతమగు సుందర మంటపములు, కోవెల నిర్మించెను. ఒక యతి ఆకాశగంగను తెచ్చి గంగధారల గల్పించెను. ఈ సింహాద్రి వైభవ మేమని చెప్పవచ్చును! అట్టి సింహాద్రినాథుని దయాపాత్రుడవు!" అని ప్రశంసించగా కృష్ణసూరి "యతిసార్వభౌమా! తమ దాసుడనై - తమ సన్నిధినే ఉండగోరుచున్నాను" అనెను. లక్ష్మణులు వానిని

బుజ్జగించి “నాకు చేయగోరిన సకల కైంకర్యములు నీవిచటనే యుండి, ఈ నృహరికే చేయుచుండుము. మారుపలుకకుము. ఇది మా యాజ్ఞ” యని పలికి నందున, కృష్ణసూరి యతిరాజులకు ప్రదక్షిణ నమస్కారములు చేసి, తిరిగి వెళ్ళిరి. సింహగిరీశునకు కైంకర్యములు చేయుచు దేహాంతమున మోక్షము పొందిరి.

## అంతిమ సంస్కార వివాదము

యామునుల శిష్యుడు మార్నేర్ నంబికి దేహంతమాయెను. మహాపూర్ణు లాదేహమునకు బ్రహ్మమేధ సంస్కారము చేసిరి. దీనితో శ్రీవైష్ణవ సమాజమున వివాదము తలయెత్తెను. కక్షలేర్పడెను. కారణము మార్నేర్ నంబి వర్ణాంతరు డగుటయే. మహాపూర్ణులను వెలివేసిరి. ఈ విషయము యతిరాజులకు తెలిసి తమ ఆచార్యులగు [1]పెరియనంబితో నిట్లనిరి : “ఆచార్యా! మీరు పెద్దలు, సర్వము తెలిసినవారు – ఇట్లు చేసితిరేమి?”

“యతిరాజా! నీవు విషయము తెలియుటకై అడుగుచున్నావా? ఊరివా రనుకొనుచున్నారని యడుగుచున్నావా?”

“ఏదియైనను విషయము విశదీకరించబడవలెనుకదా! భగవద్గీత యందు గీతాచార్యులు చెప్పినట్లు, పెద్దలమార్గమునే ఇతరులనుసరింతురు.”

“భర్త బాధను భార్యయు, తండ్రి బాధను పుత్రుడును తీసుకొనరు కదా! అట్టిది గురువులగు యామునుల రాజవ్రణము తన కీయుమని మార్నేర్ నంబి కోరి వారీయలేదని, తమ గురువులకంటె బాధపడిరి. చివరకు ఆ వ్రణమును

1. మహాపూర్ణులు.

ప్రార్థించి తీసుకొని యామునుల అనుగ్రహపాత్రులైరి. వారిని శూద్రుడని ఎంచరాదని యామునులే సెలవిచ్చిరి."

"కేవలము ఉపకారస్మృతిచేత నిట్టి ధార్మిక విషయములు నిర్ణయింపరాదు. దృష్టాంతరములు, ఉపపత్తులు చూపవలెను."

"అయినచో వినుము. [1]చక్రవర్తి తిరుమగన్ జటాయువునకు సంస్కారము చేసెను. ఇతడు జ్ఞాని. అంతకు తక్కువవాడు కాదు. ధర్మపుత్రుడు విదురునకు సంస్కారము చేసెను. విదురుడే జాతివాడు? సూక్ష్మపరిశీలన చేయగా, జాతి, కులములకంటె భక్తి, జ్ఞానములు పరికించవలెనని తెలియుటలేదా? కులము అంత ముఖ్యమా? 'కులంతరు' అనగా కులము నిచ్చునని చెప్పబడలేదా? శ్వపచుడైనను సరియేనని ప్రహ్లాదు డనలేదా? గీతాచార్యులు ఇతర ప్రయోజనములను తలచక తనను భజించువాడు – ఆచారహీనుడైనను – వానిని సాధువుగానే భావింపవలెనని సెలవిచ్చియుండిరికదా! మనసు దేవదేవునియందు నిశ్చలముగా నుండిన చాలును. ఇవి అన్నియు నీకు తెలిసినవేకదా! అష్టాక్షరిని సకల జనులకు నీ వెట్లు వెదజల్లితివి! ఇన్ని విధముల నంబి శూద్రుడైనను నాచే అంతిమ సంస్కారార్హత కలిగి యున్నారు."

"స్వామీ! మీరు చెప్పినది నా మనసునకు బాగుగ పట్టినది. తాము పెద్దలు. ఈ వివరణ తాము ఇచ్చిననే కదా శోభస్కరముగా నుండుట! వైష్ణవస్వాములారా! వారట్లు స్వయముగా చేసి చూపిరి. మీరును అట్లే అనుష్ఠించుడు."

రామానుజుల వాక్కు, మహాపూర్ణుల వివరణలతో స్వాములు సమాధానపడిరి. వివాద మంతటితో సమసినది.

---

1. శ్రీరామచంద్రుడు.

# గురు శరీరము అంత ముఖ్యమా?

ఒకనాడొక మూగవాడు రామానుజుల మఠమునకు వచ్చెను. వా రా మూగవానిని లోనికి కొనిపోయి తలుపుల మూసిరి. వీనితో సంభాషించుట - ఆ సంజ్ఞలు - లక్ష్మణులకు తెలియునా? యని కూరత్తాళ్వాను అనుకొనిరి. యతిరాజు లా మూగవానితో 'నా శరీరమే గతియని నమ్ముము' అని సంజ్ఞలు చేయగా, వాడు దివ్యమంగళ విగ్రహమైన గురు విగ్రహమే శరణ్యమని స్మరించెను. వాడు తలుపులు తెరచుకొని బయటకు వచ్చుసరికి ప్రవాహమువలె మాట్లాడసాగెను. వానితో సంభాషించుట ఇతరులకు శ్రమ యయ్యెను.

దీనితో ఎంబెరుమానార్‌లకే సందేహము కలిగెను. "గురు శరీర మంత ముఖ్యమా? ఈ సంగతిని ఇదివరలో తిరువరంగపెరుమాళ్ళరయరులు చెప్పియుండిరి. అయినను తిరుక్కొట్టియ్యూర్‌నంబి నడిగి ఆ సంగతి తెలుసుకొని చెప్పదగినది. అట్లుకాక నేనే చెప్పిన వారు నన్ను పెద్దగా తలతురు. నా కపచార దోషము కలుగును" అని తలచి నంబిని దర్శింప వెళ్ళిరి. వారి దర్శనము కాలేదు. ధ్యానమున నున్నారని లోనుండి వార్త వచ్చెను. ధ్యానానంతరము నంబి దర్శనమీయగా లక్ష్మణులు "స్వామీ! ధ్యానమననేమి? మేమును చేయువలదా? తెలియజెప్పుడు'' అనికోరిరి. అంత నంబి ''తనకు భగవత్స్వరూపము చూపిన ఆచార్యుని తలచుటే ధ్యానము. వారి కథలు వినుటే శ్రవణము. వారి నామస్మరణయే జపము. పరమపద ప్రాప్తికిని సోపానములు" అని చెప్పగా, రామానుజులు గ్రహించి శ్రీరంగము తిరిగివచ్చి 'ఎల్లరకు గురు చరణములే గతి' యని ఉపదేశించిరి.

# ద్రావిడామ్నాయ వాక్యము యథార్థమగుట

యతిరాజుల దర్శనము, వారి సద్గుణ శ్రవణము, వారి సేవా కైంకర్యాచరణములచేత – చేతనలోకము సరాసరి వైకుంఠమున కేగుచుండిరి. పితృదేవతలు సంతోషముతో నాట్యమాడిరి. వైష్ణవాగ్రేసరుడగు రుక్మాంగదుని వలన సర్వజనులు వైకుంఠమున కేగినట్లు, లక్ష్మణార్యుల నాశ్రయించిన వారందరు వైకుంఠమునకు పోసాగిరి. కర్మ జ్ఞాన భక్తి మార్గముల కడతేరదలచి యుండు జనులు. యతిరాజ సంబంధముచేత ప్రపత్తియే ముఖ్యమని తెలుసుకొనిరి. విరజాస్నానమాచరించి, పరేతలోక దర్శనమైన లేక, తిన్నగా వైకుంఠమున కేగుచుండుటచే, యీ లోకమును పాడుచేయుటకు కలి శక్తి హీనుడయ్యెను. యమునకు భూలోకాగమనము అవసరము లేకపోయెను – పనిలేకపోయెను. 'పొలిఘపొలిఘ' యను పాశురార్థము నిశ్చయముగా అమలు జరుగుచుండెను. మోక్షార్థులు పోవు అర్చిరాది మార్గమున సాధారణముగ ఆత్మల సంచారముండదు. జన్మ పుణ్యపరిపాకమున గదా – ఆ మార్గమునబోవుట! ఆ మార్గమున నిపుడు మిక్కుటమైన సందడి కలిగెను. యమునకు విశ్రాంతి లభించెను. అతడు పనిలేని తన భటుల తొలగించవలసి వచ్చెను. పనిలేని ఉద్యోగ మతనికి విసుగనిపించెను. యమలోకావసరమేమి? దానిని రద్దుచేయు నవసరమైనది. యముడీ విపర్యయ కారణముల నన్వేషించి రామానుజులు వైష్ణవసిద్ధాంత ప్రచారము చేయుచు, దేశము నలుమూలల పర్యటించుటే కారణమని తెలుసుకొని, కలవరపడి సత్యలోకమునకేగి, ఆపన్నుడై విరించికి నమస్కరించి "పితామహా! కాలము తారుమారైనది. యతిరాజు లనువారేర్పడిరి. వారికి మితిలేని శిష్యులు తయారైరి. కర్మ, జ్ఞాన, భక్తులకు అతీతమైన ప్రపత్తి మార్గప్రచారము చేయుచున్నారు. ఇపుడు అకర్మణ్యత, అజ్ఞానము, భక్తి హీనతల

ప్రసక్తిలేదు. ఏ సాధనలోనైన దోషముండవచ్చును. భగవద్గీతలో గీతాచార్యులు ప్రవచించినట్లు ప్రజలు నిష్కామ కర్మాచరణము చేయుచుండినందున – మంత్ర తంత్ర లోపములను తలపే నిరాస్తమైనది. కామ్య కర్మము చేసిననే కదా తప్పు లెన్నుట! ఇతరసాధనలు సాధనలుకావు – చేతనులు 'నీవే గతి' యనుచున్నారు – ఎంబెరుమానార్ స్వామి వారిని చేర్చుకొనుచున్నారు. ఇక నా పనిని వదులుకొనవలసినదేనా?" అని విన్నవించెను. "అట్లు కాదు, ప్రకృతి గౌరవముతో పనియేమి? వ్యవహారము చెడునే" యని విధాత తలచి దండధరుని, పరమశివుని, ఇంద్రాది దేవతలను వెంటనిడుకొని సర్వలోక శరణ్యుడై కలియుగ వైకుంఠమగు శ్రీరంగమున వేంచేసియున్న శ్రీరంగనాథుని దర్శించి, నమస్కరించెను. "తండ్రీ! రంగనాథా! ఒక విజ్ఞాపన చేయవచ్చితిమి. లోక వ్యవహార విపర్యయము కలిగినపుడు నీవేకదా మాకు శరణము! మీ యనుగ్రహ పాత్రుడగు యతిరాజులను సన్యాసి – తాము – అర్జునునకు ఉపదేశించిన చరమోపాయము – గుహ్యాతమమని సెలవిచ్చిన దానిని – ఎల్లరకు చెప్పుచున్నారు. కర్మ జ్ఞాన భక్తి దూరులైనవారును నిన్ను చేరుచున్నారు. యమునకు పనిలేదు. ఇది తాము ఉపదేశించిన యుగమున నింత వ్యాప్తిలేదు. మీరు చేయలేనిదానిని యతిరాజులు సుకరము చేసెనే! ఈ యమునకు పని కల్పింపుము – కలియుగ ధర్మమును నిలబెట్టుము" అని విన్నవించెను.

"యతిరాజులవలన నిట్లాయెనా! ఈ విధముగా కూడ ప్రవచనముండునా! ఆశ్చర్యము! నాకు లీలా, నిత్యవిభూతులు రెండును అనాదిగా నున్నవే. నిత్యవిభూతిలో భక్తుడు – అభక్తుడు అను భేదము కలదు. సీతయని – రుక్మిణి యని – పెండ్లియని ఇందు కలవు. నిత్యవిభూతిలో పెండ్లి – బంధములు లేవు. ధర్మక్షయమై – అధర్మము హెచ్చిన, నే నవతరించుచునే యుండగా – ఇక ఈ విభూతి ఎక్కడిది? రామానుజులు తుది మొదలుగా చెరచెనే. రెండు విభూతులలో నొకటి నిత్యము, మరొకటి అనిత్యమైయుండగా, రెండిటిని ఒకటిగా

చేసెనే! ఇక నన్నెవరడుగువారు? బ్రహ్మాదులకు, సనకాదులకు సులభము కాని ఆస్థానమును సుకరము చేసెను. స్మరింపను వలనుపడని స్థానమును యతిరాజుల శిష్యులు అవలీలగా సాధించిరే! ఇట్లు కొన్నినాళ్ళు గడచిన లీలావిభూతియే పోవును. సాత్త్విక, రాజస, తామస జనులలో సాత్త్వికులు ఎన్నడు చెడరు. రాజస, తామసులు యమలోకమునకు వచ్చునట్లు చేసెదను. యమస్థానమును ఎత్తివేయవలదు" అని శ్రీరంగనాథు లనిరి.

## "నీ దివ్యమంగళ విగ్రహము కాపాడుకొనుము"

ఈ సంధికాలమున క్రిమికంఠుడను రాజు సృష్టింపబడెను. వాడు యమధర్మ రాజుకు మిత్రుడు. కలిపురుషుని సఖుడు. ద్రోహి. భగవద్ద్వేషి. ఇట్లు యమలోకము నిలుపుటకై సృష్టింపబడిన రాజేమి చేసెను? వేదాంత విచారము చేయ నారంభించెను. శైవమతానురక్తుడై తన పూర్వము లోకకంటకులగు రాక్షసకోటితో సమాను డాయెను. హిరణ్యకశిపునివలె విష్ణునింద చేసెను. హరినామస్మరణ దండనీయమనెను. జనులందరను శివభక్తులుగా జేయ తలచెను. అట్లు కానివారికి శిరచ్ఛేదమనెను. పండితు లంగీకరించిన, వారి మార్గము ఇతరులు అనుసరించుట సుకరమని తలచెను. "శివా త్పరతరం నాస్తి" యని ఒక పత్రముపై వ్రాయించి, విద్వాంసులందరిచే చేవ్రాలు చేయించి తెమ్మని భటులను నలువైపులకు పంపెను.

మనకేమి విద్యానాశనమా? యని కొందరు, 'శాస్త్రవిచారమా' సద్యఃఫలమా?' యని కొందరు, 'అపాయము తొలగిన చాలు'నని కొందరు చేవ్రాలు చేయుచుండిరి. [1]నాలూరాన్ అనునతడు ఆ రాజు నొద్ద మంత్రిగా నుండెను. అతడు కూరత్తాళ్వాన్ శిష్యుడు, వాడు చేవ్రాలు చేయవలసి వచ్చెను.

1. చతుర్ గ్రామాధిపతి.

ప్రాచీన కర్మముచే వాడు తన గురువు ముందు చేవ్రాలు చేసిన క్రింద తాను చేయవచ్చునని తలచి "మహాపూర్ణులు, యతిరాజులు మొదలగు ప్రముఖ వైష్ణవులు శ్రీరంగమున నున్నారు. వారు చేవ్రాలు చేసిన గదా మేలు! నావంటి అనామకులతో నేమి?" యని రాజుతో చెప్పెను. రాజు వెంటనే శూరులు, వేగవంతులు నగు దూతలబంపి నిర్బంధముననైన వారిరువురి తోడ్కొని రమ్మని పంపెను. అంత వారు "మన్నాథుల మఠమెచ్చట? మన్నాథులున్నారా?" యని విచారించుచు వచ్చుచుండగా, వారల వేషములు, తొందర చూచిన కూరత్తాళ్వాను, రామానుజ సిద్ధాంతమునకు చేటుకాలము వచ్చునట్లు తలచిరి. యతిరాజులు స్నానము చేయబోయిరి. "ఈ దూతలు యమభటులవలె నున్నారు. యతిరాజుల జూచిన హింసించెదరు. వారు చేవ్రాలు చేసిన కార్యము చెడును. చేయకున్న హింసింతురు. కావున వారి నీ సంకటమునుండి తప్పింపవలెను. అట్టివాడే కదా శిష్యుడు కాగల"డని తలచి కూరత్తాళ్వాను, యతిరాజులతో విన్నవింపకయే, వారి త్రిదండము, కాషాయ వస్త్రములు, కమండలములను తాముధరించి "రండు, రండు, నేనే మన్నాథుడను" అని దూతలను పిలుచుకొని పోయిరి. "అయ్యో! ఈతడు గురుభక్తిచే పోవుచున్నాడే" యని మహాపూర్ణార్యులును వారితో దూతలవెంట పోయిరి.

[1]ఉడయవరులు వచ్చి చూచి, సంగతి విని, "సరి! వాడు నా కాషాయ వస్త్రములు ధరించెనే" యనుకొని కూరేశుల తెల్లని వస్త్రములు తానుధరించి, రాజభయమునకేమి చేయనగునని స్వామి నడిగిరి. రంగనాథులు "నాయనా! నీ దివ్యమంగళ విగ్రహమును కాపాడుకొనుము. ఊరువిడచి పో"మ్మని చెప్పిరి. స్వామి యాజ్ఞానుసారము వారు శిష్య ప్రశిష్యులతో శ్రీరంగము విడచి పడమర దిక్కుగా పోయిరి.

---

1. యతిరాజులు.

రాజభటుల కొక సందేహము కలిగెను. తమ ప్రభువు ఇరువురను తీసుకొననిరమ్మనెను. వారిలో యతిరాజులు తమతోనున్నారు. ఇంకను కూరత్తాళ్వాను ఉండవలెను కదా! యని, తాము రెండు భాగములుగానై నొక భాగము తమతో నున్న వారిని తీసుకొనిపోవుటకును, రెండవ భాగము కూరేశుల నన్వేషింపను నిర్ణయించుకొని వెనుకకు వెళ్ళుచు, కొందరు స్వాములు పారిపోవుచున్నారని విని వారి వెంట నంటిరి. వెనుకనే వేగముగా వచ్చుచున్న రాజభటుల గూర్చి శిష్యులు చెప్పగా యతిరాజులు క్రింద నున్న మన్నునెత్తి మంత్రించి వారికిచ్చిరి. ఆ మన్ను పైబడి బాధించగా భటులు పారిపోయిరి. ప్రయాణము ముందుకు సాగెను.

## త్వమేవ శరణం మమ

ఒకనాటి రాత్రి పరివారమునుండి ఒక స్వామి తప్పిపోయి, చీకటిలో నా యడవిలో సంచరించుచు కొందరు వేటకాండ్రు నివసించు చోటికి వచ్చిరి. వారిని వేటకాండ్రు చూచిరి.

"అయ్యా! మీ రెవరు? చీకటిలో వచ్చుచున్నారే! తమ దేయూరు?"

"మాది శ్రీరంగము. సహచరులతో తప్పి వచ్చుచున్నాను."

"అచట యతిరాజు లున్నారు కదా! వారు క్షేమముగా నున్నారా?"

"వారు శ్రీరంగమున లేరు. చోళరాజ భయముచే మారువేషముతో నెచటికో పోయిరి. ఎచట నున్నది తెలియదు. నేనును వారిని వెదకుచునే ఇట్లు వచ్చితిని."

"మేమును వారినే వెదకుచున్నాము. వారు శ్రీరంగమునుండి ఈ ప్రాంతమునకు వచ్చుచున్నారని విని, వారిని కనుగొనియే భుజింప నిశ్చయించుకొని, ఆరుదినములనుండి నిరాహారులమై యుంటిమి. మీరును మాతో జేరితిరి."

వేటకాండ్రు నిరాహారులు, శ్రాంతులునై యుండిరి. ఇంతలో గాలివాన ఆరంభమైనది. రామానుజులు తలదాచుకొన తావులేక అల్లాడుచు, కొండలు మిట్టలు నెక్కుచు, ముండ్లు పొదలు తప్పించుకొనుచు వేటకాండ్రుండు చోటికి సమీపము కొండపైకి వచ్చిరి. కొండక్రింద గాలి తాకున నెగళ్ళు మండుచు, అణగుచుండ చూచి, అట నెవ్వరో మనుష్య లుందురని, వారిని మార్గ మడుగవచ్చునని తలచి శిష్యులతో నచటికి చేరిరి. వేటకాండ్రును వారిని చూచిరి.

"అయ్యా! తామెవరు? ఎచటినుండి వచ్చుచున్నారు?"

"శ్రీరంగమున నుండెడివారము - కష్టకాలము - భగవత్సంకల్పము - శ్రీరంగనాథుని విడచి వచ్చితిమి."

"శ్రీరంగమున శ్రీమద్రామానుజాచార్యులవారు క్షేమముగా నున్నారా?"

"వారు మీ కెట్లు తెలిసిరి? వారితో మీకు గల సంబంధమేమి? బంధువుల వలె అడుగుచున్నారే!"

"తిరుమలై నల్లాన్ అనువారు యతిరాజుల శిష్యులు. వారి భృత్యులమైన మాకు 'ఎంబెరుమానార్ చరణార విందములే మీకు రక్షక'మని ఉపదేశించిరి. ఆ కారణముచే మేము యతిరాజులపట్ల భక్తి కలిగియుంటిమి."

"వారిని మీరు చూడవలయునా? సంతోషించెదరా?"

"తప్పక! - ఆరుదినముల నుండి వారిని దర్శింపవలెనని వెదకుచుంటిమి."

"ఇరుగో! వీరే యతిరాజులు!" అని శిష్యులు రామానుజులను చూపగా, వారు "త్వ మేవ శరణం మమ"యని ఉదయవరుల పాదముల బడి, వారి యాశీర్వాదముల నందిరి. కొత్త వస్త్రములను, కందమూల ఫలాదులను తెచ్చి యిచ్చిరి. నెగళ్ళను రాజబెట్టి వారందరి చలిదీర్చిరి. "ఇంతవరకు మేఘము వర్షించినది. నల్లాన్ అమృతము గురిపించుచున్నా"డని రామానుజులు ప్రశంసించిరి. శ్రీరంగమున నున్నవారు తమనుగూర్చి చింతించుచుందురని

తలచి, ఒక వేటకాని తమ పరివారమునుండి ఒక స్వామిని శ్రీరంగమునకంపి, తమ క్షేమమెరిగించి, అచటివారి క్షేమ సమాచారములు తెలుసుకొని రమ్మని పంపిరి.

## పాదుకలు

అంత వేటకాండ్రు "స్వాములారా! ఇచటి కొక క్రోసుదూరమున మా యజమాను దున్నాడు" అని వారిని పిలచుకొనిపోయిరి. వారి యజమాని వేటకు వెళ్ళియుండెను. శ్రీమన్నాథన్ అనియు, మా పరమగురువులనియు చెప్పుచుందుమే, వీరిని గూర్చియే!" అని వేటకాండ్రు చెప్పిరి. ఇంతలో నల్లాన్ వచ్చెను. గురుని రాకకు పొంగి వారి పాదములకు నమస్కరించి ఇంటియామెతో "నేను ఊరలేనని ఊరకున్నారా? [1]సాపాటుకు ఏర్పాటు చేసితిరా? లేదా?" అనెను. ఆమె "మహావైష్ణవులు మన యింటికి వచ్చి పస్తుండుటయా! వారు భుజించిన తరువాతనే మేము భుజింపవచ్చునని తలచితిని. సమీప గ్రామమున కట్టళై వారి బ్రాహ్మణగృహమున్నది. వారు పేదవారు. దివ్యభోగములు చేయుదని నెయ్యి, బియ్యము, పప్పులు, శర్కర మొదలగు సర్వపదార్థములు వారికి పంపితిని" అనెను. వేటకాండ్రు యతిరాజులకు, స్వాములకు, తిరుమలై నల్లాన్‌కు నమస్కరించి, వారి సెలవంది వెనుకకు పోయిరి. యతిరాజచంద్రులు ఏడవ నాటి రాత్రికి సపరివారముగా కట్టళైవారి ఇంటికి చేరిరి.

ఆ గృహిణి [2]చేలాంచలాంబ. ఆసరికి ఆమె భర్త భుజించెను. ఆమె ఇంకను భోజనము చేయలేదు. ఆమె వారందరికి నమస్కరించినది.

---

1. భోజనము.
2. తలప్పమ్మాళ్.

"ఆహా! నా యదృష్టము! ఈరోజున నే నెవరి ముఖము చూచితినో! మీ అందరకు [1]తళియ చేసిపెట్టు భాగ్యము లభించినది. నే నింకను భుజించలేదు. శ్రీఘ్రముగ వంట చేసెదను. మీరందరు ముందు భుజింపవలెను."

"వలదు, వలదు. ఆదరణతో పిలచిరి. అంతే చాలును. వచ్చిన వారి పీడ వదలవలెనని చేయు దానము తామసము. ఆదరణ లేని భోజనము విసము వంటిది. దానివలన పరిగ్రహించినవారికి దుఃఖము కలుగును. స్వల్పమైనను, లేచివచ్చి, వచ్చిన వారిని కూర్చుండబెట్టి, నమస్కరించి, తన వలన కావలసిన దేమో తెలుసుకొని - శక్తికొలది ఇచ్చెదను - గైకొనుడని ప్రీతితో నిచ్చిన దానమున పెద్దలు తృప్తులగుదురు. అమ్మా! నీవును అట్టి ప్రియముతో పిలచితివి. మేము తృప్తిచెందితిమి."

"అయ్యా! మేము చేసిన పుణ్యమో, పెద్దలు చేసిన తపస్సో! శ్రీవైష్ణవస్వాములు – మీరిచ్చటికి దయచేసితిరి. భుజింపకున్నను మీరిచట శయనించుటే విశేషము. భోజన సామగ్రియా? పుష్కలముగ వచ్చియున్నది. నేనో! ఇంకను భుజించలేదు. మీరో! ప్రార్థించినను వలదనుచున్నారు. కారణమేమో తెలుపకున్నారు. 'ఈమె యెవతెయో?' యని సందేహించుచున్నట్లున్నది. మీకా శంక వలదు. నేను యతిరాజచంద్రుల శిష్యురాలను. అట్లు కాకున్న - ఈ యడవిలోని కుగ్రామమున నున్న నేను, మీ వంటి స్వాములకు పాకముచేయ దలపెట్టుదునా?"

"నీవు చెప్పునది విశేషమే. వేటకాంఢ్ర నడుమ, అడవిలో కుగ్రామమున నున్న నీకు, యతిరాజ దర్శన మెట్లైనది?"

---

1. వంట.

"మాయూర వర్షములులేక ద్వాదశవర్ష క్షామము కలిగెను. అప్పుడు మేము శ్రీరంగమునకు వచ్చి యుంటిమి. ఒకనాడు యతిరాజులు భిక్షకు వచ్చునపుడు వారిని చూచి మిద్దె దిగి ఆ మహానుభావునికి భిక్షనిడి నమస్కరించి నిలచి యుంటిని. ఎందుకు నిలచి యున్నావని వారడిగిరి. "స్వామీ! మీ యొద్ద భయమేలను! మిమ్ములను చూచిన నా తండ్రియో మామయో అనిపించుచున్నది. నా మనసున నున్న సంశయము ఎన్నాళ్ళు దాచియుంతును? మీరో? భిక్షమెత్తు చున్నారు. శ్రీరంగనాథుని కాచి యున్నట్లు – ఎందరో తమను కాచియుందురు. దీనికి కారణమేమి?" అని వారి నడిగితిని. వారు "సంశయాత్మా వినశ్యతి. నీవు సందేహము వదలి యడిగితివి. చెప్పెదను – వినుము : నా యొద్ద నొక మంత్రరత్నము కలదు. దానిని నా యొద్దకు వచ్చువారి కిచ్చుచుందును. ఆ గొప్ప సొత్తునకై ఇందరు కాచియుందురు" అని యతిరాజు లనిరి. 'నా కామంత్ర ముపదేశింపుడు'డని వారిని కోరితిని. వారా మంత్రమును నా కుపదేశించి, 'ఈమెభక్తి సమర్థతలు కలది' అని వెళ్ళిరి. మరియొకనాడు వారటు పోవుచుండగా 'మంత్రము మరచితిని, మరల ఉపదేశింపుడు' అని కోరితిని. వారుపదేశించిరి. 'గుర్తుగా మీ పాదుకల నీయు'డని నేను కోరగా, శ్రీరామ చంద్రులు భరతున కొసగినట్లు వారు తమ పాదుకల నిచ్చిరి. పిమ్మట నేను నా భర్తతో మా యూరు తిరిగి వచ్చితిని. అంతట వర్షములు కురిసినవి. మేమిచ్చట బ్రతుకు చున్నాము. మరల వారి దర్శనము కలుగలేదు."

యతిరాజులు వినుచుండగా నామె వారి శిష్యులతో నీ వృత్తాంతము చెప్పి యతిరాజుల యనుగ్రహము తలచి దుఃఖించెను. రామానుజుల కా సంగతి యంతయు జ్ఞప్తికి వచ్చెను. వారి యామోదమును గుర్తించిన శిష్యు లామెతో "అమ్మా! నీవు యతిరాజుల శిష్యురాలవు. వారి పాదుకల నారాధించు

మహావైష్ణవివి. కావున తెలియచేయు"మనిరి. ఆమె యాచారమును పరిశీలించు చుండిరి. తలప్పమ్మాళ్ స్నానముచేసి మడి వస్త్రము ధరించి, ద్వయమంత్రమును, గురుపరంపరలను అనుసంధించి, దైవగృహమున నుంచిన గురుపాదుకలను భక్తితో కడిగి, ఆ జలము తనపై ప్రోక్షించుకొని, వానిని అర్ఘ్యపాద్యాదులచే అర్చించి ఆ పిమ్మట వంట చేసెను. 'స్వాములారా! ఆరగించుటకు రావచ్చు'నని ప్రీతితో పిలచెను. వారు పాదుకలను చూడవలెననిరి. అక్షతలతో పూజితములై యున్న పాదుకల నామె తీసుకొనిరాగా చూచి యతిరాజులు "మంత్రము జ్ఞాపక మున్నదా? ఉండిన చెప్పుము" అనిరి. 'అది రహస్యమే! ఎట్లు చెప్పుదు'నని ఆమె సందేహింపగా, వారు 'చెవిలో చెప్పు'మనిరి.

ఆమె "ఇంత పరీక్షింపవలెనా? భుజించిన భుజింపుడు, లేకున్న మాను"డన లేదు. ఎటులైన స్వాములు ఆరగించవలెనని కోరి ఆమె మంత్రము చెప్పెను. "సరియే, ఇందు యతిరాజులను చూపుము" అని వారడుగగా, ఆమె చేత నొక దీపము నుంచుకొని – ఒక్కొక్కరి పాదములనే – పాదుకలున్న వేమో యని చూచుచు – 'వీరు కాదు, వీరు కాదని నడచుచుండెను. హనుమంతుడు సీతాన్వేషణకై రావణుని అంతఃపురమున రాక్షస స్త్రీలను చూచిన ట్లీమెయు కార్యార్థమై చూచెను. దృఢమనస్కయు, దృఢవ్రతయునై – వైష్ణవపాదదర్శనము పావనమని చూచెను. అట్లు చూచుచు, యతిరాజుల పాదముల పాదుకలు లేకుండుట, పూర్వము ధరించిన ఆనవాళ్ళుండుట జూచి "వీరే యతిరాజులు, నేనంత గుర్తుపట్టలేకుందునా? అప్పుడు కాషాయ వస్త్రములు ధరించిరి, ఇప్పుడు శ్వేతవస్త్రములు ధరించియున్నారు. దండమును లే'దని చెప్పగా, యతిరాజులు "అమ్మా! నేనే పాదుకల నిచ్చినవాడను – మంత్రము నిచ్చిన గురువును. కొన్ని కారణములచే శ్రీరంగమునుండి యిచటికి వచ్చితిని. నీవు మహాభక్తిశాలినివి. నా శిష్యురాలవే. మాకు పరమానుగ్రహపాత్రురాలవు" అనిరి. శిష్యులతో కలసి

భోజనము చేసిరి. ఆమెయు గురువునకు, స్వాములకు వడ్డించగలిగినందుకు తృప్తి నందెను. లక్ష్మణు లామెను 'కొంగు పిరాట్టి'యని పిలచిరి.

ఆమె భర్తయో దీనికి విరుద్ధముగ నుండెను. స్త్రీకి గురుభక్తియే కాదు, పతిభక్తియు ముఖ్యమే. ఆమె వైష్ణవులు భుజించిన శేషము స్వీకరించి, తన భర్తయు కృతార్థుడు కారాదా! యని తలచుచు, గురు పాదోదకమును భర్త యొద్దకు కొనిపోయి, అతని కిచ్చెను. తాను చాపపరచుకొని పరుండెను.

"ఓసీ! నీవు భుజించితివా?"

"లేదు."

"లేదా! ఎందుచేత?"

"నా గురువులు వచ్చిరి. వంట చేసితిని."

"అందరకు బెట్టితివి కదా! నీవెందుకు భుజించలేదు?"

"మీరు శ్రీవైష్ణవులైననే, వారు ఆరగించెదరు."

"అటులనా? అయినచో వైష్ణవుడనయ్యెదను."

"ఊరకనే అని, ఆ పిమ్మట మాట తప్పుట కాదు. ప్రతిజ్ఞ చేయవలెను."

"నాలో మార్పెట్లువచ్చెనో తెలియుట లేదు. నాకు వైష్ణవుడను కావలె ననిపించుచున్నది. దైవముపై ప్రమాణము చేయుచున్నాను. ఉదయమే నీ గురువుల నాశ్రయించెదను. ఈసరికి వారు నిద్రించియుందురు."

మరునా డాతడు యతిరాజులకు శరణాగతి చేసెను. వారతనికి పంచసంస్కారములు చేసి, తిరుమంత్రోపదేశము చేసి, గోవిందదాసుడని నామముంచిరి. "నే నిచట శ్వేతవస్త్రములతో నుండు యోచన లేదు. ఇంకను చేయవలసిన అనేక కార్యములున్నవి. సన్యాసిని, అట్లే వెల్లడి యగుట బాగుండును" అని తలచి రామానుజులు కాషాయ వస్త్రములు, కమండలము, త్రిదండమును శిష్యులచే తెప్పించుకొనిరి. కాని వారి నొక సందేహము

బాధించెను. పూర్వము వరదరాజులు ఇచ్చిరి. ఇచట స్వతంత్రముగా ధరింప వచ్చునా? యనునదే సందేహము. చివరకు తమ ఆరాధనలో గల వరదరాజ ప్పెరుమాళ్ సన్నిధిలో త్రిదండ కాషాయములు ధరించిరి.

"ఇట్టి భక్తిగల దంపతుల జూచితిని, వారు దైవానుగ్రహ పాత్రులు. ఇది యొక ప్రయోజనము, సిద్ధించినది" అని తలచుచు, ఎంబెరుమానారు లచట వారిచే పూజింపబడుచు, నాలుగైదు దినములుండి శ్రీరంగనాథుని యెడబాసిన దుఃఖము కొంత శాంతింప జేసుకొనిరి. తన భర్తలో నింతటి పరివర్తన దెచ్చిన తన గురువుల సామీప్య మాహాత్మ్యమును కొంగుపిరాట్టి అనుక్షణము స్మరించు చుండెను. యతిరాజులు ఆ చోటు వదలి పడమరదిక్కుగా పయనమైరి.

## సాలగ్రామము

వారు వహ్ని పుష్కరిణికి వెళ్ళి అచట మూడు దినములుండి, అచటినుండి మిథిలచేరిరి. అచట కొన్నినాళ్ళుండిన తరువాత దగ్గరలోగల మరియొక యూరు చేరిరి. ఆ యూరివారు వీరిని పలుకరింపలేదు. ఆ యూరిమధ్య విష్ణ్వాలయ మున్నది. అచట భుజింపవచ్చును. కాని పలుకరించువారేరి? ఆ యూర మాయావాదులుండిరి. 'పరబ్రహ్మ మొక్కటే సత్యము, మాయచే తక్కినవి అట్లు తోచు'నని కొందరందురు. భగవంతుడు అవాప్త సమస్తకాముడు. 'ఆత్మయో, జనన మరణములబడి అల్లాడునది. ఇది వానితో సమానమా!' యని కొందరందురు. ఎవరేమనువారైనను, రామానుజులతో పలుకకుండుటలో వారు ఏకవాక్యులై యుండిరి. రామానుజు లిట్లు తలచిరి : "వీరిలో వాదించి జయించుటకు తగినంత విద్యాయోగ్యతలు లేవు. తెలిసినవారును కారు. యజ్ఞమూర్తినివలె మిగుల తెలిసినవారిని సరిదిద్దవచ్చును. మూగవానికివలె

నేమియు నేరనివారికిని తెలుపవచ్చును. ఏమియు తెలియక పండితులమని విఱ్ఱవీగువారు వీరు. వీరికి తెలుపుట బ్రహ్మకైన తరముకాదు. కాని ఉపేక్షింప రాదు. వీరి ఆత్మలను కూడ ఉద్ధరింపవలసినదే. వీరిని శిష్యులుగా అనుగ్రహింప వలసినదే. వీరి బుద్ధి విపరీతత చెందియున్నను, ఆ మాట అనరాదు. అన్యమార్గమే అనుసరింపదగినది."

యతిరాజులు తమ శిష్యుల దృష్టిలో మొదలియాండానుకు తగ్గుచున్న గౌరవమును గుర్తించుచునే యుండిరి. దండస్థానీయుడైన వానిని గౌరవప్రదునిగా చేయుట కర్తవ్యము. ఈ యూరివారిని సరిచేయుటతో బాటు, దండస్థానీయుని గౌరవప్రవృద్ధియు సాధింపదగినది – యని తలచిరి. వారు యాండాన్‌ను పిలచి "ఈ యూరివారు ఉదయమే చెరువుకు స్నానార్థము వచ్చుచుందురు. నీవా సమయమున వారి స్నానవారిలో నీ కాలునుంచి గట్టున కూర్చొని యుండుము" అని చెప్పిరి. అత్యంత భక్తి గల యాతడు కారణము అడుగక గురువులు చెప్పినట్లు కూర్చుండెను. స్త్రీలు, పురుషులు, బిడ్డలు – అందరు ఆ తటాకమున స్నానములు చేసిరి. వారు యాండానును వెట్టివానిగా తలచిరి. కాని వాని పాదతీర్థమున శుద్ధులై, రజోగుణ తమోగుణములను విడచిరి. వారి వారి మతముల వదలి యతిరాజుల పాదములబడి 'త్వమేవ శరణం మమ' యనిరి. వారికి మనసులు వికసించినవి. భగవద్గీతయందు స్వమతము వీడరాదని చెప్పబడియున్నది కదా! మీరు మీ మతము వదులవచ్చునా?" యని యడుగగా, వారు "జీవాత్మ పరమాత్మ భైదములు పరమార్థము కానివైతే, అద్వైత ధర్మము ప్రమాణసిద్ధమైతే, స్వధర్మము – పరధర్మము అనుకొనవచ్చును. ఇంతవరకు మా యజ్ఞానముచే అవాస్తవమును వాస్తవమనుకొంటిమి. భ్రాంతి చెందితిమి. ఇది మా స్వధర్మముకాదు. మమ్ము మీ దీక్షలో జేర్చుకొని పంచసంస్కారములు చేసి మమ్ము తరింపజేయుడు" అనిరి.

అయోగ్యులు యోగ్యులైరి. సంస్కారవంతులైరి. యతిరాజుల శిష్యులైరి. కాన ఆ యూరికి 'సాలగ్రామము' అని యతిరాజులు పేరు పెట్టిరి. కొన్నా ళ్ళా యూరనుండిరి. ఆ యూరివారిలో శరణాగతి చేసినవారిలో [1]ఆంధ్రపూర్ణు లనువారిని విశేషముగా కటాక్షించి తమ అంతరంగ శిష్యులలో జేర్చుకొని వారితో కలసి శింగర్ కోయిలకు పోయిరి. అచట శ్రీనృసింహస్వామి ఉగ్రమూర్తియై యుండెను.

వారచటినుండి తొండమాన్ గ్రామము చేరిరి. అచట తొండమాన్‌నంబి వారి అనుగ్రహము పొంది యుండెను. వానిచే పూజింపబడిరి. అచటి ప్రభువు విఠలదేవుని బిడ్డకు పట్టిన పిశాచమును పారద్రోలిరి. ఆ రాజు బౌద్ధుడు. వాని భార్య సమయ మెరిగి రామానుజుల గొప్పతనము తన భర్తకు చెప్పదలచి యుండెను. ఒకనాడు వారింట భోజనమునకై రాజు బౌద్ధ సన్యాసులను అధికముగ పిలచెను. ఢిల్లీశ్వరుడా రాజు వ్రేలును నరకించెను. అవయవ లోపము గలవాని భోజనము చేయరాదని బౌద్ధ సన్యాసులు భోజనమునకు నిరాకరించిరి. "వీరందరికి నేనిచ్చు అన్నవస్త్రములు పనికివచ్చినవి కాని, నా ఇంటి భోజనము త్యాజ్యమైనదే! నా వలన వీరు గౌరవభాజనులైయున్నారు. ప్రజలెవరికి వీరియందు విశ్వాసము, భక్తి గౌరవములు లేవు. నేనును వీరిని విడచుటయే న్యాయ"మని రాజు తలచెను. రాణి "అంగహీనుడని మిమ్ము పరాభవించిన వీరు విడువదగిన వా"రనెను. "మంచియో, చెడ్డయో – ఆచార్యులను వారొకరుండవలదా!" యను సందేహము రాజును బాధించెను. రాణి "మీకు ఆచార్యుల నెరిగించెదను. శ్రీమద్రామానుజులు వచ్చియున్నారు. వారి నాశ్రయించి తరింపవచ్చు"నని చెప్పెను. రాజు అందుల కంగీకరించెను. రాణి తొండమాన్ నంబిచే రామానుజుల కాహ్వానము పంపెను.

1. వడుగు నంబి.

రామానుజు లట్లు పోవుటకు ఇష్టపడలేదు. నంబి మొదలగు శిష్యు లిట్లనిరి: "స్వామీ! మీరట్లు అనవలదు. వాని కూతురుకు పట్టిన పిశాచమును మీరు పారద్రోలితిరి. ఈ రాజు ఇంతవరకు శరణాగతి ఎరుగడు. బౌద్ధులనే నమ్ముకొని నాడు. వారు వాని యొద్దకే పోయెడివారు. అట్టివానికి తెలియజెప్పు వారెవరు? అట్టివారిని కూడా ఉద్ధరింపవలసినదే కదా! తెలియనివానిని ప్రబోధించుటయు ముఖ్యమే. క్రిమికంఠునిచే వెతలపాలైన వైష్ణవ సంఘమున కీ రాజు ప్రాపు కాగలడు. ఇచట కాలూని మీ రెందరినో ఉద్ధరింపవచ్చును. వీడు తరించి, తన ప్రజల తరింపజేయగలడు. నాస్తికులైన ప్రజలను, ప్రభువును ఉద్ధరింపుడు!" "ఇది వైష్ణవ శాసనము, అనుల్లంఘనీయము" అని తలచి సమ్మతించి యతిరాజు లచటికి వెళ్ళిరి. అంత రాజు "నా బిడ్డను బ్రతికించిన మీకు శిష్యుడనైతిని. నా వెనుకటి గురువుల వదలితిని. మీ దయాపాత్రుడ"నని నమస్కరింపగా, యతి రాజులు వానికి పంచసంస్కారములు చేసి, మంత్రోపదేశము చేసి విష్ణువర్ధన నామ ముంచిరి.

ఆ యూరి వారెల్లరు రామానుజుల దర్శించి వారికిని, వారి వంశస్థులకును గురువులుగా నుండగోరుచు పాదముల బడిరి. భాష్యకారులు వారందరికి పంచసంస్కారము చేసిరి. ఇట్లు సర్వులచే సేవింపబడుచు, వారచట కొంతకాల ముండిరి. విష్ణువర్ధనుని పూర్వ గురువులు 'మా ఆధారమును లాగివేసుకొంటి' వని యతిరాజులమీదికి వచ్చిరి. వారు పండ్రెండు వేలమంది సన్న్యాసులు. ఎల్లరు నొక్కపెట్టున వాదమునకు దిగిరి. వారు నాస్తికులు. యతిరాజులు తెర వేయించుకొని, లోన నిజరూపముతో నుండి, వారిని వాదమున నోడించిరి. అట్లు తెరవేయింపనేల? తాను సహస్రముఖుడగు ఆదిశేషుడు, నిజరూపమున నుండి వాదించుచున్నారు. కావున వారు భయపడవచ్చును. శేషుని సహస్ర ముఖముల నుండి విషవాయువులు వెడలి వారికి మృతి కలిగించవచ్చును. వీనిని నివారించుటే యతిరాజుల లక్ష్యము. ప్రతిపక్షులయందును వారి కెంత

దయ! ఓడినవారిలో కొందరు వారి పాదములబడి వేడగా వారిని స్వీకరించిరి. ఇట్లా భూమిని నాస్తికులనుండి విముక్తి చేసిరి. విష్ణువర్ధనుడు రామానుజ చరణారవిందములయందు ఆసక్తుడై యుండెను. యతిరాజులట కొన్ని నాళ్ళుండి తిరిగి శింగర్ కోవెల కేగిరి.

## సత్యము, సత్యము, సత్యము

వారచట నుండి బ్రహ్మ సూత్రములు వ్యాఖ్యానించుచుండిరి. వారికి ధరించుటకు తిరుమణి (శ్వేతమృత్తిక) లోపించెను. శాస్త్రోక్తమగు ఆ పదార్థము అచట లభించు టెట్లని వారాలోచించుచుండగా, నా రాత్రి యాదవశైలమణి యగు తిరునారాయణస్వామి యతిరాజుల స్వప్నమున సాక్షాత్కరించి "ఎంబెరుమానారా! యదుగిరిలో మంచి స్థలమున తిరుమణి దొరకును. దానిని యథేచ్ఛగా ఎత్తుకొన వచ్చును. అది శ్వేతద్వీపమందలి మృత్తిక. గరుడుడు దానిని తెచ్చి అచట వేసెను; స్వీకరించి నన్ను స్థాపించుము. నాకు తండ్రి వగుము" అని చెప్పెను.

యతిరాజులు వెళ్ళి ఎంత వెదకినను యాదవశైలమున స్వామి దొరుకలేదు. "అయో! స్వామి దొరుకలేదే! సత్యవచనుడు, సత్యకాముడు, సత్యసంకల్పుడు స్వామి వాక్యము సత్యమే యగునే! అయినను కనుపించలేదే!" యని చింతనొంది పరుండియుండగా, స్వామి మరల సాక్షాత్కరించి "నాయనా! భాష్యకారా! కల్యాణ తీర్థము గట్టు దక్షిణవైపున కొండక్రిందుగా తులసీవనమున్నది. అచట చంపక వృక్షము మొదట పుట్టలో నున్నాను – సత్యము – సత్యము – సత్యము!" అని ముమ్మారు పలికెను. యతిరాజు లట్లే వెళ్ళి చూడగా స్వామి [1]అర్చారూపము

1. విగ్రహము.

అచటనే లభించెను. అంతట స్వామి, "యతిరాజా! నన్నిచటనే ప్రతిష్ఠింపుము. ఇచట నొక నగరము తయారగునట్లు చూడుము" అని చెప్పిరి.

స్వామి యాజ్ఞతో – విష్ణువర్ధనుని సాయముతో, యతిరాజు లచట ప్రాకార మంటపములను, సలక్షణముగా కోవెలను కట్టించి, దానికి [1]'తిరునారాయణ పురము' అను పేరిడిరి. దాని నిపుడు 'మేల్‌కోట' యందురు. స్వామి సంప్రోక్షణ చేయించుటకు [2]శ్రీరంగరాయభట్టరును నియమించగా, వారు శాస్త్రోక్తముగా చేయించి స్వామి ప్రతిష్ఠ జరిపించిరి. స్వామికి సకలవైభవములు జరుగుచుండెను. ఆ వైభవ దర్శనకై వచ్చు జను లచటనే నివాసము లేర్పరచుకొనుటచే నది పెద్ద పట్టణమయ్యెను.

## ఢిల్లీ విజయము

తిరునారాయణుని దర్శించినవారే గాక, ఎల్లరు తరించుటకు, స్వామి బ్రహ్మోత్సవములు జరుపవలెను. బ్రహ్మోత్సవ కాలమున స్వామి యూరేగి దర్శన మిచ్చును. కాని తిరునారాయణుని శిలా విగ్రహము ప్రతిష్ఠితమై అచలమైనది. స్వామికి ఉత్సవ విగ్రహములు లేవే! ఉత్సవములు జరుపుటెట్లు? ప్రజల తరింప జేయుటెట్లు? స్వామి తాను (ఉత్సవులు) ఢిల్లీశ్వరునియొద్ద నున్నందున, అచట నుండి తీసుకొని రమ్మని లక్ష్మణులతో చెప్పిరి. యతిరాజులు – తన డెబ్బది నాలుగు వేదాంత సింహాసనాధిపతులతోను, పండ్రెండు వేల ఏకాంగ భక్తులతోను, లక్ష సామాన్య శిష్యులతోను, విష్ణువర్ధనుడు తన సైన్యముతో వెన్నంటిరాగా బయలుదేరి, మధ్య మధ్య మకాములు చేయుచు ఢిల్లీ చేరి,

1. శ్రీమన్నారాయణపురము.
2. యతిభట్టరు.

తమ రాక ఢిల్లీశ్వరుని కెరిగించిరి. మూల (విగ్రహము) వరులను చేరవలెనని ఉత్సవస్వామికిని యిష్టముండుటచే, స్వామి ఢిల్లీశ్వరుని మనసున ప్రేరణ కలిగించగా, నవాబు, యతిరాజుల నెదుర్కొని, "నేను మతాంతరుడను. నాతో నేమిపని యుండి పీఠాధిపతులైన మీరు వచ్చితిరి? ఈ అనంత పరివారమేమి?" యని అడిగెను.

"మాకేమి కావలెను? మీవద్ద మా దేవుని పూజావిగ్రహ మున్నది. దానికొరకీ భక్తులతో వచ్చితిని."

"మీ దేవుని విగ్రహము మా యొద్ద కెట్లు వచ్చును?"

మీ పూర్వులు దండయాత్రాకాలమున దెచ్చియుందురు."

"మా పూర్వులు, మేము జయించి తెచ్చిన వస్తువుల నొకచో భద్రపరచి యుంచితిమి. అందు చూడుడు. కలదేని దానిని మీకిచ్చుటకు అభ్యంతరము లేదు."

యతిరాజులు నవాబు మంత్రులతో వెళ్ళి వెదకిరి. కాని విగ్రహము కాన్పింపదయ్యెను. నవాబు ఏమిచేయును? రామానుజులు బసకేగిరి. వారికి చింత కలిగెను. స్వామి కనుపించి, "లక్ష్మణా! దుఃఖించుచున్నావా? నీవు పిలచిన పలుకనా? మీ స్వామిని కానా! 'మా స్వామి యున్నా'డని ప్రతిజ్ఞ చేయుము. నమ్మిక లేదా? నీతో దాగుడుమూత లాడుదునా?"

"ఎచటికి వచ్చి పిలువవలెనో సెలవీయుము."

"నేను పాదుషా పుత్రికచెంత సౌఖ్యముల ననుభవించుచున్నాను. మీరచటికి వచ్చి పిలచిన వెంటనే వచ్చెదను."

యతిరాజు లా వృత్తాంతమును ఢిల్లీశ్వరునితో చెప్పిరి.

"మీ స్వామియైన మీరు పిలచిన రావలెనుకదా! మాతో వచ్చి ప్రయత్నించుడు."

నవాబుతో కలసి యతీశ్వరులు అంతఃపురి కేగిరి. వారితో వెళ్ళినవారు ఢిల్లీశ్వరుని ఐశ్వర్యమునకు అబ్బురపడుచుండిరి. వారందరు 'స్వామి యుండవలెను. యతిరాజులతో రావలె'నని కోరుచు వెళ్ళిరి. అంతఃపురి చేరగనే యతిరాజులు "రామప్రియా! పాదుషా పుత్రి మందిరమునుండి రమ్ము" అని పిలచిరి. అపుడు కొత్త ప్రకాశము కలిగెను. పీతాంబరము ధరించినవాడును, సౌందర్యమూర్తియు, పెండ్లికుమారునివలె నున్నవాడును, ఇట్టివాడని వర్ణింప సాధ్యపడనివాడు నగు స్వామి గలగల ధ్వనులతో నడచివచ్చి యతిరాజులతొడపై కూర్చుండెను. విగ్రహ మెపుడు నడచి వచ్చెనో, అతడు మాట్లాడియు నుండునని ఎల్లరు తలచిరి. యతిరాజులు స్వామి యనుగ్రహమునకు ఆనందపరవశు లైరి.

"ఆహా! పుట్టలోనున్న స్వామి తిరునారాయణుడు నాచే ప్రతిష్ఠించబడవలెనని తలచి, కలలో కాన్పించి తానుండు చోటు చెప్పెను. నిత్యోత్సవములు జరుగు చున్నవి. ఉత్సవ వరులు కావలెనని తలచగనే, తానున్నచోటు చెప్పి, ఢిల్లీశ్వరుని ప్రేరేపించి, నాకు మర్యాదలు చేయించెను" అను సంతోషముతో తలమున్కలు కాగా స్వామిని ఆలింగనము చేసుకొని [1]'శెల్వపిళ్ళా' యని పిలచిరి. అచట చేరినవారందరును స్వామిని 'యతిరాజ పుత్రన్' అనిరి. నవాబు అచ్చెరువుపడి యతిరాజులకు శరణాగతి చేసెను. అనేక విధముల సంభావించెను. వారి ప్రవచనము విని విగ్రహమును తీసుకువెళ్ళుడని చెప్పెను. వారు విగ్రహము తీసుకొని బయలుదేరిరి. అంత రాకుమార్తె "నేనా విగ్రహమును ఎంతకాలము నుండి నా యొద్దనే నిలిపియుంచితిని! అందుచే దానిని విడచియుండలేను" అని దుఃఖించెను – తాను కూడ స్వామితో పోయెదనని భీష్మించెను.

---

1. సంపత్కుమారా!

నవాబు తన పుత్రిక దుఃఖము చూచి, విగ్రహమును తిరిగి తెచ్చుటకు దూతల బంపెను. "నీవో ప్రభువువు, ఇచ్చితివి. ఇచ్చిన దానిని తిరిగి తీసుకొన రాదు. నే నీయవలసిన కార్యమును లేదు" అని యతిరాజులు చెప్పి పంపిరి. నవాబు బలాత్కారముగా నైనను తీసుకొని రండని సైన్యమును పంపెను. యతిరాజులు అచట తమ సైన్యములోనున్న పంచములను కర్తవ్యమేమని యడిగిరి. వా రచటి వారందరిని పొదలలో దాగుడని చెప్పి, వచ్చిన రాజభటులతో "ఇచట నెవరును లేరు. మా సైన్యములోని కెట్లు వచ్చెదరు? మేము మాలలము, మా మధ్య కెట్లు వత్తురు?" అనిరి. అట్లనగానే సేనా నాయకులు పోయి ఢిల్లీశ్వరునితో యతిరాజులు కన్పించలేదని చెప్పిరి. నవాబు వారితో "యతిరాజులు విగ్రహముతో తమ స్వజనముతోనే ఉండి యుందురు. వారి కంత శక్తి యున్నది. మీరు వెళ్ళి వారిని ప్రార్థింపుడు. 'మా రాకుమార్తెను స్వామితో పిలుచుకొని పొం'డని వారితో చెప్పుడు" అనెను. వారు యతిరాజులతో నట్లే విన్నవించిరి.

"స్వామికి అనేకమంది భక్తులుండవచ్చును. వారు తురకలలో నెందులకు ఉండరాదు? శెల్వపిళ్ళను తీసుకొని వెళ్ళిన, రాకుమార్తె మృతిచెందవచ్చును. స్త్రీహత్య చేసియే స్వామిని తీసుకుపోవలెనా?" అని తలచి యతిరాజులు సమ్మతించి ఆ సైనికుల వెంట రాజునొద్ద కేగిరి. అతడును తన మాట ప్రకారము స్వామివెంట తన కుమార్తెను పంపెను. స్వామి అల్లుడు – సన్యాసి యగు యతిరాజులు వియ్యంకుడు – ఆహా! కుమార్తె ద్వారా నవాబుకు కలిగిన భాగ్య మేమనవచ్చును! కుమార్తెను, అల్లుని పంపునపుడు వారి సంరక్షణకై – తన కుమారుని – చతురంగబలయుతమైన సైన్యముతో పంపెను. వారిని జాగ్రత్తగా తిరునారాయణపురమున దించిరమ్మని పుత్రునితో పలికెను.

వారు స్వామితోను, పాదుషా పుత్రితోను, సైన్యముతోను బయలుదేరిరి. వేదపారాయణ చేయుచు వెళ్ళుచుండిరి. పాదుషా సైనికులు, పుత్రుడు "ఎన్ని వస్త్రములు, ఆభరణములు ఇచ్చినను స్వామి మాతో భాషించెనా, మీతోనే పలుకును గాని!" అని యతిరాజుల సంభావించుచుండిరి. స్వామిని, తన చెల్లిని బంగారు పల్లకీలో నుంచి, యవన రాపుత్రుడు తాను పల్లకిని పట్టుకొని నడచుచుండెను. శ్రీరాముడు రావణవధానంతరము సీతతో గలసి సంతోషముతో అయోధ్యకు పోవునట్లు, పత్నీసహితుడై స్వామి పోవుచుండెను. వారు మార్గమధ్యమున బసచేసిరి.

అప్పుడు అచట నొక గొప్ప ప్రకాశము కలిగెను – రాపుత్రి కాన్పింప దయ్యెను. ఆమె స్వామిలో జేరెను. ఎల్లరు నామెను తురకయను భేదభావముతో చూడకుండా స్వామి సాయుజ్య మందెను. అనగా భేదములేక స్వామి లోపలికి పోయి అనుభవించుట. చుట్టును చతురంగ సైన్యము లట్లే యున్నవి – రాజపుత్రి మాయమయ్యెను. ప్రేమించిన స్వామి పిలచుకొనిపోయిన నేమి చేయవచ్చును? యతిరాజునకు, రాకుమారునికి మిక్కిలి ఆశ్చర్యమయ్యెను. కోరి వచ్చినదని స్వామి సాయుజ్య మిచ్చెను. ఆ భాగ్య మామెకు లభించెనని నవాబు పుత్రుడు వారివెంట నుండి తిరునారాయణపురమునకు పోయి వారి నచట విడచెను. "యతిరాజా! మా దొక విన్నపము – మన్నించి మా కోర్కె దీర్చుడు. మేము మాటిమాటికిని వచ్చుటకు వీలుగాదు. ఈమె ఢిల్లీశ్వర పుత్రి యని తెలియునట్లుగా, మా సోదరిని అర్చారూపమున ప్రతిష్ఠింపుడు" అని కోరెను. రామానుజులును సమ్మతించి స్వామితోబాటు రాజపుత్రిని కూడా శిలారూపిణిగా స్థాపించి కల్యాణోత్సవము జరిపించిరి. వారి దక్షతతో, తిరునారాయణస్వామి అధ్యయన బ్రహ్మోత్సవములు మహా వైభవముతో జరిగినవి. వీక్షించి ప్రజానీకము తరించెను.

## అందరు యోగ్యులే!

యతిరాజుల శిష్యులు నిత్యులు (పంచమ దాసులు) వారితో నిట్లనిరి : "అయ్యా! మేము చండాలురము. స్వామి మిమ్ములను, మమ్ములను కాపాడి చల్లగా తిరిగి తెచ్చెను. మాకును స్వామిని సేవింపవలెనని యున్నది. మమ్ములను లోనికి రారాదందురేమో! మే మెట్లు స్వామిని సేవింపగలము?" అని విన్నవించిరి. రామానుజులు "అది సరియే, స్వామికి భక్తిప్రపత్తులే గాని, కుల గోత్రములు, జాతులు ముఖ్యము కాదు. జన్మచే మ్లేచ్ఛయైనను స్వామి నవాబు పుత్రిని స్వీకరించలేదా! ఆళ్వారులలో నెందరు పంచములు కారు! భక్తిప్రపత్తులు, ధర్మాచరణము యోగ్యత నిచ్చును. కులము నిచ్చును. మీరు స్వామిసేవ నిర్భయముగ చేసిరి. స్వామి తన భక్తుల నెట్లు మరచును? ఈ కోవెల మీరే నిర్మించిరి" అని చెప్పిరి. వారు ఉత్సవ సమయముల బలిపీఠమువరకును వెళ్ళి దర్శనము చేసుకొనుటకును, కల్యాణ తీర్థమున స్నానము చేయుటకును చట్టబద్ధమైన వీలు కల్పించిరి. వారు సంతోషముతో తైలమును, బియ్యమును తెచ్చి పుష్కరిణీ స్నానముచేసి స్వామిని దర్శించి తరించిరి. ఈ ఏర్పాటు - రామానుజాజ్ఞ ఇప్పటికిని అమలు జరుగుచున్నది.

పాదుషా పుత్రుడు యతిరాజులయొద్ద సెలవంది, వెడలి, తన తండ్రితో సర్వము నివేదించెను. పాదుషా "ఆహా! జగదీశ్వరుడే అల్లుడుగా లభించెను. బిడ్డ ఎట్లు సుఖపడ గోరినదో అట్లే జరుగనిమ్ము. మంచి పనిని సమర్థతతో నిర్వర్తించితి"వని పుత్రుని అభినందించెను. మనసు నిలువక తానును తిరునారాయణపురము పోయి అల్లుని, కూతుని ఆరాధనకై అమిత ధనమిచ్చి, యతిరాజుల దర్శించెను. వారిని దైవముగా కీర్తించి వారి పాదములపైబడెను. ప్రతి సంవత్సరమును తాను బందుగులతో తిరునారాయణపురమేగి, ఉత్సవము

లను తిలకించుచుండెను - స్వామి [1]బీబీనాంచారుతో వారికి దర్శనమిచ్చు చుండెను.

## రామానుజార్య దివ్యాజ్ఞ

ఢిల్లీ నవాబుకు కబీరు అను జ్యేష్ఠపుత్రుడుండెను. వాడు యీ సంగతులు వినిననాటినుండియు, "నా సోదరి స్వామియం దైక్యమైనది. నేనును స్వామిని సేవించవలె"నని తలచుచుండెను. బయలుదేరి తిరునారాయణపురమేగి స్వామిని సేవించి, యతిరాజులకు నమస్కరించి "అయ్యా! మీరు మా పురమునకు వచ్చినప్పటి నుండి మా స్వభావములే మార్పుచెందినవి. భక్తిభావ మేర్పడినది. నన్నేమి చేయుమందురు? సెలవీయు"డని కోరెను. యతిరాజచంద్రులు "ఒకచోట ఒక స్వామిని సేవించిన చాలదు. ఈ భూమి వేదభూమి. స్వామి అర్చారూపుడై ఎన్నిచోట్ల విలసిల్లుచున్నాడు! అట్టి దివ్యదేశములు దర్శింపుము. యాత్రలు శుభపర్యవసాయులు" అని సెలవిచ్చిరి. తానో యవనుడు! అచట స్వామి దర్శనము రామానుజు కృపచే సుకరమై యున్నది. కాని యితర దివ్యదేశముల నిది సాధ్యమా? యని కబీరుకు సందేహము కలిగెను. అంత యతిరాజులు "ఇది రామానుజాజ్ఞ"యని చెప్పుమనిరి. అతడు నిరాటంకముగ దివ్యదేశములు దర్శించుచు, శ్రీరంగము పోయి స్వామిని దర్శించెను. "స్వామీ! నిన్ను విడచిపోలేను. సేవించుచు నుండెదను. మోక్షమీయు"మని ప్రార్థించెను. శ్రీరంగనాథుడు, తాను యోగ్యులకు మోక్షమిచ్చువాడు కాగా, జగన్నాథుడు పతితుల నుద్ధరించువాడై యున్నందున నీలాచలనాథు నాశ్రయించుమని చెప్పెను.

---

1. నవాబు పుత్రి.

అత డట్లే జగన్నాథు నాశ్రయించి, సన్నిధి ప్రసాదము మాత్రమే ఆహారముగా కాలము గడుపుచుండెను. స్వామి యతనిని పరీక్షింపగోరి, కబీరు భుజించు చుండగా శునకరూపమున వాని యాహారము లాగుకొని పోవుచుండగా, కబీరిట్లు తలచెను : "అతిథి విష్ణుస్వరూపుడు. స్వామియే వచ్చి యుండును. రూప మేదియైననేమి? పూజనీయుడే. భగవద్గీతయందు బ్రాహ్మణుడు, చండాలుడు, గోవు, ఏనుగు, కుక్క – ఇట్లన్నిటియందు భగవంతు డున్నట్లు చెప్పబడినది కదా!" అని తలచి పాత్రమున నెయ్యి తీసికొని దాని వెనుకనే వెళ్ళి "శునకమా! నిలువుము – నేయి యిదిగో! నేయిలేని ఆహారముచే కడుపు నొచ్చును" అని అరచుచుండెను. కబీరట్లు సర్వసృష్టియందు సమభావము చూపగలిగెను. శునకము వెంట సముద్రతీరమున వెళ్ళగా, నది యొకచో నిలచి, శంఖ చక్ర గదా అభయపాణియై జగన్నాథునిగా దర్శనమిచ్చెను. వాడనన్యభక్తి ప్రేరితుడై స్వామిని స్తుతించెను. స్వామి వానికి మోక్షమిచ్చెను. ఇట్లు నారాయణుని కృపతో ఢిల్లీశుని కుటుంబమంతయు ముక్తులైరి.

## యదుశైలము

కృతయుగమున సనత్కుమారుడు వైకుంఠుని స్థాపించి పూజించిన చోటునకు నారాయణాద్రి యని పేరు కలిగెను. త్రేతాయుగమున దత్తాత్రేయుడు వేద పుష్కరిణిచెంత అధ్యయనము చేసి, స్వామిని పూజించినందున అది వేదాద్రి యైనది. ద్వాపరమున యాదవుడైన బలరాముడచట స్వామి నర్చించినందున ఆ చోటుకు యాదవాద్రి యను నామము కలిగెను. దానినే కలియుగమున యతిరాజు చంద్రులు జీర్ణోద్ధరణము చేసిరి. ఆ చోటుకు యదుశైలమను వాడుక కలిగెను.

రామానుజుల కృపచే అతని యూరయ్యెను. ఊరు నగరమాయెను. భక్త సమూహామునకు అంతులేకుండెను. స్వామికి నిత్యోత్సవములు, వారోత్సవములు, పక్షోత్సవములు, మాసోత్సవములు – ఇట్లు నిత్యకల్యాణముగ నుండెను. పుష్కరిణీ స్నానము, స్వామిదర్శనము – యతిరాజ మంగళాశాసనములతో మనుజులు భక్తులై, ప్రసన్నులై, ముముక్షువులగుచుండిరి. ఉద్ధరింపబడిన ఆత్మలు యదుశైలమునుండి వైకుంఠమునకు మార్గమేర్పరచు కొనెను. "పద్మవనము" అనుచోట నుండు నాస్తికులను, ప్రచ్ఛన్న బౌద్ధులను యతిరాజులు వాదమున వోడించి, తమ శిష్యులుగా చేసుకొనుటతో నా ప్రాంతమంతయు కలియుగ వైకుంఠమాయెను. శ్రీరంగవైభవ మంతయు, యదుశైలమునకు రామానుజులతో నడచి వచ్చినట్లైనది. శ్రీరంగమున అన్నియు అనాదిగనుండెను. యదుశైలమున అన్నియు పునరుద్ధరణమయ్యెను. గడచిన మూడు యుగములు కలిపి త్రోసిరాజు అనినట్లుండెను.

యతిరాజులు శ్రీరంగము వదలిన తరువాత, కూరేశులు, మహాపూర్ణులును ఆ చోటు వదలినంత – నచటి విషయములు అస్తవ్యస్తము లయ్యెను. అర్చకులు స్వతంత్రించిరి. భక్తులరాక తగ్గెను. ఉత్సవములు, వైభవములు కనుమరుగైనవి. కావేరి స్నానఘట్టములు బోసిపోయినవి. మఠము నిస్తేజమాయెను. ప్రజల సంపదలకు భద్రత లేకుండెను. పతివ్రతలు ఆక్రోశించిరి. సాధువులు వెతలపాలైరి. ప్రవచనములు, వాద ప్రతివాదములు విన్పింపవయ్యెను. శ్రీరంగనాథుల వైభవం లక్ష్మీముఖము వెలవెలనైనది. శ్రీరంగనాథులకు చింతకలిగెను. 'బ్రహ్మ వచ్చి చెప్పగనే, రామానుజుని ముముక్షుమార్గమును చెడగొట్టి, యమునకు సాయము చేసితిని. నేను నియమించిన వానిని నేనే దూరము చేసుకొంటిని. ఊరునుండి నిర్దాక్షిణ్యముగా వెడలనడచితిని. మొదట రామానుజులను పంపగోరినను వరదరాజు పంపలేదు. ఎట్లో రప్పించితిని.

నా మూలమున సృష్టింపబడిన క్రిమికంఠునివలన పాషండమత మారంభమైనది. రాక్షసప్రవృత్తి బలసినది. యమునకు పని కల్పింపవలసినదేనా! ఆత్మోద్ధరణ జరుగరాదా! ఇది న్యాయమా! అయినను రామానుజులు తన కార్యము నిరాటంకముగ కొనసాగించుచునే యుండెనే! బ్రహ్మతలపు వ్యర్థముకాలేదా! రామానుజుడు లేని శ్రీరంగ వైభవము పరాస్తమైనది" అని తలచి, శ్రీరంగము నుండి యొక వైష్ణవస్వామిని ప్రేరేపించి, తిరునారాయణపురమంపిరి.

ఆ స్వామి తిరునారాయణపురము వచ్చి, రామానుజులను సేవించెను. అంత యతిరాజులు వానితో "చోళరాజు పిలువ బంపినంతనే, కూరత్తాళ్వాను, మహాపూర్ణులు బయలుదేరి వెళ్ళిరికదా! ఆ సంగతి ఏమాయెను?" అనిరి. ఆతడిట్లు చెప్పెను – "వీరుభయులు వెళ్ళగనే ఆ రాజు "మేము 'శివాత్పరతరం నాస్తి'యని నిర్ణయించితిమి. మీరేమనెదరు? ఆక్షేపణలుగాని సమాధానములు గాని ఉండిన జెప్పుడు" అనెను. కూరత్తాళ్వాను "శివుడు మా స్వామి నారాయణునికి మనుమడు. తాత పెద్దయా? మనుమడా? బ్రహ్మ, విష్ణుదేవుని కుమారుడు. శివుడాతని పుత్రుడు. బ్రహ్మరుద్రాదులాతని పుత్ర పౌత్రులు, భగవద్గీతయందు చెప్పినట్లాతనికంటె అధికులు లేరు. ఆ గీత యందే 'మత్తః పరతరం నాస్తి' యని స్వామియే సెలవిచ్చెను. ఇట్టి ప్రమాణము లుండగా 'శివాత్పరతరం నాస్తి' యని చెప్పవచ్చునా? అట్లు చెప్పరాదు – అది నిజమును కాదు" అని చెప్పిరి. రాజు అనెను :

"పుత్రుడు, పౌత్రుడు అని చెప్పకుడు. అట్టివి మేము వినము. శివుడా? విష్ణువా? ఎవరధికులు? చెప్పుడు."

"ఒకడు కాలుచాచగా, మరియొకడు పురుషసూక్త మంత్రములతో ఆ పాదమును కడిగెను. ఇంకొకడు ఆ పాదజలమును శిరమున ధరించెను. వీరిలో నెవ రధికులు?"

"ఇందు క్లిష్టత యేమున్నది? కాలు చాచినవాడధికుడు; కడిగినవాడు మధ్యముడు, పాదజలము శిరమున ధరించిన వాడధముడు."

"శ్రీమన్నారాయణుడు త్రివిక్రమావతారమున పైలోకములను కొలుచుటకై తన కాలు పైకి చాపెను. బ్రహ్మ యా పాదమును కడిగెను. శివుడా తీర్థమును శిరమున ధరించెను."

"అట్లు చేసినవా డేమి ప్రయోజనము పొందెను?"

"తిరువందాది తొమ్మిదవ పాశురము అర్థమిట్లున్నది – 'బ్రహ్మ తన అల్పత్వము చూపుచు తన కమండలములోని తీర్థముతో పురుష సూక్త మంత్రము లతో స్తుతించుచు – కాలకూట విషమును భుజించినందున నల్లని గొంతు కలవాడై యుండిన శివునిమీద పడునట్లుగా కడిగెను. కర్మముచేసి, అంతఃకరణ శుద్ధి పొంది, భగవచ్చరణారవింద ధ్యానము చేయవలెను. దివ్య రేఖలచే నలంకృతమైన శ్రీపాదములందలి నఖములు సూర్యోదయమైనట్లు ప్రకాశించును. అది సూర్యకాంతి కన్న మిన్న. సూర్యకాంతి, యే అంధకారమును పోగొట్ట జాలదో, ఈ కాంతి ఆ యంధకారమును పోగొట్టును. హృదయాకాశమున భగవచ్చరణారవిందము లుంచుకొనినచో నా చీకటి తొలగును. దీనినే భాగవతమున శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు చెప్పెను. అట్టి ప్రభావము కల భగవత్పాదతీర్థమును శివుడు పరమభక్తితో శిరసున ధరించెను. శివుడు శ్మశానవాసి. భూత ప్రేతము లాతనితో చేరియుండును. శివమనిన మంగళమని యర్థము. తాను పేరునకు మాత్రమే అట్లున్నాననియు, తన పేరును సార్థకము చేసుకొనవలెననియు తలచి శివుడా జలము శిరసున ధరించెను. మనస్సున భగవంతుని తలచువారి మనోమాలిన్యము నశించును. అనగా కామ క్రోధాదు లను భగవత్పాదజలము క్షాళన చేయును. వారి పాపములను పర్వతముల రెక్కలను వజ్రాయుధమువలె ఛేదించును. అట్టి పాదములనియే బ్రహ్మ కడిగెను. శివుడు శిరమున ధరించెను."

రాజున కా పిమ్మట నేమి చెప్పవలెనో తోచలేదు. వాదజయము అసాధ్యము. నిర్బంధముగనే అంగీకరింపజేయ దలచెను.

"ఆ వివరణ లట్లుండనిండు. మే మేది నిర్ణయించితిమో అదియే శాసనము. దీనిపై చేవ్రాలు చేయుడు."

కూరత్తాళ్వాను ఆ పత్రమున "శివా త్పరతరం నాస్తి. ద్రోణ మస్తి తతః పరం" అని వ్రాసిరి. రాజునకు క్రోధము కలిగెను. "శివ మనగా [1]తూము. ద్రోణ మనగా రెండు తూములు. ఒకటికి పైగా రెండున్నది. ఎట్లు లేదని చెప్పుట?" యని పరిహసించిరి.

"మీరేవియో శాస్త్రార్థములు చెప్పుచున్నారనియు, అవి మీ మతమున నుండి యుండుననియు తలచితిని. రాజసభలోనే పరిహాసమా! ఒక తూముకంటె అధికము లేదను మూఢుడనా! భటులారా! వీరధిక ప్రసంగము చేయుచున్నారు. వీరి కండ్లను పెరికివేయుడు. బలిమినైన సభనుండి కొనిపోయి శిక్ష అమలు చేయుడు."

"నా కండ్లను తీయుమందువా? సంతోషము. నీవు తీయ మనకుండినను నేనే తీసివేయదలచితిని. నీవు చెప్పినది సహజముగనే యున్నది. నీ యట్టి పాపాత్ముని చూచిన ఈ కండ్లతో నిక భగవంతుని చూడజాలను. నేనే పెరికి వేయుచున్నాను."

అని కూరత్తాళ్వాన్ తన నేత్రములు తానే పెరికివేసి రాజువైపు విసరిరి. పెరియనంబిగారి నేత్రములు రాజభటులు పెరికివేసిరి. దానివలన వారికి మిక్కిలి బాధ కలిగెను. వారు శ్రీరంగమునకు తిరిగి వచ్చుచుండగా మార్గమున పెరియనంబిగారు వృద్ధాప్యముచేతను, బాధచేతను పరమపదించు స్థితికి వచ్చిరి.

---

1. ఒక కొలత.

అత్తుళ్ళాయమ్మగారి సాయముతో వారిని త్వరగా శ్రీరంగము చేర్చవలెనని కూరేశులు తొందరపడిరి. "నేను శ్రీరంగముననే పరమపదించిన నందరు శ్రీరంగముననే ప్రాణత్యాగము చేయవలెనని తలచవచ్చును. ఆచార్య భక్తియు, వారి చరణ ధ్యానము చాలును. ఇదియే శ్రీరంగము" అని పెరియనంబి యామునుల ధ్యానించుచు పరమపదించిరి. వారి పుత్రులు వారికి అచటనే విధి ప్రకారము సంస్కారము చేసిరి. కూరత్తాళ్వాన్ శ్రీరంగము చేరిరి" అని చెప్పెను.

"నా కొరకు ఆచార్యులు, శిష్యుడు కూడా వెళ్ళి, బాధలనుభవించి దుఃఖపడిరే!" యని యతిరాజులు చింతించి, విశేషముగా ప్రపత్తి నిరతులై, వేదవేదాంగ పారంగతులైన పదివేలమంది వైష్ణవస్వాములకు [1]తదీయారాధన చేసిరి. వస్త్రాదులను భగవదర్పితముగ నిచ్చిరి. వా రీ వార్త వినియును వెంటనే శ్రీరంగము పోవుటకు వీలు కాలేదు.

పుత్రుడు తండ్రితో జగడమాడవచ్చును; నీ ముఖము చూడనని పోవచ్చును. తండ్రి యట్లు చేయలేడు. రంగనాథుడు యతిరాజులకు తండ్రి. వారిని విడచి యతిరాజులు త్వరగా వెళ్ళగలిగిరి. శల్యపిళ్ళయో! వారి పుత్రుడు కనుక విడచి త్వరగా వెళ్ళలేకపోయిరి. కొడుకు తండ్రి యొక్క రూపాంతరము. కాన తండ్రికి తనమీదకంటె పుత్రవ్యామోహము హెచ్చు. తానచట తగు ఏర్పాట్లుచేసి వత్తునని శ్రీరంగమునుండి వచ్చిన స్వామిని కూరత్తాళ్వాన్ వద్దకు పంపిరి. కన్నులుండిన వేదశాస్త్రములు చూడనగును, స్వామిని దర్శింపవచ్చును. గురువును సేవించ వచ్చును. తనకు పవిత్ర స్థానీయుడైన కూరత్తాళ్వాను అంధుడగుట రామానుజులెట్లు భరింతురు?

---

1. భోజనాదు లిచ్చుట.

## దైవమా? గురువా?

కూరత్తాళ్వాన్ శ్రీరంగమున తమయింటనే యుండిరి. వారొక నాడు శ్రీరంగనాథుని సేవించవలెనని సన్నిధికి వెళ్ళగా, ద్వారమువద్ద రాజభటులు అడ్డగించిరి. "ఎందుకు లోనికి పోరాదు?" అనగా, "రామానుజులతో చేరిన వా రెవరిని సన్నిధికి వదులరాదని మా రాజాజ్ఞ" యనిరి. కూరేశులకు ముందు నూయి, వెనుక గొయ్యి యైనది. గురువునుబట్టి రంగనాథుని వదలుటా? స్వామిని జేరుటకు గురువును వదలుటా? యని యోచించిరి. ఒకవేళ గురువును వదల నిశ్చయించి సన్నిధికి పోయినను, గురువును వదలి వచ్చితివా? పొమ్మని స్వామి యనునేమో? రంగనాథునిచేతనగు కార్యము యతిరాజులచే గూడ నగును. కాని యతిరాజులచే నగు కార్యములు రంగనాథుడు చేయజాలడు. రంగనాథా! రమ్మని యతిరాజులు పిలచిన స్వామి వచ్చును. కావున గురుడే హెచ్చని తలచి "అహం లక్ష్మణాచార్య సంబంధీ నాత్రసంశయః" నేను లక్ష్మణాచార్య సంబంధిని – అందుకు సందేహము లేదని చెప్పిరి. అటులైన సన్నిధికి పోరాదని భటులనిరి. కూరేశులు "సేవింప నక్కరలేదు – లేదు – లేదు" అని ముమ్మారు పలికి, సకుటుంబముగా బయలుదేరి, సుందరభుజపెరుమాళ్ వేంచేసి ఉన్న వృషాచలమునకు వెడలి, అచటనే నివాస మేర్పరచుకొనిరి. కాని వారి మనస్సు శ్రీరంగనాథునియందే లగ్నమయి యుండెను.

వారచటనుండియే యతిరాజులు సుఖముగా నుండవలెనని దైవప్రార్థన చేయుచుండిరి. యతిరాజులనుండి తిరిగివచ్చిన వైష్ణవస్వామి శ్రీరంగము చేరి కూరేశులట ఉండుటలేదని తెలుసుకొని, వృషభాద్రికి పోయి రామానుజుల యోగక్షేమములు వివరించెను. "వారు సౌఖ్యముగా నున్నారా?" యని కూరేశు

లడిగిరి. "లేదు! – మిగుల దుఃఖించుచున్నారు. పూర్ణార్యులు పరమపదించి రనియు, మీకు నేత్రములు పోయినవనియు వ్యథ చెందుచున్నారు" అనగానే "గురుని వ్యధా దుఃఖములు – భక్తి వాత్సల్యములచే – తనకే కలిగినట్లు తలచు కూరేశులు "నా కన్నులు పోయినప్పుడు నేను దుఃఖింపలేదు. అయ్యో! యతిరాజులకు కలిగిన వ్యధ ప్రపంచమునకు కలిగినట్లే. నా కన్నులు పోయిన నేమి? అది పెద్ద విషయము కాదు" అనిరి.

లంకలో నుండు సీతాదేవిని హనుమ చూడబోగా, నామె శ్రీరామునకు తన తలపు కలదా? యని యడిగెను. హనుమ "ఆయనకు ఆహార నిద్రలు లేవు. నిన్నే తలచుచు కృష్ణపక్ష చంద్రునివలె నున్నా"డని చెప్పెను. సీతాదేవి "హనుమా! నీ మాటలు అమృతముతో విషము కలిపినట్లున్నవి. నన్ను తలచు చున్నాడనగా అమృతము వలెను, నాకై కృశించి యున్నాడనగా విషము వలెను నున్న"దనెను. అట్లే యతిరాజులు అప్రతిహతముగా నున్నారనగా సంతోషమును, వ్యధపడిరనగా దుఃఖమును కూరత్తాళ్వాను పొందిరి. "సృష్టికర్తయైన స్వామి నేనుండునంత కాలము యతిరాజులను అప్రతిహతముగా నుంచవలెను. వారట్లుండగా నేను పరమపదించవలెను. నా కదియే కావలెను" అని కోరిరి. "యతిరాజులను చూచితిరా? ప్రవచనము జరుగుచున్నదా?" యని వారడుగగా "వారే కదా నన్ను పంపినది! ఆహా! అదేమి వైభవము! శ్రీరంగమునకంటె అధికముగనే యున్నది" అని వైష్ణవస్వామి చెప్పెను. యతిరాజుల విజయ వార్తలు విని పుత్రునితో "ఓరీ! ఈ సంతోష వార్త చెప్పిన వీరికి జోడుశాలువలను తెమ్ము" అనిరి. రామునివద్ద నుండి వచ్చిన హనుమను సీతాదేవి సంభావించి నట్టుగనే యతిరాజులవద్ద నుండి క్షేమసమాచారముల దెచ్చిన వైష్ణవస్వామిని కూరేశులు సంభావించిరి. ఉపచారముల జేసిరి.

# కల్యాణతీర్థము

క్రిమికంఠుడు శ్రీరంగము గాక మిగిలిన చోళదేశమందలి వైష్ణవ క్షేత్రములను నాశనము చేసెను. ఇక శ్రీరంగమునకేగి దానిని కూడ నాశనము చేయవలెనని తలచి, సైన్య సన్నద్ధుడై వచ్చి శ్రీరంగ సమీప గ్రామమున విడిసెను. కాని వాని కంఠమున వ్రణములేచి బాధించసాగెను. మరునాడు శ్రీరంగప్రయాణ కాలమున కా బాధ దుస్సహమయ్యెను. దుర్మార్గులు నవ్వుచు సజ్జనులకు పీడ కల్పింతురు. చివరకు దుఃఖించుచు అనుభవింతురు. కొంచెము బుద్ధికలవారు తమ దుఃఖమునకు కారణ మేమని యోచించి పశ్చాత్తప్తులగుదురు. క్రిమికంఠుడో! – తామసుడు! వానికి పరివర్తన సాధ్యముకాదు. అందునను, వానిది నిష్కృతిలేని భాగవతాపచారము. వాడు తన పాపఫల మనుభవించుచు, తన చివరి మజిలీ శ్రీరంగము చేరకయే చచ్చెను. ఏక్షణముననో వాడు వచ్చిపడు నన్న భయము వదలి శ్రీరంగమందలి ప్రజలు, వైష్ణవస్వాములు ఆనందముతో తన్మయులైరి. శ్రీరంగనాథుని మహిమను, యతిరాజుల ప్రభావమును కీర్తించిరి. కొందరు స్వాములు వెంటనే వెళ్ళి లక్ష్మణాచార్యుల కీ వార్తను విన్నవించిరి.

“విశిష్టాద్వైతమును నాశనము చేయ తలపెట్టిన పాపి పీడ తొలగెను. అపారకరుణాంబుధి, అనన్య శరణ్యుడు, శిష్టరక్షకుడు నగు స్వామి కరుణించెను. ఇట్టి వార్త దెచ్చిన వీరికి ఏమి యిత్తును? శాలువలగప్పుదునా? ఇంత చిన్న కానుకయా! సీతను చూచివచ్చి, ఆ వార్త రామచంద్రునకు తెలిపిన మారుతి కీయదగిన కానుక రాఘవునియొద్ద లేనందున, స్వామి వానిని ఆలింగనము చేసుకొని కృతజ్ఞత వెల్లడించెను. అట్లే, నాకేకాదు – వైష్ణవ సిద్ధాంతమునకే క్షేమము కలిగెను. ఇట్టి వార్తకు ఎట్లు సంభావింతును! రుక్మిణీదేవి తనకు శ్రీహరి నుండి సంతోషవార్త దెచ్చిన బ్రాహ్మణున కేమి యిచ్చుటకు తోపక

నమస్కరించెను. నావద్దనున్న దొక రత్నము. అదే మంత్రరత్నము. మీకిదివరకే ఉపదేశమైయుండును. ఐనను మరల ఉపదేశింతును" అని రామానుజు లా స్వాములకు మంత్రము నుపదేశించిరి. "ఇది వేదతీర్థము. ఈ తీర్థమువద్ద మీరీ జగత్కల్యాణ కారకమగు వార్త వినిపించితిరి. కావున నేటినుండి యిది కల్యాణ తీర్థమని పిలువబడు"ననిరి.

## పునరాగమనము

యతిరాజులు మూలవరులైన తిరునారాయణుని, ఉత్సవమూర్తి యగు సంపత్కుమారుని దర్శించి "స్వామీ! నేనిచటికి వచ్చి పండ్రెండేండ్లు అయినది. కాలమిట్టే గడచినది. ఇచట నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవాదులు యథావిధిగ జరుగుచున్నవి. ఏ లోపమును లేదు. నీ కైంకర్యమునకు అన్ని ఏర్పాట్లు జరిగినవి. ఇక నాకనుజ్ఞ నీయుడు. కూరత్తాళ్వాను వృషభగిరియందు అంధుడై అల్లాడు చున్నాడు" అని ప్రార్థించిరి. అక్రూరుడు వచ్చి పిలువగనే శ్రీకృష్ణుడు మధురకు ప్రయాణము కాగా దుఃఖించిన గోపికలకువలె ఆ యూరివారు "యతిరాజా! మీరు ఇటనుండి వెళ్ళకుడు. జలమును వదలి మత్స్యములు జీవింపగలవా! మీ కరుణాగంగనుండి మమ్ములను వెలిచేయకుడు" అని ప్రార్థించిరి.

"మీకు శల్వపిళ్ళ యున్నాడు. వానిని సేవించుచు తరించుడు."

"మాకు మీరుగాక మరేమియు వలదు. క్షీర మెంత శ్రేష్ఠమైనను, మత్స్యము లందు జీవింపగలవా?"

"నాకును మిమ్ము వదలుట బాధాకరమే. అయినను శ్రీరంగము చేరు సమయము ఆసన్నమైనది. ఇచట నా అర్చామూర్తి నుంచి పోయెదను. ఆ మూర్తి నా జీవితకాల మిచట నాతో భాషింపుచు నుండగలదు. ఇక బదులాడక సంతుష్టి నందుడు."

యతిరాజులు తమ శిష్య ప్రశిష్యులతో పరివారముతో శ్రీరంగమునకు ప్రయాణమైరి. మొదలియాండాను గొడుగుపట్టెను. ఎంబారు, వాని తమ్ముడు వింజామరలు వేసిరి. దుందుభులు, మేళ తాళములు మ్రోగుచుండగా, వేద పారాయణలు, ద్రావిడామ్నాయ గానము చేయుచు వైష్ణవ స్వాములు వచ్చు చుండిరి. రామానుజునికి జయము జయమని ప్రజలు జయశబ్దములు చేయుచుండిరి. పువ్వుల వాన కురిపించిరి. రామానుజులు రంగనాథుని స్మరించుచు పట్టణమున ప్రవేశించి, సన్నిధికి వెళ్ళగా, స్వామియును, తాయారును తమ పుత్రుని జూచినట్లు సంతోషించిరి. అయోధ్యలో ప్రవేశించు శ్రీరాముని జూచిన ప్రజలవలె, నచటి ఆబాలవృద్ధులు, స్త్రీలు ఆనంద వారాధిలో తలమునకలైరి. లక్ష్మణులంత కూరత్తాళ్వానును చూచియే మఠమున కేగదలచిరి.

యతిరాజులు వచ్చిరని వినిన కూరత్తాళ్వాన్ పరమానందముతో లేచి, భక్తిప్రపత్తులతో సాష్టాంగపడి మ్రొక్కిరి. యతీంద్రులు కూర్చుండగా వారు నిలచియుండిరి. పండ్రెండేండ్లు అప్రతిహతముగానైనను దూరముగా నుండి తిరిగివచ్చిన గురువుల దివ్యమంగళ విగ్రహము చూచుటకు కన్నులు లేకపోయెనే యని వారికి అనిపించెను. శిష్యుని పాటును చూచిన గురునికి దుఃఖ మాగలేదు. సన్న్యాసులైనను వారి వాత్సల్యమట్టిది – ఆర్ద్రత అట్టిది. కూరేశులు తొందరగానే స్వస్థులైరి.

"స్వామీ! నా కన్నులు పోవుటకు కారణమున్నది. కర్మమిది. జన్మాంతరకర్మ కాదు. ఈ జన్మమును చేసినదే. నేను వైష్ణవధర్మ దీక్షితుడను గాకపూర్వము శ్రీవైష్ణవులు ఊర్ధ్వపుండ్రములు ధరింపగా జూచి యిదేమి వికారమని పరిహాసము చేసెడివాడను. సాక్షాన్నారాయణునియెడనైన అపచారపడవచ్చునేమోగాని, పరమ భాగవతోత్తములైన శ్రీవైష్ణవుల యెడ అపచారపడవచ్చునా! అదియును

సాధారణాపచారమా! ఊర్ధ్వపుండ్రధారణనే పరిహసించితిని. అది దూదిలో పడిన అగ్నివలె కాల్పక మానునా!"

"కూరేశా! నా కట్లు తోచుటలేదు. ముందు నీ వట్లు పరిహాసము చేసినను, పిమ్మట తెలుసుకొని పశ్చాత్తాపపడితివి. మంత్రార్థము లెరిగితివి. గురు శుశ్రూష చేసితివి. ఇంకను పాపపరిహారము, కర్మనివృత్తికాక యుండదు. నా దౌర్భాగ్యవశముననే నిన్నిట్లు చూడవలసి వచ్చినది."

## దిగువ తిరుపతి

లక్ష్మణాచార్యులు కూరత్తాళ్వాన్‌ల చేయిపట్టుకొని తిరుమల మఠమునకు పోయిరి. పిమ్మట చిత్రకూటము నుండి కొందరు భక్తులు వచ్చి గోవింద ప్రతిష్ఠ చేయుడని కోరిరి. గోవిందు డెచట నున్నాడని వారడిగిరి. "క్రిమికంఠుడు మూలవిగ్రహము దాచెను. ఉత్సవులను సముద్రమున పారవేయదలచెను. ఈ సమాచారము నెరిగిన తిల్లె యను దాసి వానితో సరసముగా సంభాషించి వానిని మెప్పించెను. వాడు నీకేమి కావలెనో కోరుకొనుమనగా, నది గోవింద విగ్రహముల నడిగెను. దాని హావభావ విలాసముల జిక్కి వా డా విగ్రహములను తిల్లె కిచ్చెను. వాని మనసు తిరుగవచ్చునని తలచి యది విగ్రహములను అర్చకుల కిచ్చి తిరుపతి కంపెను. అవి ఇచటనే యున్నవి" అని వారు చెప్పిరి. యతిరాజులు ఎగువ తిరుపతికి పోయి, ఆ విగ్రహముల దెచ్చి, దిగువ తిరుపతిలో గోవిందరాజ ప్రతిష్ఠ జేసి తిల్లెచే కాపాడబడినందున స్వామి తిల్లె గోవిందరాజని పేరుంచిరి. తిరుమలయందును, గోవిందరాజ సన్నిధియందును ఆళ్వారుల అర్చనలు జరుగునట్లు ఏర్పాట్లు చేసిరి. శిష్యులకు ప్రవచనము చేయుచు, తిరుమంత్రార్థము, బ్రహ్మసూత్ర భాష్య కాలక్షేపములు చెప్పుచు

కొంతకాల మచట నుండిరి. కైంకర్యములకై అచట తగు శిష్యులను నియమించి, అధికార పరిధులు నిర్ణయించిరి. అవశ్య సేవలకు నిరంతరాయమగు నేర్పాట్లు చేసిరి.

## భక్తవరదుడు

వారొకనాడు కూరేశులతో ననిరి :

"కూరేశా! నిన్ను చూచుటకు దుఃఖము కలుగుచున్నది. కాంచీపురి స్వామికి వరదుడని సార్థకనామ మున్నది. అడిగినవారికి లేదనక ఈప్సితార్థము లిచ్చువాడు. కాన నేత్రముల తిరిగి ప్రసాదించుమని ప్రార్థింపుము. అనన్య భావముతో ప్రార్థింపవలెనని నా వలన వినియుంటివి కదా! వరదునిపై స్తోత్రములు చేయుము. గ్రంథములు రచింపుము. కన్నుల నిచ్చును. క్రిమికంఠుని జూచిన కన్నులు వలదంటివి. యతిరాజును చూచుటకు క్రొత్త కన్నులు కావలెననిపించుటలేదా! భగవద్గీతయందు చెప్పినట్లు కరణ కళేబర సంబంధము చేతనే కదా శ్రవణ మనన వీక్షణాదులు చేయుట! ప్రకృతిధర్మమున్నది. శరీరము వలదనిన నెట్లు? ఎంతవరకు వేనితో కార్యమో అంతవరకు వానితో నా పనులు చేయింపవలసినదే. భార్య యుండిననే కదా ఔషధపానాదులు, అతిథి అభ్యాగత సేవ జరుగునది! నా శిష్యుడవై యుండియు, పవిత్రస్థానీయుడవై యుండియు, పూర్వమువలె వీక్షింప వీలుకాకుండిన నెట్లు! కావున స్వామిని స్తుతింపుము."

"స్వామీ! నేనేమి వ్రాయగలను?"

"గురు సన్నిధానమున నైచ్యానుసంధానము చేయదగినదే. విద్వాంసుడవు – నీకు తెలియదా! స్వామిని స్తోత్రము చేయుము."

"స్తుతించిన, కన్నులు వచ్చునా?"

"ఏమి? సందేహమా! స్తుతింపుము – కన్నుల నిచ్చునో, లేదో!"

కూరేశులు స్వామిని స్తుతించిరి. "వరదా! భక్తవరదా! నీతో సమానులు లేరు. ఇక నిన్ను మించిన వా రెవరుందురు! భగవద్భక్తులు పలు విధములు – స్వాభావికములు. నే నల్పుడను. జ్ఞానము, భక్తి లేనట్టివాడను, నన్ను కాపాడు మనుటయు న్యాయము కాదు. మీరు కరుణాసముద్రులు కాన, కాపాడగోరు చున్నాను. 'కర్మ, జ్ఞాన, భక్తులు లేక కడతేర నగునా?' యని యడుగుదునేమో! శ్రీరామచంద్రుని కాలమున తృణములు సహితము తరించి వైకుంఠమున కేగెను. అవి ఏ కర్మము చేసినవి? నన్నును అట్టి జడపదార్థముగనే కాపాడుము. స్వామీ! ఏమి మాయయో! మరణకాలమున నందరు చుట్టు జేరుదురు. కన్నులనీరు నించుచు బందుగులుందురు. అంత్యకాలము – నారాయణస్మరణ చేయుమని చెప్పక, తమ కేమి ఏర్పాటు చేయుదువని యడుగుదురు. స్నేహితుడు తానెవరో గుర్తింపుమనును. కాలపాశమున బంధింపబడి బదులు చెప్పజాలని దశ వచ్చును. తాను పోయిన, తన పుత్రుని గతి ఏమనుకొనునేగాని, 'అనేక పాపముల జేసితినే! ఏ మార్గమున పోవుదునో, గతియేమి!' యని తలవరు. వరదా! భక్తవరదా! రక్షింపుము."

కూరేశులు వరదరాజస్తవము చేసి స్వామికర్పించిరి. స్వామి అంగీకరించి "కూరేశా! నీ స్తోత్రము నంగీకరించితిని. నీవు నిస్పృహుడవు. నీకేమి కావలెను? నన్ను చూచుటకు కన్నులు కదా! దివ్యదృష్టి నిచ్చితిని. దానితో నన్ను సేవింప వచ్చును" అనెను. తెల్లవారగా యతిరాజులు వచ్చి కూరత్తాళ్వాన్ వరదరాజస్తుతి జేసెనని విని "వరదుడు వచ్చియుండునే! నీకు కన్నులు నిచ్చెదనని చెప్పలేదా?" అని అడిగిరి. కూరేశులు "ప్రకృత ప్రపంచమును చూచు కన్నుల నీయలేదు. దివ్యజ్ఞాన చక్షువుల నిచ్చెను. జ్ఞానముచే ముక్తికరతలామలకము కదా!" అనిరి.

భాష్యకారులు "ఇచటనే యుండి స్వామిని స్తుతించి రప్పించుట వరదున కిష్టముకాలేదు. కంచికే పోయి అడుగుదము" అని కూరత్తాళ్వాన్‌ను కంచికి పిలచుకొనిపోయిరి. అట్లు వెళ్ళి కూరేశులు, యతిరాజులు లేని సమయమున వెళ్ళి "స్వామీ, వరదా! నా శిష్యుడైన నాలూరాన్ క్రిమికంఠుని వద్ద నుండెను. వానిని మన్నింపుము. వాడు చెడరాదు. నేనే లోకమునకు పోయిన, వాడు కూడ ఆ లోకమునకు వచ్చునట్లు అనుగ్రహింపుము" అని కోరగా, కరుణా సముద్రుడగు వరదుడు "అట్లే జరుగును" అని అనుగ్రహించెను.

యతిరాజులు వచ్చి స్వామి సన్నిధికి రమ్మని పిలువగా కూరేశులు "నన్ను మన్నింపుడు. నేను వెళ్ళి నా శిష్యుడు నాలూరాన్ చెడరాదని – నేనే లోకమునకు పోయిన వాడును అదే లోకమునకు రావలెనని స్వామిని కోరితిని. జ్ఞాననేత్రముచే సదా స్వామిని చూచుచునే యున్నాను కదా యని అట్లు కోరితిని" అనిరి. నాలూరాన్ తనను అడుగకపోయినను శిష్యుని ఉద్ధరించుట గురుధర్మము కనుక వారట్లు కోరిరి. శిష్యునియందు స్వామిదయను ప్రసరింపజేసిరేగాని, తనకు కన్నుల నీయుమని ప్రార్థింపలేదు.

అంతట ఎంబెరుమానార్ తన శిష్యుడు తనను చూడ వీలుకాలేదు. నిరీహుడగు కూరత్తాళ్వాను తనకై స్వామి నర్థింపడని తలచి "వరదా! స్వామీ! కూరేశునితో, నేను రానిదే వరమీయనని చెప్పియుండరాదా! ఎవనికి జ్ఞాన నేత్రముండునో వానికి మోక్షమనుట నిజమే. కాని కూరేశునికా జ్ఞాననేత్రము చాలదు. నా శిష్యుడు నన్ను వీక్షింపవలదా? నా సంబంధమువలన పోయిన కన్నులు నా సంబంధముననే కదా రావలసినది! అందుచే వానికి వేరు కన్నుల నిచ్చిననే నే నిచటనుండి కదలుట. అంతవరకు నీ సన్నిధిని ప్రాయోపవేశము చేసెదను" అనగా, స్వామి సమ్మతించి కూరత్తాళ్వానుకు నేత్రములను

అనుగ్రహించెను. కూరేశులు కనులతో స్వామిని దర్శించి "ఆహా! దివ్యమంగళ విగ్రహము! స్వామీ! నీ విచ్చిన నేత్రములతో నిన్ను చూచుచున్నాను" అనిరి. యతిరాజులవైపు చూచి "చంద్రోదయమైనట్లుగా సకల తాపములు పరిహారము లైనవి. ఊర్ధ్వపుండ్రములు, త్రిదండము, యజ్ఞసూత్రము, పద్మనేత్రములతో - అప్రతిహతముగానున్న నా స్వామీ! మిమ్ములను మరల వీక్షింపనైనది" అని దండప్రణామము సమర్పించిరి. యతిరాజులు కూరేశులతో శ్రీరంగము తిరిగి వచ్చిరి. పంచమోపాయ మహిమ అట్టిది.

## ద్రావిడ వేదోద్ధరణ

నూట ఎనిమిది తిరుపతులను పునరుద్ధరించుటకై మరల దివ్య దేశ యాత్ర చేయుచు యతిరాజులు ఆళ్వార్ తిరునగరికి సమీపమున నుండు పుళియంగుడి గ్రామమున కేగిరి. అచట నొక ఇంటి వాకిటి నొక బాలిక నిలచియుండగా నా చిన్నదానిని చూచి "బాలికా! ఆళ్వార్ తిరునగరు ఇచటి కెంత దూరము?" అని యడిగిరి. ఆ బాలిక భాష్యకారులతో "మీరు తిరువాయ్‌మొళి చదువలేదా?" యనెను. "ఊరెంత దూరమని మే మడుగగా, 'తిరువాయ్ మొళి చదువలేదా?' యనుచున్నావు. ఆ యూరికి, తిరువాయ్ మొళికి సంబంధమే"మని యతిరాజు లనిరి. అంత నా బాలిక తిరువాయ్ మొళి పాశుర మొకటి చదివి "దీనిలో నమ్మాళ్వారు పుళియంగుడికి - తిరునగరికి కూతవేటు దూరమని చెప్పిరి. తెలియదా?" యనెను. లక్ష్మణులు "నమ్మాళ్వార్ల అవతారస్థానము తరువాత దర్శించవచ్చును. ముందు ఈ బిడ్డను కన్నవారిని చూడవలెను" అని తలచి ఆ బాలికను పిలచుకొని వారింటికి వెళ్ళి, ఆ బాలిక తల్లిని వంట చేయుమని - వరదునికి నివేదించి, తాము ఆరగించిరి. దేవతలకైన లభింపని అనేక విషయము లా బాలికకు మనఃపూర్వకముగా నుపదేశించిరి.

పిమ్మట [1]కురుకాపురమునకు పోయి నమ్మాళ్వార్లను, [2]తిరుప్పుళిని సేవించి, ప్రపన్న సంఘపు మేలును, నమ్మాళ్వార్ల పేరును సార్థకముగా నుండగోరి, "నాకు పుత్రులుండియుండిన ఆళ్వార్ల పేరు పెట్టి యుందునే!" యనిరి. అంత తిరుమలనంబి పుత్రుడు పుళ్ళాన్ అనువారు "నేను మీకు పుత్రునిగా ఉన్నాను" అనిరి. భాష్యకారులు సంతోషించి "మంచిది, రమ్ము" అని పిలచి, తన చేతిని పుళ్ళాన్ తలపై నుంచి ఆశీర్వదించిరి. చింతచెట్టునకు ప్రదక్షిణించి, నమస్కరించిరి. నమ్మాళువారిని తలచి "స్వామీ! మీరు సాయించిన తిరువాయ్ మొళి గ్రంథము నశించిపోవుచున్నది. [3]చేతనులు తరించుటెట్లు? పారాయణ చేసినవారెల్లరు పరమపదించుచున్నారు. సామాన్యులు ఇందలి యర్థము గ్రహింపలేక పారాయణ చేయుటయే మానిరి. గ్రంథము నశించినది. నాకు మిక్కిలి విచారము కలుగుచున్నది. నాపై దయయుంచి తామా గ్రంథమును తిరిగి పూర్తిగా సెలవీయుడు. చేతనులు వెంటనే గాక దేహాంతమందు ముక్తిపొందునట్లు అనుగ్రహింపుడు' అని ప్రార్థించిరి.

నమ్మాళ్వారులకు దయగలిగి "రామానుజా! అట్లే యగు గాక! నాచుట్టు తెరలగట్టింపుము. నేనందు శేషుడనై యుండి గ్రంథమును తిరిగి చెప్పెదను" అని చెప్పగా, రామానుజులట్లే తెరలగట్టించి, నమ్మాళ్వార్లందు ఆదిశేషుడై యుండి తిరువాయ్ మొళి చెప్పుచుండగా, తాము లిఖించిరి. గ్రంథము పూర్తికాగానే ఆళ్వారులను స్తుతించి తా నా గ్రంథమును వ్యాప్తిగావించి చేతనుల తరింపజేతునని విన్నవించిరి. పుళ్ళాన్‌ను పిలచి "నీకు 'తిరుక్కురుగురై పిరాన్ పుళ్ళాన్' అని పేరుపెట్టితిని. నమ్మాళ్వార్లు సెలవిచ్చిన యీ తిరువాయ్ మొళి

---

1. నమ్మాళ్వార్ల జన్మస్థలము.
2. వారు జన్మించిన చింతచెట్టు.
3. జీవులు.

ప్రబంధమునకు వ్యాఖ్య రచింపుము" అని చెప్పిరి. పుళ్ళాన్ గురునాజ్ఞను అనుసరించి "ఆరాయిరప్పడి" రచించిరి. యతిరాజు లద్దానిని నమ్మాళ్వార్ల పాదములయందుంచి, వారి ఆమోదముతో "పుళ్ళాన్! స్వామి సంతసించిరి. నీ గ్రంథమును చేతనుల కుపదేశింపుము!" అని చెప్పిరి.

తమ పర్యటన కొనసాగించి, అనేక గ్రామములు సంచరించుచు వారివారిని అనుగ్రహించుచు, మంగళాశాసనము చేయుచు, శ్రీరంగమునకు తిరిగి వచ్చిరి. శిష్యులకు ప్రవచనము సాగుచుండెను. ఆసేతు హిమాచలము వారియాజ్ఞ అభివర్ధిత మగుచుండెను. శ్రీరంగక్షేత్రము మరల వైభవములతో వర్థిల్లుచుండెను.

యతిరాజులు శ్రీమన్నారాయణుని యాజ్ఞదలచి, విశిష్టాద్వైత సిద్ధాంతము, వేదమార్గములను స్థిరముగ ప్రతిష్ఠించుటకై తన శిష్యులలో సమర్థుల నెంచి, డెబ్బదినాలుగుమందిని సింహాసనాధిపతులుగ నేర్పరచిరి. వారిలో తిరుక్కురుగురై పిరాన్ పుళ్ళాన్, నడాదూరాళ్వాన్, మొదలియాండాన్, కిళాంబియాచ్చియాన్ – అను నల్వురిని ఉభయవేదాంతములకై ప్రత్యేకించిరి. అందున తిరుక్కురుగురై పిరాన్ పుళ్ళాన్‌కు సిద్ధాంత స్థిరీకరణకై నిర్ధారించిరి. ఇట్లు 74 మంది సింహాసనాధిపతులును, నలుగురు భాష్యసింహాసనాధిపతులును, ఏడువేల ఏడు వందల సన్న్యాసులును, పన్నెండువేల పరమైకాంగులును, ఇంకను అనేకమంది ప్రశిష్యులును కొలువగా రామానుజులు పరమ వైభవోపేతులై యుండిరి. పుళ్ళాన్ వారిని అష్టోత్తరశతనామముల పూజించిరి.

## కూరేశులు పరమపదమున కేగుట

భగవత్సంకల్పముచే నొకనాడు కూరేశులు ఒంటరిగా శ్రీరంగనాథుని దర్శింప నేగిరి. స్వామికి ఆయనయందు అనుతాపము కలిగెను. "ఆహా! ఏమి ఈతని ఆచార్య పారతంత్ర్యము! యతిరాజులు నా ప్రాణము కాగా, నీతడు

వారి ముఖ్య శిష్యుడు. వారి ప్రాణముల కాపాడినవాడు" అని ప్రీతిచెంది కూరేశుల జూచి "నీ కేమి కావలయును?" అని యడిగెను.

"స్వామీ! నాయందు ప్రసన్నుడవై మోక్ష మిమ్ము."

"ఇచటనే యుండరాదా?"

"శ్రీహరీ! మిగుల శ్రాంతుడనైతిని. నీ లీలావిభూతిలో చాల కాలముంటిని. ఇక పరమపదమునకు పిలచుకొనుము. ఇదియే నాకు కావలసినది."

శ్రీరంగనాథుడు సమ్మతించెను. యతిరాజులా సంగతి విని, కూరేశులను వదలి యుండు టెట్లా! యని చింతించిరి. కూరేశులతో "మీరు పెరుమాళ్ళ సన్నిధికి వెళ్ళితిరా? వారి నేమడిగిరి? నాతో కలసియేకాని ఒంటరిగా పోవతగునా?" అనిరి. కూరేశులు బదులాడలేదు. "అట్లేల యడిగితిరి?" అని లక్ష్మణులనగా, "భగవత్సంకల్పము. తమ కరణ సంబంధముచేత వైకుంఠమున కేగు భాగ్యము కలిగెను. పొరబాటైన మన్నింపుడు" అని కూరత్తాళ్వాన్ అనిరి. భాష్యకారు లాతనిని పోవలదనిన స్వామి యాజ్ఞకు భంగము, కూరేశుల మనోరథమునకు ఆటంకము కలుగునని తలచి, "సరియే, వైకుంఠమున కేగెదరా! గొప్ప విషయమును పలుమార్లు చెప్పవలెనందురు. ద్వయమంత్రమును మరల నుపదేశింతు"నని చెప్పి అట్లే ఉపదేశించిరి.

"రంగనాథుని సెలవాయెను. మీరు తృప్తిగా చెప్పినచో సుఖముగ పోయెదను."

"నే నప్రతిహతముగ నుండగా, పోవుటకు మీకు సంతోషముగా నుండును. తరువాతనైన దుఃఖము. స్వామి అనుజ్ఞ నిచ్చెను – పొండు."

"అట్లు కాదు. మీరు 'సుఖముగా పోయి పరమపదమున నుండు' మని యనవలెను. అప్పుడే నేను పోవలెను."

“మీరు సుఖముగా పోయి పరమపద మనుభవింపుడు.”

అట్లు కూరత్తాళ్వాను ఎంబెరుమన్నారుల సెలవందిరి. అప్పటి నుండి రామానుజులు ప్రవచనము మాని కూరత్తాళ్వార్ల మాటలనే చెప్పసాగిరి. “స్వామి సెలవిచ్చెను. ఒక నట్టి శిష్యుడు లభించునా?” యని కూరేశుల గుణగణములనే పలుమార్లు తలచసాగిరి. కూరత్తాళ్వాను ఇంటికేగి తన పుత్రుల నిద్దరను పిలచి వారి కిట్లు ఉపదేశించిరి – “బిడ్డలారా! మీ తల్లి పరమ పతివ్రత. నా కొరకై తాను చివరగా దాచిన సువర్ణపాత్రను కూడ ఇచ్ఛాపూర్తిగా వదలిన సాధ్వి. నాకై స్వామిని ప్రసాద మడిగినది. నేను పోవుచున్నాను. మీ తల్లి మాటలు వేద వాక్యములుగా పాటించుడు. ఉచితములు, విహితములునైన క్రియలనే చేయుచుండుడు. బిడ్డలారా! వైష్ణవుడను అర్థము సరిగా వర్తించుటకు ఉడయవరుల చరణ సంబంధము, ఉభయ వేదాంతముల సంబంధము నుండవలెను. వైష్ణవుల యెడ త్రికరణముల అపచారము చేయకుడు. నామమాత్ర వైష్ణవులు కాకుడు. కర్మ, జ్ఞాన, భక్తి మార్గములకంటె ‘సర్వధర్మాన్ పరిత్యజ్య’ యను శ్లోకము ద్వారా ప్రపత్తిని స్వామి ఏర్పరచిరి. ‘ఈడుపడితిమి స్వామీ! కాపాడు’మని నమ్మియుండు వైష్ణవులయెడ మనసున నొకటి తలచుట, నోటితో నొకటి చెప్పుట, వేరు రీతిగా చేయుట జరుగరాదు. ఇవి వేర్వేరుగా నుండుట దుర్మార్గుల లక్షణము. ఎప్పుడును ఏ వైష్ణవుడును చెడవలెనని తలపకుడు. వారిని దూషింపకుడు, బాధింపకుడు. ఏమియో చెప్పితినని తలపకుడు. వైష్ణవుల యెడ అనుకూలురై యుండుడు. తల్లిమాట వినుట పైలోక ప్రాప్తి హేతువు.”

అంత వారి పుత్రులు వారి పరమపదప్రాప్తి సమయము వచ్చెనని తలచి జాగరూకులై సేవించుచుండిరి. కూరేశులు తమ ప్రధాన శిష్యుడగు పిళ్ళై ఆళ్వాన్ ఒడిలో శిరస్సును, ఆండాళ్ళమ్మ ఒడిలో పాదములు నుంచుకొని పరుండిరి.

అనాయాసముగా మరణము లభించవలెనన్న – ప్రాకృత విషయములపై మనసు చొరనీయక భగవత్పాదములయందు – ఆచార్య పాదములయందు మనసు నిశ్చలముగా నిలిపియుంచవలెను. ఈ రెండును కలిగి భక్తి యుండిన చాలునని వాయుపురాణము చెప్పుచున్నది. అట్లే కూరత్తాళ్వాను ఏ విషయమున కొదువలేక భగవచ్చరణములు, యతిరాజ పాదములు మనసున నిలిపి పుత్రుల సమక్షమున శరీరము విడచి పరమపదమున కేగిరి.

సంస్కారములు చేయించువారు శ్రీభాష్యకారులు. చేయువారు భట్టరులు. యథావిధిగా సకలసంస్కారములు జరిగినవి. అంత భట్టరు శ్రీరంగనాథుని సన్నిధి కేగగా స్వామి "నాయనా! కన్నతండ్రి పోయెనని చింతింపకుము. నిన్ను స్వీకరించిన తండ్రిగా నేనున్నాను. నేను పోవువాడను కాను" అని ఓదార్చిరి. రామానుజులు "పుట్టిన శరీరము నశించునని, కర్మానుబద్ధుడైన యాత్మ తిరిగి శరీరధారణ చేయుననియు భగవద్గీతలో చెప్పబడెను. మీ తండ్రి పార్థివ శరీరము నశించినది. వానికి శాశ్వత వైకుంఠ ప్రాప్తిచే జన్మరాహిత్యము కలిగినది. భగవదనుగ్రహపాత్రుడు" అని చెప్పి, పరాశరభట్టరు చేయిపట్టుకొని తీసుకొని వెళ్ళి, ఎంబార్‌ను పిలచి "గోవిందా! నీ చేతిని చాచుము. పరాశరభట్టరు చేయి పట్టుకొనుము. నా పిమ్మట విశిష్టాద్వైత సిద్ధాంతము నిలుపుటకు తగినవానిగా నీ వీతని తీర్చిదిద్దుము. నీకీతని నొప్పగించితిని" అని చెప్పిరి.

ఉడయవరుల చరిత్రమున కూరేశుల గాథ ముఖ్యమైనది. సంపత్కరము, దినదినము ఐశ్వర్యమును వృద్ధి చేయును. ముక్తిప్రదము, పుత్ర పౌత్ర లాభమును, సకల పాపక్షయమును కలిగించును. పునర్జన్మ భయము తొలగించును. సంపూర్ణ భగవదనుభవము కలిగించును. భక్తిప్రపత్తులతో నీ గాథ చెప్పువారికి, వినువారికి, పారాయణ చేయువారికి శ్రీరంగనాథుని కృపవలన సకల సమృద్ధి కలుగునని పెద్దలు చెప్పుచున్నారు.

# కొండమీద వానికి చీటి

యతిరాజులు మరల పర్యటించునపుడు తిరుమల కొండ క్రింద నుండి పోవుచు నొకచో మజిలీ చేసిరి. వారి శిష్యులు అటుపోవు గొల్లెతను చూచి, 'పెరుగు నిచ్చెదవా?' యని యడిగిరి. తొండ్యార్‌కొండి యను నామె మనఃపూర్తిగా పెరుగునిచ్చెను. బుద్ధిశాలినియు, మంచికాలము ప్రాప్తమైనదియు నగు నామె, వారెవరో గొప్పవారై యుందురని తలచి, పెరుగునిచ్చి, చేతులుకట్టి నిలుచుండెను. శిష్యులు ఆ పెరుగు వెల యెంత యని అడుగగా "నాకు సంసారబంధము వదిలించి మంచి గతికి పోవునట్లు చేయుడు. అంతేగాని వెల వలదు" అని కొండి కోరెను. యతిరాజులా మాటలు విని అచటికి వచ్చిరి. ఆమె వారికి నమస్కరించెను.

"నీకు మోక్షము కావలెనని, దానిని కోరవలెనని తోచినది. నీవు మోక్షము పొందతగుదువు - కాని దానిని నేనిచ్చుట కుదరదు. ఆ కొండమీద ఉన్న వాని నడుగుము."

"ఆయన నాతో పలుకునా! మీరు గొప్పవారు. మీరు చీటి వ్రాసి ఇచ్చిన వారి కిచ్చెదను."

యతిరాజు లామె కోరినట్లు వేంకటేశ్వరునికి చీటి వ్రాసి ఇచ్చిరి. ఆ చీటి నామె ఏమిచేయునని శిష్యులు తలచుచుండగా నామె దానిని మహాప్రసాద మని తీసుకొని, నిస్సంశయ బుద్ధితో వారికి నమస్కరించి లేచి ఆ జాబును తలపై ధరించి, ఏడుకొండలెక్కి, వేంకటేశ్వరుని సన్నిధికేగి, దేవళమునకు ముమ్మారు ప్రదక్షిణించి, నమస్కరించి, పెరుమాళ్ళకు అందజేయుడని కోరి, యా లేఖను అర్చకస్వాముల చేత బెట్టినది. వారు దానిని స్వామియొద్దకు కొనిపోగా, స్వామి చేయిచాచి చీటి తీసుకొనెను. విశిష్టాద్వైత ప్రతిష్ఠాపనా

చార్యులు, ఉభయవేదాంత ప్రవర్తకులు, భాష్యకారులు నగు వారు సమ్మతిలేఖ నీయగా, స్వామి తీసుకొని, 'కొండికి మోక్షము నిచ్చితి' ననెను. దివ్యకాంతులు వెదజల్లుచు వైకుంఠము నుండి విమానము వచ్చెను. దివ్యపురుషులు ఆమెను లోనికి రమ్మనిరి. కొండి అందు కూర్చుండి పరమపదమున కేగెను.

"ఈమెకు కర్మ, జ్ఞాన భక్తి ప్రపత్తులున్నవా? పెరుగు నిచ్చినంత మాత్రమునకే మోక్షమా? యతిరాజు లిట్లు లేఖ వ్రాసి ఇచ్చునా?" యని వేంకటేశ్వరుడు తలచెనా? ఎంతమాత్రమును కాదు. "ఈతడు నా యాజ్ఞచే వైకుంఠమునుండి వచ్చి యిచట సకలకార్యములు నిర్వహించినాడు. ప్రతిగా నన్నేది అడిగినను చేయవలసినదే. అయినను గొల్లెత అచంచల విశ్వాసముగల యోగ్యురాలు. ఈమె నాతడు పంపెను – మోక్షమిచ్చితిని" అని స్వామి తలచెను.

## ప్రపన్న గాయత్రి

కాంచీపురమున నొక వైష్ణవ గృహమున నొక మూగబిడ్డ జన్మించెను. ఆ బాలుడు వర్చస్వి, బుద్ధికలవాడై ఆరేండ్లు పెరిగెను. ఉన్నట్లుండి ఆ బిడ్డ ఎటుపోయెనో గాని కన్పింపడయ్యెను. మరి మూడేండ్లకు ఆ బిడ్డ ఆడుకొనుచు వీథిలో తిరుగుచుండగా కనుగొనిరి. పోయిన బిడ్డ దొరకెనని ఎల్లరు వారిని చూడవచ్చిరి. మూగబిడ్డ ఆశ్చర్యకరముగ వాచాలుడయ్యెను. "మూడేండ్లు కన్పింపవైతివి. ఎచ్చటికి పోయితివి? ఇపుడెచటనుండి ఊడిపడితివి? మాటలెట్లువచ్చె" నని వారడిగిరి. అంత నా బాలు డిట్లు చెప్పెను. "నేను క్షీరాబ్ధికి పోయి అందు శయనించియుండు స్వామిని సేవించుచు నుంటిని. స్వామి శేషునికొక యాజ్ఞ నిచ్చెను. శేషుడే శ్రీపెరుంబుదూరులో పుట్టెను. ఆయనయే రామానుజులని అచటి వారనుకొనుచున్నారు" అని చెప్పి తలిదండ్రులు పిలువ రాగా నా బిడ్డ

మరల అదృశ్యమాయెను. అతడు బిడ్డకాదు, రామానుజుల దివ్యప్రభావము తెలుపుటకు వచ్చిన దేవతయే యని అచటివారు తలచిరి. ఇట్టి గాథలు అనేకము. ఇవి యెల్ల శ్రీమద్రామానుజాచార్యుల శేషాంశ సంభవతను రూఢిచేయునవై యున్నవి.

తిరువరంగత్తముదనార్ అనువారు "రామానుజనూత్తందాది" యను గ్రంథము ద్రావిడ భాషలో రచించిరి. దానికి ప్రపన్నగాయత్రి యని పేరు. అది శరణాగతులు, ముముక్ష కాంక్షులు తప్పక పఠించి, ఆ పిమ్మట వాలాయిరమను తిరువాయ్ మొళి పఠింపనగును. ప్రపన్నగాయత్రి యతిరాజులపై చేయబడిన స్తోత్రము. దానిని ముదనార్ సమర్పింపగా రామానుజులు "నాపై గ్రంథమా? అదెట్లు? స్వామిపై రచింపకపోయితివా? ఏవో అతిశయములు వ్రాసితివా?" అనియు, ముదనార్ తిరిగి తిరిగి ప్రార్థింపగా నా గ్రంథమును చదివిరి. "సరియే, అంగీకరించితిని" అని అనుగ్రహించిరి.

## ఆజ్ఞాపరిపూర్తి

శ్రీమద్ రామానుజాచార్యులు జన్మించి నూట యిరువది యేండ్లాయెను. "నేను ఈ లోకమునకు వచ్చి చాల యేండ్లాయెను. ఇచటి కార్యములు పూర్తిచేసి స్వామియాజ్ఞను నెరవేర్చితిని. ఇక వైకుంఠమున కేగుట మేలు" అని తలచి ఒకనాడు శ్రీరంగనాథుని సన్నిధికి వెళ్ళిరి.

"స్వామీ! నేనిచటకు వచ్చి నూట యిరువది ఏండ్లయినది. తిరిగి వైకుంఠమునకు చేకొనుడు."

"అదెట్లు?"

"మీరు నియమించిన అన్ని కార్యములు పూర్తియైనవి యామునుల కిచ్చిన

మూడు ప్రమాణములు నెరవేర్చబడినవి. విశిష్టాద్వైతము స్థిరపడి ప్రవర్ధమగు చున్నది. పరంపర కొనసాగించగల సమర్థులున్నారు. ఇక నాకు తిరిగి వైకుంఠము చేరుట కాజ్ఞ యిమ్ము."

"అంగీకరించితిని."

అంత రామానుజులు మఠమునకు వెళ్ళి శిష్యులనందరను పిలచి అతి నిగూఢ వేదాంత విషయములు, ప్రమాణములతోను, యుక్తులతోను, సంప్రదాయ విషయములు తేటతెల్లముగాను, నిర్విరామముగా వారికి భాషణము చేయసాగిరి. శిష్యులు ఆశ్చర్యపడి "భాష్యకారా! నిర్విరామముగా ప్రవచనము చేయుచున్నారే? ఎందుచేత?" అని అడుగగా, వారు "శిష్యులారా! నాల్గుదినములే వ్యవధి. నేను వైకుంఠమున కేగుచున్నాను. తరువాత మీకీ విషయములు లభింపవు. కాంతి యున్నప్పుడే కదా కార్యములు చక్కబెట్టునది!" అనిరి.

వారు పరమపదించు దినము వచ్చినది. ఎంబారు తొడపై శిరస్సును, [1]వడుగనంబి తొడపై పాదముల నుంచుకొనిరి. పెరియనంబి పాదుకల తెమ్మని వానిని ముందుంచుకొని సేవించుచు, హృదయమున యామునాచార్య రూపిగా శ్రీహరిని నిలిపి – మాఘ శుద్ధ దశమీ శనివారము మధ్యాహ్నమున పరమ పదించి, భోగిరాజపదమునందిరి. "వారు పరమపదించిరే! మనగతి యేమి?" యని తలచు సర్వస్థలముల యందును వారి అర్చావిగ్రహముల నేర్పరచిరి. వానిలో రామానుజుల జన్మస్థలి భూతపురి, వారి కార్యక్షేత్రము శ్రీరంగము, వారు పునరుద్ధరించిన యాదవాచలములందు అర్చావిగ్రహములు ప్రముఖ మైనవి. యతిరాజచంద్రుల అచటి విగ్రహము లిప్పటికిని సజీవముగనున్నట్లే దర్శన మిచ్చుచున్నవి. ముముక్షువులు వానిని సేవించి తరించుచునే యున్నారు.

---

1. ఆంధ్రపూర్ణులు – రామానుజ అష్టోత్తరశతనామ స్తోత్ర కర్త.

భాష్యకారులను పేరు వారియందు శారదాదేవిచే సార్థకము చేయబడి వాడుకలో నున్నది. వారు రచించిన శరణాగతి, శ్రీరంగ, వైకుంఠ గద్యలు గద్య సాహిత్యము నకు మచ్చుతునకలుగ సాహిత్య పరిశోధకులు పరిగణించుచున్నారు.

తిరుక్కచ్చినంబి విరచిత దేవరాజాష్టకము, కూరత్తాళ్వాన్ వ్రాసిన అతి మానుష, శ్రీస్తుతులు, పరాశరభట్టరుచే రచితమైన దర్పణమను విష్ణు సహస్రనామ వ్యాఖ్య, శ్రీగుణరత్నకోశము, అష్టశ్లోకి, తిరుక్కురుగురై పుళ్ళాన్ వ్రాసిన ఆరాయిరప్పడి, తిరువరంగత్త ముదనార్‌చే చేయబడిన రామానుజ నూత్తందాది (ప్రపన్నగాయత్రి), వడుగనంబి నిర్మించిన శ్రీరామానుజ అష్టోత్తరశతనామ స్తోత్రము – ఇవి అన్నియు రామానుజుల కాలపు రచనలు – ఇప్పటికిని ప్రసిద్ధములే.

ఇట్టి పావనమైన బ్రహ్మసూత్ర భాష్యకర్త చరితమును – పఠించినను, విన్నను, వ్రాసినను – వారికి యతిరాజచంద్రులు పరమపదము ప్రసాదింతురు – సందేహము లేదు!

ఓమ్ తత్ సత్



అనుబంధము - 1

# శ్రీ యతిరాజ వింశతి

## (శ్రీ మనవాళ మహాముమనులు సాయించినది)

యస్స్తుతిం యతిపతి ప్రసాదినీం
వ్యాజహార యతిరాజ వింశతిమ్ ।
తం ప్రపన్నజన చాతకామ్బుదం
నౌమి సౌమ్యవరయోగి పుఙ్గవమ్ ॥

శ్రీమాధవాఙ్ఘ్రి జలజద్వయ నిత్యసేవా
ప్రేమావిలాసయ పరాఙ్కుశ పాదభక్తమ్ ।
కామాది దోషహర మాత్మపదాశ్రితానాం
రామానుజం యతిపతిం ప్రణమామి మూర్ధ్నా ॥ 1

శ్రీరఙ్గరాజ చరణామ్బుజ రాజహంసం
శ్రీమత్పరాఙ్కుశ పదామ్బుజ భృఙ్గరాజమ్ ।
శ్రీభట్టనాథ పరకాల ముఖాబ్జమిత్రం
శ్రీవత్సచిహ్న శరణం యతిరాజమీడే ॥ 2

వాచా యతీన్ద్ర! మనసా వపుషా చ యుష్మత్
పాదారవిన్ద యుగళం భజతాం గురూణామ్ ।
కూరాధినాథ కురుకేశ ముఖాద్య పుంసాం
పాదానుచిన్తనపర స్సతతం భవేయమ్ ॥ 3

నిత్యం యతీన్ద్ర ! తవ దివ్యవపు స్స్మృతౌ మే
సక్తం మనో భవతు వాగ్గుణ కీర్తనేఽసౌ ।
కృత్యం చ దాస్య కరణం తు కరద్వయస్య
వృత్త్యన్తరేఽస్తు విముఖం కరణ త్రయంచ ॥ 4

అష్టాక్షరాఖ్య మనురాజపదత్రయార్థ
నిష్ఠాం మమాత్ర వితరాద్య యతీన్ద్రనాథ ।
శిష్యాగ్రగణ్య జనసేవ్య భవత్పదాబ్జే
హృష్టాఽస్తు నిత్య మనుభూయ మ మాన్య బుద్ధిః ॥ 5

అల్పాపి మే న భవదీయ పదాబ్జ భక్తిః
శబ్దాది భోగ రుచిరన్వహ మేధతేహా ।
మత్పాపమేవ హి నిదాన మముష్య నాన్యత్
తద్వారయార్య యతిరాజ! దయైకసిన్ధో! 6

వృత్త్యా పశు ర్నరవపు స్త్వహ మీదృశోఽపి
శ్రుత్యాది సిద్ధ నిఖిలాత్మగుణాశ్రయోఽయమ్ ।
ఇత్యాదరేణ కృతినోఽపి మిథః ప్రవక్తుం
అద్యాపి వంచనపరోఽత్ర యతీన్ద్ర! వర్తే ॥ 7

దుఃఖావహోఽహ మనిశం తవ దుష్టచేష్టః
శబ్దాది భోగ నిరత శ్శరణాగతాఖ్యః ।
త్వత్పాదభక్త ఇవ శిష్టజనౌఘమధ్యే
మిథ్యాచరామి యతిరాజ! తతోఽస్మి మూర్ఖః ॥ 8

నిత్యం త్వహం పరిభవామి గురుం చ మన్త్రం
తద్దేవతామపి నకించి దహో బిభేమి ।
ఇత్థం శఠోఽ ప్యశఠవ ద్భవదీయ సఙ్ఘే
హృష్టశ్చరామి యతిరాజ తతోఽస్మి మూర్ఖః ॥ 9

హా హా న్త! హన్త మనసా క్రియయా చ వాచా
యోఽహం చరామి సతతం త్రివిధాపచారాన్ ।
సోఽహం తవాప్రియకరః ప్రియకృద్వదేవ
కాలం నయామి యతిరాజ ! తతోఽస్మి మూర్ఖః ॥ 10

పాపేకృతే యది భవన్తి భయానుతాప
లజ్జాః పునః కరణ మస్య కథం ఘటేత ।
మోహేన మే న భవతీహ భయాదిలేశః
తస్మా త్పునః పున రఘం యతిరాజ ! కుర్వే ॥ 11

అన్తర్బహి స్సకల వస్తుషు సన్తమీశం
అన్తఃపురః స్థితమివాహ మవీక్షమాణః ।
కన్దర్ప వశ్య హృదయ స్సతతం భవామి
హన్త ! త్వదగ్ర గమనస్య యతీన్ద్ర ! నార్హః ॥ 12

తాపత్రయీ జనిత దుఃఖ నిపాతినోఽపి
దేహస్థితౌ మమ రుచిస్తు నత న్నివృత్తౌ ।
ఏతస్య కారణ మహో మమ పాపమేవ
నాథ ! త్వమేవ హర త ద్యతిరాజ ! శీఘ్రమ్ ॥ 13

వాచా మగోచర మహాగుణ దేశికాగ్ర్య
కూరాధినాథ కథితాఖిల నైచ్యపాత్రమ్ ।
ఏషోఽ హ మేవ నపున ర్జగతీదృశ స్తత్
రామానుజార్య కరుణైవతు మద్గతి స్తే ॥ 14

శుద్ధాత్మ యామున గురూత్తమ కూరనాథ
భట్టాఖ్యదేశికవరోక్త సమస్త నైచ్యమ్ ।
అద్యాస్త్య సంకుచితమేవ మయీహలోకే
తస్మా ద్యతీన్ద్ర ! కరుణైవతు మద్గతి స్తే ॥ 15

శబ్దాది భోగవిషయా రుచి రస్మదీయా
నష్టా భవ త్విహ భవ ద్దయయా యతీన్ద్ర ।
త్వద్దాస దాసగణనా చరమావధౌ యః
తద్దాసతైకరసతాఽ విరతా మమాస్తు ॥ 16

శ్రుత్యగ్రవేద్య నిజదివ్య గుణస్వరూపః
ప్రత్యక్షతా ముపగత స్త్విహ రఙ్గరాజః ।
వశ్య స్సదా భవతి తే యతిరాజ ! తస్మాత్
శక్తః స్వకీయజన పాపవిమోచనే త్వమ్ ॥ 17

కాలత్రయేఽపి కరణత్రయ నిర్మితాతి
పాపక్రియస్య శరణం భగవత్క్షమైవ ।
సాచ త్వయైవ కమలారమణేఽర్థితాయ
క్షేమ స్స ఏవహి యతీన్ద్ర ! భవచ్ఛ్రితానామ్ ॥ 18

శ్రీమన్ యతీన్ద్ర ! తవ దివ్య పదాబ్జ సేవాం
శ్రీశైలనాథ కరుణా పరిణామ దత్తామ్ ।
తా మన్వహం మమ వివర్ధయ నాథ ! తస్యాః
కామం విరుద్ధ మఖిలం చ నివర్తయ త్వమ్ ॥ 19

విజ్ఞాపనం యదిద మద్యతు మామకీనం
అఙ్గీకురుష్వ యతిరాజ ! దయామ్బురాశే ।
అజ్ఞోఽ యమాత్మగుణలేశ వివర్జితశ్చ
తస్మా దనన్యశరణో భవతీతి మత్వా ॥ 20

ఇతి యతికులధుర్య మేధమానై ః
శ్రుతి మధురై రుదితైః ప్రహర్షయన్తమ్ ।
వరవరమునిమేవ చింతయన్తీ
మతి రియమేతి నిరత్యయం ప్రసాదమ్ ॥ 21



## అనుబంధము - 2

### శ్రీమదాన్ధ్ర పూర్ణ విరచిత

# శ్రీమద్రామానుజ అష్టోత్తర శతనామ స్తోత్రమ్

రామానుజః పుష్కరాక్షో యతీన్ద్రః కరుణాకరః ।
కాన్తిమత్యాత్మజః శ్రీమాన్ లీలామానుష విగ్రహః ॥ 1

సర్వ శాస్త్రార్థ తత్త్వజ్ఞ స్సర్వజ్ఞ స్సజ్జనప్రియః ।
నారాయణ కృపాపాత్రః శ్రీభూతపురనాయకః ॥ 2

అనఘో భక్తమన్దారః కేశవానంద వర్ధనః ।
కాఞ్చీపూర్ణప్రియకరః ప్రణతార్తి వినాశనః ॥ 3

పుణ్య సఙ్కీర్తనః పుణ్యో బ్రహ్మరాక్షస మోచకః ।
యాదవాపాదితాపార్థ వృక్షచ్ఛేద కుఠారకః ॥ 4

అమోఘో లక్ష్మణముని శ్శారదాశోకనాశనః ।
నిరన్తర జనాజ్ఞాన నిర్మోచన విచక్షణః ॥ 5

వేదాన్తద్వయ సారజ్ఞో వరదాయామ్బుదాయకః ।
పరేఙ్గితజ్ఞో నీతిజ్ఞః యామునాఙ్గుళి మోచకః ॥ 6

దేవరాజ కృపాలబ్ధ షడ్వాక్యార్థ మహోదధిః ।
పూర్ణార్యలబ్ధ సన్మన్త్ర శౌరి పాదాబ్జ షట్పదః ॥ 7

త్రిదణ్డధారీ బ్రహ్మజ్ఞో బ్రహ్మధ్యాన పరాయణః ।
రంగేశ కైఙ్కర్యరతో విభూతిద్వయనాయకః ॥ 8

గోష్ఠీపూర్ణ కృపాలబ్ధ మన్త్రరాజప్రకాశకః ।
వరరఙ్గానుకమ్పాత్త ద్రావిడామ్నాయపారగః ॥ 9

మాలాధరార్య సుజ్ఞాత ద్రావిడామ్నాయ తత్త్వధీః ।
చతుస్సప్తతి శిష్యాఢ్యః పఞ్చాచార్య సమాశ్రయః ॥ 10

ప్రపీతవిష తీర్థాంభః ప్రకటీకృత వైభవః ।
ప్రణతార్తిహరాచార్య దత్తభిక్షైక భోజనః ॥ 11

పవిత్రీకృత కూరేశో భాగినేయ త్రిదణ్డకః ।
కూరేశదాశరథ్యాది చరమార్థ ప్రదాయకః ॥ 12

రంగేశ వేఙ్కటేశాది ప్రకటీకృత వైభవం ।
దేవరాజార్చనరతో మూక ముక్తిప్రదాయకః ॥ 13

యజ్ఞమూర్తి ప్రతిష్ఠాతా మన్నాథో ధరణీధరః ।
వరదాచార్య సద్భక్తో యజ్ఞేశార్తి వినాశకః ॥ 14

అనన్తాభీష్ట ఫలదో విఠ్ఠలేంద్ర ప్రపూజితః ।
శ్రీశైలపూర్ణ కరుణాలబ్ధ రామాయణార్థకః ॥ 15

ప్రపత్తి ధర్మైకరతో గోవిన్దార్య ప్రియానుజః ।
వ్యాససూత్రార్థ తత్త్వజ్ఞో బోధాయన మతానుగః ॥ 16

శ్రీభాష్యాది మహాగ్రంథకారకః కలినాశనః ।
అద్వైతమతవిచ్ఛేత్తా విశిష్టాద్వైత పాలకః ॥ 17

కురంగనగరీ పూర్ణమన్త్రరత్నోపదేశకః ।
విశేషితాత్మతత్త్వజ్ఞ శ్శేషీకృత రమాపతిః ॥ 18

పుత్రీకృత శఠారాతి శ్శఠజిత్సూక్తి వర్ధనః ।
భాషాదత్త హయగ్రీవో భాష్యకారో మహాయశాః ॥ 19

పవిత్రీకృత భూభాగః కూర్మనాథ ప్రకాశకః ।
శ్రీవేఙ్కటాచలాధీశ శంఖచక్రప్రదాయకః ॥ 20

శ్రీవేఙ్కటేశశ్వశుర శ్శ్రీరమాసఖదేశికః ।
కృపామాత్ర ప్రసన్నార్యో గోపికామోక్షదాయకః ॥ 21

సమీచీనార్య సచ్ఛిష్యః సత్కృతో వైష్ణవప్రియః ।
క్రిమికంఠనృపధ్వంసీ సర్వమన్త్ర మహోదధిః ॥ 22

అంగీకృతాన్ధ్రపూర్ణాఖ్య స్సాలగ్రామ ప్రతిష్ఠితః ।
శ్రీభక్తగ్రామ పూర్ణేశో విష్ణువర్ధన రక్షకః ॥ 23

బౌద్ధధ్వాంత సహస్రాంశు శ్శేషరూప ప్రదర్శకః ।
నగరీకృత వేదాద్రిః సర్వాస్తిక సమర్చితః ॥ 24

నారాయణ ప్రతిష్ఠాతా సమ్పుత్పుత్ర విమోచకః ।
సనత్కుమారజనక స్సాధులోక శిఖామణిః ॥ 25

సుప్రతిష్ఠిత గోవిన్దరాజః పూర్ణమనోరథః ।
గోదాగ్రజో దిగ్విజేతా గోదాభీష్ట ప్రపూరకః ॥ 26

సర్వ సంశయ విచ్ఛేత్తా విష్ణులోక ప్రదాయకః ।
అవ్యాహత మహద్వర్త్మా యతిరాజో జగద్గురుః ॥ 27

ఏవం రామానుజార్యస్య నామ్నా మష్టోత్తరం శతమ్ ।
యః పఠే చ్ఛృణుయా ద్వాపి సర్వాన్కామా నవాప్నుయాత్ ॥ 28

యదాన్ధ్రపూర్ణేన మహాత్మ నేదం
స్తోత్రం కృతం సర్వజనావనాయ ।
తజ్జీవభూతం భువి వైష్ణవానాం
బభూవ రామానుజ మానసానామ్ ॥